వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 18 సంచిక : 12 హైదరాబాద్ 230 డిసెంబర్ 2020 పేజీలు : 68 రు. 25

- తెలంగాణ ఆరోగ్యానికి ముప్పు ఫార్మా సిటీ
- ఎపిలో పెరిగిపోతున్న పోలీసు రాజ్యం
- కొత్త కార్మిక వ్యతిరేక చట్టాలు
- కశ్మీర్ మరో పాలస్తీనా కాబోతున్నదా?
- వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం
- సంపాదకునిగా ఫ్రెడరిక్ ఎంగెల్స్
- ఓడిపోయినా కొనసాగుతున్న ట్రంపిజం

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పద్దెనిమిది సంవత్సరాలుగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనబయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పద్దెనిమిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ – **013911011002175, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్**

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

హృదయపూర్వక కృతజ్ఞతలు

అక్టోబర్, నవంబర్ 2020 సంచికల్లో చేసిన పై విజ్ఞప్తికి చాల మంది మిత్రులు సాదరంగా స్పందించారు. తాము ఇవ్వగలిగిన విరాళాలు ఇవ్వడం మాత్రమే కాక, ఫేస్‌బుక్, వాట్సప్ వంటి మాధ్యమాలలో ఈ విజ్ఞప్తిని ఇతర మిత్రులకు పంపారు. కొమ్మన బాబు, వైరా–ఖమ్మం – రు. 5,000; జి. తిరుపతిరెడ్డి, సిద్దిపేట – రు. 5,000; వై. రాజేశ్వరి, నెల్లూరు – రు.20,000; ఎస్. రామబ్రహ్మం, వరంగల్ – రు. 25,000; అరుణ్, కర్నూలు – రు. 10,000; మోహన్‌రావు, హైదరాబాద్ – రు. 5,000; కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి, రైతాంగ సమితి, గద్వాల – రు. 1000 విరాళంగా ఇచ్చారు.

గత సంచికలో విరాళాలు అందించిన వారి పేర్లలో పొరపాటున నారాయణస్వామి యుఎస్ – రు. 36,334 అని అచ్చయింది. ఆ స్థానంలో శ్రీకాంత్ సూరి, యుఎస్ అని ఉండాల్సింది. పొరపాటుకు చింతిస్తున్నాం.

మీ వంటి మిత్రుల ఆదరాభిమానాల వల్లనే వీక్షణం కొనసాగుతున్నది. హృదయపూర్వక కృతజ్ఞతలు. – **వీక్షణం** కలెక్టివ్

230

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

డిసెంబర్ 2020
సంపుటి : 18
సంచిక : 12

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

నవంబర్ వీక్షణం చదివాను. సంపాదకీయంతో బాటు, హాథ్రస్ సంఘటన, జైల్లో మాకు ధైర్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఆర్మేనియా–అజర్ బైజాన్‌ల మధ్య యుద్ధం…బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా, జైల్లో మాకు ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది…అనేవ్యాసం గొప్పగున్నది..కవిత్వం చదువుతూ కొత్త కాంతుల పొదివి పట్టుకున్నట్టుగ ఉంది. జైల్లో ఉన్నపుడు మానసిక నిబ్బరాన్ని నిలబెట్టుకోవడం ఆషామాషీ విషయమేం కాదు.. తమను తాము ఉత్సాహపర్చుకోవడం కోసం. "తూ జిందాహై" "తోడ్ తోడ్‌కే బంధనోంకో" వంటి పాటలతో కళ్లు తుడుచుకోవడం..తమను తాము నిలబెట్టుకోవడమే. అక్రమ కేసులో ఇరవై ఐదు రోజులు జైలులో నిర్బంధించబడిన కళ్యాణి, తన్మయ్ (ట్రాన్స్‌జెండర్)లు తమ అనుభవాలనిలా కవిత్వీకరించారు. హాథ్రస్ సంఘటన నన్ను తీవ్రంగా కదిలించిన సంఘటన.. ప్రతి విషయాన్ని సునిశితంగా ఫాలో ఆయిన..అయితే నిజ నిర్ధారణ రిపోర్టు ద్వారా అక్కడ ఇంకా ఎంత భయం నెలకొని ఉందో నాతో సహా పాఠకులకు అర్థమౌతుంది. రాజ్యమూ యంత్రాంగమూ ఒక్కటైన చోట ఆ అమ్మాయికి ఎప్పటికి న్యాయం దొరికేనో. పోతే అజర్ బైజాన్, ఆర్మేనియాలకు మధ్యన యుద్ధం తెలుసుగాని మూల కారణం రాజేంద్రబాబు వ్యాసం చదివాక బాగ అర్థమైంది. విలువైన వ్యాసాలతో సంచిక తెచ్చినందుకు కృతజ్ఞతలు.

– ఉదయమిత్ర
జడ్చర్ల

నవంబర్ సంచికలో 'న్యాయ వ్యవస్థ స్వతంత్రత – రాజ్యాంగ దృక్పథం'పై బర్నబాస్ రాసిన వ్యాసం, దేశంలో అద్భుతమైన న్యాయ వ్యవస్థ కొనసాగుతున్నట్లుగా, దాన్ని రక్షించుకోవాల్సిన అవసరం గురించి నొక్కి నొక్కి చెప్పడం చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆయన స్వయంగా న్యాయవాది. పైగా హక్కుల సంఘంలో బాధ్యుడిగా ఉంటూ, న్యాయ వ్యవస్థపై అంత నమ్మకాన్ని కలిగి ఉండడం చిత్రమే. అవినీతిపరుడైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అలా ఫిర్యాదు చేసే నైతిక హక్కు లేదని అందరూ అంగీకరిస్తారు. అలా అడిగినందుకు అతనిపై చర్య తీసుకోవచ్చని కూడా అడగవచ్చు. కాని అతని లేఖవల్లనే న్యాయ వ్యవస్థకు పెను ప్రమాదం రాబోతుందని ఆందోళన చెందడం న్యాయ వ్యవస్థను, న్యాయమూర్తులను ఆదర్శవంతంగా చూపడం సరైంది కాదు.

ఆయన వ్యాసంలో ప్రధాన అంశాలు :

'న్యాయమూర్తులు రాజ్యాంగ పరమైన అంశాలు మాత్రమే చూస్తారు తప్ప మిగతా విషయాలు పెద్దగా పట్టించుకోరు'.

'కేవలం తమ దగ్గర ఉన్న రాతమూలకమైన డాక్యుమెంట్ల ఆధారంగా తీర్పు వచ్చే సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి జడ్జీలకు ప్రతీ విషయాన్ని ఆపాదించలేం'.

'ఈ చర్చ న్యాయ వ్యవస్థపైనా, న్యాయస్థానాలపైనా ప్రజలకు అనుమానాలకూ, అవహేళనకూ దారితీసింది. న్యాయమూర్తులపై గౌరవం పోతుంది. కోర్టులకు పోతే న్యాయం జరుగుతదనే గ్యారంటీ లేదు అనే భావన ఏర్పడు తుంది. భారత వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది'.

'హైకోర్టు న్యాయమూర్తులు రాగద్వేషాలకు అతీతంగా, న్యాయసూత్రాలకు అనుగుణంగా పనిచేస్తూ, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుతున్నారు. అయితే ప్రతీ తీర్పు మనకు అనుకూలంగా రావాలని కోరుకోవడం రాష్ట్ర ప్రభుత్వం తప్పు'.

'భారత సుప్రీంకోర్టుకు ఉన్న విలువ, ఘనత, హోదా, ప్రజలకిస్తున్న రాజ్యాంగ భరోసా, దేశవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాలపై, పరిపాలనా అధికారులను కించపరిచే విధంగా, తక్కువ చేసే విధంగా, బలహీనపరిచే కుట్రగా భావించవచ్చు'.

ఈ విషయాలపై సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది అయిన దుష్యంత్ జాదవే 'ముఖ్యమంత్రి చేసిన ఆరోపణల నిజా నిజాలు మనకు తెలియవు. సక్రమమైన విచారణ ద్వారా మాత్రమే సత్యం బయట పడుతుంది. ఈ సత్యాన్వేషణను అడ్డుకోవడం సరైంది కాదు' అని ప్రకటించారు.

సంపాదకీయ వాఖ్యలో ప్రశ్నలు 'ప్రజల వైపు నుండి న్యాయ వ్యవస్థను అడగవలసినవే కాని, జగన్‌కు ఆ హక్కు ఉందా' అంటూనే 'ఇటువంటి ప్రశ్నల వలన న్యాయ వ్యవస్థ ప్రతిష్ట దెబ్బతింటుందనే అభిప్రాయం సరైనది కాదు. అసలు ప్రతిష్ట అంటూ ఉంటే, అది చేసిన పనుల వల్ల దెబ్బతింటుంది కాని, ఆ పనుల గురించి ప్రశ్నించడం వల్ల కాదు' అని సూటిగానే చెప్పడం సరిగ్గానే ఉంది.

ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తుల తీరు, వారి విలువ, ఘనత, హోదా, ప్రజలకిస్తున్న రాజ్యాంగ భరోసా గుర్తు చేసుకొందాం. 2018 జనవరిలో నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పత్రికా సమావేశం పెట్టి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా న్యాయ వ్యవస్థ గౌరవాన్ని ధ్వంసం చేసే విధానాలపై ఆరోపణలు చేసిన సంగతి మనకు తెలుసు. నలుగురు జడ్జీలలో ఒకరైన రంజన్ గొగోయ్‌ను, 'తుచ్ఛుడని, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి సాగిలపడిన, మొత్తం అత్యున్నత న్యాయ స్థానాన్నే రాజకీయ అధికార వర్గం చేతిన పెటిన అతన్ని జస్టిస్ అని కూడా పిలవనని, లైంగిక అత్యాచారాలకు పాల్పడే ఒక వికృత జీవికి, ఆ విశేషణం తగదని' మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి మార్కండేయ కట్జూ ప్రకటించడం దేన్ని సూచిస్తుంది? ఆ రంజన్ గొగోయే తర్వాత ప్రధాన న్యాయమూర్తి కూడా అయ్యారు. ప్రభుత్వానికి అనుకూలంగా రామజన్మ భూమి తీర్పు చెప్పారు. లాక్‌డౌన్ కాలంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది వలస కార్మికులు ఎంత అన్యాయంగా బలైపోయారో ఏమాత్రం పట్టించుకోకుండా, అది ప్రభుత్వాల పాలసీ, మేమేం చేయలేమని మొదట అన్న సుప్రీంకోర్టు వ్యవహారంపై మాజీ హైకోర్టు న్యాయమూర్తి అజిత్ ప్రవాష్ షా సుప్రీంకోర్టు నిర్లక్ష్య వైఖరిని అత్యంత తీవ్రంగా ఖండించడం, దేశ వ్యాప్త నిరసనలు కొనసాగిన తర్వాతే సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని వలస కార్మికులను రక్షించే కార్యక్రమాలపై ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగింది.

'బాబ్రీ మసీదు నేను కూల్చాను. మసీదు గోపురమెక్కి ధ్వంసం చేశాను. దానికి నేను ఏమాత్రం చింతించడం లేదని బిజెపి నేత ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ 2019లో ఒక టీవి ఇంటర్వ్యూలో ప్రకటించడం లాంటి రుజువులు, మసీదు కూల్చివేత కేసులో నిందితులందర్నీ విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు

(మిగతా 8వ పేజీలో…)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

వ్యక్తిగత ప్రేమనూ శాసిస్తున్న రాజ్యదుర్మార్గం

వరంగల్ విప్లవ విద్యార్థి ఉద్యమం మీద 1980లలో జరిగిన పోలీసు దౌర్జన్యంలో భాగంగా పోలీసులు కళాశాలల్లోకి, తరగతి గదుల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించవచ్చునా అని చర్చ జరిగినప్పుడు, బెడ్ రూముల్లోకి కూడ చొరబడవచ్చు అని పోలీసు అధికారులు అన్నారు. ఎక్కడికైనా చొచ్చుకువచ్చి దౌర్జన్యం చేయడానికి రాజ్యానికి హక్కు ఉంది అని ఆ మాటకు అర్థం. రాజ్యం అనేది ఎక్కడో పాలనలో, రాజకీయార్థిక నిర్ణయాలలో మాత్రమే ఉంటుందని, వ్యక్తిగత జీవితంలో దాని ప్రమేయం తక్కువ అనీ భ్రమపడేవాళ్లు ఇప్పటికీ ఉండవచ్చు. కాని రాజ్యం ఎంత దుర్మార్గమైనదో, నిరంకుశమైనదో, విస్తరణ–దురాక్రమణ కాంక్ష నిండినదో ఎన్నెన్ని అధ్యయనాలు, పరిశోధనలు, ఉద్యమాలు చెపుతున్నప్పటికీ అది ఎప్పటికప్పుడు మరొక కొత్త దుర్మార్గాన్ని చూపి ఆశ్చర్యపరుస్తూనే ఉంటుంది. ఇప్పుడైతే భారత రాజ్యం కేవలం హింసా సాధనమైన పాలకవర్గ రాజ్యం మాత్రమే కూడ కాదు, ఇది హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు భావజాలం నరనరానా జీర్ణించుకున్న విషవిద్వేష రాజ్యం. పితృస్వామ్యం, మతోన్మాదం, కులవివక్ష, అసమానత, పీడన, హింస దీని స్వాభావిక లక్షణాలు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మతాంతర వివాహాలను, ముఖ్యంగా ముస్లిం యువకులకు, హిందూ యువతులకు మధ్య వివాహాలను "నేరం"గా పరిగణించే చట్టాన్ని తీసుకురావడానికి వీలుగా ఆర్డినెన్స్ ప్రవేశపెట్టడం వ్యక్తిగత జీవితంలో, మానవ సంబంధాలలో, ప్రేమ సంబంధాలలో రాజ్యపు మితిమీరిన జోక్యానికీ దౌర్జన్యానికీ మాత్రమే కాదు, హిందుత్వ భావజాలానికి చిహ్నం. సంఘ్ పరివార్ తన మత విద్వేష ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎన్నో ఏళ్లుగా లవ్ జిహాద్ అనే మాట వాడుతున్నది. ముస్లిం యువకులు హిందూ యువతులను ఆకర్షించి, పెళ్లి పేరుతో మతం మార్చడానికి కుట్ర పన్నుతున్నారని, అలా క్రమక్రమంగా భారతదేశాన్ని ఇస్లామీకరిస్తారనే వాదన ఈ ప్రచారానికి మూలం. ఇది పచ్చి అబద్ధమని, అంత పెద్ద సంఖ్యలో మతాంతర వివాహాలు జరగడం లేదని, జరిగిన మతాంతర వివాహాలలో యుక్తవయసు దాటిన, తమ అభిప్రాయాలు తాము వ్యక్తీకరించగలిగిన యువతీ యువకులు మతంతో సంబంధం లేకుండా చేసుకున్న ప్రేమ వివాహాలే ఎక్కువని గణాంకాలు, సామాజిక చరిత్ర, చివరికి పోలీసు రికార్డులు కూడ చూపుతున్నాయి. కాని సంఘ్ పరివార్ బతికేదే అబద్ధాల మీద. వారికి వాస్తవాలతో పని లేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నిక కాకముందే ఎన్నో సంవత్సరాలుగా ఈ అబద్ధ ప్రచారంలో అగ్రశ్రేణిలో ఉన్నవాడు యోగి ఆదిత్యనాథ్. ఈ లవ్ జిహాద్‌ను అరికట్టడానికి యువతీయువకులను బెదిరించడం, ప్రేమ సంబంధాలను విచ్ఛిన్నం చేయడం, పోలీసు కేసులు పెట్టడం వంటి ఎన్నో చర్యలతో పాటు అసలు మతాంతర ప్రేమ వివాహాలను చట్టపరంగా నిషేధించాలని యోగి ఆదిత్యనాథ్ ఎన్నో సంవత్సరాలుగా చెపుతున్నాడు. 2017 ఎన్నికల ప్రచారంలో కూడ ఆ ప్రచారం చేశాడు. తాను అధికారానికి రాగానే ఈ విషయమై నివేదిక ఇమ్మని రాష్ట్ర న్యాయ కమిషన్ ను ఆదేశించాడు. వివాహం పేరుతో, అక్రమంగా మతాంతరీకరణ జరుగుతున్నదని, దాన్ని అడ్డుకోవడానికి ఇటువంటి కఠిన చట్టం తేవాలని న్యాయ కమిషన్ సిఫారసు చేసింది. ఇటీవలి కాలంలో ఉత్తర ప్రదేశ్ తూర్పు, మధ్య భాగాలలో అటువంటి సంఘటనలు జరిగాయంటూ, ఈ చట్టం తక్షణమే తేవలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అక్టోబర్ 31న ఒక బహిరంగ సభలో ప్రకటించాడు.

చివరికి రాష్ట్ర మంత్రివర్గం నవంబర్ 24న ఉత్తర ప్రదేశ్ విధి విరుద్ధ్ ధర్మ సంపరివర్తన్ ప్రతిషేధ్ అద్యాదేశ్ 2020 (చట్టవ్యతిరేక మతాంతరీకరణ నిషేధ చట్టం) పేరుతో ఆర్డినెన్స్ విడుదల చేసింది. ఆకర్షించడం ద్వారా యువతికి మతాంతరీకరణ జరిపితే ఒక సంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రు. 15,000 జరిమానా, ఆ యువతి మైనర్ అయినా, షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు చెందినవారైనా మూడు నుంచి పది సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రు. 25,000 జరిమానా, అటువంటి మతాంతరీకరణ సామూహికంగా జరిగితే మూడు నుంచి పది సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రు. 50,000 జరిమానా అని చట్టం చెపుతున్నది. యువతి మతాంతరీకరణే లక్ష్యంగా వివాహం జరిగి ఉంటే ఆ వివాహాన్ని రద్దు చేసే అధికారాన్ని కూడ ప్రభుత్వానికి ఇస్తున్నది. ఒక యువతి మతం మారదలచుకుంటే రెండు నెలల ముందు జిల్లా మెజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వాలని, స్వచ్ఛందంగా మతం మారుతున్నానని రుజువు చేసుకోవాలని చట్టం చెపుతున్నది.

లవ్ జిహాద్ అనేది అబద్ధం. ప్రేమ పేరుతో, వివాహం పేరుతో మతం మారుస్తున్నారనేది అబద్ధం. యువతీయువకుల మధ్య మతంతో నిమిత్తం లేకుండా ప్రేమ కలగడం, వివాహం చేసుకోవడం సహజం. అలా వివాహం జరిగినప్పుడు కుటుంబ ఆచారవ్యవహారాలు పాటించడానికి మతం మారవలసి రావచ్చు. ఈ సహజమైన జీవిత చర్యలను నేరంగా ప్రకటించడం నిరంకుశత్వం. ఒకవైపు రాజ్యాంగం ఇష్టం వచ్చిన మతాచారాలు పాటించే ప్రాథమిక హక్కును గుర్తిస్తుండగా, ఈ చట్టం మతం మారడాన్ని నేరంగా పరిగణిస్తున్నది. ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం మాత్రమే కాదు, అమానుషం, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛలోకి దురాక్రమణ. సరిగ్గా హిట్లర్ యూదులకూ, ఇతర మతస్తులకూ మధ్య వివాహాలను నిషేధించి, యూదుల మీద ద్వేషాన్ని పెంచినట్టుగానే ఈ చర్య ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమం అయిన ముస్లింల పట్ల ద్వేష కల్పనలో భాగం. దేశంలో పద్నాలుగు శాతంగా ఉన్న ముస్లింల మీద అనుమానాలు, వ్యతిరేకత, ద్వేషం పెంచి, వారిని రెండో తరగతి పౌరులుగా మార్చడం, మెజారిటీ మత సమూహాన్ని అబద్ధాలతో రెచ్చగొట్టడం సంఘ్ పరివార్ లక్ష్యం. తనిష్క్ ఆభరణాల ప్రకటనలో హిందూ–ముస్లిం మతాంతర వివాహం చేసుకున్న దంపతులను చూపితే దాన్ని తొలగింపజేసిన సంఘ్ పరివార్ అసహనం, నెట్ ఫ్లిక్స్ మీద ఎ సూటబుల్ బాయ్ చిత్రంలో ఒక హిందూ యువతి, ఒక ముస్లిం యువకుడు ముద్దు పెట్టుకుంటున్న దృశ్యం మీద అభ్యంతరాలు చెప్పిన సంఘ్ పరివార్ అసహనం అధికార కేంద్రాల్లో స్థిరపడడంతో పాటు మన ఇళ్లలోకి, వ్యక్తిగత జీవితాల్లోకి, మానవ సంబంధాల్లోకి దురాక్రమించడానికి ప్రయత్నిస్తున్నది. విశ్వసించే భావజాలం ఏదైనా, వ్యక్తిస్వేచ్ఛ, ఆత్మగౌరవం, స్వాభిమానం అనే విలువలు మౌలికమైనవనీ, సంఘ్ పరివార్ వాటిని విధ్వంసం చేయనున్నదనీ గుర్తించి ప్రతిఘటించడం ఇవాళ ప్రతి ఒక్కరి కర్తవ్యం. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

మాయ జేసే పెగ్గెలు, మతి తప్పిన మాటలు

పట్నంల ఓట్ల పండుగ మాదండిగ జరుగుతాంది. ఓట్ల పండుగ అంటరేంది, ఓట్లనేటియి మతంతోటి, పండుగల తోటి ములాయిజా లేకుంట ఉండాలె గద అని నాకనిపిచ్చేది. జనం ఈ దునియల తమను తాము పాలించుకునుటానికి, తమనుంచి ఒకణ్ని పైకి లేపి నిలబెట్టుటానికి గద ఓట్లు ఒచ్చినయి. దానికీ పరలోకం తోటి, మతం తోటి పొత్తున్న పండుగకూ ఏం పోలిక అని అడుగబుద్ధయ్యేది. మెల్లెమెల్లెగ దెలిశింది, పండుగంటె తాగుడు తినుడు తందనాలాడుడు గద, ఓట్లు గుడ గంతే గద. ఓట్లంటె పాల్టికొక్కడు సీస ఇచ్చుడేనాయె, బిర్యాని పొట్లాలు పంచుడేనాయె, తాగి డెడ్డెనుక డెం అని జీపుల ముంగట ఎగురుడేనాయె. జీపు మీద నిలబడ్డ మారాజు అటూ ఇటూ చేతులూపుకుంట ఏది పడితె అది అడ్డం దిడ్డం మాట్లాడుడేనాయె. ఇంకేంది ఇది పండుగ గాకపోతె. నివద్దె, ఇది పండుగే. పట్నంల ఓట్ల పండుగ లొల్లి జూస్తాంటె అచ్చంగ ఇది తాగుడు, తినుడు, తందనాలాడుడు, నోటికొచ్చింది వదురుడు పండుగే అని ఎర్కయితాంది. తాగినోడు ఏం మాట్లాడ్తడో వానికే దెల్వదంటరు గద. గట్ల గీ ఓట్ల పండుగల జైజైలు గొట్టెటోల్లు ఏం మాట్లాడ్తండ్రో వాండ్లకే దెలుస్తలేదు. పట్నమంటే ముత్తాతల ముత్తాతల కాడి సంది ఎన్నో మతాలోల్లు కలిసి ఉన్నదేనాయె. అలాయి బలాయి దీస్కున్నదేనాయె. ఒగల పండుగలకు ఇంకోల్లు పోయిందేనాయె. ఇయాల ఒగడొచ్చి మేం గెలిస్తె అవతలోల్ల మీద బాంబులేస్తం అంటాండు. పట్నం సంగతి, బల్దియా సంగతి పక్కన బెట్టి జైశ్రీరాం అంటాండు, భారత్ మాత అంటాండు. ఇంకొగడొచ్చి నెత్తురు పారుతదంటాండు. అసలు ఓట్లల్లకు మతం ఎట్లొస్తది? ఒక మనిషికి ఒకటే ఓటు. ఏ కులమైన, ఏ మతమైన గంతే. ఎవడు మంచి పాలన ఇస్తడనుకుంటె జనం వానికి ఓటేస్తరు. నిలబడ్డోల్లల్ల ఒక్కడు గుడ సక్కగ లేడని ఎర్కె అయినా ఎవనికో ఒగనికి కాలబెడ్తరు. నిలబడ్డోడు ఎవడైనా నేను గిది జేశిన, గది చేశిన అని చేసిన మంచి పనులుంటె జెప్పుకోవాలె గని, అవుతలోన్ని తిట్టుడు, మతమో కులమో తెచ్చుడు, వాడోటి అన, వీడోటి అన. గా లొల్లిల అసలు ముచ్చట మాయం. ఓట్ల పండుగంటె గిదా? ఆరేండ్ల బట్టి దొరతనమే చెల్లుతాండె. అందునా నాలుగేండ్ల నుంచి పట్నంల, బల్దియాల పెద్దొర, చిన్నదొర రాజ్జెం ఏల బట్టిరి. పట్నం ఏం పొడుగైందీ చెప్పుకోవాలె గద. కారు గుర్తుకు ఎందుకు ఓటెయ్యాల్నో అడుగాలె గద. కని గాయినె గుడ పట్టు పీతాంబురాలు గట్టుకోని, నేనే రాముణ్ని, నన్ను మించిన ఇందువున్నడా అనబట్టె. ఇగ అందరు మత పాల్టి అని లొల్లిజేసె మజ్లిస్ ఎవనికి ఖిలాఫో, ఎవనికి దోస్తానో ఎర్కయిత లేదాయె. అందరికందరు మతం పేరు వాడుకునెటోల్లె. ఎటుబడితె అటు మాట్లాడెటోల్లె. కాంగ్రెస్ ఉండి లేనట్టేనాయె. ఇందరి నడిమిట్ల కనబడకుంట పసిరిక పామోలె పువ్వు గుర్తు రాబట్టె. పట్నంను అడ్డంగ నరకబట్టె. విషం కక్కబట్టె. ఎవడు గెలిచి ఎవడు గద్దెనెక్కినా జనానికి ఒరిగేడిదేమున్నది అని చప్పరిచ్చొచ్చు గాని, నెత్తురు రుచి మరిగిన పులి తరుముకుంట ఒచ్చినప్పుడు పులికి దొరుకుడా, బాయిల దునికి సచ్చిపోవుడా అని గాచారం ఒస్తది. గిప్పుడు పట్నం జనానికి గా గతే పట్టినట్టున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

పోలీసు రాజ్యంగా మారుతున్న ఆంధ్రప్రదేశ్

రాష్ట్ర విభజన తర్వాత ప్రజావ్యతిరేక, కర్కోటక పోలీసు అధికారులు తెలంగాణ వాటాకు వచ్చారని, సాపేక్షికంగా నెమ్మదైన పోలీసు అధికారులు ఆంధ్రప్రదేశ్ వాటాకు వెళ్లారని, అందువల్ల ఆంధ్రప్రదేశ్ లో పోలీసు దౌర్జన్యం అంత ఎక్కువ ఉండబోదని ఒక అభిప్రాయం మొదట్లో ఉండేది. కాని ప్రజా వ్యతిరేకత, దురహంకారం, దౌర్జన్యం పోలీసుల శిక్షణలోనే భాగమైనట్టున్నాయి గనుక పోలీసుల మధ్య అటువంటి సున్నితమైన విభజనరేఖలు ఏమీ పని చేస్తున్నట్టు లేవు. చంద్రబాబు నాయుడు పాలన మొదటి నుంచే ఎన్ కౌంటర్లు, కేసులు, అక్రమ నిర్బంధాలతో పోలీసు రాజ్యాన్ని కొనసాగించింది. జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఆ పోలీసు రాజ్యం కోరలు మరింత పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా దళిత, ఆదివాసి, బలహీన వర్గాల మీద పోలీసు దౌర్జన్యం మితిమీరిపోతున్నది. విప్లవోద్యమం మీద, భిన్నాభిప్రాయాల మీద దాడులు సరేసరి. దళిత యువకులకు పోలీస్ స్టేషన్లలోనే శిరోముండనం, దళితుల మీద అత్యాచారాల గురించి ఫిర్యాదులు వచ్చినా పోలీసులు పట్టించుకోక పోవడం, చిన్న చిన్న కారణాల మీద నిర్బంధంలోకి తీసుకున్నవారిని లాకప్‌లలో కొట్టి చంపడం, భిన్నాభిప్రాయాలు ప్రకటించిన వారిని చిత్రహింసలకు గురి చేయడం, ప్రతిపక్ష నాయకులను తప్పుడు కేసులలో ఇరికించడం, ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను అక్రమ కేసుల్లో ఇరికించడం, సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వకపోవడం, చివరికి పత్రికా సమావేశాలను కూడ అడ్డుకోవడం వంటి అప్రజాస్వామిక చర్యలు ఎడాపెడా సాగుతున్నాయి. ఇప్పుడు గత కొద్ది రోజులలో జరిగిన కొన్ని అప్రజాస్వామిక, నిరంకుశ చర్యలు జగన్ మోహన్ రెడ్డి పాలనలో పోలీసులకు ఎంత విచ్చలవిడి అధికారాలు, ప్రశ్నించడానికి, విచారించడానికి వీలులేని హింసావకాశాలు అందుతున్నాయో చూపుతున్నాయి. కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలో పోలీసులు చేసిన అవమానానికి మనస్తాపంతో ఒక ఆటో డ్రైవర్, అతని భార్య, కూతురు, కొడుకు ఆత్మహత్య చేసుకున్నారు. అవి ఆత్మహత్యలు కావని, వ్యవస్థ చేసిన హత్యలని, పోలీసు అధికారులకు ప్రత్యక్ష సంబంధం ఉందని అన్ని ఆధారాలూ ఉన్నప్పటికీ బాధ్యులైన పోలీసు అధికారుల మీద ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అంటే ప్రజలను హత్య చేసే, ఆత్మహత్య వైపు తోసే పూర్తి అధికారం పోలీసులకు అప్పగించామని పాలకులు చెప్పకనే చెపుతున్నారు. అది అలా ఉండగానే, ఇప్పటికి ఏడాదిగా తెలంగాణలో జరుగుతున్నట్టు, ప్రజా సంఘాల కార్యకర్తల మీద తప్పుడు కేసులు బనాయించే, అక్రమంగా అరెస్టు చేసే వ్యవహారం కూడ మొదలయింది. ఇటు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌లో, అటు విశాఖపట్నం జిల్లా ముంచింగ్ పుట్ పోలీసు స్టేషన్‌లో ఒకచోట 27 మంది మీద, మరొక చోట 64 మంది మీద చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టంతో సహా అనేక ఆరోపణలతో అక్రమకేసులు బనాయించారు. అరెస్టులు కూడ ప్రారంభించారు. 1969 నుంచీ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగుతున్న దౌర్జన్య పోలీసు రాజ్యం విడిపోయిన రెండు రాష్ట్రాలలో జడలు విప్పి నర్తిస్తున్నది. ఈ దౌర్జన్యాన్ని ఆపగల విశాల ప్రజా సమీకరణ, ప్రతిఘటన ఇవాళ్టి అవసరం. వీ

అమెరికా రాజనీతిని బైడెన్ మారుస్తాడా?

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, ప్రపంచ చరిత్రలోకెల్లా అసహనపరుడిగా, దుర్మార్గుడుగా, మూర్ఖుడుగా ప్రసిద్ధికెక్కిన డొనాల్డ్ ట్రంప్ ఓటమి పాలై, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ ఎన్నిక కావడం ఏదో మార్పు తేబోతోందని కొందరైనా ఆశ పడుతున్నారు. కాని వ్యక్తిగతంగా బైడెన్ చరిత్ర చూసినా, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుల గత అనుభవాలు చూసినా గుణాత్మకమైన మార్పులు జరుగుతాయని ఆశ లేదు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా 1970లలో తొలిసారి సెనెటర్ గా ఎన్నికైన నాటి నుంచీ కూడ బైడెన్, వర్ణ వివక్ష విషయంలో తాను రిపబ్లికన్ అభ్యర్థి కన్న మెరుగేమీ కాదని చూపుకున్నాడు. నల్లజాతివారి పట్ల తన వ్యతిరేకతను, తెల్లజాతి దురహంకారుల పట్ల తన ప్రేమాభిమానాలను బహిరంగంగానే ప్రకటించుకున్నాడు. దేశంలోని ప్రధాన సమస్య అయిన జాతి సంబంధాల విషయంలో బైడెన్ వైఖరి అంత అభివృద్ధి నిరోధకమైనది కాగా, విదేశాంగ నీతి విషయంలో బైడెన్ చరిత్రంతా కూడ అమెరికా యుద్ధ నీతిని సమర్థించిన చరిత్రే. కాకపోతే, బైడెన్ చరిత్ర చూపి వ్యతిరేకిస్తే, వోటు వేయకపోతే, ట్రంప్ మళ్లీ ఎక్కడ అధికారానికి వస్తాడోనని ప్రగతిశీలవాదులు భయపడ్డారు. అయినా ట్రంప్ ప్రాతినిధ్యం వహించిన అభివృద్ధి నిరోధకతకూ, జాతి విద్వేషానికీ, ముస్లిం వ్యతిరేకతకూ ఇంకా ఎక్కువ బలమే ఉన్నదని ఎన్నికల ఫలితాలు చూపుతున్నాయి. ఎన్నికైన బిడెన్‌కూ ఓడిపోయిన ట్రంప్ కూ మధ్య వోట్ల శాతంలో తేడా పెద్దగా లేదు. ఎక్కువ ప్రమాదమా, తక్కువ ప్రమాదమా, రెంటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలనే తత్తరపాటులో బైడెన్ పట్ల అనుకూలత వ్యక్తమయింది. అయితే, ఇది కేవలం బైడెన్ అనే వ్యక్తి సమస్య కూడ కాదు.

అమెరికన్ రాజకీయార్థిక వ్యవస్థ సైనిక–పారిశ్రామిక పాలకవర్గాల గుప్పెట్లో ఉన్నది. పెంటగన్ చేతిలో, బహుళజాతిసంస్థల చేతిలో ఉన్నది. ఆ పాలకవర్గాలకు దాసోహం అని, వారికి అనుకూలమైన విధానాలను అమలు చేయడమే తప్ప స్వతంత్ర, ప్రగతిశీల, జాతిసామరస్య, యుద్ధ వ్యతిరేక విధానాలను అమలు చేయగల శక్తి డెమొక్రట్లకు కూడ లేదు. చివరికి నల్లజాతి వాడైన బారక్ ఒబామా కూడ ఇతర దేశాలను దురాక్రమించి ఉన్న అమెరికన్ సేనలను ఉపసంహరించ లేకపోయాడు. డజన్లకొద్దీ దేశాలలో తిష్టవేసిన సైన్యాలు, వివిధ ఇరుగుపొరుగు దేశాల మధ్య ఆరని చిచ్చులు రగిలిస్తూ ఇరు దేశాలకూ ఆయుధాలు అమ్ముకునే పారిశ్రామిక సంస్థలు, ప్రపంచ దేశాలన్నిటి వనరులను, దేశదేశాల చౌకశ్రమను కొల్లగొట్టి తమ పెరట్లోకి చేర్చుకునే బహుళజాతి సంస్థలు, ప్రపంచ మార్కెట్ నంతా కబళించి ఎక్కడ పోగుబడిన సంపదనైనా తన ఖజానాకు చేర్చుకోవాలనుకునే పిడికెడు బడా కార్పొరేట్ సంస్థలు–ఇవీ ఇవాళ అమెరికా అంటే. ఆ బలీయమైన శక్తులను ఎదిరించాలన్నా, ఓడించాలన్నా అది రెండు పాలకవర్గ పార్టీలలో ఏ ఒక్కదానికీ సాధ్యం కాదు. అమెరికన్ సైనిక–పారిశ్రామిక వ్యవస్థను అసహ్యించుకునే, అది మారాలని కోరుకునే ప్రగతిశీల వర్గాలు, ప్రజలు అమెరికాలో విస్తృతంగానే ఉన్నారు గాని వారి మధ్య సమన్వయం, శాస్త్రీయ సమీకరణ లేదు. ఒకరకంగా ప్రపంచం 1960లలో ఎట్లా ప్రగతిశీల భావాల వైపు, తిరుగుబాటు వైపు, విప్లవాల వైపు, వెలుగు వైపు మళ్లిందో, ఈ దశాబ్దం అట్లా ప్రగతి నిరోధకత వైపు, జాతి విద్వేషం వైపు, దుర్మార్గం వైపు మళ్లుతున్నట్టున్నది. జాగరూకతే, మనను మనం నిలబెట్టుకోవడమే ఇవాళ్టి లక్ష్యం. వీ



(.. 4వ పేజీ తరువాయి)

చేసి, నేను సేకరించిన ఆధారాల ప్రకారం 'మసీదు కూల్చివేత ఒక కుట్ర. నిందితులందరు దానిలో భాగస్వాములే. నేను ఉమాభారతిని విచారించినప్పుడు తానే బాధ్యత వహించానని చెప్పింది. కోర్టు కాదంటే నేనేమి చేయగలను?' అంటూ మసీదు కూల్చివేతపై వేసిన విచారణ కమిటీకి సారధ్యం వహించిన జస్టిస్ లిబర్‌హాన్ వాపోయారు. వందలాది సాక్ష్యాలున్నా సిబిఐ కోర్టు న్యాయమూర్తికి నిందితులందరూ నిర్దోషులుగానే కనిపించడం మన న్యాయ వ్యవస్థ లక్షణాలు తెలపడం లేదూ? 'అందరూ నిర్దోషులైతే మసీదు కూల్చిందెవరు' అన్న వ్యాసంలో సంతోష్ 'భారతదేశ కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయంగా మసకబార్చిన బాబ్రీ మసీదు కూల్చివేతపై తీర్పు కనీస న్యాయ సూత్రాలు, ప్రాథమిక న్యాయ విలువలు ఉల్లంఘించడం, న్యాయ వ్యవస్థ సంపూర్ణంగా పాలకవర్గం, పాలక పార్టీ చేతుల్లో బందీ అయిన తీరుకు ఉదాహరణగా నిలుస్తుంది' అని సరిగ్గానే విశ్లేషించారు.

కశ్మీర్, బాబ్రీ మసీదు, షహీన్‌బాగ్ లాంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారినందరినీ దేశ ద్రోహులుగా ఆరోపణలు చేస్తూ, భీమా కోరేగావ్ కేసులో నిందితులందర్నీ మావోయిస్టు పార్టీతో సంబంధాలున్న వారేనని, వారు రాజీవ్ గాంధీని చంపినట్లు మోదీని కూడా అంతమొందించాలని పన్నాగం పన్నారని, కొన్ని రుజువులు కేవలం మా దగ్గర మాత్రమే ఉన్నాయని, వారంతా చాలా ప్రమాదకారులని, వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రచారం చేసే రిపబ్లిక్ టీవీ ఎడిటర్ అర్నాబ్ గోస్వామి ఎదుటి వారిని అమానుషంగా రెచ్చగొట్టి, ద్వేషపూరిత సంఘపరివార్ రాజకీయాలను కొనసాగిస్తున్నాడని అందరికీ తెలిసిందే. ఒక ఆత్మహత్య కేసులో మహారాష్ట్ర ప్రభుత్వం అతన్ని అరెస్ట్ చేస్తే, హైకోర్టు బెయిల్ తిరస్కరించింది. దీనిపై అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేశాడు. 10న ఉదయం సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే, సాయంత్రానికి కల్లా దానిని రిజిస్టర్ చేయడంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దుష్యంత్ దవే కోర్టులో నెలల తరబడి రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు కోల్పోయిన కేసులతో పాటు, ప్రాణహాని ఉన్న వందలాది పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా గోస్వామి బెయిల్ పిటిషన్ కేవలం కొన్ని గంటల్లోనే అనుమతించడంపై తీవ్రంగా ఖండించడం జరిగింది. అయినా 'రాజు తలచుకుంటే' అన్న చందంగా పిటిషన్ వేసిన మరుసటి రోజునే అంటే 11న సుప్రీంకోర్టు గోస్వామికి బెయిల్ ఇస్తూ, 'టీవీ అరుపులు పట్టించుకుంటే ఎలా? అర్నాబ్ హక్కులు మేం కాకుండా ఎవరు రక్షిస్తారు. వ్యక్తులపై కత్తులు దూస్తే ఊరుకునేది లేదు. ఈ కేసులో మేం కలుగచేసుకోపోతే ఒక విధ్వంసకర మార్గానికి దారితీసే ప్రమాదం ఉంది. రాష్ట్రాలలో చిన్న చిన్న విషయాలకే ప్రజల్ని అరెస్టులు చేస్తున్నారు. న్యాయం చేయాల్సిన హైకోర్టులు బెయిల్ ఇవ్వడం లేదు. దానిపై మేం తీవ్రమైన సందేశాన్ని పంపవలసి ఉంటుంది' అని హెచ్చరించడం ఏం తెలియజేస్తుంది? ప్రజల కోసం పోరాడుతున్నవారు జైలులోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా న్యాయ వ్యవస్థ ఎందుకు కలుగచేసుకోవడం లేదు? బాధితులందరి పట్లా న్యాయ వ్యవస్థ ఒకే వైఖరిని కొనసాగిస్తే, విమర్శలకు తావు ఎక్కడుంటుంది? దళితులపై దాడిచేసి, చంపి, ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచులలో కూరి వాటిని నదిలోకి విసిరేసిన హంతకులు చుండూరు మారణకాండపై ఏర్పడిన ప్రత్యేక కోర్టుకు బదిలీ మీద వచ్చిన దళిత న్యాయమూర్తి డా. ప్రభాకరరావు ఎస్.సి. కులానికి చెందినవాడు కాబట్టి మాకు న్యాయం జరగదని ఫిర్యాదు చేస్తే హైకోర్టు నిస్సిగ్గుగా ప్రభాకరరావుని 1995లో బదిలీ చేయడంపై 'అగ్రకుల దురహంకారాన్ని హైకోర్టు మన్నించడం లజ్జాకరం' అన్న బాలగోపాల్ నిరసన ఏం తెలియచేస్తుంది?

'ఈ న్యాయస్థానాల్లో 'నిజవూ, న్యాయవూ' అనే మాటల్ని గట్టిగా పలకనివ్వరు' అని నేను ఎలుగెత్తి చెప్పగలను. నొక్కి వక్కాణించగలను. నిర్భయంగా చెప్పగలను. ఇక్కడ న్యాయం దొరకదంటే దొరకదు. తోడేళ్లు తప్పితే గుంటనక్కలు ఈ న్యాయాధిపతులు. పులులూ, మేకలూ, సింహాలూ పార్టీలు. ఈ న్యాయస్థానాలు ఆవులకీ, మేకలకీ మధ్య స్థానాలు' అని 1956లోనే (అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి కేవలం 9 సంవత్సరాల నాటికే) న్యాయవాది, ప్రముఖ రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఒక నవలలో ప్రధాన పాత్రతో అనిపించినప్పుడు వ్యవస్థను అంచనా వేయడంలో ఆయన దూరదృష్టి, విశ్లేషణ అబ్బురమనిపిస్తుంది.

వర్గ సమాజంలో న్యాయ వ్యవస్థ ఉంటుంది. కాని స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఉండే అవకాశం ఉండదు. న్యాయస్థానాల్లో కొద్దిపాటి న్యాయమైనా లభిస్తుందంటే జస్టిస్ కృష్ణ అయర్, పి.బి. సావంత్, కోల్సె పాటిల్, ఎంపిషా లాంటి కొద్దిమంది నిజాయితీ పరులు, అధికారానికి లొంగనివారు నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాంక్షించేవారు, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల హక్కుల్ని కాపాడాలని కోరుకునేవారు కొద్ది మందైనా న్యాయ వ్యవస్థలో ఉండడమే కారణం. న్యాయ వ్యవస్థ నుండి కనీస న్యాయమైనా ప్రజలు పొందగలగాలంటే ప్రజా పోరాటాలే మార్గం.

– పి.వి. రమణ
విశాఖపట్నం

దేశంలో ప్రాథమిక హక్కుల పతనం నిరాటంకంగా జరుగుతుంది అదే బాటలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కూడా కొనసాగడం విచారకరం. మరోవైపు దేశంలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఏక వ్యక్తి కేంద్రీత రాజకీయాలు, మరోవైపు మేధావులు రైతులు మైనారిటీలు గిరిజనుల, దళితుల హక్కుల గురించి మాట్లాడడం కూడా మృగ్యమైపోయింది.

వరవరరావు గారి విషయమే తీసుకుంటే ఎనభై ఏండ్ల మనిషిని రాజ్యం ఎన్ని రకాలుగా హింసించవచ్చో, ఎన్ని వికృత వేషాలు వెయ్యవచ్చో అన్ని రకాలుగా మానసికంగా, శారీరకంగా అనారోగ్యం పాల్చేస్తున్నారు. ఇంతకీ వరవరరావు చేసిన తప్పు ఏమిటి? బడుగుల గురించి బలహీనుల గురించి గొంతు విప్పాడమేనా? కక్షపూరితంగా మానవీయత లేకుండా వ్యవహరిస్తున్న రాజాన్ని ఏమనాలి మనం? నియంత పాలనలో లేమని మనది అతి పెద్ద ప్రజాసామ్యం అని రాజ్యం సోయి తప్పిందా? అంతే కాకుండా వరవరరావుకు రాజ్యాంగం హామీ పడిన ప్రాథమిక హక్కులను కూడా రాజ్యం నిర్బంధం ద్వారా కాలరాస్తున్నది. జీవించే హక్కును, స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరించే హక్కును రాజ్యం కాలరాస్తుండగా మరోవైపు స్వతంత్రతను చూపాల్సిన న్యాయ వ్యవస్థను అర్ణబ్ గోస్వామికి ఒక న్యాయం, వరవరరావుకి ఒక న్యాయం అమలు చేస్తూ వ్యక్తి ఆధారిత న్యాయాన్ని అమలు చేయడం దురదృష్టకరం. నిజానికి వరవరరావు తెలంగాణ సమాజంలో ఉండే భయపడని తత్వానికి ఒక ప్రతీకలాంటి వాడు. తెలంగాణ సమాజంతో సహగమించిన వాడు తెలంగాణ ఉద్యమంలో తన మేధో శక్తిని పంచి, తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసినవాడు. అలాంటి వ్యక్తిని ఇవ్వాళ రాజ్యం శిక్ష కాని శిక్ష ద్వారా తన వికృత చేష్టలను బయటపెడుతున్నది. ఒకవేళ వరవరరావు తప్పు చేసారనుకుంటే ఎందుకు రెండు ఏండ్ల నుండి విచారణ మొదలు పెట్టలేదు? ఎందుకంటే ఈ కేసు నిలువదు అని వాళ్లకి తెలుసు, మరి అలాంటప్పుడు జైల్‌లో ఉంచడం ఎందుకు? బెయిల్ ఇవ్వొచ్చు కదా. తద్వారా ఆయన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశాన్ని, కుటుంబ సభ్యులతో గడిపే అవకాశాన్ని కల్పించొచ్చు కదా. లేని కేసులు పెట్టి ఎందుకు కుటుంబాన్ని, వరవరరావుని ఇబ్బంది పెట్టడం? ప్రజాస్వామ్యానికి కూడా మానవీయ కోణం ఉంటుందని మరిచిపోయారా? వరవరరావు తను రెండు ఏళ్లుగా కోల్పోయిన విలువైన కాలాన్ని, ఆయన తెలుగు అక్షరం చదవక రెండు ఏళ్లు గడిచిపోయింది అని బాధపడుతున్న నాలాంటి ఎంతో మందికి ఏమి సమాధానం చెపుతారు? తాను అన్యాయంగా కోల్పోయిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?

– అవినాష్ భారత
హైదరాబాద్

రామోజీపేట దళితులపై దాడులు

ఆర్ఎస్ఎస్/బిజెపి మద్దతుతో రామోజీపేట దళితులపై ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారని అంటున్నారు **మాదన కుమారస్వామి**

తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, రామోజీపేట గ్రామంలో దసర రోజున అక్టోబర్ 25 రాత్రి 11:30 గంటలకు గ్రామానికి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన 100 మంది యువకులు (ఆర్ఎస్ఎస్/బిజెపి పార్టీకి అనుబంధంగా ఉండే) మధ్య వయసు ప్రజలు, దళిత వాడపై దాడిచేశారు. ఈ ఘటనలో 10 మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన దళితులను తీవ్రంగా గాయపర్చి ఆ ఊరి దళితుడైన ఉపసర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్‌ను కూడా తీవ్రంగా చితకబాదినారు. ఈ దాడుల్లో ఈదుల మధుకు తల పగిలింది, ఈదుల మధు తండ్రి బాలయ్యకు తలపగిలి తీవ్ర రక్తస్రావమైంది. తడ్కపెల్లి మురళి కాలువిరిగింది. బెజ్జంకి పోచయ్య కాలు తొంటికి తీవ్రంగా గాయమైంది. బెజ్జంకి నర్సవ్వ కుడి భుజంకు తీవ్ర గాయమై వాచింది. దళితుల 7 ఇండ్లను వారి కిరాణం షాప్‌లను, ఇంట్లోని సమ్మర్ కూలర్లు, ఫ్రిడ్జ్‌లు, భూమిపైనున్న మంచి నీళ్ల ట్యాంకులు ధ్వంసం చేసిండ్లు. ఇతర నిత్యావసర వస్తువులు, ఇండ్ల పైకప్పు రేకులు, దళిత యువకుల 12 మోటార్ సైకిళ్లను ధ్వంసం చేసినారు. మొత్తం దళిత ప్రజలు, మహిళలు, పిల్లలు, ఆ దాడి నుంచి ప్రాణాలను కాపాడుకోవడం కోసం తమ ఇండ్ల సమీపంలోని తమ పంట పొలాల్లో ఆ అర్ధ రాత్రిపూట తలదాచుకున్నారు. మూడు పాలు ఇచ్చే బర్రెలపై దాడిచేసి, వాటి పాల రొమ్ములను, పొదుగులను రక్తాలు కారే విదంగా చిత్రహింసలు చేసినారు. దాడి మొదలైన రాత్రి 11:30 ప్రాంతంలో దళిత యువకులు, ఉపసర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్ ఇల్లంతకుంట పోలీసులకు సమాచారం ఇస్తే, పోలీసులు మాత్రం రాత్రి 2 గంటల వరకు ఆ గ్రామానికి చేరుకోలేదు. అప్పటి వరకు ముదిరాజ్ ప్రజల దాడులు, విధ్వంసం దళితులపై కొనసాగింది. పోలీసులు వచ్చిన తర్వాతనే ముదిరాజ్‌ల దాడులు ఆగినయి.

తీవ్రంగా గాయపడి తలలు పగిలిన ఈదుల మధు తలకు పది కుట్లు పడ్డవి. ఈదుల మధు తండ్రి బాలయ్య తలకు పదమూడు కుట్లు పడ్డవి. కాలు విరిగిన తడ్కపెల్లి మురళి, తీవ్రంగా కాలుతొంటి గాయమైన బెజ్జంకి పోచయ్య, దాడిలో రవిక చినిగి, భుజం గాయంతో తీవ్రంగా అస్వస్థతకు గురైన బెజ్జంకి నర్సవ్వలు ఆ రాత్రి సిరిసిల్ల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళితే ఆ రాత్రి డాక్టర్ వారికి నామమాత్రంగా వైద్యం చేసి ఇంటికి పంపారు. అసలైన వైద్యం మరుసటి రోజు 26 అక్టోబర్ ఉదయం దళిత, ప్రజా సంఘాలు, వామపక్షాలు, మానకొండూరు నియోజవర్గ అధికార టిఆర్ఎస్ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ (రామోజీపేట గ్రామం ఇల్లంతకుంట మండలం మానకొండూరు నియోజకవర్గం పరిధి లోనిది) స్పందించడంతోనే వారికి సిరిసిల్ల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో తలకు కుట్లువేసి, బెడ్లు ఇచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేసుకొని వైద్యం అందించారు. ఈ ఆసుపత్రి, సిరిసిల్లా రాజన్న జిల్లా కేంద్రం కెటిఆర్ నియోజకవర్గానికి చెందినది. అయినప్పటికీ తీవ్రంగా గాయపడ్డ ఆ ఐదుగురు ఆదివారం దసరా రోజు రాత్రంతా, ఆసుపత్రి బయటి వరండాల్లోనే గాయాలతో బిక్కు బిక్కుమంటూ భయంతో బతికిండ్లు.

అక్టోబర్ 26 మధ్యహ్నాం సిరిసిల్లా జిల్లా ఎస్సి/ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు దళితులను కలిసి మాట్లాడి, అనంతరం రామాజిపేట దళిత వాడలో దాడికి గురైన ప్రజలను, కుటుంబీకులను కలిసి సేకరించిన వాస్తవాలు.

గత మూడు సంవత్సరాల క్రితం నుండి ఆ గ్రామ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం పెట్టడానికి, దళిత ప్రజలు కృషిచేస్తుంటే, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన యువకులు ఆర్ఎస్ఎస్/బిజెపి అండతో అడ్డుకొని 2020 సెప్టెంబర్ 4న ఛత్రపతి శివాజీ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టే స్థలంలో పెట్టి అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టకుండా అడ్డుకున్నారు. మరుసటి రోజు సెప్టెంబర్ 5న ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో దళితులు ముదిరాజులపై ఫిర్యాదు ఇస్తే, నలుగురు ముదిరాజ్‌లపై పోలీసులు ఎస్సి/ఎస్టి కేసు నమోదు చేసినారు.

సెప్టెంబర్ 6న దళిత సంఘాలు, ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ ఇరువర్గాలతో మాట్లాడి అంబేడ్కర్ విగ్రహం, జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టుకుందామని, ఛత్రపతి శివాజీ వద్దని గ్రామ పంచాయతీలో తీర్మానం చేసిండ్లు. అప్పటి నుండి ఇంకా కక్ష పెంచుకొని, అంబేడ్కర్ విగ్రహం ఉండద్దని ముదిరాజ్ ప్రజలు నిర్ణయించుకున్నారు. ఆర్ఎస్ఎస్/బిజెపి సిరిసిల్లా నాయకులు ముదిరాజ్ యువకులను బాగా ప్రభావితం చేయడంతో దళితులపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దసరా రోజు దళితులను దేవుని వద్ద డప్పులు కొట్టడానికి రావద్దని, జమ్మి ఆకు బొడ్రాయి వద్ద తీసుకోవడానికి దళితులను అనుమతివ్వలేదు. ఉపసర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్‌ని దేవుని వద్ద కొబ్బరికాయ కొట్టనివ్వలేదు. ఈ మొత్తం సంఘటనలకు తీవ్ర మనోవేదనకు గురైన దళిత యువకులు, తమ దళితవాడలోని ఉప సర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్ ఇంటి ముందు చిన్న సౌండ్ బాక్స్‌లు పెట్టుకొని, దసరా పండగకు తమ తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన కూతుళ్లు, పిల్లలు, అందరూ కలసి పండుగ జరుపుకున్నారు.

ఆ సమయంలోనే రామోజీపేట సర్పంచ్ భర్త మొండెయ్య (ముదిరాజ్ సామాజిక వర్గం) ఆ రాత్రి 11:15 గంటల సమయంలో ఉప సర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్ ఇంటికి వచ్చి సౌండ్ బాక్స్‌ను ఆపివేయాలని హెచ్చరించిన సందర్భంగా తమ వాడలో కూడా ముదిరాజ్‌ల పెత్తనంపై, మీరు సౌండ్ బాక్స్‌లతో పండగ ఆటలాడుతున్నారని మమ్మల్ని అడ్డుకుంటున్నారని దళితులు మొండెయ్యతో మాట్లాడుతున్న సమయంలో, ఒక్కసారిగా సుమారు100 మంది ముదిరాజ్, యాదవ యువకులు

అసంతృప్తి గళాల ఐక్యత రాగం

తెలంగాణ ప్రజలు అమాయకులు అని పాలకులు అనుకుంటున్నారు కాని ఎవరిని ఎప్పుడు ఎక్కడ పెట్టాల్నో అక్కడపెట్టే తెలివిమంతులు అంటున్నారు **బెజ్జంకి ప్రభాకరాచారి**

మడమ తిప్పను, మాట తప్పును, తల కోసుకుంటా కానీ అన్న మాట విడను ఆరు నూరైన, సన్నాసులకు ఆయుధాలు ఇచ్చి నన్ను యుద్ధం చేయమంటే ఎట్లా. మాట్లాడితే కుండ బద్దలు కొట్టిన్నట్లు అబ్బా ఏమి డైలాగులు, ఏమి సినిమా అడివి రాముడు, దొంగ రాముడు, సర్దార్ పాపరాయుడు, జస్టిస్ చౌదరి సినిమాల పేర్లు కూడ దొరుక్తలేవు అవి అన్ని దండగే.

తెలంగాణ రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు అసంతృప్తి గళాల ఐక్యత రాగం. స్వయం పాలన–ఆత్మగౌరవం పోలవరం మాదే, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్ స్లీపర్ ఫ్యాక్టరీ, ఆజంజాహి బట్టల మిల్లు, సిర్పూర్ పేపర్ మిల్లు, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం అనంగానే జనం ఎంత ఆశపడ్డరు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేర్చడంలో కీలక భూమిక నిర్వహించిన 'ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిరుద్యోగుల పాత్ర చరిత్ర' మర్చిపోలేనిది తెలంగాణ మాట మాట్లాడిన పాట పాడిన నేరంగా పరిగణించే నిర్బంధకాల సంకెళ్లను ఛేదించిన తెగువ ఒక్క తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చూడగలం. అంత పెద్ద ప్రజా తెలంగాణ ఉద్యమంలో ఇప్పుడు అధికారంలో ఉన్న పాలక పక్షం ఎక్కడ. పల్లె నుండి పట్నం దాక అన్ని తామై నిలిచింది. ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరుద్యోగులు సామాజిక తెలంగాణ మహా సభ, తెలంగాణ జన సభ, తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ ఐక్య వేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ప్రజా ఫ్రంట్, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ వంటి అనేక పేర్లతో అనేకమంది పనిచేసిండ్లు. ఉద్యోగులు 610 జిఓ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంతం వ్యాప్తంగా యాత్రలు నిర్వహించిండ్లు.

తెలంగాణ రాష్ట్రం కోసం లాఠీలకు, తూటాలకు, చెరసాలలకు ఎదురు నిలిచిడ్లు. ప్రతి గ్రామంలో రిలే నిరాహారదీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిండ్లు. సాగర హారం, మిలియన్ మార్చ్, వంట వార్పు, సకల జనుల సమ్మెలో సబ్బండ వర్గాలు కుల సంఘాలు, వృత్తి సంఘాలు పాల్గొన్నాయి. ఒక్కటా రెండా ఎన్ని అని లెక్క లేని రూపాల్లో 'గల్లీ నుండి ఢిల్లీ దాక పార్లమెంట్ దద్దరిల్లే విధంగా పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. అంత పెద్ద ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఎక్కడ ఉన్నది ఒకటి

ప్రజలు దళితులపై దాడులు చేసినారు. రాత్రి11:30 నుండి 2 గంటల వరకు సుమారు రెండున్నర గంటల పాటు విధ్వంసం చేశారు. కరీంనగర్ ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అయిన బండి సంజయ్, సిరిసిల్ల బిజెపి నాయకుడైన న్యాయవాది రమాకాంత్ రావు, రామోజీపేట టీచర్ తేజేశ్వర్ రెడ్డి మరికొంత మంది ఆర్ఎస్ఎస్/బిజెపి నాయకుల ప్రోద్బలంతో రామోజీపేట ముదిరాజ్ యువకులు ఛత్రపతి శివాజీ విగ్రహం పెట్టడం కోసం పట్టుపట్టడం, అంబేద్కర్ విగ్రహాన్ని ఒప్పుకోకపోవడానికి పురికొల్పబడ్డారు.

2018 జనవరి 1న మహారాష్ట్రలోని భీమా కోరేగాం వద్ద 200 సంవత్సరాల విజయదివస్ దళితుల ర్యాలీపై శంబాజీ భిడే, మిళింద్ ఎక్బోటేలు ఏ విదంగానైతే పురికొల్పి ఆర్ఎస్ఎస్/విఎచ్పి/బిజెపి అనుకూల ప్రజలతో దళితులపై దాడులు చేసినారో, ఇక్కడ రామోజీపేటలో వెనుకబడిన వర్గం అయిన ముదిరాజులు, యాదవ ప్రజలు, ఆర్ఎస్ఎస్/విఎచ్పి/బిజెపి బావజాలంతో కుల ఉన్మాదానికి లోనై దళితులపై దాడులు చేశారు. భూస్వామ్యానికి, వెట్టికి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన సిరిసిల్లా, జగిత్యాల రైతాంగ పోరాటాలు జరిపిన త్యాగాల విప్లవోద్యమ ప్రాంతాలైన సిరిసిల్లా–ఇల్లంతకుంట, రామోజీపేటలో కుల ఉన్మాదం, మధ్య యుగాల రాజులకు బానిస మనస్తత్వంతో మెదిలేవిధంగా భావోద్వేగాలను చాపకింద నీరులా ఆర్ఎస్ఎస్/బిజెపి శ్రేణులు పెంచిపోషించాయి. అన్నదమ్ముల్లా ఉండాల్సిన ఎస్సి–బిసిలు ఫాసిజం కోరల్లో చిక్కుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత కెసిఆర్ మరింతగా కుల సంఘాలను పెంచి పోషించిండు.

దళితులపై దాడులు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల పోరాటానికి స్పందించిన పోలీసులు, దాడులకు పాల్పడ్డారని 29 మంది ముదిరాజ్ కొంత మంది యాదవులపై ఎస్సి/ఎస్టి అట్రాసిటీ కేసు బుక్ చేసి 10 మందిని కరీంనగర్ జైలుకు పంపారు. 11 మందిని ఇంకా అరెస్టు చేయాల్సివుంది. 8 మందిని అబ్స్కాండింగ్గా చూపినారు. 13 మంది దళితులపై కౌంటర్ కేసులు పోలీసులు నమోదు చేశారు.

ఈ దాడికి కారకులైన సిరిసిల్ల జిల్లా ఆర్ఎస్ఎస్/బిజెపి నాయకులపై ఎస్సి/ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్ పై కెసిఆర్ ప్రభుత్వం స్పందించలేదు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారికి ఇరవై లక్షలు నష్ట పరిహారం, తీవ్రంగా గాయపడ్డవారికి 10 లక్షలు, వాహనాలు పశువులు గాయపడ్డవారికి, 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన తెలంగాణ ప్రభుత్వం ఇంకా స్పందించలేదు.

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో, చుండూరు, కారంచేడు, పదిరికుప్పం, వెంపేట లాంటి సంఘటనలు లేవు, కానీ ఇప్పుడు ఆర్ఎస్ఎస్/బిజెపి నాయకుల ఆలోచన, సిద్ధాంత వైఖరుల వలన తెలంగాణ గ్రామాల్లో ఉన్మాదం బుసలు కొడుతుంది. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు, అభ్యుదయవాదులు, దళిత సంఘాలు, బిసి సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు దృష్టి సారించి ఫాసిజాన్ని అడ్డుకోవాలి.

(రచయిత సహాయ కార్యదర్శి, పౌర హక్కుల సంఘం, తెలంగాణ) వీ

రెండు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. చాల చోట్ల నాయకుల సంగతి అటుంచి క్యాడర్‌కే దిక్కు లేదు. ఉన్నదల్లా ఉద్యమకారులు మాత్రమే 'తెలంగాణ పోరులో బెల్లి లలిత, కనకాచారి, మారోజు వీరన్న వంటి అమరులు ఎందరో'. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంత మంది అన్యాలంగా వాళ్లకు వాళ్లు సచ్చిపోయిరి. మలిదశ ఉద్యమంలో బలిదనాలకు కొదువ లేదు. 'శ్రీకాంతాచారి నుండి పార్లమెంట్ ముందు బలిదానం చేసుకున్న యాదవ రెడ్డి సంఘటన వరకు, పోలీస్ కిష్టయ్య వరకు' అసలు ఎంత మంది వీళ్ల మాటలు విని అసువులు బాసిండ్లో లెక్క లేదు వందలు, వేల సంఖ్యలో ఉంటుంది.

ఒక్క పెద్ద నాయకుడు కూడ సావలే. 'ప్రొ.జయశంకర్, కాళోజీ నారాయణ రావు' 'బియ్యాల జనార్దన్ వంటి వాళ్ల ఆశలు, ఆకంక్షలు ఒక్కటికూడ నెరవేరలేదు'. ఇల్లు, వాకిలి, పెళ్లాం, పిల్లలను ఇడిసిపెట్టి ఉద్యమం చేస్తే ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అధికార పక్షంలో మంత్రులు, ఎంఎల్ఏలు, ఎంపిలు అధిక శాతం తెలంగాణ వ్యతిరేకులుగా వెలగబెట్టినవాళ్లే. 'ఉద్యమకారుల ఉసురు తీసినోళ్లే బొంత పురుగునైన ముద్దాడుతా, కాలికి ముళ్లు గుచ్చుకుంటే పంటితో తీస్తా అంటే ఎందో అనుకున్నాం. ప్రత్యక్ష ఆంధ్ర పాలన పోయి దొడ్డిదారి ఆంధ్ర పాలన కొనసాగుతున్నట్లు ఉన్నది పరిస్థితి' జెండాలు, పార్టీల గుర్తులు మారినై తప్పితే మనుషులు మారలేదు, దోపిడీ, పీడన, అణిచివేత మారలేదు.

నీళ్ల పేరుతో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కాంట్రాక్టర్లకు లాభం అయినది. నిధులు, నియామకాలు అంటే నలుగురు వారి బంధువులు, స్నేహితులు, వాళ్ల పార్టీ క్యాడర్లకు మాత్రమే అన్నట్లు చేయబట్టే. కె.జి. టు పి.జి., డబల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల భూమి, బి.సి. కుల వృత్తులకు ఫెడరేషన్ల ఏర్పాటు నిధుల కేటాయింపు, పాలక మండలి ఏర్పాటు, విధి విధానాలు, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ అన్ని గాలి మాటలు నీటి మీది రాతలు అన్నట్లు ఐపోయే. ఆత్మగౌరవం అంటిరి బతుకమ్మ చీరలు, క్రిస్మస్ బహుమతులు, రంజాన్ తోఫాల పేరుతో ప్రజలను బిచ్చగాళ్ల మాదిరి తయారు చేయబడితిరి. ఓట్ల కోసం గొర్లు, బర్లు, చేపలు అనబడితిరి. రైతు బంధు పేరుతో వందల, వేళ ఎకరాల భూములు ఉన్నోళ్లకు ప్రభుత్వ సొమ్మును దానం చేయబడితిరి. డ్వాక్రా, మహిళ పొదుపు సంఘాలకు లక్ష రూపాయల రుణం మాఫీ లేకపాయే. బీడీ కార్మికులకు పెన్షన్ ఉత్తదే ఐపోయే. ఎవరిని బాగు చేసిండ్లు.

ఆర్‌టిసి సమ్మె 50 రోజులకు పైగా జరిగితే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోగా ఏకంగా కార్మిక సంఘాలను రద్దు చేస్తున్నట్లు, ఎస్మా కిందికి తెస్తున్నట్లు ప్రకటించింది, 30, 40 మంది చనిపోతే వారి కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సహాయం, ఉద్యోగ కల్పన వంటివి సకాలంలో చేయకపోవడం. ఆర్‌టిసిని ప్రవేటుకు అమ్మడానికి సిద్ధం కావడం. 'తెలంగాణ రాష్ట్రంలో కుల అసమానతలు, కుల వివక్షత మహిళలపై అత్యాచారాలు, చిన్న పిల్లల కిడ్నాప్‌లు, హత్యలు గతంలోకంటే పెరిగిపోయాయి' 'ధనిక రాష్టాన్ని అప్పుల రాష్ట్రంగా తయారు చేస్తిరి'.

'లక్ష ఉద్యోగాలు అని లక్ష సార్లు అన్నారు కానీ లక్ష ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇవ్వకపోయే' 'టిపిపిఎస్‌ఇకి స్వయం నిర్ణయాధికారం లేకుండ కీలుబొమ్మగా చేయడం'. 'జిల్లాల స్థాయిలో డిఎస్‌సిలు నిర్వహించకపోవడం' 'ఉద్యోగ ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు 6 సంవత్సరాల నుండి పిఆర్‌సి, ఐఆర్, డిఏలు, ఓపిఎస్ వంటి న్యాయంగా ఇవ్వాల్సినవి ఇవ్వకపోవడం, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ రద్దు అన్న పెద్దమనిషి రెగ్యులర్ చేయకపోయే. జోనల్ వ్యవస్థ అన్నారు అది ఎటు పోయిందో'.

'రైతులకు రుణమాఫీ చేయకపోవడం,గిట్టుబాటు ధరలు ఇవ్వకపోవడం, సన్నాలు వరి వేయాలి అని వత్తిడి చేయడం' 'ఎల్ఆర్ఎస్, వ్యక్తిగత ఆస్తి వివరాల నమోదు, విఆర్ఓ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, పంచాయతీ రాజ్ వ్యవస్థ, రిజిస్ట్రేషన్ వ్యవస్థ ఇట్లా ప్రతి శాఖల్లో మార్పులు, చేర్పులు, ఉద్యోగులను మానసిక వత్తిడికి గురి చేయడం. దుబాయ్, బొంబాయి వంటి వలసలు నిలువరించకపోవడం, చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్య వ్యవస్థ దోపిడీని లేకుండ చేస్తాం, వాటిని రద్దు చేస్తాం అన్నోళ్లు విద్య ప్రవేటీకరణ చేయబట్టే, ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు రద్దు చేయడం, ప్రవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడం. ప్రభుత్వ వైద్యం నిర్లక్ష్యం చేయడం. జిల్లాకో కార్పొరేట్ తరహా హాస్పిటల్ కడతాం అంటిరి, కనీస మౌలిక సదుపాయాలు కల్పన చేయలేక పోతిరి. విద్య, వైద్య రంగాల్లో కొత్త నియామకాలే చేయకపోయే.

'కరోన మహమ్మారిని సరిగా ఎదుర్కోవకపోవడం, ఓపెన్ కాస్ట్ బొగ్గు తవ్వకాలు వ్యతిరేకంగా మాట్లాడి అధికారంలోకి వచ్చిన తరువాత ఓపెన్ కాస్ట్ తవ్వకాలు జరిపించడం, గ్రానైట్ కోసం గుట్టల విధ్వంసం బందు కాలేదు, బయ్యారం ఉక్కు అన్నోడు మాటే లేదాయే, చేత లేదాయే, ఏజన్సీలో పోడు భూములకు పట్టాలు ఇస్తా, పెసా చట్టం, 1/70 సక్రమంగా అమలు చేస్తా అన్నారు ఏమైంది అని అడిగితే మాటే లేదు. హైదరాబాద్‌లో వర్షాల వల్ల లక్షలాది మంది సహాయక చర్యలు అందక, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులను ఎదుర్కోవడం ఒక వంతు అయితే, పాలక పక్షం క్యాబినెట్ అనేది ఒక బొమ్మల కొలువుగా మిగిలిపోవడం ఏ మంత్రికి స్వయంగా తన శాఖ పరిధిలో ఆలోచించే, నిర్ణయాలు తీసుకునే, మాట్లాడే స్వేచ్ఛ లేని గంగిరెద్దులుగా ఉంచడం.

ఎంఎల్ఏ, ఎంఎల్‌సిలు చిడతలు కొట్టే భజన మండలిగా మిగిలిపోవడం. అన్నిటికి ఆ నలుగురే అన్నట్లు వ్యవహరించడం, పాశం యాదగిరి సీనియర్ జర్నలిస్ట్ అన్నట్లు ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, ఎడ్యుకేషన్ మాఫియా, మెడికల్ మాఫియా, కుఫియా, మీడియా అన్నిటికి అన్ని కూడబలుక్కొని సామాన్యుడి జీవితంలో అత్యంత అవమానకర రీతిలో చొచ్చుకొని వ్యవహరిస్తున్న తీరు వల్లనే ఓట్లు వ్యతిరేకించాయి. వారి స్వపక్షంలో పదవులకు పడిగాపులు పడుతున్న వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడం కూడ నివురు కప్పిన నిప్పులాగా ఉన్న వ్యతిరేకత, అసంతృప్తి దుబ్బాక ఎన్నికల్లో పని చేసింది.

ప్రజలు అమాయకులు, బలహీనులు అని అధికారం అనుకోవచ్చు. ఎవడు మాట్లాడిన, ఎవడు రాసిన, ధర్నాలు, రాస్తారోకోలు అని పిచ్చిపిచ్చిగా చేస్తే మక్కెలు ఇరగగొడుతా, బొక్కలో తోస్తా అని అనుకోవచ్చు. కానీ తెలంగాణ ప్రజానీకం తెలివైన వాళ్లు, విచక్షణ జ్ఞానం అనేది తప్పనిసరి పరిస్థితుల్లో కచ్చితంగా పని చేస్తుంది. ఎవడు ఎన్ని డబ్బులు ఇచ్చిన, ఎంత మందు పోసిన పనికి రాని వాన్ని ప్రక్కన పెట్టక తప్పదు అని నిరూపించారు. పాలనలో, పైసల్లో ప్రజలను భాగస్వామ్యం చేయకుండ పాలక పక్షం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు గ్రహించారు. తెలంగాణ ఉద్యమంలోని కలాలను, గళాలను ఎన్నిటినైన ప్రలోభ పెట్టవొచ్చు, ఎంఎల్‌సిలుగా, నామినేటెడ్ పదవుల్లో, పట్టం కట్టవొచ్చు కానీ తెలంగాణ ప్రజల నాడీ పట్టుకోకపోతే రానున్న 2023 ఎన్నికల్లో మార్పు తప్పదు అది నేటి పాలకుల వ్యవహార శైలి పై ఆధారపడి ఉంటుంది.

(రచయిత తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

తెలంగాణ ఆరోగ్యానికి ముప్పు ఫార్మా సిటీ

ప్రైవేట్ ఫార్మా కంపెనీలతో కార్పొరేట్ సంస్థలు లాభపడగా, వాటి నుంచి వచ్చే కాలుష్యంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడతారని అంటున్నారు **అన్వేశ్ రెడ్డి సుంకేత్**

తెలంగాణ వస్తే మన బతుకులు మారుతాయి అని, బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఫార్మాసిటీ తేవడం వలన ఎవరికి బంగారం? ఎవరికి సింగారం?

రాష్ట్ర వ్యాప్తంగా, ప్రత్యేకంగా పటాన్‌చెరువు, జీడిమెట్ల, చౌటుప్పల్, కొత్తూర్, పోలేపల్లి లాంటి ప్రాంతాలలో ఉన్న ఫార్మా కంపెనీలు తమ ఫాక్టరీల ద్వార కాలుష్యాన్ని వెదజల్లుతున్న విషయం మనకు అనుభవమే. అనేక గ్రామాల ప్రజలు మందుల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ నీరు, గాలి, అత్యంత ప్రమాదకర ఘన పదార్థాల కాలుష్యంతో సతమతమవు తున్నారు. దాదాపు 30 ఏళ్ల నుంచి పటాన్‌చెరువు ప్రాంతంలో ప్రజలు ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు తీసుకున్న చర్యలు నిరర్థకం, శూన్యం.

గత పది ఏళ్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు కూడా విపరీతంగా గ్రామ వనరులను కలుషితం చేస్తున్నా, ప్రజలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా, ఫలితం కానరాలేదు. ఆయా ప్రాంతాలలో స్థానికులు రకరకాల కాలుష్యంతో, అత్యంత ప్రమాదకర రసాయన చర్యల భారిన పడి అనారోగ్యం పాలు అవుతూనే ఉన్నారు. అనారోగ్యంతో, వైద్యానికి ఖర్చులతో, ఉన్న ఆస్తులు కరిగిపోయి బికారులు అవుతున్నారు. పరిశ్రమ వేసే పవర్ బోర్ల తోటి స్థానిక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇంజక్షన్ బోర్లు వేసి ప్రమాదకర వ్యర్థ జలాలు భూగర్భంలోకి వదులు తున్నారు. భూగర్భ జలాలు పూర్తిగా విషమయం అయిపో తున్నాయి. రకరకాల రంగులలో ఈ నీళ్లు బోర్ల ద్వార రావడం అనేక గ్రామాలలో చూస్తున్నాం. వ్యవసాయం పూర్తిగా నిలిపివేసే పరిస్థితి వచ్చింది. పల్లె ప్రజలు, పశువులు అంతు చిక్కని రోగాల బారిన పడుతున్నారు. పశువులు విషం నీళ్లు తాగి చనిపోతున్నాయి. జీవనోపాధులు దెబ్బతింటున్నాయి. గ్రామీణ పేదరికం ఆయా ప్రాంతాలలో పెరుగుతున్నది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ప్రాంతంలో ఎప్పుడో 40 ఏళ్ల కిందట సిరిస్ కంపెని వెదజల్లిన కాలుష్యం వల్ల, ఇప్పటికే ఆ ప్రాంత వాసులకు బోర్లలో విష సమానమైన రంగు నీళ్లు తప్పడం లేదు.

జీరో డిస్చార్జి అంటూ స్థానిక భూగర్భ జలాలను, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమలను నియంత్రించకుండా, వాటిని మూసి వేయకుండా, ప్రజలు నిరసనలు తెలియజేస్తే వారి మీద తప్పుడు కేసులు పెట్టిన వైనాలు కూడా ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మీద దృష్టి పెట్టకపోగా, ఇంకా ఫార్మా పరిశ్రమలు పెట్టండి, మంత్రులు, అధికారులు కాలుష్య నియంత్రణ మీద ఆలోచనలు చేయకుండా కొత్త ఔషద కంపెనీలకు రాయితీలు ఇస్తామని ప్రకటనలు చేయడం శోచనీయం. మేము పోలేపల్లిలోని ఫార్మా కంపెనీలు ఉన్న ప్రాంతాల గ్రామాలను పరిశీలించినప్పుడు కొన్ని ప్రమాదకరమైన, దిగ్భ్రాంతి కలిగించే విషయాలు బయటపడ్డాయి. అక్కడి ప్రజలు ఉపయోగించే బోరు నీళ్లను స్టీల్ బిందెలలో నిల్వ ఉంచితే ఆ బిందెలకు మొత్తం రంధ్రాలు పడుతున్నాయి. బోర్ల నుండి వచ్చే నీళ్లతో పంటలు పండలేని పరిస్థితి. అక్కడ గాలి వల్ల ఊపిరి ఆడక సతమతమవుతున్న వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. అక్కడ ఉన్న కొన్ని ఫార్మా కంపెనీల వల్ల ఇలాంటి పరిస్థితి ఉంటే మొత్తం వందల వేల కంపెనీలు ఒక్క దగ్గర ఉంటే ఎలా ఉంటుందో ఊహించడమే కష్టం. ఈ పరిస్థితులను విస్మరించి కాలకూట విష సర్పాన్ని 'నిమ్జ్' అనే కొత్త పేరు పెట్టి 'ఇది కరిచే పాము కాదు మన పెంపుడు పాము' అనే భ్రమ కల్పిస్తున్నారు.

కాలుష్యం తగ్గించి, వనరులను పునర్వినియోగించి, పర్యా వరణాన్ని కాపాడవలసిన తరుణంలో పరిశ్రమల అధిపతులు కేవలం తమకు వచ్చే లాభాల మీదనే దృష్టి పెడుతున్నారు. ఫార్మా పరిశ్రమలు ప్రభుత్వం నుంచి అనేక రకాలుగా సబ్సిడీలు పొందుతూ, ప్రజల మీద పడుతున్న దుష్ప్రభావం గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు, ఎన్నికైన ప్రతినిధులు ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచన చేయకుండా, కాలుష్య కారక పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారు. స్వచ్ఛమైన పర్యావరణ వనరులను కాలుష్యమయం చేయడం వలన స్థానిక జీవనోపాధులు దెబ్బతింటున్నాయి. ఉన్న వ్యవసాయం కుంటుపడుతున్నది. యువత ఉన్న ఉపాధిని కోల్పోతున్నారు. అటు పరిశ్రమలలో ఉద్యోగాలు రాక, తమ బతుకు తాము జీవించే పరిస్థితి లేక, పారిశ్రామిక ప్రాంతాలలో గ్రామీణ ప్రజలు నిత్య నరకం అనుభవిస్తున్నారు.

అక్కడ ఒక్కటి, ఇక్కడ ఒక్కటి పరిశ్రమలు ఉన్నప్పుడే ఇంత దారుణ పరిస్థితి ఉండగా, ఒకే చోట కొన్ని వందల ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మా సిటి పేరుతో ఒక పూర్తి స్థాయి విష నగరిని ప్రజలు వ్యతిరేకిస్తున్న కూడా ఏర్పాటు చేయాలనీ ముందుకు పోతున్నది. ఈ విష నగరి వల్ల రాబోయే దుర్భర పరిస్థితులు ఊహకు కూడా అందవు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్యాన్ని నియంత్రించలేని ప్రభుత్వం, అధికారులు ఒకటే చోట వెయ్యి కంపెనీలు పెడతామని మొండిగా వ్యవహరించడం దారుణం. ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం. ఫార్మా సిటీ బారిన పడే అన్ని గ్రామాల ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్‌కు ముప్పై కిలోమీటర్ల దూరంలోనే ఫార్మసిటీ ఏర్పాటు కోసం యాచారం, కడ్తాల్, కందుకు మండలాల్లో పట్టా, అసైన్డ్, ఫారెస్ట్ భూములు మొత్తం 19,333 వేల ఎకరాల్లో ఔషదా నగరిని ఏర్పాటు చేయడం కోసం రైతుల భూములను తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నుండి వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్న రైతులు ఎక్కడికి వెళ్లాలి? వ్యవసాయ కూలీలు, ఇతర కులవృత్తుల వాళ్ల పరిస్థితి ఏంటి? భూములు

తీసుకుంటున్నారు. మరి ఇండ్లు అలానే ఉంటున్నాయి. మరి చుట్టూ ఫార్మా కంపెనీలు వెలిసినంక గ్రామాల ప్రజలు అక్కడ ఎలా నివసించగలరు? ఫార్మా సిటీ ఏర్పాటు వలన ఒక 100 నుంచి 150 కి.మీ పరిధిలో పర్యావరణం, చెట్లు, చేమ, చెరువులు, కుంటలు, చెలమలు, భూమి, మట్టి, నేల, పీల్చే గాలి వంటి అన్ని రకాల సహజ వనరులు కలుషితమై, స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ కాలుష్య ప్రభావం దశాబ్దాల తరబడి ఉంటుంది, భవిష్యత్ తరాల ఉనికికే ఇది ప్రమాదం.

తెలంగాణలో ఫార్మా రంగం పరిస్థితి చూస్తే భారత ఫార్మా ఎగుమతుల్లో 20 శాతం హైదరాబాద్ నుంచి జరుగుతున్నాయి. ఉత్పత్తిలో మూడింట ఒక భాగం తెలంగాణలో జరుగుతుంది. మొత్తం 412 ఫార్మా కంపెనీలు (173 బల్క్ డ్రగ్) ఉన్నాయి. ఫార్మా రంగంలో ఉద్యోగ కల్పన విషయంలో వాస్తవల్ని చూస్తే టిఎస్ ఐపాస్ (1 జనవరి 2016 నుంచి 2017) వరకు వచ్చిన ఫార్మా, కెమికల్స్ అనుమతులు 169. మొత్తం పెట్టుబడి రు. 4,055 కోట్లు. ఉద్యోగ కల్పన 19,190. సగటున ఒక్క యూనిట్‌కి కల్పించే ఉద్యోగాలు 118 అంటే ప్రతి ఉద్యోగానికి రు. 20 లక్షల పెట్టుబడి.

'ఆరోగ్యమే నిజమైన సంపద బంగారు వెండి నాణాలుకావు' కానీ మన ప్రభుత్వాలు జిడిపి పెరుగుదలే లక్ష్యం చేసుకొని ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రతిపాదన ముందుకు తెచ్చింది ప్రభుత్వం. ఫార్మా సిటీ కోసం వేలాది ఎకరాల రైతుల భూములు తీసుకుంటున్నారు అనుకుంటే ఆ భూముల మీద అధారపడి బతికే దాదాపు అరవై వేల మంది జీవనం కోల్పోతారు. వారిలో కనీసం పదిహేను వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తేనే వారందరి జీవనం సాఫీగా సాగుతుంది. పరిశ్రమల స్థాపనలో భాగంగా నిర్వాసితులైన వారికి ఇంతవరకు సరైన ఉద్యోగాలను కల్పించిన ధాఖలాలు లేవు. పరిశ్రమలలో ఎక్కడ చూసినా బయటి రాష్ట్రాల వారే పని చేస్తున్నారు.

ఫార్మా సిటీకి సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో ఈ ప్రాజెక్ట్ ద్వారా 8.79 లక్షల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని (పేజీ సి 423)లో రాశారు. పట్టిక 2.2 (పేజీ సి 212) లో 15.95 లక్షల ఉద్యోగాలు ఉంటాయని రాశారు. పట్టిక 2.16 (పేజీ సి 245)లో మరో అంకె ఇచ్చారు. ఏ సంఖ్య సరైనది?. మొదటిది సరైనది అనుకుంటే 1000 ఉద్యోగాలు ఇచ్చే ప్లాంట్లు కనీసం 879 రావాలి. మొత్తం దేశంలో ఫార్మా రంగంలో ఉద్యోగాల సంఖ్య ఆ స్థాయిలో ఉంది. పట్టిక 4.2 పేజీ సి 415లో ఇచ్చిన ప్రాజెక్ట్‌లో మొత్తం బాయిలర్ పొగ గొట్టాల సంఖ్య 230 అంటే 230 ప్లాంటులే ప్రతిపాదిస్తున్నట్లు. సగటున ఒక్కో ప్లాంటులో 3822, లేదా 2002 మంది ఉద్యోగాలుండాలి. హైదరాబాద్‌లో 1000 మంది ఒకే చోట పని చేస్తున్న రసాయన కంపెనీలు ఎన్ని ఉన్నాయి? ఒక్క ఫార్మసిటీలోనే ఎన్ని ఉద్యోగాలోస్తాయి అనడానికి ప్రాతిపదికే లేదు. ఇది ప్రజలను మోసం చేయడమే.

ఏ ప్రాజెక్ట్‌లో ఏ ఉత్పత్తులు చేస్తారో చెప్పకుండానే ఏ ప్రాతిపదికన ద్రవ వ్యర్థాలు రోజుకి 68220 ఘనపు మీటర్లు ఉంటాయని నిర్ధారించారో తెలియదు. గృహ ద్రవ వ్యర్థాలు కూడా అదే స్థాయిలో రోజుకి 54,800ల ఘనపు మీటర్లు చూపారు. పట్టిక 2.2 పేజీ సి 212ను బట్టి ఉద్యోగుల సంఖ్య 15.95 లక్షలుగా తీసుకున్నట్లు గణనం తెలుపుతుంది. ఈ సంఖ్య మనదేశంలో మొత్తం ఫార్మా రంగ ఉద్యోగుల సంఖ్యకు రెట్టింపు. ఇది పచ్చి మోసం. ఘన హానికర పదార్థాల అంచనాను 'Inventorisation and Characterization of Hazardous Waste Categories in Andrapradesh and Telangana' నివేదిక ఆధారంగా చేశాం అని చెప్తూ ఏడాదికి అది 1.5 లక్షల టన్నులు ఉంటుందని రాశారు. అదే నివేదికలో పేజీ 83 లోని పట్టిక 7.4 ప్రకారం ప్రస్తుతం పాత మెదక్ జిల్లాలో ఉత్పత్తి అవుతున్న హానికర ఘన వ్యర్థం 2,53,672.08 టన్నులు. భారతదేశం మొత్తంలోని ఫార్మా రంగాన్ని మించిపోయే ప్రాజెక్ట్ ప్రతిపాదన చేస్తూ తెలంగాణలో ఒక జిల్లా కంటే తక్కువ ఘన వ్యర్థాల ఉత్పత్తి మాత్రమే జరుగుతుందని చూపడం శోచనీయం.

హైదరాబాద్ ఫార్మా సిటి – ప్రజలు తిరస్కరించిన ప్రాజెక్ట్

జీరో డిస్చార్జి అంటూ స్థానిక భూగర్భ జలాలను, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమలను నియంత్రించకుండా, వాటిని మూసివేయకుండా, ప్రజలు నిరసనలు తెలియజేస్తే వారి మీద తప్పుడు కేసులు పెట్టిన వైనాలు కూడా ఉన్నాయి. ఇటీవల 2017, జూలై 22 నాడు జరిగిన సమీక్ష సమావేశంలో, మంత్రితో సహా అధికారులు కాలుష్య నియంత్రణ మీద ఆలోచనలు పెట్టకుండా, కేవలం కంటితుడుపు మాటలతో తమ నిస్సహాయతను వ్యక్తపరిచిన విషయం తెలిసిందే.

కాలుష్యం తగ్గించి, వనరులను పునర్వినియోగించి, పర్యావరణాన్ని కాపాడవలసిన తరుణంలో, పరిశ్రమలు కేవలం తమకు వచ్చే లాభాల మీదనే దృష్టి పెడుతున్నాయి. ఔషధ పరిశ్రమలు ప్రభుత్వం నుంచి అనేక రకాలుగా సబ్సిడీలు పొందుతూ, ప్రజల మీద పడుతున్న దుష్ప్రభావం గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు, ఎన్నికైన ప్రతినిధులు ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచన చేయకుండా, కాలుష్య కారక పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారు. స్వచ్ఛమైన పర్యావరణ వనరుల కాలుష్యం వలన స్థానిక జీవనోపాధులు దెబ్బతింటున్నాయి. ఉన్న వ్యవసాయం కుంటుపడుతున్నది. యువత ఉన్న ఉపాధి కోల్పోతున్నారు. అటు పరిశ్రమలలో ఉద్యోగాలు రాక, తమ బతుకు తాము జీవించే పరిస్థితి లేక, పారిశ్రామిక ప్రాంతాలలో గ్రామీణ ప్రజలు నిత్య నరకం అనుభవిస్తున్నారు.

అక్కడ ఒక్కటి, ఇక్కడ ఒకటి పరిశ్రమలు ఉన్నప్పుడే ఇంత దారుణ పరిస్థితి ఉండగా, ఒకే చోట కొన్ని వందల ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తే రాబోయే దుర్భర పరిస్థితులు ఊహకు కూడా అందవు. వేయి ఎకరాలలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలను నియంత్రించలేని ప్రభుత్వం, తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు ఇంత పెద్ద క్లస్టర్ ఏర్పాటు చేసే ప్రణాళిక చేయడం శోచనీయం. ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం. ఫార్మా సిటీ బారిన పడే అన్ని గ్రామాల ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. 19,333 ఎకరాలలో ఫార్మా సిటీ ఏర్పాటు వలన ఒక 50 నుంచి 70 కి.మీ. పరిధిలో పర్యావరణం, చెట్లు, చేమ, చెరువులు, కుంటలు, చెలమలు, భూమి, మట్టి, నేల, పీల్చే గాలి వంటి అన్ని రకాల సహజ వనరులు కలుషితం అయ్యి, స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ కాలుష్య ప్రభావం కొన్ని దశాబ్దాల వరకు ఉండే అవకాశం ఉంది. భవిష్యత్ తరాల ఉనికికే ఇది ప్రమాదం.

ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015, ఆగస్టు 14న జారీ చేసిన జిఓ నెం.63ను గమనించాలి. గ్రామ జ్యోతి కార్యక్రమం

ద్వార ప్రతి గ్రామం తమ వనరులను అంచనా వేసుకుని, తమ స్థాయికి అనుగుణంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఈ ఉత్తర్వులు చెబుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం కూడా ప్రతి గ్రామం కూడా తమ అభివృద్ధిని నిర్దేశించుకునే అవకాశం ఉంది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాలలో ఉన్న అనేక గ్రామాలు, ముచ్చెర్ల, మేడిపల్లి, కురుమిద్ద తదితర గ్రామాలతో సహా, ఫార్మా సిటీ కావాలి అనుకోవడం లేదు. స్థానిక యువతకు వారి చదువుకు, నైపుణ్యానికి తగ్గ ఉపాధి అవకాశాలు ఈ గ్రామాలు కోరుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న వ్యవసాయం, వృత్తులు, ఇంకా అనేక ఇతర జీవనోపాధుల పునాదుల మీద అభివృద్ధి జరగాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

ఫార్మా పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానికులకు ఉపాధి దొరకకపోగా, స్థానిక గ్రామాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. ఫార్మా సిటీ ఆయా గ్రామ ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు, ఆలోచనలకూ పూర్తిగా విరుద్ధం. అవసరం లేనిది. 2017 అక్టోబర్ 11న యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వేలాది మంది పోలీసులను పెట్టి గ్రామాల రైతులను అక్కడకు రానీయకుండా బయటి ప్రాంతాల ప్రజలను అక్కడకు తీసుకవచ్చి ప్రజాభిప్రాయ సేకరణను ప్రభుత్వానికి అనుకూలంగా చేసుకున్నారు. ఇప్పుడు అక్కడి రైతులు ఈ దినాన్ని నిరసన దినంగా మేడిపల్లిలో ఎక్కడైతే ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం జరిగిందో అక్కన్నే ఒక స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇకపోతే అక్కడి రైతుల నుండి భూములు తీసుకోవడం కోసం అనేక విధాలుగా రైతుల మీద ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేస్తున్న విషయాన్ని సెప్టెంబర్ 9న జాతీయ బిసి కమిషన్ తాటిపత్రి గ్రామానికి వచ్చినప్పుడు రైతుల గోసను వారు చెప్పుకున్నారు. దీని తర్వాత కూడా స్థానిక ఎం.ఎల్.ఏ మేడిపల్లి గ్రామానికి వస్తే అక్కడి గ్రామాల రైతులంతా తిరగబడితే రైతుల మీద కేసులు పెట్టి జైలుకు కూడా పంపినారు.

ఈ విషయాల మీద ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి అని స్థానికులు కోరుతున్నారు

1) ఫార్మా సిటీ లోపల ఉండే గ్రామాలు, నివాస ప్రాంతాల గురించి ప్రభుత్వం చేసిన ప్రణాళిక ఏమిటి?
2) అసైన్డ్ భూములకు, ఇతర భూములకు మధ్య నష్ట పరిహార పరిమాణంలో సరి సమానత ఎందుకు లేదు?
3) కుటుంబ కలహాలు వచ్చిన భూముల సేకరణ పట్ల ప్రభుత్వ వ్యూహం ఏమిటి?
4) భూమి లేని కుటుంబాలు, ఇతర వృత్తిదారుల పట్ల పునరావాస ప్రణాళికలు ఏమున్నాయి? దీని మీద ఏమన్నా నివేదిక తయారు చేశారా?
5) అవినీతి మీద విచారణ చేపట్టిన తరువాత తీసుకున్న చర్యలు ఏమిటి?
6) మహిళలు, వృద్ధులు, పిల్లల పట్ల ప్రభుత్వ ప్రణాళికలు ఏమున్నాయి?

ప్రజలను ముందస్తుగా సంప్రదించకుండా, వారి అనుమతి లేకుండా, ఈ ఫార్మా సిటీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పూర్తి స్థాయి ప్రాజెక్ట్ ప్రణాళిక కూడా ప్రజల ముందు పెట్టలేదు. సింగపూర్ కంపెనీకి ఫార్మా సిటీ మాస్టర్ ప్రణాళిక తయారు చేయమని కాంట్రాక్ట్ ఇచ్చినా, వారి నివేదిక మాత్రం ప్రజలకు అందుబాటులో లేదు. కాని అన్నింటి కంటే ముందే, ప్రజలకు చెప్పకుండా, వారి అనుమతి తీసుకోకుండా, వారిని సంప్రదించకుండా, ఫార్మా సిటీ ప్రాజెక్ట్ కొరకు భూసేకరణ ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

మాస్టర్ ప్లాన్ తయారు కాకముందే, అసైన్డ్ భూములు, అటవి, పట్టా భూముల సేకరణ చేపట్టడం సుపరిపాలన పద్ధతులకు వ్యతిరేకం. కాగా, గ్రామంలోని ఇళ్ల గురించి, నివాస ప్రాంతాల పరిస్థితి గురించి అధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేదు. ప్రభుత్వం చెప్పట్టిన భూసేకరణ కుటుంబాలలో చిచ్చు రేపింది. కలహాలు సృష్టించింది. సేకరణ చేసిన భూములలో కూడా రైతుకు మొత్తం పరిహారం కాకుండా కొంత మేరకే ఇచ్చారు – ఉదా: ఐదు ఎకరాల భూమి సేకరిస్తే, ఒక ఎకరాకు ఇచ్చారు, మిగతాది ఇయ్యలేదు. భూసేకరణలో అవకతవకలు, అవినీతి విపరీత స్థాయిలో ఉంది అనే విషయం ప్రజలకు, అధికారులకు తెలిసిందే. అలాగే రైతులకు పట్టా భూములకు ఒక రకంగా అసైన్డ్ భూములకు ఒక రకంగా డబ్బులు ఇస్తున్నారు.

అసైన్డ్ భూముల సేకరణ కూడా రైతులకు, భూ యజమానుల హక్కులకు భంగం కలిగించే పద్ధతిలోనే జరుగుతున్నది. భూమి ఉన్న రైతు పరిస్థితి ఒక సమస్య కాగ, భూమిలేని నిరుపేదల గురించి ప్రభుత్వం కాని, అధికారులు కాని, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ గాని ఇప్పటివరకు ఒక ప్రకటన చేయలేదు. బాధితులకు సమాచారం ఇవ్వలేదు. వారి గోస ఎవరికీ చెప్పుకునేటట్టులేదు.

ఈ విధమైన పరిస్థితిలో, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు.

1) హైదరాబాద్ ఫార్మా సిటీ పేరిట రంగారెడ్డి జిల్లాలో తలపెట్టిన ప్రాజెక్ట్ ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.
2) గ్రామ జ్యోతి కార్యక్రమం ద్వార ప్రజలు తమ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకుని, అమలు పరుచుకునే అవకాశం తెలంగాణ ప్రభుత్వం కల్పించాలి. ఈ ప్రణాళిక అమలు చేయడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలి.

వారి మాటలలో "మా గ్రామ పరిధిలో, మా గ్రామం చుట్టూ ఫార్మా సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు మాకు పత్రికల ద్వార తెలుస్తున్నది. మీ సంస్థ ఈ ప్రాజెక్ట్‌కు నోడల్ సంస్థగా ఉన్న సందర్భంలో, మా గ్రామ పంచాయతీకి మీరు ఇప్పటి వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపలేదు. మాకు ఎటువంటి సమాచారం పంపలేదు. మాతో సంప్రదింపులు జరుపలేదు. మా గ్రామ సభలాగానే, పార్లమెంటు తరహాగా, రాజ్యాంగ పరంగా ఏర్పాటు అయినది. మా హక్కులకు మీ కార్యకలాపాలు భంగం కలిగిస్తున్నాయి.

మీరు తక్షణమే మీరు తలపెట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డి.పి.ఆర్ మాకు అందజేయండి. మీరు తయారు చేసుకున్న ప్రాజెక్ట్ షెడ్యుల్ మాకు పంపించండి. ఈ ప్రాజెక్ట్ మీద జరిపిన పర్యావరణ ప్రభావ అంచనా రిపోర్ట్ (ఇఐఏ) మాకు పంపించండి. ఈ సందర్భంగా అసలు ఇఐఏ రిపోర్ట్ తయారు చేసిన బృందం క్షేత్ర పరిశీలన చేయలేదు. మమ్మల్ని సంప్రదించలేదు" అనే వాదన ప్రజలలో బలంగా ఉంది. కాబట్టి ప్రభుత్వం అభివృద్ధి పేరు మీద కొద్దిమంది పెట్టుబడిదారుల కోసం భూమిని నమ్ముకొని బతుకుతున్న రైతుల భూములు లాక్కొని రైతును రోడ్డు మీద పడెయ్యకండి. ప్రజలకు ఉపయోగపడే నీటి ప్రాజెక్ట్‌లో లేదా రైల్వే లైన్ కోసం కానీ రోడ్ల కోసమో కాకుండా విషపూరితమైన ఫార్మా ప్రైవేట్ కంపనీల కోసం ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం.

(రచయిత చైర్మన్, తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్) వీ

రైతు వేదికలు ఎందుకు ఉపయోగపడాలి?

గ్రామాలలో రైతు వేదికల ఏర్పాటు నిజంగా రైతు ప్రయోజనాలను కాపాడుతుందా, అందరికీ అందుబాటులో ఉంటుందా, అన్ని సామాజిక వర్గాలకు ఉపయోగపడుతుందా అని ప్రశ్నిస్తున్నారు **కన్నెగంటి రవి**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో రైతు వేదికలు నిర్మాణం అవుతున్నాయి. గ్రామీణ వ్యవసాయదారులు ఈ కేంద్రాలను ఉపయోగించుకుని రైతులు ముందడుగు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు ఇస్తున్నది. 2020 జూన్ 5న జిఓ 247 ద్వారా 350 కోట్లు బడ్జెట్ కేటాయించింది.

క్లస్టర్‌కు ఒకటి చొప్పున (ప్రభుత్వ వ్యవసాయ శాఖ పరిభాషలో క్లస్టర్ అంటే 5000 ఎకరాలు) రైతు వేదికలు నిర్మించాలని ప్రభుత్వ ఆలోచన. కానీ ప్రస్తుతం రెండు రెవెన్యూ గ్రామాల మధ్యలో, లేదా 5,6 గ్రామ పంచాయితీల మధ్యలో నిర్మిస్తున్నారు. ఈ రైతు వేదికలు ఎలా నిర్వహించబడతాయో ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు (ఎఇఓ) ఇక్కడి నుండే పని చేయాల్సి ఉంటుందని కొన్ని సూచనలు ఇచ్చినా, అందుకు సంబంధించి కూడా నిర్దిష్ట నిర్ణయం కాలేదు.

గ్రామీణ రైతుల కోసం గ్రామాల మధ్యలో ఒక భవనం ఉండడం తప్పేమీ కాదు. కాకపోతే ఈ భవనం నిజంగా రైతుల ప్రయోజనాలను కాపాడుతుందా? గ్రామాలలో ఉండే వాస్తవ సాగుదారులకు అందుబాటులో ఉంటుందా? వివక్ష లేకుండా అన్ని సామాజిక వర్గాల రైతులు, మహిళా రైతులు, అవసరమైనప్పుడు వ్యవసాయ కూలీలు, ఇతర అనుబంధ వృత్తుల (చేనేత కార్మికులు, మత్స్యకారులు, గీత కార్మికులు, మేకల, గొర్రెల పెంపకం దారులు) వినియోగించుకోవడానికి అవకాశం ఇస్తారా? ఈ భవనాల నిర్వహణకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు కనుక ఇవన్నీ ఇంకా ప్రశ్నలు గానే ఉన్నాయి.

రాష్ట్ర ముఖ్యమంత్రి అప్రజాస్వామిక పాలనా తీరు, భూముల యజమానులకు ఇస్తున్న ప్రాధాన్యం, కౌలు రైతులను గుర్తించకపోవడం, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దళితులకు 3 ఎకరాల భూమి కొనుగోలు పథకాన్ని నిలిపివేయడం, మహిళలను రైతులుగా గుర్తించక పోవడం. ఇవన్నీ రైతు వేదికల నిర్వహణ ఏ మేరకు మొత్తం గ్రామీణ ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగ పడేలా ఉంటుందా అన్నది ప్రశ్నార్థకమే.

నిజానికి గ్రామీణ ప్రాంతంలో చాలా కీలకమైన సమస్యలు గ్రామీణ ప్రజలను, ముఖ్యంగా రైతులను వేధిస్తున్నాయి. వాటి గురించి గత 6 సంవత్సరాలుగా రైతు సంఘాలు చర్చకు పెడుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఆ అంశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్రానికి ఒక సమగ్ర వ్యవసాయ విధానం ఇప్పటికీ లేదు.

2020 ఖరీఫ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అమలులోకి వచ్చిన నియంత్రిత పంటల సాగు విధానం రైతులకు ఎంత నష్టం కలిగించిందో చూస్తున్నాం. బహుళ పంటలు పండే తెలంగాణ రాష్ట్రంలో వరి, పత్తి మాత్రమే 80 శాతం సాగు భూములను ఆక్రమించాయి. పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు, కూరగాయల, చిరుధాన్యాల సాగు పూర్తిగా తగ్గిపోయింది. వాతావరణంలో వచ్చిన మార్పులు, రాష్ట్ర పర్యావరణం, భూముల సారం, నీటి వనరుల అందుబాటు, రాష్ట్ర అవసరాలతో సంబంధం లేకుండా మార్కెట్ కోసం పండించాలనే పేరుతో వేయించిన పంటలు నిజంగా రైతులకు మేలు చేయలేదని ఈ సీజన్ రుజువు చేసింది. రైతు వేదికల కేంద్రంగా గ్రామ స్థాయిలో స్థానిక వనరులు, అవసరాలు ప్రాతిపదికగా పంటల ప్రణాళిక చేసి అమలు చేయగలిగితే నిజంగా గ్రామానికి, రైతులకు, గ్రామీణ ప్రజలకు మేలు జరుగుతుంది.

గ్రామాల భూ యాజమాన్యంలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. బయటి వాళ్లు, వ్యవసాయంతో ఏ మాత్రం సంబంధం లేని వాళ్లు గ్రామాలలోకి వచ్చి భూములు కొంటున్నారు. తమ భూములను కౌలుకు ఇవ్వడమో, లేదా రైతు బంధు కోసం వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పడానికి, పంట దిగుబడులతో నిమిత్తం లేకుండా విత్తనాలు చల్లి వదిలి పెట్టడమో, లేదా బీడు పెట్టడమో చేస్తున్నారు. గ్రామాల రైతులు స్వయంగా వ్యవసాయం చేసి, ఆ మిగులుతో భూములు కొనుక్కోలేని విధంగా భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కౌలు రైతుల సంఖ్య విపరీతంగా ప్రతి గ్రామంలో పెరిగిపోవడానికి ఇదొక కారణం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండీ కౌలు రైతులను గుర్తించకుండా, చాలా నిరంకుశ వైఖరిని తీసుకున్నది. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందక ప్రైవేట్ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నా, అప్పుల భారంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. ఈ మధ్యనే వరంగల్ జిల్లాలో ఒక కౌలు రైతు నిర్మాణం పూర్తయిన రైతు వేదిక భవనంలో ఉరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడంటే కౌలు రైతుల దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. గ్రామాలలో ఏర్పడే రైతు వేదికలు, తమ భూములు, వ్యవసాయంతో సంబంధం లేని వాళ్ల చేతుల్లోకి జారిపోకుండా కాపాడుకోవడానికి, భూమి లేని పేదల చేతుల్లోకి భూమి హక్కుగా అందుకోవడానికి నిర్దిష్ట చర్చలకు, కార్యాచరణకు ఈ రైతు వేదికలు కేంద్రం కావాలి. కౌలు రైతులను గుర్తించేలా, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేయడానికి రైతు వేదికలు భూమిలేని పేదల, కౌలు రైతుల గొంతు వినిపించే వేదికలుగా మారాలి.

రైతులకు అవసరమైన అన్ని పథకాలు గ్రామ స్థాయిలోనే అందేలా ఈ వేదికలు మారాలి. గ్రామీణ ప్రజల కోసం, రైతుల కోసం పని చేసే ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ భవనం నుండి తమ కార్యకలాపాలు సాగించేలా ప్రభుత్వం నిర్దిష్టంగా మార్గదర్శకాలు జారీ చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు గ్రామీణ ప్రజలకు పాలనను అందుబాటులోకి వచ్చాయి. ఆచరణలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ ఈ కేంద్రాల లక్ష్యం మాత్రం గ్రామీణ ప్రజలకు మేలు చేసేదే. తెలంగాణ రైతు వేదికలు కూడా ఆ లక్ష్యాలను కలిగి ఉంటే ఖచ్చితంగా గ్రామీణ ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

తెలంగాణలో పంటల సాగు ఖర్చులు ఎక్కువ. అందువల్ల జాతీయ స్థాయిలో ప్రకటించే కనీస మద్దతు ధరలు రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా ఉండడం లేదు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు ఈ కనీస మద్దతు ధరలకు కూడా గ్యారంటీ ఇచ్చే విధంగా లేవు. సిఏసిపి ప్రకటించే మద్దతు ధరల సూత్రం ప్రకారం ఉత్పత్తి ఖర్చుల జాతీయ సగటు మాత్రమే మద్దతు ధరల ప్రకటనకు ప్రాతిపదిక. కాబట్టి ప్రత్యేకంగా తెలంగాణ కోసం మద్దతు ధరలు ప్రకటించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పంటల ఉత్పత్తి ఖర్చులను తగ్గించేలా ప్రత్యేక కార్యక్రమాలు, పథకాలు చేపట్టాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో రసాయన ఎరువుల, పురుగు విషాల, కలుపు విషాల వినియోగం బాగా పెరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ ప్రాంత గాలి, నీరు, ఆహారం విష పూరితమై పోతున్నాయి. గ్రామాలలో అనారోగ్య సమస్యలు పెరిగి పోతున్నాయి. చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయి. పంటల పొందికలో వచ్చిన మార్పుల వల్ల ప్రజలకు పౌష్టిక ఆహారం, రైతులకు లాభదాయకత తగ్గి పోయింది. పప్పులు, నూనెలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, పండ్లు వినియోగం బాగా తగ్గిపోయాయి. పాలు, పాల ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. అనారోగ్యానికి మనుషులను గురిచేసే మద్యం, కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్ గ్రామాలను ఆక్రమిస్తున్నాయి. సిగరెట్లు, గుట్కాలు ఉండనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పశువులకు తగినంత మేత కేంద్రంగా పంటల ప్రణాళిక రూపొందడంతో పాటు, అవి రసాయన రహితంగా ఉత్పత్తి కావాల్సి ఉంది. గ్రామాలలో నిర్మాణం అయ్యే రైతు వేదికలు ఇందుకు కేంద్రం కావాలి. రైతులకు అవగాహన పెంచడానికి, శిక్షణలు ఇవ్వడానికి ఈ రైతు వేదికలు ఉపయోగ పడాలి. ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఈ వేదికలను తీర్చిదిద్దగలిగితే రైతులు (మహిళా రైతులతో సహా) సులభంగా ఈ జ్ఞానాన్ని పొందగలుగుతారు.

తెలంగాణలో గ్రామీణ యువతీ, యువకులకు, మహిళలకు వివిధ అంశాలపై నైపుణ్య శిక్షణలు ఇవ్వడానికి కూడా ఈ రైతు వేదికలు ఉపయోగపడాలి. ఇప్పుడు శిక్షణా తరగతులన్నీ నగరాలు, పట్టణాలు కేంద్రంగా జరుగుతున్నాయి. చాలా సందర్భాలలో ఈ శిక్షణ తరగతులకు హాజరై, జీవనోపాధులకు అవసరమైన శిక్షణలు పొందలేక పోతున్నారు.ఒక్కోసారి గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన నిపుణులు కూడా లేక, ఆ సేవలు పొందడానికి గ్రామీణ ప్రజలు నగరాలకు,మండల కేంద్రాలకు వెళ్లవలసి వస్తున్నది. ఈ పరిస్థితి మారాలంటే రైతు వేదికలను అందుకు అనుగుణంగా మార్చాలి.


గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, మహిళా బృందాలతో ఏర్పడిన గ్రామ మహిళా సమాఖ్యలు, కొన్ని గ్రామాలలో మత్స్య కారుల సహకార సంఘాలు, గొర్రెల, మేకల పెంపకం దారుల సహకార సంఘాలు కూడా ఉన్నాయి. కానీ వీటి అన్నిటి మధ్య సమన్వయం లేదు. పరస్పర సహకారం లేదు. కార్యక్రమాలు కలసి చేసుకునే పరిస్తితి లేదు. వాస్తవానికి ఈ అన్ని రకాల వృత్తులలో ఉన్న వాళ్లను ఐక్యరాజ్య సమితి వ్యవసాయ దారులుగానే గుర్తించింది. కానీ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వ వైఖరుల వల్ల కేవలం భూములు ఉన్న రైతులే రైతులు అన్నట్లుగా మారిపోయింది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం ఈ గ్రామీణ ప్రజల సంఘాల మధ్య సమన్వయానికి ఈ రైతు వేదికలను ఉపయోగించుకోవాలి. ఈ సంఘాలన్నీ చట్టబద్ధంగా ఏర్పడినవి. చట్టబద్ధంగా ఆర్థిక కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుంటాయి. నిజం మాట్లాడాలంటే, ప్రభుత్వం గుర్తించి, సభ్యులకు గౌరవ వేతనం ఇచ్చే రైతు బంధు కమిటీలకు ఎటువంటి చట్టబద్ధత లేదు. ఈ కమిటీలన్నీ పూర్తిగా అధికార పార్టీ ప్రతినిధులతో మాత్రమే ఏర్పడినవి. ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం ప్రకటించి రైతు, మహిళా సహకార సంఘాల మధ్య సమన్వయానికి ఒక ప్రాతిపదిక ఏర్పరిస్తే తప్ప, గ్రామ స్థాయిలో ఈ సమన్వయం సాధ్యం కాదు.

చాలా చోట్ల పేదల నుండి అసైన్డ్ భూమిని వెనక్కు తీసుకుని ఈ రైతు వేదికలను నిర్మించారు. కొన్ని గ్రామాలలో ప్రభుత్వ భూములు ఉన్నాయనే పేరున ఊరికి దూరంగా వీటిని నిర్మించారు. మహిళలు, మహిళా సిబ్బంది, చివరికి నడిచి వెళ్లవలసిన రైతులైనా ఊరికి దూరంగా ఉన్న ఈ రైతు వేదికలకు వెళ్లగలుగుతారా అన్నది భవిష్యత్తులో చూడాలి.

గ్రామీణ ప్రాంత పరిస్థితులను అధ్యయనం చేస్తున్న వాళ్లంగా మేము పెడుతున్న ప్రతిపాదనలు ఇవి. కానీ ఇప్పటివరకూ ప్రభుత్వ వ్యవహారశైలి ఇందుకు అనుగుణంగా లేదు. ఒక ఫ్యూడల్ దొరతనాన్ని కళ్ల ముందు చూస్తున్నాం కనుక గ్రామాలలో నిర్మించిన రైతు వేదికలు దొర గడీలుగా మారినా ఆశ్చర్యంలేదు. సాయుధ పోరాటంతో, విప్లవోద్యమాలతో దొరల గడీలను కూల్చిన తెలంగాణ గ్రామీణ ప్రజలు, అత్యంత చైతన్యంతో, మెలకువతో ఉండి గ్రామాలలో నిర్మించిన రైతు వేదికలను ప్రజాస్వామిక దృక్పథంతో నిర్వహించుకునేలా ప్రయత్నం చేయాలి. కుల, మత, లింగ వివక్షకు దూరంగా గ్రామీణ బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ ఈ రైతు వేదికలను ఉపయోగించుకునేలా కృషి చేయాలి. దానిని అడ్డుకునే శక్తులపై పోరాడాలి.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక సభ్యులు) వీ

యాన్ మిర్డాల్



స్వీడన్‌కు చెందిన మార్క్సిస్టు మేధావి, రచయిత యాన్ మిర్డాల్ (93) అక్టోబర్ 30న మరణించారు. నాలుగు దశాబ్దాల పాటు చైనా గ్రామీణ ప్రాంతాలను అధ్యయనం చేసి ఎన్నో పుస్తకాలు రచించిన యాన్ మిర్డాల్‌కు భారతదేశంతో, భారత ప్రజా ఉద్యమాలతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. నోబెల్ బహుమతి గ్రహీతలు అయిన తల్లిదండ్రులు ఇవా మిర్డాల్, గున్నార్ మిర్డాల్‌లతో కలిసి ఆయన తొలి యవ్వనంలోనే భారతదేశం వచ్చారు. తండ్రి ప్రఖ్యాత అర్థశాస్త్రవేత్త, ఏషియన్ డ్రామా రచయిత గున్నార్ మిర్డాల్‌ను భారత ప్రభుత్వం సలహాదారుగా ఆహ్వానించినప్పుడు తండ్రితో పాటు వచ్చిన యాన్ ఆ తర్వాత 1980లలో నక్సలైట్ ఉద్యమాన్ని అధ్యయనం చేయడానికి వచ్చి కరీంనగర్, ఖమ్మం అటవీ ప్రాంతాలలో పర్యటించి 'ఇండియా వెయిట్స్' పుస్తకం రచించారు. ఆ తర్వాత 84 ఏళ్ల వయసులో 2010 ఫిబ్రవరిలో దండకారణ్యంలో పదిహేను రోజుల పాటు పర్యటించి 'రెడ్‌స్టార్ ఓవర్ ఇండియా' రచించారు. కలకత్తా బుక్‌ఫేర్‌లో ఆ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా 2012లో మరొకసారి భారతదేశం వచ్చినప్పుడు హైదరాబాద్ కూడా వచ్చి అనేక సభల్లో ప్రసంగించారు. వీక్షణం కార్యాలయంలో మిత్రులతో ఇష్టాగోష్ఠి సంభాషణలో పాల్గొన్నారు. ఆ సంభాషణ నివేదిక వీక్షణం ఏప్రిల్ 2012 సంచికలో అచ్చయింది. యాన్ మిర్డాల్‌కు జోహార్లు.

ఎపిలో పెరిగిపోతున్న పోలీసు రాజ్యం

***పోలీసులకు పరిమితికి మించి అధికారం, స్వేచ్ఛ ఇవ్వడం వల్ల వారు సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు చేస్తూ, తీవ్ర ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలకు పురికొల్పుతున్నారని అంటున్నారు* చిమ్మె. జాన్ బర్నబాస్**

కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలో అబ్దుల్ సలామ్ అనే ఆటో డ్రైవర్, అతని భార్య నూర్జహాన్, పద్నాలుగేళ్ల కూతురు, పన్నెండ్ల కుమారుడు నలుగురూ కలిసి నంద్యాల నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కౌలూరు వద్ద నవంబర్ 3న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి నంద్యాల 1వ పట్టణ సిఐ సోమశేఖరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, మరికొందరు కొందరు కానిస్టేబుళ్లు, నిజంగా చెప్పాలంటే ఆ రోజు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న వారందరూ ప్రధాన కారకులు. ఎందుకనగా ఆయనపై దొంగతనం నేరం మోపి, ఆటోలో ప్రయాణించిన వ్యక్తి నుంచి రు. 70 వేలు దొంగిలించావని ఆరోపిస్తూ గత 4 రోజుల నుంచీ హింసించడంతో దానిని తట్టుకోలేక, ఒకవేళ నీవు గ్రామం విడిచిపెట్టి పోయినా నీ భార్యా పిల్లలను కేసులో ఇరికించి హింసిస్తామనీ, అంతేకాకుండా తన భార్య నూర్జాహాన్‌ను మా స్టేషన్‌కు చెందిన పోలీస్‌వారు రోజూ అనుభవిస్తారనే మాట అనడంతో కుంగిపోయి, బాధతో కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పైగా సిఐ సోమశేఖరరెడ్డి, తన ఎదుటనే తన భార్యను అవమానకరంగా అనడంతో మానసిక క్షోభ అనుభవించలేక, భార్యను ఒప్పించి పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వాస్తవానికి ఈ విషయం బయటపడడం కూడా కేవలం తన ఆటోతో సహా కౌలూరు వెళ్లి, ఆటోను రైలు పట్టాలకు సమీపంలో పెట్టి ఆత్మహత్య చేసుకోవడంతో ఇది బయట పడింది. తన కూతురు – ఎంత సేపటికీ ఇంటికి రాకపోయేసరికి, ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సలాం అత్త మాబున్నీకి దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలో అవమానానికి గురయింది. మొదట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళితే 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లమన్నారు; అక్కడ వారు 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పొమ్మన్నారు. వెతికి, వెతికి అలసిపోయిన ఆమెకు చివరకు కౌలూరు వద్ద మొత్తం కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియగానే ఆమె బాధ వర్ణనాతీతం. కేవలం పోలీసులు మానసికంగానూ, శారీరకంగానూ హింసిచడం వల్లనే తన బిడ్డ కుటుంబం ఆత్మహత్య చేసుకున్నదనీ, దీనికి 1వ పట్టణ నంద్యాల పోలీసులే కారణమంటూ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కూడా పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని హాత్రాస్ మాదిరిగా పోస్ట్‌మార్టమ్ నిర్వహించి మృతదేహాలను ఖననం చేశారు. కనీసం కుటుంబ సభ్యుల కోరిక మేరకు వారిని ముస్లిం మత సాంప్రదాయాల ప్రకారం ఖననం చేయలేదు కదా, కనీసం మరుసటి రోజు బంధువుల కొరకు, వారి చివరి చూపు కొరకు కూడా నిరీక్షించకుండా పోలీసులు వారి ఇష్టప్రకారమే ఖనన కార్యక్రమం కూడా నిర్వహించారు. మృతదేహాలను బంధువులకు అప్పజెప్పే సమయంలో కూడా కనీసం మానవతా దృక్పథంతో వ్యవహరించలేదు. దారుణంగా, అమానవీయంగా ప్రవర్తించారు. ఇది శోచనీయం.

అబ్దుల్ సలామ్ చనిపోవడానికి ముందు కుటుంబ సభ్యులతో సహా తన బాధను వ్యక్తపరుస్తూ తీసిన సెల్ఫీ వీడియో కొంతమంది మిత్రులకు, బంధువులకు పంపడంతో, వారు రెండు రోజుల తర్వాత దానిని చూసుకున్నారు. అంతవరకూ పోలీసులు కేసు నమోదు చేయలేదు. అంతే కాకుండా ఒకవేళ సెల్ఫీ వీడియో తీయకుండా చనిపోయి ఉండి ఉంటే కూడా ఈ విషయం బయట పడేది కాదు. కాబట్టి కేవలం వీడియో ఆధారంగా పోలీసులు చేసిన అమానవీయ చర్యలు బహిర్గతం కావడంతో అది బయటి ప్రపంచానికి తెలియడంతో రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు నంద్యాల 1వ పట్టణ సిఐ సోమశేఖరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్‌పై కేసు నమోదు చేశారు. అది కూడా కేవలం బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేశారు. తర్వాత రిమాండ్ రిపోర్ట్‌లో ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు చేసిన నేరం ఐపిసి సెక్షన్ 306 కింద కేసును నమోదు చేసి మొదటి ఎఫ్ఐఆర్‌కు కొంత సవరణ చేకూర్చారు. ఇది కూడా ఆలస్యం కావడంతో స్థానిక న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. వాస్తవానికి నిందితులు ఐపిసి సెక్షన్ 306కు జిల్లా న్యాయస్థానం (సెక్షన్ కోర్టు) లో బెయిల్ పొందవలసి ఉంటుంది. అయితే అవి ఏమీ పట్టించుకోకుండా స్థానిక న్యాయమూర్తి ఏ నిబంధనల మేరకు జారీ చేశారో కానీ, ఇవ్వకూడని బెయిల్ మంజూరు చేశారు. ఒక రకంగా చెప్పాలంటే జిల్లా న్యాయమూర్తి అధికారులను తాను బలవంతంగా తీసేసుకున్నట్లుగా బెయిల్ మంజూరు చేశారు. ఇక్కడ నిందితుల తరపున న్యాయవాదులు, స్థానిక న్యాయమూర్తికి ఏ విధమైన ప్రలోభాలకు గురిచేశారో, లేదా ఏ రకమైన పూర్వపు జడ్జిమెంట్లు చూపించి నిందితులకు బెయిల్ మంజూరు చేయించారో భవిష్యత్తులో జరుగబోయే విచారణలో బయటపడనుంది.

ఈ కేసులో పెద్ద విచిత్రం ఏమంటే, రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు నిందితులను సస్పెండ్ చేసింది, మరోవైపు బెయిల్ వచ్చేటట్లు చేసింది. దానితో పాటుగా చనిపోయిన సలామ్ కుటుంబంలో ఎవరూ మిగలలేదు కాబట్టి అత్త (భార్య తల్లి) కు 25 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ వీర్‌పాండ్యయన్ ద్వారా అందజేసింది. ఒకవైపు నిందితులకు బెయిల్ మంజూరు చేయించింది, మరోవైపు బాధితులకు చెక్కును పంపిణీ చేయించింది. ఇది ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పోలీసుల అత్యుత్సాహం, దురహంకారం, అమానవీయ ప్రవర్తన, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనలు నిత్యకృత్యమైపోయాయి. పోలీస్ స్టేషన్లలోనే దళిత యువకులకు శిరోముండనం. రాజమండ్రి యువకుడు తనకు శిరోముండనం చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి లేఖ రాయడంతో, రాష్ట్రపతి విచారణకు ఆదేశించి ప్రత్యేక అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఈ రాష్ట్ర

ప్రభుత్వం పట్టించుకోలేదు సరికదా, నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నది. నిందితులు వై.ఎస్.ఆర్. పార్టీకి చెందిన ఇసుక కాంట్రాక్టర్ కావడమే దానికి మూల కారణం. వారికి, పోలీసులకు సత్సంబంధాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌లలో నిందితులకు రాచమర్యాదలు, బాధితులకు వేధింపులు జరుపుతున్నది. ఇది పోలీసుల విశృంఖలత, మితిమీరిన దురహంకారాన్ని తెలియజేస్తున్నది. మనం రాజ్యాంగ పాలనలో ఉన్నామా? లేదా సైనిక పాలనలో ఉన్నామా? ఇది ప్రజాస్వామిక వ్యవస్థణా కాదా? అనేది కూడా అర్థం కావడం లేదు.

ప్రకాశం జిల్లా చీరాల పట్టణంలో మాస్క్ ధరించనందుకు దళిత యువకున్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టి చంపారు. కేవలం ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ రామిరెడ్డి అనే వ్యక్తితో ఫిర్యాదు చేయించి, దళిత యువకున్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళుతుండగా జీపులో నుంచి దూకి చనిపోయాడని ఒక కట్టుకథ అల్లి చేతులు దులుపుకున్నారు. కిందిస్థాయి పోలీస్ అధికారుల తప్పులను రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ కప్పిపుచ్చుతూ, ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఖరిగా సమర్థిస్తూ, అసలు పోలీసులు ఏమీ తప్పు చేయలేదన్నట్లుగా మాట్లాడుతున్నాడు. తప్పు చేసిన వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు.

అబ్దుల్ సలామ్ కుటుంబం ఆత్మహత్యపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) విచరణ కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలయింది. రాష్ట్ర ప్రభుత్వ పోలీసులపై నమ్మకం లేదని, కాబట్టి సిబిఐ చేత విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య పైనే సిబిఐ విచారణ జరుపుతున్నప్పుడు, అబ్దుల్ సలామ్ ఆత్మహత్యపై సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని బాధిత కుటుంబం, అబ్దుల్ సలామ్ న్యాయ పోరాట కమిటీ డిమాండ్ చేస్తున్నది. గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతి చిన్న సంఘటనకూ రాష్ట్ర ప్రభుత్వ పోలీసులపై నమ్మకం లేదనీ, కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ చేత విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేసేవారు. ఇక్కడ నిందితులు రాష్ట్ర ప్రభుత్వంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు కాబట్టి ఈ పోలీసు అధికారులపై నమ్మకం లేకనే బాధితులు కేంద్ర దర్యాప్తు అధికారుల విచారణ కోరుతున్నారు. ఇక్కడ నిందితులు కేవలం సిఐ సోమశేఖరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ మాత్రమే కాదు, ఇంకా చాలా మంది క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు ఉన్నారు. అందరి పైనా చర్యలు తీసుకోవలసిందే, వారిని చట్ట ప్రకారం శిక్షించవలసిందే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా అక్రమంగా కేసులు నమోదు చేయడం, దళితుల పైననే ఎస్‌సి/ఎస్‌టి కేసులు (వర్తించనప్పటికీ) నమోదు చేయడం, పోలీసుల అనుచిత ప్రవర్తన, దుర్మార్గ వైఖరికి నిదర్శనం. రాష్ట్రంలో (రూల్ ఆఫ్ లా) చట్టబద్ధ పాలన ఉన్నదా? అనేది అనుమానమే. పోలీసులు నిరంకుశంగా వ్యవహరిస్తూ, సామాన్య పౌరుల హక్కులను కాలరాస్తున్నారు. అక్రమంగా అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. విశాఖపట్టణంలో డా. సుధాకర్‌పై అక్రమ కేసు నమోదు చేసి, రోడ్డుపై రెండు చేతులు వెనక్కి కట్టేసి, పిచ్చివాడిగా ముద్రవేసినది మొదలు, నంద్యాల అబ్దుల్ సలామ్ ఉదంతం వరకూ అనేక సంఘటనలలో పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. అబ్దుల్ సలామ్ ఆటో డ్రైవర్‌గా ఉండక ముందు బంగారు అంగడిలో పనిచేసేవాడు. ఆ సమయంలో ఆ అంగడిలో దొంగతనం జరుగగా అది తానే చేశాడని అంగడి యజమాని ఫిర్యాదు చేయగా, అప్పుడు కూడా ఇదే చిత్రహింసలకు గురిచేయడంతో ఇంట్లో ఉన్నదానిని పోలీసులకు ఇచ్చి కూడా కేసును అనుభవించాడు, జైలుకు వెళ్లాడు, కుటుంబాన్ని పోషించడానికి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించడానికి నిశ్చయించుకుంటే తిరిగీ ఈ దొంగతనం తనమీద పడడంతో కుంగిపోయాడు, కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ప్రతి కేసులోనూ ఇదే విధంగా వ్యవహరిస్తున్నారా? సామాన్యులు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి ఎంతో శ్రమించవలసి వస్తున్నది. ఫిర్యాదు దారులపై కూడా పోలీస్ స్టేసన్లలో సరిగా స్పందించడం లేదు, పైగా వారి పైననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసుకోవడం, విచారణ ప్రక్రియ పూర్తి చేయడం పెద్ద ప్రహసనంగా మారిపోయింది. దీనికి పాలకులే సమాధానం చెప్పాలి.

అబ్దుల్ సలామ్ ఆత్మహత్య కేసులో నిందితులు పోలీసు అధికారులు అయినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందనేది నిర్వివాదాంశం. అంతేకాకుండా వారి బెయిల్ రద్దు చేయాలంటూ జిల్లా కోర్టుకు పోవడం, మొదట ఉన్నతాధికారులు చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికే తప్ప, నిజంగా నిందితులను శిక్షించడానికి కాదు. కేవలం వీడియో ఆధారంగా తప్ప, బాధితులు ఎంత మొర పెట్టుకున్నా పోలీసులు మాట వినలేదు. మొత్తం కుటుంబమంతా ఆత్మహత్యకు పాల్పడడానికి దోహదపడ్డారు. కేవలం పోలీసు అధికారుల వేధింపుల వల్లనే సలామ్ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందనేది సుస్పష్టమైనప్పుడు ఐపిసి సెక్షన్ 306 ప్రకారం మొదట ఎందుకు పోలీసులు కేసు నమోదు చేయలేదు? సెల్ఫీ వీడియో ప్రపంచాన్ని కదిలించింది కాబట్టే పోలీసులు స్పందించారు తప్ప, వాస్తవానికి పోలీసులకు కేసు నమోదు చేయాలనేది లేదు. అంతే కాకుండా దాదాపుగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎంతో మంది అమాయకులు ఇదే విధంగా చిత్రహింసలకు గురవుతూ అక్రమ కేసులు బనాయించుకొని, తమ జీవితాలను జైళ్లలోనే ముగిస్తున్నారు. వీరి గురించి జైళ్ల మాన్యువల్స్, రాజ్యాంగ నిబంధనలు, క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ అంతా విచారకరమైన పద్ధతులలో వ్యవహరిస్తున్నారు ఈ దేశంలో. కేవలం అధికారంలో ఉన్న వారికి బానిసలుగా పనిచేయడం తప్ప, అధికారులు తాము ఏమైనా తప్పు చేస్తున్నామా? అనే భావన ఏమాత్రమూ కనబడడం లేదు. రోజూ ఎన్నో సంఘటనలు జరుగుతున్నా బయటపడుతున్నవి కేవలం 1-2 మాత్రమే. అవి కూడా మీడియా దృష్టికి వచ్చినవి మాత్రమే. ప్రజలు ఆందోళన చేస్తే తప్ప ఉన్నతాధికారులు స్పందించడం లేదు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చినవారు అదే ప్రజలను పోలీసుల ద్వారా అణచివేస్తున్నారు. పోలీసులు చేసే అవమానకరమైన పద్ధతులకు ఎంతో మంది భవిష్యత్తు ఉన్న యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. న్యాయ వ్యవస్థ సరిగా పనిచేస్తే పోలీసు అధికారుల వేధింపులు ఇంతగా ఉండవు.

భారతదేశంలో న్యాయ వ్యవస్థ కూడా కొద్దో గొప్పో పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించినప్పటికీ, అధికారులంతా అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో పనిచేస్తూ ఉంటారు కాబట్టి హైకోర్టు ఆదేశాలు కూడా అమలు కావడం లేదు. అయితే 'వ్యక్తి స్వేచ్ఛ'ను హరించే విషయంలో పోలీసులపై రాష్ట్ర హైకోర్టులు కానీ, సుప్రీంకోర్టు కానీ చాలా కఠినంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. విశాఖపట్టణంలో7 ప్రభుత్వం పెద్ద గెస్ట్‌హౌస్ నిర్మాణానికి 'స్టే' ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అక్కడ పనులు మొదలు పెట్టారు. ఎస్‌సిలకు వర్తించని ఎస్‌సి/ఎస్‌సి (పిఒఎ) యాక్ట్ 1989 కింద దళితులపై కేసు నమోదు చేసిన పోలీసు అధికారులపై ఇంతవరకూ చర్యలు లేవు.

బీహార్ ఎన్నికల ఫలితాలు ఏం చెపుతున్నాయి?

బీహార్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే దేశభక్తి పేరుతో ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందని అంటున్నారు **వై. రామచంద్రం**

బీహార్ అసెంబ్లీకి మూడు దశలుగా జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బొటాబొటీ ఆధిక్యం సాధించింది. మహాగట్‌బంధన్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పి చివరివరకు గట్టిపోటీనిచ్చి రెండో స్థానంలో నిలిచింది. వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న నితీష్‌కుమార్ పై ఉన్న ప్రజా వ్యతిరేకతను బిజెపి పక్కదారి పట్టించి ఓటర్లను, పార్టీలను చీల్చి తాను అధికారంలోకి రావాలనుకుంది. అందులో భాగంగానే ఎల్‌జెపి నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ఒంటరిగా పోటీచేయించి జెడి(యు)ను బలహీనపరిచి అధిక స్థానాల్లో నెగ్గింది. దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని 59 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలను గెలుచుకుంది. బిజెపి అధికారం కోసం ప్రజలను ఎప్పటిలాగే ప్రలోభాలకు, భావోద్వేగాలకు గురిచేసి ఎన్నికల్లో గెలిచి ప్రజామోదం పొందామనిపించుకుంది.

ఎన్నికలకు ముందు మహాగట్‌బంధన్ కూటమి తన ఎన్నికల మానిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే ప్రధానంగా యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, కాంట్రాక్ట్ టీచర్‌లకు-సేమ్ వర్క్ సేమ్ పే విధానాన్ని అమలు చేస్తామని, కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దుచేస్తామని పేర్కొంది. ఎన్‌డిఏ కూటమి ప్రత్యర్థి కూటమి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటే తాము 19 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, రాష్ట్ర ప్రజలందరికి ఉచిత కరోనా టీకా ఇస్తామంది. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి రద్దుచేసిన 370 ఆర్టికల్‌ని పునరుద్ధరిస్తామనే విషయాన్ని మహాకూటమి తన ఎన్నికల మానిఫెస్టోలో చేర్చాలంది. ఇలా చైనా సరిహద్దుల్లో జరిగే పరిణామాలను ఎన్నికల్లోకి లాగి ప్రజల్ని భావోద్వేగాలకు గురిచేసింది.

బీహార్ ఎన్నికల ఫలితాలను గమనిస్తే మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్‌డిఏ కూటమిలోని బిజెపి-74; జెడి(యు)-43; ఇతర పార్టీలతో కలిపి 125 స్థానాల్లో నెగ్గింది. మహాగట్‌బంధన్ కూటమి లోని ఆర్‌జెడి-75; కాంగ్రెస్-19; సిపిఐ (ఎంఎల్-లిబరేషన్) - 12; సిపిఐ-2; సిపిఎం-2తో కలిపి మొత్తం 110 స్థానాలు దక్కించుకుంది. ప్రజాస్వామ్య లౌకిక కూటమి పేరుతో పోటీ చేసిన మజ్లిస్ పార్టీ ఐదు, బిఎస్‌పి ఒక స్థానంతో మొత్తం ఆరు స్థానాల్లో గెలుపొందింది. విడిగా పోటీ చేసిన ఎల్‌జెపి ఒక స్థానంలో, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో గెలుపొందారు. కూటముల ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే వికీపీడియా ప్రకారం ఎన్‌డిఏ కూటమికి 37.26 శాతం (1,57,01,226), ఆర్‌జెడి కూటమికి 37.21 శాతం (1,56,77,320) వచ్చాయి. ఎల్‌జెపి పోటీ చేసిన 134 స్థానాల్లో 5.66 శాతం (23,83,457), ప్రజాస్వామ్య లౌకిక కూటమికి 4.5 శాతం ఓట్లు వచ్చాయి. ఇందులో బిజెపి అధికారంలోకి రావాలనే కుట్రతో బిజెపి పోటీచేసిన చోట ఎల్‌జెపి తన అభ్యర్థులను నిలుపకుండా ఆ పార్టీకే మద్దతు తెలిపింది. ఇలా 109 స్థానాల్లో తన ఓటు బ్యాంకును బిజెపికి బదలాయించింది. ఆ పార్టీ మిగతా స్థానాల్లో పోటీచేసి సాధించిన ఓట్లు 4.6. శాతం. వీటిని బిజెపికి మళ్లించింది. ఎల్‌జెపి ఓట్ల బదలాయింపు బిజెపికి సీట్లు, ఓట్లు పెరగడానికి దోహదపడింది. జెడియు పోటీపడిన స్థానాల్లో ఎల్‌జెపి స్వంతంగా పోటీచేసి జెడియు ఓట్లను, సీట్లను తగ్గించింది. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను చీల్చడానికే రకరకాల

సామాన్య పౌరునికి ఒక చట్టం, పోలీసులకు మరో చట్టం ఉన్నదా? 'చట్టం ముందు అందరూ సమానులే' అంటూ ఆర్టికల్ 14 చెబుతుండగా ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం రాజ్యాంగ వ్యతిరేకం. పోలీసులు వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గానీ, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ సెక్షన్ 41ను గానీ పాటించడం లేదు. పోలీసులు వ్యక్తిని అరెస్ట్ చేసినప్పుడు పాటించ వలసిన నియమ నిబంధనలపై లాండ్‌మార్క్ జడ్జిమెంట్ డి.కె. బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ ఎఐఆర్ 1997 ఎస్‌సి 610, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కుల్‌దీప్‌సింగ్, జస్టిస్ ఎ.ఎస్. ఆనంద్‌లు ఇచ్చిన తీర్పు ప్రామాణికం. నాడు ఈ కేసులో సుప్రీంకోర్టు పోలీసు అధికారులకు ఎన్నో మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ వాటన్నింటినీ తుంగలో తొక్కి, పోలీసులు తాము అనుకున్న పనులే చేస్తున్నారు. ప్రజలపై విచక్షణా రహిత హింసకు పాల్పడుతున్నారు. పోలీస్ కస్టడీలోనే చంపివేస్తున్నారు. మృతదేహాలకు పోస్ట్ మార్టమ్ కూడా వీడియో తీయించడం లేదు. తమకు అనుకూలంగా డాక్టర్లతో రిపోర్ట్ రాయించుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కేవలం తాత్కాలికంగా చర్యలు తీసుకొని, కొన్ని రోజులకే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తిరిగీ వీధుల్లోకి తీసుకుంటున్నారు. ఇదంతా ఒక తంతుగా మారిపోయింది. ప్రజలు కూడా ఆందోళనల వ్యక్తం చేస్తేనే ఇవి బయటకు వస్తున్నాయి తప్ప, లేనిచో కేసులు మూసివేయ బడుతున్నాయి. ఇంత దుర్మార్గమైన వ్యవస్థలో మనం జీవిస్తున్నాం. పోలీసులపై పోరాడడానికి సైతం సంసిద్ధంగా లేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఏది ఏమైనప్పటికీ బయటికి వెల్లడైన కేసులలోనైనా పోలీసులను శిక్షించాలని పోరాడడం మన కర్తవ్యం. అబ్దుల్ సలామ్ కుటుంబం ఆత్మహత్యకు కారకులైన పోలీసు అధికారులందరినీ ఉద్యోగాల నుంచి తొలగించి, డిస్మిస్ చేయాలి. విచారణ త్వరగా పూర్తిచేసి వారిని శిక్షించాలి. మరొక సలాం లాంటి సంఘటన జరుగకుండా ఉండాలని కోరుకుందాం.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

సామాజిక నేపథ్యాలు ఉన్న పార్టీలను పోటీకి దింపి బిజెపికి సీట్లు పెరగడానికి దోహదపడింది. అధికార పార్టీలు, సామాజిక ఆకాంక్షల పేరుతో వచ్చిన పార్టీల నేతలు కలిసి ప్రజలను తమ అధికారం కోసం తప్పుదారి పట్టిస్తున్న తీరును మనం ఇక్కడ చూడవచ్చు.

2015లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ఫలితాలను గమనిస్తే రెండు కూటములకు ఇంచుమించు సమాన స్థానాలే దక్కాయి. ఈ మధ్యన 2019 ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీహార్‌లోని 40 లోక్‌సభ స్థానాలకు గాను 39 ఎన్‌డిఏ కూటమి దక్కించుకోగా ఒక్క స్థానాన్ని మాత్రమే ఆర్‌జెడి గెలుచుకుంది. ఇప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మార్పులు వచ్చి ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వస్తుందన్నంతగా ఊహాగానాలతో మహాగట్‌బంధన్ కూటమి మెజారిటీకి 12 స్థానాల దగ్గర ఆగిపోయింది. దీన్నిబట్టి గత ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు పూర్తి సమ్మతితో లేరనే విషయం అర్థమవుతోంది. గత రెండు దశాబ్దాల బీహార్ రాజకీయాలలో ఆర్‌జెడి, జెడియు, బిజెపిలకు ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో అధికారం కోసం వాటి సైద్ధాంతిక అవగాహనలను పక్కనపెట్టి అవకాశవాద పొత్తులతో ముందుకెలుతున్న పరిస్థితి ఉంది. అంటే ఏ పార్టీని కూడా ప్రజలు పూర్తిగా నమ్మడం లేదనేది బీహార్ ఫలితాలు తెలియజేస్తున్నాయి.

బిజెపికి జెడియుకు మధ్య రాజకీయ విబేధాలు ఎన్ని ఉన్నప్పటికీ అధికారంకోసం ఒక్కటయ్యాయి. ఇప్పుడు బిజెపి అధిక స్థానాల్లో గెలుపొందినా తక్కువ సీట్లు వచ్చిన నితీష్‌కుమార్‌ను ముఖ్యమంత్రిని చేసిన అనివార్యమైన పరిస్థితి. ఈ పరిస్థితి ముందు ముందు ఇలాగే కొనసాగుతదని ఏమిలేదు. ఎందుకంటే నితీష్‌కుమార్ కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్ రద్దును వ్యతిరేకించారు. సిఏఏ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్ అంశాలు ముందుకు వచ్చినపుడు బీహార్‌లో వాటిని అమలుపరుచమని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు కాని దానికి ఏమేరకు కట్టుబడి ఉంటారనేది ప్రశ్నే. ఈ ఎన్నికల ప్రచారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రి వరకు ప్రచారంలో పాల్గొన్నారు. మహాగట్‌బందన్ కూటమి తరపున ప్రధానంగా ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ రాజకీయ అనుభవం ఎక్కువ లేకున్నా ప్రత్యర్థి పార్టీలను తట్టుకొని ఆర్‌జెడి పూర్వస్థితిని నిలబెట్టాడు.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఎన్నికల్లో నెగ్గడానికి రాజ్యాంగ సంస్థలను అనుకూలంగా మలుచుకొని ప్రజాస్వామ్యం పేరిట ఎన్నికలను ఒక తంతుగా వాడుకుంటున్నాయి. ప్రజాభిప్రాయానికి ఎన్నికలనే సంకేతంగా చెబుతున్నాయి. ఎన్నికల్లో నెగ్గడానికి డబ్బు పంపిణీ, మద్యం పంపిణీతో పాటు ప్రజల్ని ఇతరేతరంగా ప్రలోబపెట్టి భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను, సీట్లను చీల్చడానికి పార్టీలనే చీల్చారు. ప్రజల అవసరాలు తీర్చి మెప్పు పొందడంకన్నా ప్రలోబాలమీదే ఆధారపడి ఎన్నికల్లో గెలుస్తున్నారు. ఎన్నికయిన తెల్లారి అధికారంకోసం, డబ్బుకోసం పార్టీలు, నాయకులు ఏ పార్టీలో చేరుతారో తెలియని పరిస్థితి నేడు దేశవ్యాప్తంగా నెలకొంది. ఓటు వేసిన ప్రజల అభిప్రాయాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించని నాయకులను ఎన్నుకోవడం ఎవరి ప్రయోజనాలకోసం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అధికారాన్ని అడ్డంపెట్టుకొని గోవా, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ వచ్చినప్పటికీ ఆ పార్టీ అభ్యర్తులను బెదిరించి, పదవుల ఆశచూపి తనవైపు తిప్పుకొని దొడ్డిదారిన అధికారాన్ని చేపట్టింది. ఇలాంటి కుట్రలకు పాల్పడే పార్టీలు అధికారంలోకి వస్తున్నప్పుడు ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే ప్రజామోదం అని ఎలా అనుకోగలం.

బీహార్ అసెంబ్లీకి అట్లాగే 11 రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులను ఒకసారి గమనిస్తే దేశ ఆర్థిక పరిస్థితి తిరోగమనం వైపు పయనిస్తోంది. కోవిడ్-19 కారణంగా అకస్మిక లాక్‌డౌన్ ప్రకటించడంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. నిర్మాణ రంగం మొత్తం ఆగిపోయింది. దీంతో కోట్లాది మంది అసంగటిత రంగ కార్మికులు ఉపాధి కోల్పోయి జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నారు.

హాథ్రస్ లాంటి హత్యాచార ఘటనలు దేశ వ్యాప్తంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివాసి, దళిత, ముస్లీంలపై నిత్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై దేశద్రోహ కేసులు పెట్టి నిర్భంధిస్తున్నారు. లాక్‌డౌన్‌ను అడ్డంబెట్టుకొని పార్లమెంట్‌లో ఎటువంటి చర్చలేకుండానే కార్మికులు పోరాడి సాధించికున్న హక్కులను సవరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చారు. హాథ్రస్ హత్యాచార ఘటన దుర్మార్గాన్ని కప్పిపుచ్చడానికి పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. ఆ విషయాన్ని కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులను అడ్డుకున్నారు. కొందరిని అరెస్టుచేసి జైలుకు పంపారు. మీడియాకే స్వేచ్ఛ లేనప్పుడు ఇక సాధారణ ప్రజల స్వేచ్ఛ గురించి ఈ దేశంలో మాట్లాడుకోవలసిన పనేలేదు.

వ్యవసాయరంగంలో కొత్తగా తెచ్చిన చట్టాలు రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తూ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చేవి. వీటిని వ్యతిరేకిస్తూ నవంబర్ 26న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చి చల్లో ఢిల్లీకి వెళ్లుతున్న లక్షలాది మంది రైతుల్ని పొలిమేరల్లోనే పోలీసులు బారికేడ్లతో ఆపి లాఠీచార్జీ చేసి వాటర్ కెనాన్‌లతో చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్‌లు ముందుకు వెళ్లకుండా రహదారుల్ని తవ్వేసి అడ్డుకొని యుద్ధవాతవరణం కల్పించారు. ఇది ఈనాడు దేశ ప్రజలకు అన్నంబెడుతున్న రైతుల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరు.

దేశ ప్రజలకు ఇన్ని సమస్యలను సృష్టిస్తున్న పాలకులు ఒక్క బీహార్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో మేజారిటీ స్థానాల్లో గెలుపొందారు. దీన్ని బట్టి అర్థమవుతుందేమంటే పాలకులు కుల, మతాల పేరుతో ప్రజల మధ్య బావోద్వేగాలను రెచ్చగొట్టి ఎంత తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థమవుతోంది. రాజ్యం, మతం కలిసిపోతే ఎటువంటి దుర్మార్గాలు జరుగుతాయో ఢిల్లీలోని షాన్‌భాగ్‌లో మేము ఈ దేశ పౌరులమే అన్నందుకు మైనారిటీలపై దాడిచేసి 54 మందిని చంపేశారు. దేశ వ్యాప్తంగా ప్రజల పక్షాన గొంతువిప్పుతున్న మేధావుల్ని నిర్భంధానికి గురిచేసింది. ఈ పరిణామాలన్నీ కూడా ఈ దేశ ప్రజల్ని అభద్రతలోకి ఎటువంటి ప్రజాస్వామిక హక్కులు లేకుండా చేసే నియంతృత్వ పాలనవైపు వెళుతోంది. కాబట్టి ఇది ఏ కొద్దిమంది హక్కుల కార్యకర్తల్లో, మేధావులో కదిలితే అయ్యేపని కాదు కాబట్టి సమాజం హితం కోరే అన్ని తరగతుల ప్రజలు కదిలి తమ హక్కులకోసం నినదించకుంటే జీవించే హక్కే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఎంతో దూరంలో లేదు.

(రచయిత వీక్షణం సహాయ సంపాదకుడు) వీ

హిందుత్వ వక్రీకరణలు

***మత ఛాందస, ఫాసిస్టు భావజాలంతో, అశాస్త్రీయ కథనాలతో హిందుత్వ పేరు మీద ప్రజలను విభజించి కాషాయ వర్గం సామ్రాజ్యవాద ప్రయోజనాలకు తోడ్పడుతోందని అంటున్నారు* సంగిరెడ్డి హనుమంత రెడ్డి**

మతమంటే అభిప్రాయం. మతం మనుషులను విడదీస్తుంది. కట్టడి చేస్తుంది. భ్రమల్లో ముంచుతుంది. మతోన్మాదం మానవత్వాన్నే మంటగలుపుతుంది. సంఘీయ హిందుత్వం సమాజ విభజన, దోపిడి, హింసలను ప్రోత్సహిస్తోంది. హిందువులకు ప్రత్యేక అధికారాలు, హక్కులు, సౌకర్యాలు ఉండాలని హిందుత్వవాదులు వాదిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులపై హింసను రెచ్చగొడుతున్నారు. శ్వేత జాత్యహంకారులకు, సనాతన హిందు సంప్రదాయ ఛాందసవాద రాజకీయులకు తేడా లేదు. మహాత్మా జ్యోతిరావు పూలే భారత దళిత అంటరానితనాన్ని పాశ్చాత్య జాత్యహంకారంతో పోల్చారు. 'ఫాసిస్టు భావజాలం ప్రజల్లో సుస్పష్ట ఐక్యత తెస్తుంది. హిందుసేన పునర్నిర్మాణానికి హిందు భారత్‌కు అలాంటి సంస్థ కావాలి. హెగ్డేవార్ ఆధ్వర్యంలోని మన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అలాంటిదే.' 1931లో ఇటలీ ఫాసిస్టు నియంత ముసోలినిని కలిసిన తర్వాత హిందు జాతీయవాద నాయకుడు బాలకృష్ణ శివరాంమూంజే వ్యక్తపరిచిన అభిప్రాయం. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ సంస్థలు హిందు బోధనలతో కాక జర్మనీ నాజీ హిట్లర్, ఇటలీ ఫాసిస్టు ముసోలినిలతో ప్రేరణ పొందాయి.

హిందుమతం-హిందుత్వం

హిందు ఒక మతం కాదు. ఇండో ఆర్యన్‌ల సంస్కృత పదం సింధు నుండి హిందు పదం పుట్టింది. సింధు అనగా పెద్ద జలాశయం, నది, సముద్రం. ఇండస్ నది, దాని ఉపనదులకు సంకేతం. ప్రాచీన అధికార పత్రాలలో భౌగోళిక శాస్త్రాల సంకేత పదం. సంపదను పోగుచేసుకోవడం (అర్థ), కోరికలను తీర్చుకోవడం (కామ), పునర్జన్మల నుండి విముక్తి పొందటం (మోక్ష) హిందుమత ధర్మాలు, జీవన కార్యాలు, శాశ్వత సామరస్య సూత్రాలు. వేదాలు హిందుమత ప్రాచీన సంస్కృతభాషా గ్రంథాలు. హిందుత్వమంటే హిందుతత్వం. 'హిందు, భారతీయం ఒకటే. భారతీయులంతా హిందువులే. భారతదేశం హిందుదేశం.' అంటుందీ తత్వం. హిందు జాతీయవాద సంస్థల తాత్విక ఆలోచనే హిందుత్వం. 'భారత ఉపఖండ ప్రజలందరు స్వజాతి హిందువులు. భారత్ వారి మాతృ భూమి, పుణ్యభూమి. ఆక్రమణదారులు నాశనంచేసిన హిందు సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించాలి.' ఇదీ హిందుత్వవాద భావన. హిందుత్వం బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకించలేదు. ముస్లిం దాడులను, పాలనా పద్ధతులను, సంస్కృతిని వ్యతిరేకిస్తుంది. వామపక్ష సిద్ధాంతాలు మత మైనారిటీల అనుకూలమని, హిందు వారసత్వాన్ని బలహీన పరిచాయని కమ్యూనిజం పట్ల వ్యతిరేకత పెంచుకుంది. గోవధ నిషేధం అమలుచేయాలని కోరుతుంది. సంప్రదాయ సమాచార సంపదను పొందడానికి, సాంస్కృతిక మూలాల అనుసంధానానికి విద్యార్థులందరూ సంస్కృతం నేర్చుకోవాలని, సనాతన వైదిక శాస్త్రజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రచారం చేస్తుంది. హిందుత్వ భావజాల మూలాలు కల్పిత గాథల, పురాణాల, వేదాల కట్టుకథలను పవిత్రంగా భావించే కాలానివి. ఈ ఊహా గాథలు హిందు జాతీయవాదానికి ప్రాణం పోశాయి. ప్రథమ ప్రపంచ యుద్ధం తర్వాతి ఖిలాఫత్ ఉద్యమంలోని ముస్లిం రాజకీయాలను ప్రతిచర్యగా హిందుత్వం అనుకరించింది. జర్మనీ నాజీ ఫాసిస్టు రాజకీయ భావాలను అరువు తెచ్చుకుంది. హిందుత్వ తాత్విక వ్యవస్థాపక సూత్రకారుడు వినాయక్ దామోదర్ సావర్కర్, ఆర్.ఎస్.ఎస్. రెండవ సర్ సంఘచాలక్ మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్‌ల రచనలు, ప్రవచనాలు హిందుత్వ తాత్వికతకు ఆధారాలు, ఆదర్శాలు. హిందుత్వ సంస్కృతి అహంకారపూరిత, చరిత్రలేని, తప్పుల తడకల గతకాల అశాస్త్రీయ విషయాల వర్ణన. జాతి, మత, భాషా సంస్కృతుల కాల్పనిక జాతీయవాదం.

హిందు సంస్కరణవాది, ముస్లిం ద్వేషి బంకించంద్ర ఛటోపాధ్యాయ 1870లలో వివాదాస్పద ముస్లిం వ్యతిరేక సాహిత్యం 'ఆనంద్ మఠ్' రాశారు. 1882లో ప్రచురించిన ఈ నవలలో 'వందేమాతరం' యుద్ధగీతం రచించారు. ముస్లిం వ్యతిరేక భావజాల విషం విరజిమ్మారు. హిందుదేశ స్థాపన కలలుకన్నారు. బెంగాలి సంప్రదాయ సాహిత్యకారుడు, హిందువాది, హిందుత్వ సూత్ర స్థాపకుడు చంద్రనాథ్ బసురాసిన, 1892లో ముద్రించబడిన, పుస్తకం 'హిందుత్వ'లో హిందుత్వ పదం మొట్టమొదట నమోదయింది. భారతదేశంలో హిందు సాంస్కృతిక జాతీయవాద ప్రధాన రూపం 'హిందుత్వ'. సావర్కర్ ఈ పదాన్ని 1923లో విస్తృతంగా ప్రచారం చేశారు. 'ఇతరులను' వ్యంగ్యంగా పోటీపడి అనుకరించి, అపకీర్తి పాలు చేసి, బెదిరించటం ద్వారా తాము గుర్తింపు పొందడానికి సావర్కర్ చేసిన అపూర్వకృషి ఇది. ఆయన జర్మనీ, ఇటలీల జాత్యహంకార, సాంస్కృతిక జాతీయవాద భావాలను దిగుమతి చేసుకున్నారు. మతం-సంస్కృతి, దేశం-రాజ్యం అనే విభిన్న ఇరుసు సిద్ధాంతాలను ప్రవేశపెట్టారు. హిందు జాతీయవాద సంస్థ ఆర్.ఎస్.ఎస్., దాని అనుబంధ సంఘ్ పరివార్ సంస్థలు ఈ పదానికి మద్దతు పలికి తీవ్రంగా ప్రచారం చేశాయి. హిందుత్వ ఉద్యమాన్ని ప్రామాణిక శాస్త్రీయ భావంగా, హైందవజాతి ఐక్యతా ఉద్యమంగా వర్ణించాయి.

సావర్కర్ హిందుత్వ నిర్వచనంలో ఉమ్మడి దేశం, ఉమ్మడి జాతి, ఉమ్మడి సంస్కృతి అత్యవసర అంశాలు. హిందుత్వంలో హిందు, జైన, బౌద్ధ, శిక్కు మతాలను కలిపారు. నాస్తికుడైన సావర్కర్‌కు ముస్లింలు నిజమైన శత్రువులు. బ్రిటిష్ వారు కాదు. ఆంగ్లేయుల ఆర్థిక దోపిడీ కంటే ముస్లింల సాంస్కృతిక కాలుష్యం అపాయకరమని హిందుత్వవాదం. మతం మార్చుకున్న క్రైస్తవులు, ముస్లింలను కూడా ఉమ్మడి సంస్కృతిలో చేర్చారు. హిందుమతం నుండి హిందు, హిందుత్వ భావాలను సావర్కర్ వేరుచేశారు. 'హిందుత్వం విశాల భావనల మానవ భాష. ప్రజల

ఆధ్యాత్మిక చరిత్ర కాదు. సంపూర్ణ మానవ చరిత్ర.' అని అతిశయించారు. సావర్కర్ భావన హిందు జాతీయవాదానికి గట్టిపునాది వేసింది. హిందుత్వం హిందు విశ్వాసాల, ఆచారాల, ఉన్నత కుల పెత్తనాల రాజకీయ ఉద్యమం. రాజ్యాధికారం పొందడానికి మార్గాలు చూపిన పిడివాదం.

హిందుత్వం, హిందుమతాల నిర్వచనం అనేక కోర్టు కేసుల్లో భాగమైంది. 1966లో నాటి భారత ప్రధాన న్యాయమూర్తి, కర్ణాటకకు చెందిన, దేశస్థ మధ్వ బ్రాహ్మణుడైన ప్రహ్లాద్ బాలాచార్య గజేంద్రగడ్కర్ హిందుమత నిర్వచనం అసాధ్యమన్నారు. హిందుమతం సంకీర్ణమైందన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ నివేదికను ఆమోదించారు. సర్వేపల్లి రాధాకృష్ణ తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. హిందుత్వ ప్రగాఢ సమర్థకుడు. భారత దేశంలోనే గాక, పాశ్చాత్య దేశాల్లోనూ హిందుమత గుర్తింపుకు దోహదపడ్డారు. గజేంద్రగడ్కర్ నిర్ణయం సుప్రీంకోర్టు తర్వాతి తీర్పులను, ప్రత్యేకించి 1990 ల ఏడు హిందుత్వ తీర్పులను, ప్రభావితం చేసింది. హిందు జాతీయవాద న్యాయవాది, వాజ్‌పేయి మంత్రివర్గంలో బిజెపి కేంద్ర మంత్రి, రాం బూల్చంద్ జెఠ్మలానీ హిందుత్వం మత ఛాందసవాదం కాదని 1995 సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించారు. రాజ్యాంగ నిపుణుడు, రాజకీయ వ్యాఖ్యాత సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ఎ.జి. నూరాని ఈ వక్రీకరణతో విభేదించారు. 'ఈ తీర్పు హిందుత్వానికి అనుకూల అర్థాన్నిచ్చింది. హిందుత్వాన్ని భారతీయాకరణ గా పేర్కొంది. ఇవి వాస్తవాలను వక్రీకరించే అనవసర అప్రస్తుత ప్రశంసా ప్రసంగాలు. ఈ ప్రక్రియలో కోర్టు మతం, రాజకీయాల మధ్య అడ్డుగోడను కూల్చివేసింది.' అని వివరించారు.

సావర్కర్

1857 మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో నాయకులు, యుద్ధ యోధులు ఎక్కువ మంది ముస్లింలు. ఈ విషయం సావర్కర్ ప్రస్తావించారు కూడా. అండమాన్ జైలులో రాజకీయ ఖైదీలు ఎక్కువగా హిందువులే. వారితో హిందువులు అనుకూలంగా ప్రవర్తిస్తారని ముస్లింలను ఖైదీల పర్యవేక్షకులుగా నియమించారు. వీరు హిందు ఖైదీలను హింసించేవారు. ముస్లింలుగా మార్చేవారు. దీనితో సావర్కర్ ముస్లింల పట్ల అసహ్యం పెంచుకున్నారు. దేశాన్ని హిందుత్వ ప్రాతిపదికన పునర్నిర్మించాలన్న ఆశయంతో అండమాన్ జైలు నుండి బయటకు వచ్చారు. 1921లో ఆయనను మహారాష్ట్రలోని రత్నగిరి జైలుకు తరలించారు. అక్కడ హిందుత్వ శీర్షికతో కరపత్రం రాశారు. ఆ విధంగా 'హిందుత్వ' రాజకీయ నిఘంటువులో చేరింది. ఈ కరపత్రం హిందుత్వ వాదులకు హిందుదేశ సిద్ధాంత వర్ణనగా బోధపడింది. లౌకికవాదులకు మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేదిగా, ముస్లింలను బలిపశువులను చేసేదిగా అర్థమైంది. సావర్కర్‌కు ముందు స్వామి వివేకానంద, దయానంద సరస్వతి, లోకమాన్య తిలక్ వంటి సాధువులు, రాజకీయ నాయకులు హిందు పునరుద్ధరణ చేపట్టారు. సావర్కర్ హిందు పునరుజ్జీవనాన్ని మతచర్యగా కాక రాజకీయ కోణంలో నిర్వచించారు. హిందుత్వం, హిందుమతం ఒకటి కాదన్నారు. హిందు పదం వేదకాలం నాటిదన్నారు. నిజానికి హిందుదేశ నిర్మాణం సావర్కర్ ఉద్దేశం కాదు. సహజ మూల భావంలో ప్రాచీనకాలం నుండే భారత్ హిందు దేశమని వివరించారు. 'ఈ దేశాన్ని పితృభూమిగా, పుణ్యభూమిగా పరిగణించేవారంతా హిందువులే. ఈ ప్రాతిపదికన శిక్కులు, బౌద్ధులు, జైనులు హిందువులు. ముస్లింలు, క్రైస్తవులు జాతీయవాదులైనా వారి పుణ్య భూములు అరేబియా, ఇజ్రాయిల్‌లలో ఉన్నాయి. వారు హిందువులు కారు' అని వ్యాఖ్యానించారు.

స్వామి వివేకానంద

వివేకానంద విద్యార్థిగా పాశ్చాత్య తాత్విక ఆలోచనల అధ్యయనం చేశారు. ప్రాచ్య(తూర్పు) ప్రపంచ, ప్రపంచ మతాల ఏకత్వసూత్రాల, దైవత్వ తాత్వికతల, విశ్వజనీనతల ప్రభావంతో హిందు ఆధ్యాత్మికత సారాంశంగా, మానవ మతతత్వ ప్రగతిగా అద్వైత వేదాంతానికి కొత్త అర్థం చెప్పారు. 1893 సెప్టెంబర్ 11న షికాగో ప్రపంచ మతాల పార్లమెంటులో హిందు ఆధ్యాత్మికతను, మేధోసంపత్తిని పాశ్చాత్య ప్రపంచానికి తెలియజేశారు. హిందు జాతీయవాద ప్రదర్శన ఆయన ప్రధాన సందేశం. హిందు ఆధ్యాత్మికత, పాశ్చాత్య భౌతికవాద ప్రతిఘటనలతో హిందు పునరుజ్జీవన ప్రయత్నం చేశారు. శ్వేతజాతి అహంకారాన్ని, పాశ్చాత్య ఆధిపత్యాన్ని హిందు ఆధ్యాత్మికతతో ప్రశ్నించారు. తర్వాతి కాలంలో ఈ తరహా ఆధ్యాత్మిక హిందు మతాన్ని గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుకు తీసుకెళ్లారు. నేటి హిందు జాతీయవాదానికి ఇది ప్రధాన ప్రేరణ. ఆర్.ఎస్.ఎస్. అతిగా పూజించిన నాయకుల్లో ఒకరైన ఉమాకాంత్ కేశవ్ (బాబాసాహెబ్) ఆప్టే జీవితకాల ప్రీతిపాత్ర వాక్యం, 'ఆర్.ఎస్.ఎస్.కు వివేకానంద భగవద్గీత లాంటివాడు.' అయితే వివేకానంద విశాల మానవవాదాన్ని, ప్రపంచ మత సామరస్యతలను ప్రబోధించారు. ఆయనది సహనాన్ని, విశ్వజనీన ఆమోదాన్ని నేర్పిన ప్రాచీన హిందుమతం. ఆయన కుల వ్యవస్థను తిరస్కరించారు. 'వేదాంత సిద్ధాంతాలు ఎంత మంచివైనా ముస్లింల ప్రయోజన సహకారం లేకుండా మానవజాతికి విలువలు ఉండవు. మత గ్రంథాల అవసరంలేని స్థితికి మానవజాతిని చేర్చాలి. మతాలన్నీ సమానం. లక్షలాది మంది ప్రజలు ఆకలితో మాడుతుంటే మనకు నిద్ర ఎలా పడుతుంది? కుల కొట్లాటలతో ప్రయోజనం లేదు. తక్కువ కులాలను కించపరచడం వల్లనే బాధితులు ముస్లింలుగా, మదరాసీలు (దక్షిణ భారతీయులు) క్రైస్తవులుగా మారారు. ఇటుకలు, రాళ్లు, కొయ్యలకు రాముని పరిమితం చెయ్యరాదు. మానవజీవితం గోజీవితం కంటే విలువైనది.' ఇవీ వివేకానందుని ప్రవచనాలు.

మహాత్మాగాంధీ

గాంధీ వర్ణాశ్రమ ధర్మాలను నమ్మిన హిందు భక్తుడు. లౌకికత్వం, ఆధ్యాత్మికతలను అనుసంధానించారు. నైతిక, రాజకీయ, కళా సౌందర్యాత్మక, మతపర ఆలోచనలను పురుషార్థాల పరిధిలో అమర్చుకున్నారు. భారతీయ సమాజంలో లౌకిక, ఆధ్యాత్మిక జీవితాల మధ్య, రాజకీయ ఆలోచనాత్మక జీవితాల మధ్య వ్యాపించిన విభేదాలను ఈ సూత్రాలతో సవాలు చేశారు. తన సామాజిక, రాజకీయ తాత్వికతలో (హిందు) ధర్మం, రామరాజ్యం భావాలను ప్రచారం చేశారు. 'రాజకీయ స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ దిగువ సభ, రష్యా సోవియట్ పాలన, ఇటలీ ఫాసిజం, జర్మనీ నాజీయిజం కాదు. మనకు అనుకూలమైన స్వచ్ఛమైన నైతిక అధికారాల ప్రజల సర్వసత్తాక రామరాజ్య పాలన. రామ రాజ్యమంటే శాంతి, న్యాయం. అట్టడుగు పౌరునికి కూడా సత్వర న్యాయం అందించగల నిజమైన ప్రజాస్వామ్యం. అన్ని మతాలను గౌరవించగలది. ఇదే రామరాజ్య రహస్యం.' అని గాంధీ వక్కాణించారు.

గాంధీ సోవియట్ పాలనను ఇటలీ ఫాసిజం, జర్మనీ నాజీయిజంలతో పోల్చారు. మత నైతికతను రాజకీయాలలోకి తీసుకొచ్చారు. తొలినాళ్లలో వర్ణవ్యవస్థను, దళితుల అంటరానితనాన్ని సమర్థించారు. అయితే సావర్కర్ లాగా రాజకీయ తీవ్రవాదాన్ని మత సమూహాల్లోకి చొప్పించలేదు. భారతీయులంతా హిందువులుగా ఉండాలన్న సావర్కర్ సంకుచిత హిందుత్వం, మతాలన్నీ కలిసి జీవించాలన్న గాంధీ హిందుమతానికి వ్యతిరేకం. సావర్కర్‌తో, హిందుత్వంతో అతి సన్నిహిత సంబంధంగల హిందుమతోన్మాది గోడ్సే గాంధీని చంపారు. గాంధీ హిందుత్వానికి వ్యతిరేకమని ఈ హత్య నిరూపిస్తోంది. గాంధీ హిందుమతాన్ని అధికంగా ప్రేమించినా ఏ మతాన్నీ అగౌరవించలేదు. 'గాంధీ మతం మానవత్వం, మానవ సేవ, సర్వోదయం' అని లౌకికవాదుల భావన.

హిందుత్వ విజృంభణ

1950 దశకంలో నెహ్రూ పాలనలో లౌకిక విధానం అమలు చేయబడింది. 1960 లలో కాంగ్రెస్ వ్యతిరేకత, కాంగ్రెస్ హిందుత్వరాజీ ధోరణి మొదలయ్యాయి. 1964లో మరో పరివార సంస్థ విశ్వహిందు పరిషత్ స్థాపించబడింది. గోవధ నిషేధ ఉద్యమం ఆరంభమైంది. 1967లో కాంగ్రెస్ ప్రభావం తగ్గింది. కొన్ని రాష్ట్రాల మిశ్రమ ప్రభుత్వాల్లో జన సంఘ్ అధికారం పంచుకుంది. గోవధ నిషేధ ఉద్యమం ఉధృతంగా సాగిన ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల విజయాలు సాధించింది. గుజరాత్, బీహార్‌లలో మొదలైన నిరసన ఉద్యమం జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో జాతీయ స్థాయిని అందుకొంది. ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితిలో ఆర్.ఎస్.ఎస్., జన సంఘ్‌ల రాజకీయ అంటరానితనం తగ్గింది. అవి బాగా బలపడ్డాయి. కాంగ్రెస్, వామపక్షాలు బలహీనపడ్డాయి. 1980 లలో బిజెపి ప్రాభవం తగ్గింది. జనతా పాలనలో అధికారం చవిచూసిన సంఘ్ ఎలాగైనా అధికారం సాధించాలని నిర్ణయించింది. సంఘీయులు హిందు పదానికి పర్యాయంగా భారతీయ పదాన్ని వాడారు. తమ రాజకీయ పార్టీకి భారతీయ జన సంఘ్, భారతీయ జనతా పార్టీ అని పేర్లు పెట్టారు. ప్రజా సంస్థలకూ భారతీయ పదం జోడించారు. చివరికి గాంధియన్ సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. జయప్రకాశ్ వారసత్వాన్ని కొనసాగించారు.

అయోధ్య రామ మందిర నిర్మాణ ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఆడ్వాణీ రథయాత్రతో, బాబ్రీ మసీదు కూల్చివేతతో హిందుత్వం వేళ్లూనుకుంది. వాజ్‌పేయి పాలనలో హిందుత్వం చాపకింద నీరులా పారింది. కాంగ్రెస్ కూడా హిందువులను దువ్వడానికి హిందుత్వ అనుకూల అలౌకిక చర్యలు చేపట్టింది. ఇతర పాలక పక్షాలు హిందుత్వ మెతక ధోరణి పాటించాయి. 2004 నుండి పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన రాజకీయ అఘాతంలో, అభివృద్ధి నాయకుడుగా సొంతడబ్బా కొట్టుకున్న మోదీ కుదురుకున్నారు, అధికారం చేపట్టారు. రెచ్చగొట్టే అబద్ధాల ఉపన్యాసాలతో, ప్రచార పటాటోప యంత్రాంగంతో, ఉద్వేగ మతోన్మాద అంశాలతో అధికారంలో స్థిరపడ్డారు. ఈయనకు అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ తోడయ్యారు. మోదీకి ఎదురుచెప్పేవారు లేరు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పట్ల నిరసన తెలియజేస్తున్న ఉద్యమకారులను పాశవికంగా తొక్కేస్తున్నారు. ప్రజావ్యతిరేక విధానాలను మెచ్చనివారిని, హిందుత్వ తాత్వికతను, ఫాసిస్టు పాలనను ప్రశ్నించిన వారిని, సమాజ నిర్మాతలు, రాజ్యాంగ పరిరక్షకులు, విద్యార్థులను జైళ్లలో కుక్కారు. సంఖ్యాధిక హిందు మతస్తుల సమీకరణతో హిందుత్వం ఆకాశానికి ఎగిసింది. బ్రాహ్మణేతర హిందువులు కూడా బ్రాహ్మణత్వాన్ని ఒంటినిండా పులుముకున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల ఆధారంగా ఏర్పడిన సామాజిక, రాజకీయ ఆలోచనల సమాహారం హిందు జాతీయవాదం. ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే మతం, ఒకే భాష హిందుత్వ రామరాజ్యం ఉద్దేశాలు. ఏకస్వామ్యం అసలు అజెండా. రామరాజ్యం పేరుతో మొత్తం భారత ఖండాన్ని అఖండ హిందు దేశంగా మార్చాలి. ఆర్యధర్మం/సనాతన ధర్మ సూత్రాల ప్రకారం పాలన సాగాలి. హిందు జాతీయవాద తాత్వికత ముస్లిం వ్యతిరేక రూపందాల్చింది. మోసపూరిత, వాక్చాతుర్య, మతోన్మాద, ఆకర్షక నినాదాలు గోడల నిండా, కరపత్రాల్లో, ప్రకటనల్లో వ్యాపించాయి. హిందువుల ఇళ్లలో వాడుక పదాలుగా మారాయి. సంప్రదాయ సామరస్య శబ్దజాలాన్ని కలుషితం చేసి, మత అల్లర్లకు దారితీస్తున్నాయి.

భారత్‌లో నేడు హిందుమత ప్రచారకుల పాలనలో హిందుత్వం ఆధునిక రాజకీయ భావజాలంగా మారింది. హిందు మతాన్ని అవమానిస్తోంది. స్వదేశీ వస్తు వినియోగం, చైనా వస్తు బహిష్కరణ, ఆర్థిక రక్షణ, ఆత్మ నిర్భరత, సరిహద్దు భద్రత వాదాల నినాదాతో సామ్రాజ్యవాద దేశాల మితవాద ఉద్యమాలను పోటీపడి అనుసరిస్తున్నది. హిందు గుర్తింపు భారత జాతీయ గుర్తింపుకు పర్యాయంగా మారాలన్నది హిందుత్వవాద ప్రత్యేక విభజన ప్రాతిపదిక. గత 18 నెలల మోదీ–షాల ప్రభుత్వంలో, మోదీ–షా–యోగి కాషాయ విషత్రయంలో, హిందుత్వ ఆగడాలు విపరీతంగా పెరిగాయి. హిందుత్వం సమన్వయ సామరస్యత లను వదిలేసింది. విజయపథంలో పయనిస్తున్నామని గర్విస్తోంది. చట్టసభల్లో మత చిహ్న రంగు దుస్తుల సంఖ్య పెరిగింది. మోదీ బహుళజాతి సంస్థల, సంపన్నుల అనుకూల విధానాలనే ఆచరిస్తారు. పౌర, వలసదారుల, మానవ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను మతాతీతంగా కాలరాస్తారు. మతం ముసుగు మాత్రమే. శాసనాధికార హిందుత్వానికి న్యాయ, కార్యనిర్వాహక, పాత్రికేయ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలు స్వాధీనమయ్యాయి. వందేళ్ల నుండి రాజకీయ అతిక్రమణలకు పరిమితమైన హిందు మతోన్మాద నిజరూపం ఇది.

చివరిమాట

మన జీవితాలు విజ్ఞానశాస్త్ర సాంకేతికతలపై ఆధారపడ్డాయి. ఆర్థిక అంశాలతో నిర్దేశించ బడుతున్నాయి. అయినా మనం ఎవరం? మన జీవన విధానం ఎలా ఉండాలి? అన్న ప్రాథమిక ప్రశ్నలు చిక్కుముళ్లుగా మారాయి. మానవీయ విజ్ఞాన శాస్త్రాలు మాత్రమే వీటికి జవాబులు, పరిష్కారాలు అందించగలవు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే మానవులను తయారుచేసే లక్ష్యం మానవీయ విజ్ఞాన శాస్త్రాలది. నేటి విద్యాసంస్థల్లో ఈ శాస్త్రాల బోధన, అధ్యయనం లేవు. చరిత్ర నుండి సామాజిక సాంస్కృతిక అంశాలు అర్థం చేసుకోవాలి. ఈ జ్ఞానంతో సమకాలీన సమస్యలను పరిష్కరించుకోవాలి. శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలి. జీవపరిణామ క్రమాన్ని అధ్యయనం చేయాలి. ఆదిమ సమాజ మానవునికి మతం లేదు. హిందుత్వ వాదాన్ని వ్యతిరేకించవలసిన ప్రత్యేక బాధ్యత హిందువులుగా పుట్టిన ప్రగతిశీలురది. హిందుత్వ ఛాందసత్వాన్ని, అశాస్త్రీయ కథనాలను హిందువులు అందరూ ఎదుర్కోవాలి. మత పెద్దలు ప్రేక్షక పాత్ర వదలాలి. పాలక సామ్రాజ్యవాద సమర్థనా చర్యలతో, బహుళజాతి సంస్థల ప్రోత్సాహక పథకాలతో తామూ నష్టపోతామని గుర్తించాలి.

(రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి) వీ

కొత్త కార్మిక వ్యతిరేక చట్టాలు

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి, కార్మికుల హక్కులను హరించి, యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అంటున్నారు **కె. సూర్యం**

కరోనా కల్లోలం గణాంకాలకు అందని గడ్డుకాలం, ప్రగతి చక్రాలు ఆగిపోయాయి, పల్లె తల్లి అయ్యింది. రివర్స్ మైగ్రేషన్‌తో సమస్యలు తీవ్రమయ్యాయి, జన జీవనం అస్తవ్యస్తమైంది, గ్లోబలైజేషన్ పోయి గ్లోబల్ విలేజ్‌గా మారింది, నిన్నటి దీమా నేడు ఉండడం లేదు, పులి మీద స్వారీ బతుకులు అయ్యాయి, ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయ్యింది. ఎదుగుదల లేని ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది నిరుద్యోగులు పెరిగిపోయారు. 11 కోట్ల మంది వలస బతుకులు ఛిద్రమయ్యాయి. బతుకులు దుర్లభంగా మారినాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మిక వర్గానికి ఉపాధి కరువైంది. తెలంగాణ రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ద్వారా 90 వేల మంది కార్మిక ఉద్యోగులకు పనులు లేక జీతాలు లేక అస్తవ్యస్తం అవుతున్నారు. విద్యా వాలంటీర్లు 12 వేల మంది, మిడ్ డే మీల్స్ 55000, స్కావెంజర్స్ 28 వేలు, 200 బోధన బోధనేతర సిబ్బందినీ తొలగించి బతుకు లేకుండా చేయడం జరిగింది. రాష్ట్రంలో బోధన బోధనేతర సిబ్బంది సుమారు రెండున్నర లక్షల మందికి ప్రైవేటు స్కూల్, కాలేజ్ యాజమాన్యం జీతాలు ఇవ్వకుండా చేతులెత్తేసింది. మోటార్ కార్మికులకు తగిన ఆదాయం లేక లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరందరినీ ఆదుకోవాల్సిన సమయంలో కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేయడం జరిగింది. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరోనా కాలంలో కార్మిక వర్గాన్ని ఆదుకోవాలని, వారందరికీ తగిన సామాజిక భద్రత కల్పించాలని, సాధారణ పరిస్థితులు నెలకొనేదాకా ఒక్క కార్మికుడికి 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించాలని, కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావడం సరైంది కాదని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించరాదని అనేక ఆందోళనలు నిర్వహించాం. 2020 సెప్టెంబర్‌లో పార్లమెంట్ ఏకపక్షంగా కార్మిక వ్యతిరేక బిల్లులను ఆమోదించింది. సామాజిక భద్రత పేరా దేశంలో 50 కోట్ల శ్రమజీవులకు, సామాజిక భద్రత లేకుండా చేసే ఉద్దేశంతో కార్మిక చట్టాలను మార్చడానికి పూనుకుంది. కార్పొరేట్లకు సేవ చేసే ఉద్దేశం స్పష్టమౌతుంది.

ఆక్యుపేషన్, సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్ కోడ్ 2020 :- పార్లమెంట్‌లో 2020 సెప్టెంబర్ 22న బిల్ పాస్ చేయడం జరిగింది. 13 కేంద్ర కార్మిక చట్టాలను కలిపి ఒక కోడ్‌గా రూపొందించారు. పాత చట్టాల స్థానంలో కొత్త చట్టాలను రూపొందిస్తున్నామని, కార్మిక వర్గానికి లాభం చేకూర్చే విధంగా ఉంటుందని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మాటలు బూటకమని అర్థమౌతుంది. ఈ చట్టాలలో ఉన్న లోపాలను, ప్రమాదాలను అర్థం చేసుకుంటే కార్మిక ప్రయోజనం కొరకు లేవని తేటతెల్లమౌతుంది. ఈ కోడ్లో కలిపిన చట్టాలు 1) ఫ్యాక్టరీ యాక్ట్ 1948, 2) మైన్స్ యాక్ట్ 1952 ,3) డెక్ వర్కర్స్ (సేఫ్టీ హెల్త్ అండ్ వెల్ఫేర్) యాక్ట్ 1986, 4) భవన ఇతర నిర్మాణ కార్మిక చట్టం 1996 (బి.ఓ.సి), 5) ప్లాంటేషన్ లేబర్ యాక్ట్ 1951, 6) కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) యాక్ట్ 1970(సిఎల్ఏఆర్ఎస్),7) ఇంటర్ స్టేట్ వర్కర్స్ యాక్ట్ 1979, 8) వర్కింగ్ జర్నలిస్ట్ ఇతర న్యూస్ పేపర్స్ ఎంప్లాయిస్ యాక్ట్ 1955, 9) వర్కింగ్ జర్నలిస్ట్ 1958, 10) మోటార్ ట్రార్ట్ యాక్ట్ 1976, 11) సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976, 12) బీడీ, చుట్ట కార్మికుల చట్టం 1966, 13) సినీ వర్కర్స్, సినిమా థియేటర్స్ వర్కర్స్ యాక్ట్ 1981, ఈ సంక్షేమ చట్టాలు అన్నింటిని విడివిడిగా ఆయా రంగాలకు వర్తించే విధంగా ఆయా రంగాలకు అమలయ్యే విధంగా రూపొందించబడింది. వీటన్నిటిని తూట్లు పొడిచే లక్ష్యంతోనే, కార్పొరేట్లకు మంచి సేవకుడిగా నిరూపించుకోవడం కొరకు కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను రద్దుచేసింది.

ఫ్యాక్టరీ చట్టం ప్రకారం కరెంట్‌తో నడిచే పరిశ్రమలో పదిమంది, కరెంటు లేకుండా నడిచే పరిశ్రమలో 20 మంది పని చేస్తుంటే వారందరికీ ఫ్యాక్టరీ చట్టం ప్రకారం చట్టం నిర్దేశించిన విధంగా సేఫ్టీ, మెజర్స్‌ను, వర్కింగ్ కండిషన్స్ అమలు పరచాలి. నేడు కార్మికుల కొరకు లాభం చేకూర్చేవిధంగా చట్టాన్ని మార్చినాం అంటున్నా పాలకులు ప్రవేశపెట్టిన కోడ్‌లో 20, 40 మంది కార్మికులు కలిగి ఉండాలని మార్చడం జరిగింది. దీని కన్నా తక్కువ ఉన్న పరిశ్రమలో చట్టాలను అమలు చేయకుండా తప్పుకోవడానికి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. వలస కార్మికుల కొరకు ఇదివరకే చట్టాలు ఉన్నాయి, ఈ కోడ్‌లో వలస కార్మికుల వేతనాలను 18 వేల లోపు ఉన్నవారికి చట్టం వర్తిస్తుందని పేర్కొన్నది, తప్ప ఇతర ప్రత్యేక బెనిఫిట్స్ ఈ కోడ్ సూచించలేదు. కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ ప్రకారం రద్దు పరచడం, రెగ్యులర్ చేయాలని చట్టం నిర్దేశించింది. కానీ కాంట్రాక్ట్ విధానాన్ని మరింత మెరుగుపర్చే విధంగా ఉంది. కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ 20 మంది కలిగిన కాంట్రాక్టర్ చట్టం నిర్దేశించిన విధంగా ఉండాలి, కానీ దాని స్థానంలో 50 మంది వరకు పెంచారు. దీని వలన జరిగేది ఏమిటి భవిష్యత్తులో 49 మంది కలిగిన కాంట్రాక్టర్ చట్టాలను అమలు పరచకుండా యథేచ్ఛగా రాజ్యం చేయడానికి అవకాశం ఈ కోడ్ కల్పించింది. అలాగే సంవత్సరానికి ఒకసారి కాంట్రాక్టర్ తమ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి. నేడు ఐదు సంవత్సరాలకు ఒకసారిగా మార్చినారు. ప్రధాన యజమాని విధులను చట్టం నుంచి తప్పించింది. ప్రభుత్వ పనులను కాంట్రాక్టర్ చేయిస్తే ప్రభుత్వ ప్రిన్సిపల్ ఎంప్లాయర్ అవుతుంది, దీనివలన ప్రభుత్వ 'ప్రధాన యజమాని' అవడం చేత చట్టాలను అమలు చేసుకోవడానికి ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం

పాత చట్టంలో ఉంది, కానీ నేటి 'ఆక్యుపేషన్ కోడ్‌లో' కాంట్రాక్టర్ అన్నింటికీ బాధ్యత అనేది సవరించడం కార్మిక హక్కులకు భంగకరంగా మారబోతుంది. కరోనా కల్లోలంలో 11 కోట్ల మంది కార్మికులు లాక్‌డౌన్ సమయంలో పనులు లేక కాలం వెళ్లదీసారు. లక్షల మంది ప్రయాణ సౌకర్యాలు లేక కాలినడకన ప్రయాణం సాగించిన వారికి ఈ ఆక్యుపేషన్ కోడ్ ఎలాంటి ఊరట కల్పించలేదు.

వేజ్ కోడ్ 2019, కేంద్ర కార్మిక చట్టాలు 1) కనీస వేతనాల చెల్లింపు చట్టం 1948 (ఎం.డబ్ల్యు), 2) వేతనాల చెల్లింపు చట్టం 1936 (పి.డబ్ల్యు), 3) గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, 4) ఈక్వల్ రెమ్యునేషన్ యాక్ట్ (సమాన వేతన చట్టం) 1970 ఈ నాలుగు కేంద్ర కార్మిక చట్టాలను 2019 పార్లమెంట్ ఆమోదించింది. కార్మిక సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలిపినా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను కుదించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈ కోడ్ ప్రకారం ఫ్లోర్ వెజ్ నిర్ణయిస్తుంది, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వేతనం కన్నా తగ్గించి వేతనాన్ని నిర్ణహించరాదు. 15వ లేబర్ కమిషన్ కనీస వేతనాలను ఎలా నిర్ణయించాలో సూచించింది, కానీ ఈ కోడ్‌లో 'ఫ్లోర్ వెజ్'ను ఎలా నిర్ణయించాలనే నిర్దేశం లేదు. 'వేతనాల చెల్లింపు చట్టం', 'కనీస వేతనాల చెల్లింపు చట్టం' ప్రకారం సకాలంలో వేతనాలు ఇవ్వకుంటే, అక్రమంగా వేతనాల్లో కోత విధిస్తే తగిన శిక్షలు, జరిమానాలు, జైలు శిక్షలు కూడా ఉన్నాయి. నేడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వేజ్ కోడ్'లో అలాంటి జైలుశిక్షలను రద్దు చేశారు. జైలు శిక్షలు ఉన్నంత మాత్రాన చట్టాలు పకడ్బందీగా అమలు అవుతున్నాయని అర్థం కాదు. ఒకరకంగా చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష కూడా ఉంటుందన్న నిర్దేశం కార్మిక వర్గానికి కొంత ఊరట లభిస్తుంది.

'గ్రాట్యుటీ చెల్లింపు చట్టం' ప్రకారం కార్మికుల సర్వీసును బట్టి సంవత్సరానికి పదిహేను రోజుల వేతనాన్ని గ్రాట్యుటీగా పొందవచ్చు. చట్టాలను అమలు పరచడానికి సంబంధిత లేబర్ శాఖ తగిన చర్యలను చేపట్టడానికి అవకాశాలు పాత చట్టాల్లో ఉన్నాయి. కార్మిక చట్టాలన్నీ కార్మిక సంక్షేమం కొరకు నిర్దేశింపబడి వీటిని కార్మిక శాఖ కార్మికులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉండాలి. నేడు పార్లమెంట్ ఆమోదించిన 'వేజ్ కోడ్'లో లేబర్ అధికారుల అధికారాలను కత్తిరించడం జరిగింది. లేబర్ అధికారులు నేడు కేవలం 'పెసిల్ స్టేటర్' (సహాయకుడు) పాత్ర అని నిర్వహించింది. అంటే యజమాని సహాయకుడిగా ఉండడమే తప్ప మరోటి లేదు. దీనివల్ల జరిగేది ఏమిటి 'వేజ్ కోడ్' కార్మిక వర్గానికి లాభం జరగక పోగా అత్యంత నష్టాన్ని కలిగించే విధంగా పాలకవర్గాలు ఆమోదించడం సిగ్గుచేటైన విషయం.

సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020 :– కేంద్ర ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 22నాడు 9 కేంద్ర కార్మిక చట్టాలను కుదిస్తూ ఈ కోడ్‌గా రూపొందించారు. 1) కార్మిక భవిష్య నిధి చట్టం 1952 (పిఎఫ్), 2) ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్ట్ 1948 (ఇఎస్ఐ), 3) ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ (కంపల్సరీ నోటిఫికేషన్ ఆఫ్ వేకెన్సీస్) యాక్ట్ 1959, 4) మెటర్నటీ బెనిఫిట్ యాక్ట్ 1961, 5) గ్రాట్యుటీ యాక్ట్ 1972, 6) సినీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్ 1981, 7) భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 (బిఓసి), 8) అన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ యాక్ట్ 2008, 9) ఎంప్లాయిస్ కంపెన్సేషన్ యాక్ట్ 1993 (డబ్ల్యు.సి), ఈ కేంద్ర కార్మిక చట్టాలను అన్నింటినీ కలిపి ఒక కోడ్‌గా రూపొందించడం మేము చేసిన ఘనకార్యం అని కేంద్రం ప్రకటించడం సిగ్గుచేటైన విషయం. గతంలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరించి వేసే లక్ష్యమే నేడు ఈ ప్రభుత్వం ఆమోదించిన కోడ్‌లో ఉంది ఇది కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం గోబెల్స్ ప్రచారానికి పూనుకుంది. యజమాన్యాలు వివిధ రంగాలలో కార్మికులను నియమించుకొని పని చేయించుకుంటారు. వారందరి పరిస్థితులను బట్టి ప్రత్యేకంగా ఆయా రంగానికి సంబంధించి కార్మిక చట్టాలను రూపొందించారు. నేడు ప్రభుత్వం అన్నింటిని గుండుగుత్తగా అడ్డగోలుగా సవరించ పూనుకున్నది. దీనివలన కార్మిక వర్గానికి నిర్దిష్ట ప్రయోజనాలు అందకుండా దూరం అయ్యే ప్రమాదం ఉంది. కార్మిక వర్గానికి ప్రభుత్వం అందించవలసిన సంక్షేమాల నుండి దూరం జరగడానికి ఈ కుట్రలకు దిగింది. 'ఫ్యాక్టరీ యాక్ట్' కింద 20 మంది కార్మికులు విద్యుత్ శక్తి లేని ఫ్యాక్టరీలో పని చేస్తే చట్టబద్ధ హక్కులు అమలు చేయాలి. నేడు ప్రభుత్వం సవరించిన కోడ్‌లో 40 మందికి పెంచడం అంటే చట్టబద్ధ హక్కును దూరం చేయడం తప్ప మరొకటి లేదు కదా? ప్రావిడెంట్ ఫండ్ చట్టంలో 20 మంది గల పరిశ్రమకు పిఎఫ్ అమలు చేయాలి నేడు నలభైకి పెంచడం అంటే రేపు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయడానికి చట్టం నుండి యాజమాన్యాలను తప్పించడం తప్ప మరొకటి ఉందా? సోషల్ సెక్యూరిటీ కోడ్ అనే పేరు మీద వివిధ రంగాలకు గల చట్టాలను కుదించడం అంటే ఆ చట్టాల్లో పొందే ప్రయోజనాలకు ముప్పు వాటిల్లుతుంది. ఉదాహరణకు భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం ప్రత్యేక బోర్డు కలిగి ఉంది, ఇతర రంగాలకు సంబంధించి ఆయా రాష్ట్ర బోర్డులు నిర్మాణం అయి ఉన్నాయి. ఆ బోర్డుల ద్వారా సంక్షేమ పథకాలను కార్మిక వర్గానికి అందిస్తారు. అన్నింటినీ కలిపి ఒకే దాంట్లో వేయడం అంటే రేపు భవిష్యత్తులో సంక్షేమం అమలు చేయకుండా తప్పుకోవడం తప్ప మరొకటి లేదని ఈ సవరణల వలన అర్థం అవుతుంది.

భవన ఇతర నిర్మాణ రంగ కార్మిక చట్టం ప్రకారం 20 లక్షల నిర్మాణానికి కార్మికుల సంక్షేమం కొరకు ఒక శాతం సెస్ చెల్లించాలి. నేడు ఈ కోడ్ 50 లక్షలకు పెంచింది. పోనీ నిర్మాణ ఖర్చులు పెరిగినందువల్ల 20 నుంచి 50కి పెంచింది అంటే అర్థం చేసుకోవచ్చు, కానీ సెస్ వసూలు చేసే విధానాన్ని, సెస్ చెల్లించని యాజమానులతో ఎలా అమలు చేయించాలనేది ఈ కోడ్ సూచించలేదు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కొరకు స్వతంత్రంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సెస్ ద్వారా సంక్షేమ అందించేవారు, నేడు ఇది కాల గర్భంలో కలిసి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంటుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు మనం చూస్తూనే ఉన్నాం. బీడీ కార్మికుల కొరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా నేడు ఈ ఒక్క పథకాన్ని కూడా అమలు చేయని దౌర్భాగ్య స్థితి నెలకొని ఉంది. భవిష్యత్తులో 'సోషల్ సెక్యూరిటీ కోడ్' అన్నది సామాజిక భద్రత గగనంగా మారక తప్పదు. ఒక సంవత్సరం పని చేసిన కార్మికులకు కూడా గ్రాట్యుటీ అందిస్తామని బీరాలు పలుకుతున్నారు. అంటే ఫిక్స్ ఎంప్లాయిమెంట్ పద్ధతి అమలు చేయడం అంటే కార్మిక హక్కులను హరించడమే? ఇంతకాలమే కార్మికులతో పని చేయించుకుంటున్నారు అనే ముందస్తు అగ్రిమెంట్ ప్రమాదకరమైంది. వీరికి కూడా మేం గ్రాట్యూటీ ఈ అమలు చేస్తామనేది కార్మికవర్గానికి అంత ప్రయోజనకరమైనవి కాదు.

ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ 2020 :– కరోనా కాలంలో నిర్వహించిన పార్లమెంట్ సమావేశాలలో సెప్టెంబర్ 22 నాడు బిల్లును ఆమోదించారు.

ఈ కోడ్‌లో 3 కేంద్ర కార్మిక చట్టాలను క్రోడీకరించారు. 1) పారిశ్రామిక వివాదాల చట్టం 1947, 2) కార్మిక సంఘాల నిర్మాణ చట్టం 1926, 3) ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్ చట్టం1946, ఈ చట్టాలను కార్మికవర్గం పోరాడి సాధించుకుంది. వీటిని ఒక్క కలం పోటుతో ఏకపక్షంగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా చట్టాలు సవరించింది. కార్మిక వర్గానికి 'సమ్మె జన్మ హక్కు' లాంటిది యజమానులతో బేరసారాలకు, తమ డిమాండ్ల సాధన కొరకు సమ్మె ఉపయోగపడుతుంది. పారిశ్రామిక వివాదాల చట్టం సమ్మె చట్టబద్ధ హక్కుగా పేర్కొన్నది. అత్యవసర సర్వీసులకు మాత్రమే సమ్మెపై నిషేధాన్ని పేర్కొన్నది. పదిహేను రోజుల ముందు నోటీసు ఇచ్చి సమ్మెకు దిగవచ్చు, నేడు 60 రోజుల ముందు నోటీసు ఇవ్వాలని కోడ్‌లో సవరించడం జరిగింది. ఇది చాలా ప్రమాదకరం, ఈ సవరణ సమ్మెకు తూట్లు పొడవడం తప్ప మరొకటి కాదు. యజమానులకు అధిక అవకాశాన్ని కల్పించి కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విషయమే తప్ప మరోటి లేదు. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం పరిశ్రమలో వచ్చిన వివాదాన్ని సంబంధిత జిల్లా, రాష్ట్ర లేబర్ అధికారులు కన్సిలేషన్ మీటింగు నిర్వహించి వివాదాలను పరిష్కరించవచ్చు, కానీ నేడు ఈ కోడ్ వివాదాలను ట్రిబ్యునల్‌లో పరిష్కరించాలని పేర్కొన్నది. ట్రిబ్యునల్ అంటేనే ఆలస్యానికి నిలయాలు, అనేక సంవత్సరాలుగా వివాదాలు పరిష్కారం కాకుండా ఉండడానికి అవకాశం ఉంది. ఈ సవరణ కార్మిక వర్గానికి ప్రయోజనకరమైనది కాదు. యజమాన్యాలు కార్మికులను అడ్డగోలుగా తొలగించడానికి పారిశ్రామిక వివాదాల చట్టం అడ్డంకిగా ఉంది. నేడు యజమానులకు కార్మికుని నియమించుకోవడానికి, తొలగించడానికి సమయాన్ని కూడా ఫిక్స్ చేయడం వింతైన విషయం, దారుణమైన విషయం ఇలాంటి అవకాశం ఈ కోడ్ కల్పించింది. దీనితో కార్మిక చట్టాలను తుంగలో తొక్కడానికి యజమానులకు అధిక స్వేచ్ఛను కోడ్ కల్పించింది. ఒక పరిశ్రమలో 100 మంది కార్మికులు ఉంటే కార్మిక విధులు, యజమాన్యం అమలుచేస్తున్న నిబంధనలు, పేర్కొంటూ ఉభయుల ఆమోదంతో యజమాని, కార్మిక సంఘం సంబంధిత అధికారి ముందు 'ఇండస్ట్రియల్ స్టాండింగ్ ఆర్డర్ చట్టం' ప్రకారం అంగీకార పత్రం రూపొందించుకోవచ్చు, నేడు 3 వందల పైగా కార్మికులు గల పరిశ్రమ, సంస్థలు మాత్రమే 'ఇండస్ట్రియల్ స్టాండింగ్ ఆర్డర్స్'ను రూపొందించుకోవాలి. ఒకనాడు కార్మికవర్గానికి గల హక్కులను నేడు ఈ కోడ్ కార్మికుల సంఖ్యను పెంచి యాజమాన్యాలకు నిబంధనలు అమలు చేయకుండా ఉండేవిధంగా అవకాశాన్ని కల్పించడం దారుణం. చట్టాలను నీరుగార్చి కుదించి పారిశ్రామిక వేత్తలకు చట్ట ఉల్లంఘనకు అవకాశం కల్పించడం తప్ప మరోటి కాదు. దీనివలన కార్మిక హక్కులను కాపాడుకోవడం గగనంగా మారుతుంది. 300 లోపు ఉండే కార్మికులను 'కట్టు బానిసలు'గా మార్చాలన్నది మోడీ ప్రభుత్వ ఉద్దేశమా? దీనికి సమాధానం చెప్పాలి. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం 100 మంది కార్మికులు గల పరిశ్రమ మూసివేయాలనుకుంటే సంబంధిత ప్రభుత్వంతో అనుమతి తీసుకొని మూసివేయాలి. నేడు ప్రభుత్వం సవరించిన కుదించిన 'ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్' 300 మందికి పెంచడం, ఈ పరిశ్రమ మాత్రమే ముందస్తు అనుమతి పొందాలని సవరించింది. దీనితో చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల్లో తక్కువ మంది కార్మికులతో నడుస్తున్నాయి. మూడు వందల మంది ఉంటేనే అనుమతి అవసరం అనేది ప్రమాదకరం, ఇది యాజమాన్యాలకు లాభకరమైన విషయం. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న సంఘ నిర్మాణ హక్కును తూట్లు పొడవడం ఈ కుదింపు చట్టంలో ఉంది. ఐదు మంది కార్మిక ప్రతినిధులు కార్మికుల ఆమోదంతో యాజమాన్యంతో డిమాండ్ల సాధనకు 'నెగోషియేషన్' చెయ్యవచ్చని 'ట్రేడ్ యూనియన్ యాక్ట్' తెలుపుతుంది. నేడు తగినంత సభ్యత్వం కలిగిన వారితోనే యజమాన్యం చర్చలు జరపాలని పేర్కొంటూ పాత విధానాన్ని తొలగించడం జరిగింది. కార్మిక సంఘ సభ్యత్వాలను చెక్‌చేసి ధృవీకరించే అధికారం యజమానులకు ఇస్తే, అది కార్మిక వర్గానికి లాభం చేకూర్చదు కదా నష్టాన్ని కలిగిస్తుంది. కార్మిక సంఘం రిజిస్టర్ చేసుకుని, గుర్తింపు ఎన్నికల్లో ఎన్నికైన సంఘంతో చర్చలు చేయని వైనాన్ని చూస్తున్నాము. నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ పరిశ్రమ సంబంధాలను మరింత ప్రమాదకరమైన స్థితిలోకి నెడుతుంది.

కేంద్ర కార్మిక చట్టాలను సులభతరం కై, నవీనీకరణకై కోడ్‌లుగా కుదించాం అన్నది పచ్చి బూటకం, సింప్లిఫై, మాడ్రన్జేషన్ అంటే యాజమాన్యాలకు సులభతరంగా ఉండడానికి, వారికి మంచి సేవకునిగా మేమున్నామని చెప్పడానికే ఈ సవరణలు ఈ కుదింపులు. కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. ఈ కార్మిక ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ 2020 నవంబర్ 26 నాడు 'దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె'కు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చాయి. ఈ పిలుపును విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరుతున్నాం.

(రచయిత ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

శాంతసుందరి



ప్రముఖ అనువాదకురాలు శాంతసుందరి(73) నవంబర్ 11న మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తండ్రి కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యకారుడు కావడం, ఇంట్లో సాహిత్య వాతావరణం ఉండడంతో సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకొని ప్రఖ్యాత హిందీ కవి హరివంశరాయ్ బచ్చన్ రచనల స్ఫూర్తితో హిందీ సాహిత్యంలోని కవిత్వం, కథలు, నవలలను తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. సుమారు 75 తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషానువాదాలు చేశారు. 'ఇంట్లో ప్రేమ్‌చంద్' అనువాదానికి 2015లో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ఆమె అనువాద ఎంపికలో కూడా విలక్షణత చూపించేవారు. ఆ రచనలో విషయం సార్వజనీనంగా ఉండాలని, శిల్పంలో కొత్తదనం ఉండాలని, ఆ రచన సమాజానికి ప్రయోజనం చేకూరేలా ఉండాలని కోరుకునేవారు. తెలుగు రచనలు ఇతర భాషల్లోకి అంతగా వెళ్లడం లేదని, అందుకే ఆ ప్రయత్నానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు.

కశ్మీర్ మరో పాలస్తీనా కాబోతోందా?

కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసిన ప్రభుత్వం ఆ భూభాగాన్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయాలని చూస్తోందని అంటున్నారు బి. ఎస్. రాజు

దాపరికం ఏమీ లేదు. ఇన్నాళ్లు దాచిపెట్టి, ఇప్పుడేదో హఠాత్తుగా మేము ఏమీ చేయడం లేదు. గత 70 ఏళ్లుగా మేము మా పార్టీ ప్రణాళికల్లో, మా విధాన ప్రకటనల్లో ఏదైతే చెబుతూ వస్తున్నామో అదే ఇప్పుడు జమ్మూ-కశ్మీర్‌లో అమలు చేస్తున్నాం. ఏదైతే గత 70 ఏళ్లుగా భారతదేశ ప్రజలకు వాగ్దానం చేస్తూ వచ్చామో దానినే ఇప్పుడు పూర్తి చేస్తున్నాం, నెరవేరుస్తున్నాం.

మొదట్లో ఒకలా, ఇప్పుడు మరోలా మా పార్టీ, మా రాజకీయ సంస్థ పేరు అవసరార్థం, అధికార సాధనార్థం మారుతూ వచ్చి ఉండవచ్చు. కూటమి కోసం మా రాగం కొంత లోస్థాయిలో ఉండి ఉండవచ్చు. అయితే అప్పుడూ ఇప్పుడూ మా మూల నీతి ఒక్కటే, అది మారలేదు, మారదు.

మా హిందూ హృదయం స్వచ్ఛమైనది. మా హిందుత్వ ఆదర్శం సదా నిలకడైనది, ఎన్నటికీ మారనిది. ఇది మా నిజాయితీకి, నిబద్ధతకు నిదర్శనం. యావత్ భారతం ఈ మా ఆదర్శాలకు నీరాజనాలు పడుతోంది. దేశం నలుమూలలా ఎన్నికల్లో మా పార్టీ సాధిస్తున్న ఘన విజయాల వెనుక ఉన్న రహస్య మేమిటి? ఇదే కదా!

బాబ్రీ మసీదు కూల్చివేత, సుప్రీం కోర్టు చెయ్యి మెలిత, అయోధ్యలో రామాలయ నిర్మాణ నిర్ణయ ఘనత, కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, జమ్మూ కశ్మీర్ భౌగోళిక విభజన, వాటి కేంద్ర (సైనిక) పాలన, అక్కడి భూచట్టాల్లో మార్పు ఇవన్నీ గొప్ప ముందడుగులు కావా? కాశ్మీర్ ప్రజల వికాసానికి, త్వరిత అభివృద్ధికి గొప్ప సోపానాలు కావా? ఇది గుర్తించ నిరాకరించిన వారు జాతి ద్రోహులు, దేశద్రోహులుకారా?

జమ్మూ-కశ్మీర్-లద్దాక్‌లతో సహా యావత్ భారతం ఓ హిందు రాష్ట్రం, హిందుస్థాన్. ఇక్కడ నివసించే పౌరులందరూ హిందూ రాష్ట్ర నీతి నియమాలకు, చట్టాలకు కట్టుబడి ఉండాల్సిందే! వేరువేరు జన జాతులకు, మత సమూహాలకు వేరువేరు జెండాలు, వేరువేరు ఎజెండాలు, చట్టాలు, నియమాలు ఉండవు. ఉండటానికి వీల్లేదు. అందరికీ ఒకే రాజ్యాంగం, ఒకే రకం చట్టాలు వర్తిస్తాయి. ఇలా కాదు, ఇది కుదరదు అనే వారు దేశద్రోహులే! వారు ఈ దేశంలో ఉండటానికి అర్హత కోల్పోతారు. పోవాల్సిందే! ఇందులో దాపరిక మేముంది? ఇదంతా మా హిందూ రాష్ట్ర ఎజెండాలో భాగమే కదా!

విదేశీ చొరబాటుదార్లను ఏరివేసి దేశీవాసులను నిర్ధారించడానికే కదా పౌరసత్వ సవరణ బిల్లు, పౌర పట్టిక బిల్లులను దేశభక్తితో అంకిత భావంతో ప్రవేశ పెడుతున్నది? వీటిని వ్యతిరేకించే ముసుగు ముఠాలు, తుకుడే తుకుడే గ్యాంగులు దేశద్రోహులుకారా?

మేము కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసామంటే అర్థమేమిటి? అక్కడ నెలల తరబడి అష్టదిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నా మంటే, భారత సైన్యాన్ని పహారాగా ఉంచుతున్నామంటే దేనికోసం? ఆటంకవాద్ ముక్త్, టెర్రరిస్ట్ ఫ్రీ అంటే వేర్పాటువాద, ఉగ్రవాద, పాకిస్థాన్ ఆరాధక, దేశద్రోహ ముక్త భారత్ కోసమే కదా! ఈ ముష్కర మూకల నుండి కశ్మీర్‌ను విముక్తి చేసి ఓ సుందర హిందూ-కార్పొరేట్ వికసిత కశ్మీర్ నిర్మాణానికే కదా!

ఇప్పుడు మేము ఆత్మనిర్భర భారత్ అంటున్నామంటే, అది కశ్మీర్‌ను కలుపుకునే చెబుతున్నాం. కశ్మీర్‌లో భూములు ఎవరైనా కొనుగోళ్లు అమ్మకాలు చేసుకోవచ్చు, పరిశ్రమలు పెట్టవచ్చు, రియలెస్టేట్ దందా, ఇతరత్రా వ్యాపారాలు చేసుకోవచ్చు, త్వరితంగా చేసుకోండి అని తీర్మానించామంటే అర్థం ఏమిటి? కశ్మీర్‌ను వెనుకబాటుతనం నుండి విముక్తి చేయడానికే కదా! ముడుచుకుపోయి ఉన్న గులాబీ కశ్మీర్‌ను తిరిగి విచ్చుకునేట్లు చేయడానికే కదా!

అంబానీ, ఆదానీలకు, దేశ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు, బడా రియలెస్టేటర్లకు, గుత్తేదార్లకు, దిగ్గజ వ్యాపారులకు కశ్మీర్ ద్వారాలు ఎందుకు తెరిచాం? ఎర్ర తివాచీలు ఎందుకు పరిచాం? అక్కడ భూములను, వనరులను వారికి అప్పచెప్పి పలు విధాలుగా అభివృద్ధి చేయమనే కదా!

మరి రాజ్యాంగం సంగతి ఏమిటి అని ఆడిగేవాళ్లు అడుగుతూనే ఉంటారు. అది మేం లెక్కచెయ్యం. అలా అని ఇప్పుడే దాన్ని విసిరేయం. ఇప్పటి అవసరానికి వాడుకుంటాం. దాని అవసరం తీరిపోయే సమయం తొందరలోనే రాబోతుంది. ఆ సమయాన్ని కుదించే పనిలోనే ఉన్నాం మేం! అసలు ఈ రాజ్యాంగం హిందు రాష్ట్ర తాత్వికతకు వ్యతిరేకంకదా? దీన్ని మోయవలసిన పని మాకేముంది?

జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి దాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం, జమ్మూ-కశ్మీర్ భూచట్టాలను సవరించడం తప్పని, భారత రాజ్యాంగ సూత్రాల అతిక్రమణ అని, జమ్మూ-కశ్మీర్ ప్రజల పట్ల ద్రోహమని అనేవారు కశ్మీర్‌ను పాకిస్థానుకు, చైనాకు వదిలిపెట్టి హిందువులకు ద్రోహం చెయ్యమని అంటున్నారు.

అంతేకాదు వీరు ఇంకా చాలా చాలా మాట్లాడుతున్నారు. ఆకు పచ్చని కాశ్మీరం కాషాయ కశ్మీర్‌గా మార్చడానికి జరిగే కుట్రగా మా చర్యలను వర్ణిస్తున్నారు. కశ్మీర్‌ను అమ్మకానికి పెట్టామని, కశ్మీరీ ప్రజల భూములు గుంజుకుని హిందు పెట్టుబడిదారుల జాగీరుగా మారుస్తు న్నామని అంటున్నారు. తద్వారా హిందూ ప్రజలను ఇక్కడి భూభాగంలో

ఆత్మనిర్భర్ భారత్‌కు ఆకలి సూచి హెచ్చరిక

రెండంకెల వృద్ధిరేటు వంటి ఆకర్షణీయమైన నినాదాల డొల్లతనాన్ని ప్రపంచ ఆకలి సూచి బట్టబయలు చేసిందని, ఇప్పటికైనా పేదరిక నిర్మూలనకు ప్రణాళికాబద్ధమైన కృషి జరగాలని అంటున్నారు డా.ఎ. పున్నయ్య

ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది అన్నార్తుల జీవితాలతో నిరంతరం మృత్యు క్రీడలాడుతున్న నిశ్శబ్ద హంతకి పేదరికం. ఇది హింసకు అత్యంత హీన రూపం. ఆధునిక సమాజ పరిణామంలో ఇప్పటికి నెలకొన్న బానిసత్వం, వర్ణ వివక్ష వంద శాతం పాలకుల నిర్మితమే. వీటి కవల పిల్లలు ఆకలి, పేదరికం. నేటి వర్గ సమాజంలో ఆకలి విడిగా ఉండదు. ఇది దశాబ్దాలుగా పాలకుల నిరంకుశ విధానాల ఫలితంగా వర్ధిల్లుతుంది. నిజానికి అభివృద్ధికి, సమర్ధ మానవ వనరుల వికాసానికి విఘాతంగా మారిన పేదరికాన్ని నిర్మూలించకుండా ఆధునిక ప్రపంచం పురోభివృద్ధి సాధించలేదు. ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న పేదరిక రక్కసి పెడరెక్కలు విరిస్తేనే ప్రగతి కాముక ఆర్థిక ప్రగతి సాధ్యమౌతుంది. మన దేశంలో పేదరికానికి గల ప్రత్యేక కోణం సామాజిక అణచివేత. అణగారిన సామాజిక వర్గాల వారే అత్యధిక సంఖ్యలో పేదరికం, నిరు పేదరికం అనుభవిస్తున్నారు. వీరిని ఆధునిక ఆర్థిక కార్యకలాపాలకు మళ్లించి, సామాజిక దోపిడీ నుంచి కూడా విముక్తం చేస్తేగాని వారి పేదరికం పోదు. పేదరిక నివారణకు కృషి ప్రణాళికాబద్ధంగా జరగడం లేదు. ఇప్పుడు పేదరికం వ్యవస్థీకృతంగా మారింది. ఫలితంగా విస్తారమైన ప్రకృతి వనరులు, అపారమైన సహజ సంపద ఉన్న భారత్ మానవాభివృద్ధి సూచిలో మాత్రం ఎక్కడో అట్టడుగున మూలుగుతున్నది. స్వాతంత్ర్యానంతరం గత 75 ఏండ్లుగా స్వదేశీ పాలకులే అసమానతలు, వివక్షతను పెంచి పోషిస్తూ దేశం పేదరికాన్ని మూటగట్టుకునేలా అవలంబించిన ఆర్థిక విధానాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. అందుకు ప్రత్యక్ష సాక్షమే ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ఈ (యుఎన్‌డిపి) నివేదిక. యుఎన్‌డిపి 2019-20 నివేదిక ప్రకారం 189 దేశాలలో హెచ్‌డిఐలో భారత్ 129వ స్థానంలో ఉంది. తలసరి ఆదాయంలో 124వ స్థానంలో నిలిచింది.

ఈ నేపథ్యంలో ఆరున్నరేండ్ల ముందు అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం అసమానతలను తగ్గిస్తూ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించుటకు, రెండంకెల వృద్ధిరేటు లక్ష్యంగా అడుగులు వేస్తున్నామనే, ఆకర్షణీయమైన నినాదాల డొల్లతనాన్ని ప్రపంచ ఆకలి సూచి – 2020 బట్టబయలు చేసింది. మీడియాని గుప్పిట్లో పెట్టుకున్న పాలకుల ప్రభుత్వ పథకాల ప్రచారంలోని వాస్తవం ఏమిటో వెల్లడైంది. ప్రభుత్వ విధానాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో ఈ ఆకలి కేకలు సజీవ సాక్ష్యంగా వినిపిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు విధానాలు, నినాదాలతో ప్రభుత్వం ప్రజలను ఈ ఆరున్నర సంవత్సరాలుగా మభ్యపెట్టింది. దీంతో ఈ దేశంలో పేదరికం, ఆకలి సమస్య మరింత తీవ్రమైంది. ఫలితంగా ఆకలి సూచిలో మళ్లీ భారత్ దిగజారి అదమ స్థానంలో నిలిచింది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ రిపోర్ట్

ప్రతి ఏడాది కన్సర్న్ వరల్డ్‌వైడ్, జర్మనీకి చెందిన ఎన్‌జిఓ వెల్త్ హంగర్ లైఫ్‌లు సంయుక్తంగా అంతర్జాతీయ, ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ఆకలి గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు గ్లోబల్ హంగర్ ఇండెక్స్ రిపోర్ట్ తయారు చేస్తారు. 2020కి పై సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌కు 132 దేశాల సమాచారాన్ని సేకరించారు. కానీ సమగ్ర సమాచారం లభించని 25 దేశాల స్కోర్‌ను పరిగణలోకి తీసుకోకుండా 107 దేశాలకు మాత్రమే ర్యాంకులు ఇవ్వడం జరిగింది. దీనిలో భారత దేశం 94వ స్థానంలో ఉండడం దాని భయంకర పరిస్థితికి అద్దం పడుతుంది. దేశం విస్తృతమైన ఆకలితో పోరాడుతోందని, 2020 ఆర్థిక సంవత్సరంలో భారత జనాభాలో 14 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్టు ఈ నివేదిక పేర్కొంది. ఐదేళ్లలోపు చిన్నారుల్లో 37.4 శాతం ఈ లోపంతో బాధపడుతున్నట్టు తెలిపింది. అలాగే చైల్డ్ వెస్టింగ్ రేటు 17.3 శాతంగా ఉన్నట్టు చెప్పింది. ఐదేళ్లలోపు

చొప్పించి ముస్లిం ప్రజల శాతాన్ని తగ్గించి కాశ్మీర్ రూపురేఖలను మార్చడమే మా చర్యల వెనుక ఉద్దేశమని వీరంటున్నారు. ఈ చర్యలు భారత ఉపఖండంలో మరో పాలస్తీనాను సృష్టిస్తాయని అంటున్నారు.

కశ్మీర్ సమస్యకు శాంతియుత పరిష్కారం చర్చల ద్వారా, సంప్రదింపుల ద్వారా, బుజ్జగింపుల ద్వారా, రాజీ బేరసారాల ద్వారా సాధించాలని వీరు చిలక పలుకులు పలుకుతున్నారు. గత 70 ఏళ్ల నుండి ఈ తతంగం నడుస్తున్నదే కదా! మేము ఈ తతంగమంతా ఓ దండగ మారి బూటకమని నిర్ద్వంద్వంగా చెబుతున్నాం.


దాపరికమేమీ లేదు. కాశ్మీర్ కాషాయం కావలసిందే! ఈ క్రమంలో అది మరో పాలస్తీనాగా మారితే మారనూవచ్చు. లేక మరో పేరుతో మరో రూపుతో అఖండ భారత్‌లో సంపూర్ణ అంతర్భాగమై విలసిల్లనూ వచ్చు. ఇది మా హిందూ ప్రమాణం, ప్రయాణం.

దీన్ని కాదనే వాళ్లు, ఇది కుదరదనే వాళ్లు, దీన్నడ్డుకుని, ఎదుర్కోవాలనుకునే వాళ్లు ఆలోచించుకోవాలి ఏమి చెయ్యాలో, ఏమి సాధించాలో, ఎలా సాధించాలో, మార్గమేమిటో...

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

శిశు మరణాల రేటు 3.7 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. భారత్ కన్నా సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన దేశాలు కూడా ఈ ర్యాకింగ్స్‌లో మెరుగైన స్థానంలో నిలిచాయి. పొరుగునున్న బంగ్లాదేశ్ (75), పాకిస్తాన్ (88) శ్రీలంక కన్నా ఆకలి సూచిలో అట్టడుగు స్థానానికి దిగజారడం అత్యంత ప్రమాదకరమే కాదు విషాదకరం కూడా. ఇక దక్షిణ, తూర్పు, ఆగ్నేయాసియాలో తైమూర్ లెస్టే, ఆఫ్ఘనిస్థాన్, ఉత్తర కొరియా, రువాండా, నైజీరియా, లైబీరియా, మొజాంబిక్, ఛాడ్ లాంటి 13 దేశాలు మాత్రమే మన దేశం కన్నా దిగువ స్థాయిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని 2022 నాటికి ఆవిష్కరిస్తానని చెప్పిన 'దారిద్ర్య రహిత భారతం' సాధ్యమవుతుందా తిరిగి సమీక్షించుకోవాల్సిన తక్షణ అవసరముంది.

భారతదేశంలో విలువల సూచికల ధోరణి



శాస్త్రీయంగా, గణితాత్మకంగా రూపొందించిన ఆకలి సూచి

ప్రఖ్యాత ఆర్థిక విశ్లేషకులు ప్రపంచవ్యాప్తంగా ఈ ఆకలి సూచిని శాస్త్రీయంగా, హేతుబద్ధంగా, అంచనా వేయడానికి మరిన్ని కోణాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నప్పటికీ ప్రపంచ వ్యాప్త వర్తమాన ఆర్థిక స్థితిగతులు, అవలంబిస్తున్న ఆర్థిక విధానాల నేపథ్యంలో ఈ సంస్థలు చలన స్థితిలో ఉన్న కారకాలు, ఆహార సరఫరా కొరత, శిశుమరణాలు, బాలల్లో పోషకాహార లోపం లాంటి ప్రధానమైన మూడు కోణాలను పరిగణనలోకి తీసుకున్నాయి. వీటి ఆధారంగా ఐదు సంవత్సరాల వయసుకు తక్కువగా ఉన్న బాలలలో ఎత్తుకు తగినంత బరువు లేకపోవడం (వేస్టింగ్), వయసుకు తగినంత ఎత్తు లేకపోవడం (స్టంటింగ్), మరణాల రేటు, అవసరమైనన్ని క్యాలరీల ఆహారం తీసుకోలేకపోవడం లాంటి నాలుగు సూచిలను రూపొందించింది. ఈ సూచిల ఆధారంగా గణిత పద్ధతులను ఉపయోగించుకొని గుణాత్మక మిశ్రమాన్ని కొలబద్ధగా తీసుకొని వచ్చిన దత్తాంశం ఆదరంగా సున్నా (0) నుండి 100 పాయింట్లు కేటాయిస్తారు. ఈపాయింట్ల ఆధారంగా దత్తాంశం సేకరించిన మొత్తం దేశాలను ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 0 నుండి 9.99 శాతం వరకు పాయింట్లు వచ్చిన వారిని తక్కువ స్థాయి ఆకలి ఉన్న దేశాలు గానూ, 10 నుండి 19.9 వరకు పాయింట్లు వచ్చిన దేశాలను మధ్య స్థాయి ఆకలి ఉన్న దేశాలుగానూ, 20 నుండి 34.9 పాయింట్లు వచ్చిన దేశాలను తీవ్ర స్థాయి ఆహార కొరత ఉన్న దేశాలుగానూ, 35 నుండి 49.9 పాయింట్లు వచ్చిన దేశాలను అత్యంత తీవ్రమైన ఆహార కొరత ఉన్న దేశాలుగానూ, 50కి పైగా పాయింట్లు వచ్చిన దేశాలను భయానకమైన ఆహార కొరత ఉన్న దేశాలుగానూ వర్గీకరించారు. సున్నా వస్తే ఆ దేశంలో ఆకలి బాధ లేనట్లుగా, 100 వస్తే ఆ దేశంలో ఆకలి బాధ తీవ్రంగా ఉందని పరిగణిస్తారు. తాజా ఆకలి సూచిలో 27. 2 స్కోరుతో ఇండియా సీరియస్ కేటగిరీ జాబితాలోకి చేరింది. భారత్ 2000లో 38.9, 2006లో 37.5, 2012లో 29.3 స్కోరును కలిగి ఉంది. తాజాగా, స్కోరులో కాస్త మెరుగుపడినప్పటికీ పొరుగు దేశాలు మనకంటే ముందుకు దూసుకెళ్లాయి. గతేడాది 117 దేశాల జాబితాలో భారత్ 102వ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 47 దేశాలకు 0 నుండి 9.99 పాయింట్లు వచ్చాయి. వాటిలో చైనా నాలుగవ స్థానంలో, క్యూబా ఏడవ స్థానంలో ఉన్నాయి. ఈ రెండు కాకుండా ఆకలి సమస్య తక్కువగా ఉన్న మొదటి 47 దేశాల్లో 21 దేశాలు గతంలో సోషలిస్టు దేశాలు కావడం ఆసక్తికరమైన విషయం.

ఈ ప్రామాణిక అంశాలలో భారతదేశం అత్యంత తీవ్రమైన దుస్థితిలో ఉన్నది. మొత్తం మార్కులలో మూడవ వంతుకు ప్రాతినిధ్యం వహించే ఎత్తుకు తగినంత బరువు లేకపోవడం, వయసుకు తగినంత ఎత్తు లేని బాలలలో మన దేశం ప్రపంచంలోనే దిగువ స్థానంలో ఉన్నది. 2000 సంవత్సరంలో వయసుకు తగిన ఎత్తు లేని బాలలు 54 శాతం ఉండగా 2010-14 మధ్య ఎత్తుకు తగిన బరువు లేని బాలలు 15.1 శాతం ఉండగా, 2015-19 మధ్య మన దేశ పరిస్థితి మరింత దిగజారింది. మరోవైపున వయసుకు తగిన బరువు లేని పిల్లల విషయంలో గత రెండు దశాబ్దాలలో ఏమాత్రం మెరుగుపడలేదు. బాలల మరణాల శాతం, అవసరమైనంత ఆహారం తీసుకోలేని వారి శాతంలో తగ్గుదల ఉన్నప్పటికీ ఆ అంశాలలో కూడా దిగువ స్థాయిలోనే ఉంది. ప్రపంచం మొత్తంలో వీరి సంఖ్య 69 కోట్లు. అంటే తగినన్ని క్యాలరీల ఆహారం తీసుకోలేని వారిలో ఎక్కువ మంది మన దేశం లోనే ఉండటం గమనార్హం.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆకలిని తీరుస్తుందా

నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, కార్పొరేట్, బహుళజాతి సంస్థల అనుకూల విధానాలను అనుసరిస్తూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మన ర్యాంకు దూసుకు పోతున్నదని గొప్పలు చెప్పుకుంటూ మీనమేషాలు లెక్కిస్తుంది. దేశాభివృద్ధిని గురించి, పదేపదే వల్లెవేస్తూ, ఫలితం ఇవ్వని మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ లాంటి తదితర పథకాల గురించి గొప్పగా ప్రచారం చేస్తు దేశభక్తిని గురించి తమకు మాత్రమే పేటెంట్ ఉన్నట్లు, తమ వ్యతిరేకులంతా దేశ ద్రోహు లైనట్లు ప్రచారం చేసుకుంటూ ప్రపంచ బ్యాంకు ర్యాంకుల కోసం ప్రజలను పస్తుల పాలు జేస్తుంది.

ఈ దేశ ప్రజల ఆహార భద్రతకు ఉపయోగపడని ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులు కేటాయించేది ప్రపంచబ్యాంకు. భారతీయుల రక్తాన్ని, స్వేదాన్ని పీల్చుటకు ప్రపంచ బ్యాంకు మనకు అనేక షరతులతో రుణాలనిస్తుంది. రుణాలు తీసుకోవడం, అందుకోసం వారు పెట్టిన షరతులను తు.చ. తప్పకుండా అమలు జరపడం, వడ్డీలు, అసలు

సకాలంలో చెల్లించడం మినహా వాటి విధాన నిర్ణయాలలో మనకేమీ పాత్ర ఉండదు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు వాటి విధానాలను నిర్ణయిస్తాయి. అమెరికా నుండి ప్రపంచ బ్యాంకుకు అధ్యక్షుడిని ఎన్నుకుంటే, ఇ.యు దేశాల నుండి ఐఎంఎఫ్‌కు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఇటువంటి అమెరికా పెత్తనంలో ఉన్న ప్రపంచబ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులలో పైస్థాయికి చేరడానికి మన ప్రజలను ఆకలితో మాడ్చి చంపే విధానాలను అనుసరిస్తూ విదేశాలకు సంపదను దోచిపెడుతూ 2014లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 134వ స్థానంలో ఉన్న మన దేశం మరింత ముందుకు సాగి 2020లో 63వ ర్యాంకుకు చేరింది. అంటే దోపిడీ రేటు ఎంత వేగంగా ముందుకు సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక అవినీతి సూచిలో భారత్ దేదీప్యమానంగా వెలుగుతూ ఈ సంవత్సరానికి 194 దేశాల్లో 77 స్థానాన్ని దక్కించుకుంది.

కేంద్రీకృతమైన దేశ సంపద

ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక విశ్లేషకులు జోసఫ్ స్టిగ్లిట్, అంగస్ డిటెన్, థామస్ పికెట్టీ, లూకాస్ ఛాన్సెల్, అమర్త్యసేన్, అభిజిత్ బెనర్జీలు పేదరికాన్ని, ఆకలిని బహుముఖంగా అధ్యయనం చేసి పేదరికం తీవ్రతను, పాలకుల వైఫల్యాలను వెలుగులోకి తెచ్చారు. ప్రభుత్వాధినేతలు, వారి ఆశ్రితులు, ప్రపంచ కుబేరులు సంపదను ఎలా పెంచుకున్నారో కళ్లుతిరిగే సత్యాలను గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ వందేళ్లలో అంతరాలు ఏవిధంగా పెరిగాయో స్పష్టీకరించారు.

దేశ ప్రజలకు కనీస ఆహార, ఆరోగ్య భద్రతకు హామీ ఇచ్చే, సంక్షేమ రంగం దారుణంగా నీరసించి పోవడంతో ఆకలి ఆర్తనాదాలు మిన్నంటినాయి. కాగా భారత దేశంలో దశాబ్దాలుగా ఇటీవల వ్యవస్థీకృతంగా ఉన్న ఆకలి గురించి, పేద-ధనిక అంతరాల గురించి బయట హఠాత్తుగా ఇంత చర్చ జరగడానికి ప్రధానంగా ఇక్కడ రెండు కారణాలు కనపడుతున్నాయి. మొదటిది ప్రపంచీకరణ నేపథ్యంలో నయా ఉదారవాద, స్వేచ్ఛా వాణిజ్యీకరణ, సరళీకరణ పేరుతో పెరిగిన రాజకీయ అవినీతి మూలంగా పేద, ధనిక అంతరాలు తీవ్రంగా పెరిగాయి ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా ప్రపంచ జనాభాలో 60 శాతం (460 కోట్లు)వద్ద నున్న సంపదకు సమానంగా కేవలం 2153 మంది శత కోటీశ్వరుల దగ్గర పోగుబడిందంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత దారుణంగా శ్రమ జీవుల సంపదను కొల్లగొడుతున్నదో విదితమౌతుంది. దీనిపై ప్రతి సంవత్సరం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే కార్పొరేట్లు, వారి రాజకీయ సేవకుల జాతరలో గత కొన్ని సంవత్సరాలుగా ఇదొక చర్చనీయాంశం. కాగా పెరిగే అంతరాల సునామీ తమ సామ్రాజ్య పునాదులెక్కడ పెకలించి వేస్తుందోననే భయం కార్పొరేట్ల గుండెల్లో గుబులు రేపుతోంది. ఇక రెండవది 2020 సంవత్సరం అత్యున్నత నోబెల్ శాంతి పురస్కారం ప్రపంచంలోని అతి పెద్ద సేవా సంస్థ, ఐక్యరాజ్య సమితికి సంబంధించిన వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూ.ఎఫ్.పి)కి దక్కడం. 2019లో 88 దేశాల్లో 42 లక్షల టన్నుల ఆహార పదార్థాలను అందించి పదికోట్ల మందికి పైగా అన్నార్తిని తీర్చిన సంస్థ ఇది. ఈ రెండు బలమైన కారణాలు ఆకలి సూచిలో ప్రతిబింబించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రపంచంలోని అన్ని దేశాల కంటే కూడా భారతదేశంలో అంతరాలు భారీగా పెరుగుతున్నాయనీ ధృవీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక విశ్లేషకులు పేదరిక నిర్మూలనకు దశాబ్దాలుగా నిరంతర శోధన, కఠోర శ్రమ, అవిశ్రాంత కృషితో, వినూత్న ప్రయోగాల ద్వారా పేదరికాన్ని పారదోలడానికి సత్యశీలతతో కూడిన అనేక సిద్ధాంతాలను ప్రపంచం ముందు పెట్టినారు. ప్రపంచ వ్యాపిత ఆకలి నిర్మూలనకు జరిగే పోరాటంలో పరిశోధనలతో పాటు విధాన నిర్ణేతలు కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు పొందగలమనేది చారిత్రిక సత్యం. అయితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత ఆరున్నర సంవత్సరాల నుండి ఆకలి సూచిలో దేశం దిగజారుతుంది. దీనికి ప్రధానమైన కారణం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అస్పష్టమైన, బూటకపు హామీలు కుమ్మరిస్తూ ప్రభుత్వాలను ఏర్పాటుచేయడం ఒకటి. అనంతరం పాలకుల నిరంకుశత్వంతో పరిపాలన, విధానాల మీద హేతుబద్ధంగా మాట్లాడితే చేతులకు సంకెళ్లు వేసి జైల్లో బంధించడం రెండవది. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతులకు ఉరితాళ్లు బిగిస్తున్నారు. పత్రికలూ, ప్రసార మాధ్యమాలూ అధికారానికి కరపత్రాలుగా మారిపోతున్న ఆనవాళ్లు. మానవహక్కుల చుట్టూ మోహరించిన ఇనుప కంచెలు ఇవే.

ఇప్పుడు వినిపిస్తున్న శబ్దాలూ, కనిపిస్తున్న దృశ్యాలూ. ఇవి సరిగ్గా 45 ఏండ్ల కిందటి చీకటి చరిత్రను పునరావృతం చేయనున్నాయా, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదపుటంచులకు చేర్చనున్నాయా. ఇప్పుడు దేశమంత ఇవే అనుమానాలూ, ఆందోళనలూ ఆవహించినాయని స్వీడన్‌కు చెందిన వీ-డెమ్ ఇన్‌స్టిట్యూట్ హెచ్చరిస్తోంది. ఈ ఏడాది డెమోక్రసీ రిపోర్టు ప్రమాదంలో ఉన్న భారత ప్రజాస్వామ్యాన్ని ఎత్తి చూపుతోంది. ఇటీవల వరుసగా వెలువడుతున్న ప్రపంచ సూచి (గ్లోబల్ ఇండెక్స్)లన్నిటిలో తిరోగమనాన్నే ప్రదర్శిస్తోన్న భారత్ ప్రజాస్వామ్య సూచిలోనూ దిగజారిన వైనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన హెచ్చరిక కానుంది. ఇప్పటికే దేశం ప్రజాస్వామ్య హోదాను దాదాపు కోల్పోయిందనీ, ఇందుకు దేశంలో పౌర సమాజం, ప్రతిపక్షం, మీడియాల స్థానం దారుణంగా కుంచించుకు పోవడమే కారణమనీ ఈ నివేదిక పేర్కొనడం గమనార్హం. ఇది ప్రజాస్వామ్య దేశానికి గొడ్డలి పెట్టు లాంటిది.

మిలీనియం సామాజికాభివృద్ధి లక్ష్యం

2030 నాటికీ భూగోళం నుండి ఆకలిని రూపుమాపడం మిలీనియం సామాజికాభివృద్ధి లక్ష్యాల్లో ప్రధానమైంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే 37 దేశాలు ఆహార కొరతను తక్కువ స్థాయిలోకి తగ్గించడంలో కూడా వెనుకబడతాయని చెప్పింది. ప్రస్తుతం ప్రపంచ దేశాలను చుట్టుముట్టిన కోవిడ్-19 మహమ్మారి ఫలితంగా ఏర్పడే పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఈ అంచనాను రూపొందించారు. దానిని కూడా పరిగణన లోకి తీసుకొంటే పరిస్థితి మరింత భయానకంగా ఉంటుంది. భారత దేశం ఇప్పటికే ఆరున్నర సంవత్సరాలను కోల్పోయింది. ప్రస్తుతం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి, ఆహార భద్రత మధ్య ఏర్పడిన కనెక్షన్లు దీనికి విరుద్ధంగా జిడిపి సంకోచంతో పాటు ఆహార అభద్రతతో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక మాంద్యం ఫలితంగా 80 మిలియన్ల మంది అదనంగా పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోవిడ్-19 ప్రతికూల ప్రభావాన్ని నియంత్రించడానికి చేపట్టిన లాక్‌డౌన్, ఇతర చర్యలు మన

ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయి. లక్షలాది మంది జీవనోపాధిని కోల్పోవడం వలన పేదరికపు గీతకు దిగువకు నెట్టబడ్డారు. ఇది ఆకలి సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ప్రతికూల పరిస్థితిలో సామాజికాభివృద్ధి లక్ష్యానికి ఇక మిగిలింది 10 సంవత్సరాలు మాత్రమే. ఈ క్రమంలో ప్రజారోగ్యాన్ని, సుస్థిర ఆహార వ్యవస్థను సంధానించడం ద్వారానే సస్టైనబుల్ లక్ష్యం సాధ్యం. ఇప్పటికే నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో ప్రభుత్వాలు ప్రైవేటీకరణ మోజులో పడడంతో నేడు ప్రభుత్వ విద్య, వైద్యం అటకెక్కింది. దీనివల్ల తీవ్రంగా నష్టపోయింది పేదలే. అర్థాకలితో జీవించేవారికి జబ్బులెక్కువ కావున పేదలే వైద్యం పై అధికంగా ఖర్చుపెడుచున్నారు. అందువల్ల విద్య, వైద్యం పై ప్రభుత్వ వ్యయం భారీగా పెంచాలి. అప్పుడే మిలీనియం సామాజికాభివృద్ధికి అడుగులు వేసినట్లవుతుంది. లేదంటే 2030 నాటికి జీరో హంగర్ సాధించాలనే లక్ష్యం పగటికలే అవుతుంది.

భారత్‌లో ఆకలి కేకలకు ముగింపు

నిర్దేశించుకున్న సామాజికాభివృద్ధి లక్ష్యం పట్ల నిర్లక్ష్యపూరిత వైఖరితో ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ సక్రమంగా కొనసాగడం లేదు. అధికారంతో అందినంత దోచుకోవడమే ప్రధాన ఎజెండాగా రంగ ప్రవేశం చేస్తున్న రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యం ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధి ముసుగులో ఈ వ్యవస్థను తమ స్వార్థానికి వాడుకుంటున్నాయి. ఈ రాజకీయ పార్టీలు పేదరికం పై పోరాటంలో నినాదాలకె పరిమితమౌతున్నాయి. ఎన్నికల్లో ఓట్లకు ఈ నినాదాలను గాలంగా ఉపయోగించినంత చిత్తశుద్ధి పథకాల అమలులో ప్రదర్శించడం లేదు. పేరుకు పేదరిక నిర్మూలనకు ఎన్నో పథకాలు ప్రకటించినప్పటికీ, కొన్నింటికి అరకొరగా నిధుల కేటాయించడం, మరి కొన్ని పథకాలకు నామమాత్రంగా నైనా కేటాయించడం లేదు. ఈ ప్రపంచ ఆకలి సూచిని హెచ్చరికగా తీసుకొని, మిగిలి ఉన్న దశాబ్దకాలంలో మిలీనియం లక్ష్యాల సాధన దిశగా పరుగులు తీయాలంటే కావలిసింది మభ్యపెట్టె నినాదాలు కాదు. చిత్తశుద్ధితో ఆచరణాత్మక కార్యాచరణతో ప్రజాపంపిణీ విధానాన్ని మెరుగు పరచి వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్ పథకాన్ని తక్షణమే ప్రారంభించి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) దుకాణాలలో పాయింట్-ఆఫ్-సేల్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చి పేద ప్రజలకు, ముఖ్యంగా వలస కార్మికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. మన దేశంలో ఆకలి-2020 నివేదిక విడుదల సమయంలో, దేశంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వివిధ గిడ్డంగులలో 70 మిలియన్ టన్నులకు పైగా ఆహార నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వానికి దార్శనికత కనుక ఉండి ఉంటే ఎవరూ ఆకలితో పస్తులుండే పనిలేదు.

ఈ దేశంలో అత్యంత దుర్భర దారిద్ర్యంతో బాధపడుతున్న వర్గాలకు ఆహార భద్రత ఉండేలా 'జాతీయ ఆహార భద్రతా చట్టం 2013' నేడు అమలులో ఉన్నదన్న విషయం ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరం. ఈ చట్ట ప్రకారం నిత్యావసరాలు అత్యవసరమైతే, ఉచితంగా లేదంటే సరసమైన ధరలకు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ, పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన కార్యక్రమాలు, పిల్లలు, గర్భిణీ తల్లులకు అంగన్వాడీల వద్ద పోషకాహారం, ప్రసూతి ప్రయోజన కార్యక్రమాలు ఈ చట్ట పరిధిలోకి వస్తాయి. ఆకలితో అలమటించే దేశంలో పేదల ఆకలి కేకలకు ముగింపు పలకాలంటే ప్రధానంగా అధికమందిలో పౌష్టికాహార లోపాలు అరికట్టడానికి ప్రణాళికాబద్ధంగా కృషి జరగాలి. సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం, రక్షిత మంచినీరు, విద్య, విద్యుత్తు సౌకర్యం, రోజ్‌గార్ యోజనలు, గ్రామీణ పేదలకు గృహ నిర్మాణం, గ్రామీణ ఉపాధి హామీ, ఓల్డ్ ఏజ్ పెన్షన్ పథకాలు వంటి ప్రయోజనాలు చేకూరడానికి ప్రభుత్వాల కృషి, తోడ్పాటు, తగినంతగా ఉండాలి. అధికంగా మారుమూల గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో పేదరికం రాశిపోసినట్టుగా ఒక తరం నుంచి మరో తరానికి నిరవధికంగా వ్యాపిస్తున్నది. దీనిని చేదించి నిర్మూలించాలి.

పేద గర్భిణీ మహిళలకు మెరుగైన పోషణ, పౌష్టికాహారం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా ఎనీమియా నిర్మూలనకు కృషిచేయాలి. వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలి. పేద ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్న పొగాకు ఉత్పత్తుల సేవనం తగ్గింపు పై మరింత శ్రద్ధ పెట్టవలిసిన అవసరముంది. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు సవాలుగా మారకుండా చూడాలి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పేదరికాన్ని వేగంగా నిర్మూలిస్తున్నామని చేసే ప్రకటనలకు అభివృద్ధి ఫలాలు అందుకోవడం మధ్యగల అంతరాన్ని గుర్తించాలి. ప్రభుత్వాలు సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 15 పైసలు మాత్రమే లక్షిత లబ్ధిదారులకు చేరుతున్నాయని, మిగతా 85 పైసలు అవినీతిపరుల కైంకర్యం అవుతున్నాయని 1985లో స్వయంగా అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఒడిశాలోని కలహండి కరువు పీడిత ప్రాంత పర్యటనలో చెప్పనమాటలు నేటికీ నిజమౌతుండడం విచారకరం. అవినీతిని సమూలంగా తొలగించగలిగే చిత్తశుద్ధి పాలకులకు ఉంటె వారు ప్రవేశపెట్టే పథకాలు, ప్రణాళికల వల్ల దేశంలోని పేదరికం పూర్తిగా అదృశ్యమౌతుంది. దశాబ్దాల తరబడి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా దారిద్ర్యం, పేదరికం ఇంకా భారీ స్థాయిలో కొనసాగుతుండటం ఆలోచించవలసిన అత్యంత విషాదకరమైన విషయం.

ఇప్పటికైనా ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి రాబోయే కాలంలో ఆరోగ్య, పర్యావరణ, ఆర్థిక, ఆహార భద్రతా లాంటి బహుళ సంక్షోభాలను అధిగమించే సామర్థ్యాన్ని పెంచుకునే ప్రణాళికలు రచించుకోవాలి. ఆత్మనిర్భర భారత్ పేరుతో దేశాన్ని అభివృద్ధి పదం వైపు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా సాగుతున్నామని ప్రగల్బాలు పలికే పాలక పక్షం క్షేత్ర స్థాయి అనుభవాలను పరిగణలోకి తీసుకుంటూ పేదరిక నిర్మూలనకు ప్రణాళిక బద్ధమైన బలమైన పునాదిని నిర్మించుకోవాలి. ప్రభుత్వాలు దేశ ప్రజలను ఆకలితో మాడ్చి చంపే విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు దోచిపెట్టే పాలకుల వైఖరికి స్వస్తి పలకనంత వరకు ఈ ఆకలి సమస్య దేశాన్ని వెంటాడుతూనే ఉంటుందని గుర్తించాలి. దేశ బహుళ ఉత్పత్తికి ఆధారమైన మెజారిటీ ప్రజల పొట్ట నింపకుండా పిడికెడు మంది కార్పొరేట్ల ఖజానాలు నింపే దోపిడీ విధానాలను నిలదీసే ఉద్యమాలు ఉవ్వెత్తున రావాల్సిన అనివార్యతను ఈ ఆకలి సూచి గుర్తుచేస్తూ ప్రభుత్వాలను హెచ్చరిస్తుంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

అమెరికా సైనిక కూటమిలో భారత్ చేరవద్దు

ఇరుగు పొరుగు దేశాల మధ్య చిచ్చు పెడుతూ అమెరికా తన ఆయుధ వ్యాపారాన్ని పెంచుకుంటోందనీ, దాని సైనిక కూటమిలో చేరితే భారతదేశం అభివృద్ధి మరింత దిగజారిపోతుందనీ అంటున్నారు **డా. కొల్లా రాజమోహన్**

"సామాజిక అభ్యున్నతి కార్యక్రమాల కంటే సైనిక రక్షణ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయడానికి కొనసాగిస్తున్న దేశం ఆధ్యాత్మిక మరణానికి చేరుకుంటుంది"

– మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్.

ఈ నవంబర్ 6న చుషుల్‌లో జరిగిన 8వ విడత కోర్ కమాండర్ స్థాయి చర్చలలో, సరిహద్దులోని ఉద్రిక్తతలను తొలగించి, సైనిక ప్రతిష్టంభనకు తెరదించేందుకు భారత–చైనా దేశాలు ఒక అంగీకారానికి వచ్చే అవకాశాలున్నాయని వార్తలు వచ్చాయి. ఇది ఆహ్వానించదగిన పరిణామం. చర్చల వలన అంగీకారం కుదిరితే, వాస్తవాధీన రేఖ వద్ద మోహరించిన సైనిక, ఆయుధ వ్యవస్థలను ఇరుదేశాలు ఉపసంహరించుకోవలసి ఉంటుంది. మూడు దశలలో సైనికుల ఉపసంహరణ, యుద్ధ ట్యాంకులు, వాహనాలను, శతఘ్నులను తరలించాలని, ఇరువైపులా మే నెలకు పూర్వమున్న పరిస్థితులను పునరుద్ధరించాలనే ప్రతిపాదనను ఇరువురూ ఆమోదించినట్లుగా తెలుస్తున్నది. త్వరలో జరిగే 9వ విడత చర్చలలో ఒప్పందం కుదురుతుందని ఆశిద్దాం. ఆరు నెలలుగా భారత–చైనా సరిహద్దులలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని చల్లబరిచే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా పత్రికలు రాస్తున్నాయి.

మరొక పక్క రెండో దఫా మలబార్ సైనిక విన్యాసాలు నవంబర్ 17 నుండి జరుగుతున్నాయి. అమెరికా నాయకత్వాన జరుగుతున్న ఈ సైనిక విన్యాసాలలో భారతదేశం భాగమైంది. జపాన్, ఆస్ట్రేలియాలు కూడా పాల్గొంటున్నాయి. జపాన్ కొన్ని దీవుల విషయంలో చైనాతో వివాద పడుతోంది. అయితే వాటి కోసం యుద్ధానికి దిగేస్థితి లేదు. మరోవైపు అమెరికా ప్రభావం నుంచి బయటపడి స్వతంత్ర శక్తిగా ఎదిగేందుకు, మిలిటరీ శక్తిగా మారాలని చూస్తోంది. ఆస్ట్రేలియా విషయానికి వస్తే అమెరికా అనుంగు దేశంగా మలబార్ సైనిక విన్యాసాలలో పాల్గొంటున్నది.

చైనాను చుట్టుముట్టాలి

మాన్యుఫాక్చరింగ్ రంగంలో చైనా కొత్త దారులను తొక్కి అమెరికాతో సహా ప్రపంచ ప్రజలందరికీ కావలసిన వినియోగ వస్తువులను, ఎలక్ట్రానిక్ సామానులను తయారుచేసి తక్కువ ధరలకు అందిస్తున్నది. ఈ పోటీకి నిలవలేక కస్టమ్స్ డ్యూటీ పెంచడంలో పోటీలుపడ్డాయి. చైనా తన మార్కెట్‌ను, ఆధిక్యతను స్థిరపరచుకుని, పెంచుకుని ఆర్థిక శక్తిగా ఎదిగే ప్రయత్నంలో ఉంది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా రవాణా సౌకర్యాలను అభివృధి చేసి ఆఫ్రికా, యూరప్‌లతో తన వాణిజ్య వ్యాపారాలలో పైచేయి సాధించడానికి అమెరికాతో పోటీపడుతోంది. అందుకు అవసరమైన ధనాన్ని ధారాళంగా వెచ్చిస్తున్నది. చైనా ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా ఎదగడాన్ని అమెరికా సహించలేకపోతున్నది. చైనాను ప్రత్యర్థి ఆర్థిక శక్తిగానే కాక సైద్ధాంతిక శత్రువుగా కూడా అమెరికా పరిగణిస్తున్నది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఆధిక్యత సంపాదించి చైనాను చుట్టుముట్టడించి సైనికంగా దిగ్బంధించాలని అమెరికా ప్రయత్నం చేస్తున్నది. అందుకు మన సహాయం కోసం తీవ్ర ప్రయత్నం చేస్తుంది. క్రమేపీ సైనిక కూటమిలో చేర్చుకోవటానికి కుట్ర పన్నుతోంది. సైనిక విన్యాసాలని, వాతావరణ, ప్రదేశిక సమాచారాన్ని పంచుకునే "బెకా" అని రకరకాల ఒప్పందాలలో ఇరికించే ప్రయత్నాలలో ఉంది.

అమెరికా దేశంతో మన సంబంధాలు ఎపుడూ లేనంత బాగున్నాయి. 1947 నుండి ఇప్పటివరకూ అమెరికాతో మైత్రీ ఇంతలా లేదు. అమెరికా విదేశాంగ శాఖామంత్రి మైక్ పాంపియోతో పాటుగా రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్ 2×2 చర్చలు జరిపారు. మనదేశం తరపున భారతదేశ రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, విదేశాంగ మంత్రి జయశంకర్ పాల్గొన్నారు. మిలిటరీ రంగంలో అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కో– ఆపరేషన్ అగ్రిమెంట్ 'బెకా'ను కుదుర్చుకున్నారు.

1998లో భారతదేశం అణుపరీక్షలు నిర్వహించడం, అమెరికాకు కోపం తెప్పించింది, అమెరికా భారతదేశంపై తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను విధించింది. ఆనాటి విదేశాంగ శాఖా మంత్రి శ్రీ జైపాల్ సింగ్, అమెరికా విదేశాంగ మంత్రి టాల్బోట్‌తో రెండు సంవత్సరాల కాలంలో 18 సార్లు చర్చలు సాగించారు. అనేక సంవత్సరాల చర్చలు, సర్దుబాట్లు, ఒప్పందాలు, లొంగుబాట్ల వలన 2005లో ఆంక్షలను క్రమంగా సడలించారు. పది సంవత్సరాల రక్షణ వ్యవహార సంబంధాల వ్యూహానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను భారత–అమెరికాలు ఏర్పరచుకొని 2013లో రక్షణ వ్యవహారాల సహకారంపై సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. 2015లో రక్షణ వ్యవహారాల వ్యూహ ఫ్రేమ్‌వర్క్‌ను మరో పదేళ్లు పొడిగించారు.

ఈ వ్యూహ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగానే భారత –అమెరికా మిలిటరీల సంయుక్త విన్యాసాలతో పాటుగా, విపత్తు ఉపశమనం, మానవతా సహాయం, సాంకేతిక బదిలీ, ఇంటెలిజెన్స్ ఎక్స్ఛేంజ్ ఉమ్మడి శిక్షణలన్నీ ఉన్నాయి. ప్రారంభంలో వ్యూహ కదలికలు నెమ్మదిగా ఉన్నాయి. భారతదేశం–అమెరికా పౌర అణు ఒప్పందంతో 2008లో అణు అడ్డంకిని అధిగమించిన తరువాత అది ఊపందుకుంది.

2000లో 20 బిలియన్ డాలర్లున్న భారత– అమెరికాల వాణిజ్యం 2018 నాటికి 140 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2005 వరకు రక్షణ పరికరాలు 400 మిలియన్ డాలర్ల నుండి 18 బిలియన్ డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

1991లో బుష్– పి.వి. నరసింహరావు అధికారంలో ఉండగానే అమెరికాకు దగ్గరకావడం మొదలయ్యింది. అణు పరీక్షల తరువాత

అమెరికా అధ్యక్షుడి జిమ్మీ కార్టర్ 1978లో భారతదేశంలో పర్యటించాడు. ఆ తర్వాత 22 సంవత్సరాలకు ప్రధానమంత్రి వాజ్‌పాయ్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ని ఘనంగా ఆహ్వానించారు. రిపబ్లికన్ అధ్యక్షుడు బుష్‌తో మన్మోహన్ సింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం స్నేహ సంబంధాలను పెంచుకుంటూ పోయింది. 2008లో అణు ఒప్పందంతో ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది. ప్రజాస్వామ్య దేశాల స్థాయి నుండి సహజ మిత్రుల స్థాయికి చేరింది.

సోవియట్ పతనంతో అంతరిస్తున్న అలీన విధానం

అలీన విధానం భారతదేశ విదేశాంగ విధానంగా భారత ప్రభుత్వం 1947 నుండి 1991 వరకు కొనసాగించింది. నెహ్రూ అలీన దేశాల నాయకునిగా కొనసాగాడు. ఆసియా, ఆఫ్రికా దేశాల విముక్తి పోరాటాలకు అలీన ఉద్యమం సహాయాన్నందించింది. పంచవర్ష ప్రణాళికలకు సోవియట్ సహాయం అందించింది. భారీ పరిశ్రమలైన ఉక్కు ఫ్యాక్టరీలకు, భారత మందుల పరిశ్రమలకు నిస్వార్థంగా సహాయాన్నందించింది. 1971లో ఇందిరా గాంధీ అలీన దేశాల సిద్ధాంతాన్ని పక్కనపెట్టి సోవియట్ రష్యాతో శాంతి, స్నేహం, సహకార ఒప్పందం చేసుకుని సోవియట్ రష్యాకు దగ్గరయింది. అలీన ఉద్యమం బలహీనపడడం, అలీనోద్యమ నాయకులైన నెహ్రూ, నాజర్, టిటో, కాస్ట్రో, సిరిమావోలు అంతరించడం అమెరికా అనుకూల భావజాలానికి అడ్డు తొలగింది. అలీనోద్యమానికి సహకారాన్నందించిన సోవియట్ రష్యాను విచ్ఛిన్నం చేయడంలో అమెరికా సఫలమయ్యింది. సాంకేతికంగా ఆధునిక టెక్నాలజీని సొంతం చేసుకున్న అమెరికా సైనిక బలంలోనూ తన ఆధిపత్యాన్ని నిరూపిస్తూ ఏకధ్రువ ప్రపంచానికి నాయకత్వం వహించింది. కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. అయితే, ఆర్థిక సంక్షోభాలను నివారించలేకపోయింది. అమెరికా దేశం అప్పులలో మునుగుతూంది. 906 బిలియన్ డాలర్ల అమెరికన్ ట్రెజరీ సెక్యూరిటీలు చైనా చేతిలో ఉన్నాయి. జపాన్ 877, ఆయిల్ ఎగుమతిదారులు 213 బిలియన్ డాలర్ల ట్రెజరీ సెక్యూరిటీలను సొంతం చేసుకున్నారు. అయినా డాలర్లను సొంతంగా సృష్టించుకునే అవకాశం ఉండడం వలన తాత్కాలికంగా తట్టుకుని నిలబడుతున్నది. నిజ వేతనాలు క్రమేపీ తగ్గిపోతున్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంది. వైద్యరంగంలో వైఫల్యాల వలన లక్షలాది మంది మరణిస్తున్నారు. జాతి వర్ణ వివక్షలు, ఘర్షణలు పెరుగుతున్నాయి.

సోషలిజం, కమ్యూనిజం చర్చలోకి వచ్చింది

అమెరికాలో నిరుద్యోగం, అసమానతలు పెరిగిపోవడంతో సోషలిజం, కమ్యూనిజం సోషల్ డెమోక్రసీ చర్చలోకి వచ్చింది. ఆర్థిక సంక్షోభాల సుడిగుండాల నుండి బయటపడటానికి మార్కెట్ల కోసం వెతుకులాటలో ఉంది. అమెరికా విదేశాంగ విధానం ముఖ్యంగా మిలిటరీ రీత్యా ఘోరంగా విఫలమయింది. వియత్నాం యుద్ధం తరువాత సైన్యంలో చేరే పౌరులు కరువయ్యారు. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో ఎదురైన పరాజయంతో ప్రత్యక్ష యుద్ధానికి వెనుకాడుతుంది. టెక్నాలజీ సహాయంతో దొంగదెబ్బలు తీయడానికి ప్రాముఖ్యతనిస్తుంది. 2020 జనవరి 3న ఇరాన్ మేజర్ జనరల్ ఖాసిమ్ సొలేమాన్‌ని డ్రోన్ ద్వారా సోబ్బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద దొంగదెబ్బతీసి హతమార్చింది.

భారతదేశం లాంటి దేశాలను తనవైపు చేర్చుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. భారత – చైనా సరిహద్దు తగాదా ఒక మంచి అవకాశంగా మలుచుకుంటున్నది. అయితే లాటిన్ అమెరికా దేశాల అనుభవాలు ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి.

బిగుసుకుంటున్న బంధం ధ్రుతరాష్ట్ర కౌగిలిని గుర్తుచేస్తున్నది. ప్రేమ నటిస్తూ దగ్గరకు తీసుకుంటూ ఉంటే ధృతరాష్ట్ర కౌగిలి అంటారు. కురుక్షేత్రం ముగిసింది. పాండవులతో యుద్ధం చేసిన కౌరవులంతా చనిపోయారు. ధృతరాష్ట్రుడు, గాంధారి బాధపడుతున్నారు. వాళ్లను పరామర్శించడానికి పాండవులు, కృష్ణుడు, కుంతి, ద్రౌపది వెళ్లారు. బాధపడుతూనే గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు భీముణ్ణి దగ్గరికి పిలిచాడు. ఏది నాన్నా ఒక్కసారి నిన్ను కౌగిలించుకోవాలని ఉంది అంటాడు. కృష్ణుడు ఒక ఉక్కు భీముణ్ణి రెడీగా పెట్టించాడు. దాన్ని ఆ ముసలాయన ముందు ఉంచుతారు. ప్రేమతో కౌగిలించుకున్నట్టే గట్టిగా ఆ విగ్రహాన్ని ముక్కలు ముక్కలు చేస్తాడు. కపట ప్రేమ చూపించి మనుషులందరినీ విడగొట్టి నాశనం చేసే విష కౌగిళ్లేవో తెలుసుకోవాలి.

ఇండో–పసిఫిక్ పాలసీ

ఇండో–పసిఫిక్ పాలసీని ముందుకు తెచ్చింది ట్రంప్ కాదు. ఒబామా, బిడెన్ అధికారంలో ఉండగానే ఈ విధానాలకు శ్రీకారం చుట్టారు. చైనా ప్రభావాన్ని ఆసియా దేశాలపై నివారించడానికి 2015లో ఢిల్లీలో ఒబామా భారత–అమెరికాల విజన్ స్టేట్‌మెంట్‌పై సంతకం చేశారు. అదే విధానాలను ఆసియా పసిఫిక్ విదానాలుగా ట్రంప్ కొనసాగించాడు. భారత –చైనా సరిహద్దు ఘర్షణలు అమెరికాకు కలిసి వచ్చాయి.

నాటో సైనిక కూటమి స్థానంలో క్వాడ్ సైనిక కూటమి

దక్షిణచైనా సముద్రంలో (సౌత్ చైనా సీ) నౌకా విన్యాసాలు చేసి ఆ ప్రాంతాన్ని మరొక సైనిక కూటమికి కేంద్రంగా చేయాలని 1992 నుంచి కొనసాగుతున్నా అమెరికా వ్యూహం ఫలించిందనే చెప్పాలి. నాటో సైనిక కూటమికి శత్రువైన సోవియట్ పతనం తర్వాత నాటో సైనిక కూటమి అవసరమే ప్రశ్నార్థకమయ్యింది. శత్రువే అదృశ్యమైనపుడు ఎవరితో పోట్లాడాలో స్పష్టత లేనపుడు సైనిక కూటములు బలహీనపడడం సహజమే. నాటో సభ్యదేశాలు అమెరికాకు దూరమవుతున్నాయి. నాటో కూటమి ఖర్చులు భరించే స్థితిలో అమెరికా లేదు. సభ్యదేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా తదితరులను ఖర్చులను పంచుకోమని అమెరికా కోరవలసి వచ్చింది. నాటో కూటమికి నాయకత్వం వహిస్తున్న అమెరికాతో పాటు సభ్యదేశాలు కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. సంక్షోభంలో నుండి బయటపడాలంటే ఆయుధాలను, యుద్ధ విమానాలను, సైనిక సామగ్రిని అమ్ముకోవాలి. నాటో సైనిక కూటమి స్థానంలో క్వాడ్ కూటమిని స్థాపించాలని అమెరికా ప్రయత్నాలు సాగిస్తూ ఉన్నది. మలబార్ సైనిక విన్యాసాలు 1992 నుంచి కొనసాగుతున్నాయి. తొలిదశలో భారత–అమెరికా నౌకాదళాల శిక్షణా కార్యక్రమాలకు మాత్రమే పరిమితమని ప్రచారం చేశారు. 2015లో మలబార్ విన్యాసాలలో జపాన్ చేరింది. కొత్తగా ఆస్ట్రేలియాను భయపెట్టి, బతిమిలాడి క్వాడ్ అంటే చతుష్టయ కూటమిలోకి చేర్చుకొన్నారు. దక్షిణ చైనా సముద్రాన్ని ఆధిపత్యం సంపాదించడం ద్వారా ఆ ప్రాంతాన్నంతా పాదాక్రాంతం చేసుకోవచ్చని అమెరికా వ్యూహం. 2015లో జరిగిన మలబార్ విన్యాసాలకు భారత్ నౌకాదళం రెండు యుద్ధ నౌకలను మాత్రమే పంపింది. ఇపుడు 2020లో అత్యధిక విమానవాహక యుధనౌకలను, సబ్ మెరైన్‌లను కూడా మన దేశం పంపింది. చైనాను నిలవరించడానికి అమెరికా ఏర్పాటు చేసిన క్వాడ్ కూటమిలో అమెరికా,

భారతదేశం, జపాన్‌తో పాటుగా ఆస్ట్రేలియా కూడా చేరింది. ఈ నాలుగు దేశాలు కలిసి బంగాళాఖాతంలో నవంబర్ 3న మలబార్-2020 పేరున సైనిక విన్యాసాలు ప్రారంభించాయి. అరేబియా సముద్రంలో 17 నుండి 20 వరకు ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. ఈ విన్యాసాల లక్ష్యాలలో మొదటిది సౌత్ చైనా సీ పై ఆధిపత్యాన్ని సంపాదించి చైనాను ఇరుకున పెట్టడం, భారతదేశాన్ని ఈ విన్యాసాలలో భాగం చేసి క్వాడ్ సైనిక కూటమిలో సభ్యునిగా చేర్చడమే ధ్యేయంగా అమెరికా కృషి చేస్తూనే ఉంది. భారత్ వంటి విశాలమైన మార్కెట్ ఉన్న దేశం తన చెప్పుచేతల్లో ఉండడం వలన వచ్చే ఆర్థిక, సైనిక ప్రయోజనాల కోసం అమెరికా తపనపడుతోంది.

చైనాను చుట్టుముట్టి నిలవరించాలనే (ఎన్సర్కిల్మెంట్ ఆఫ్ చైనా) పథకం 2007లోనే మొదలయింది. అప్పటి అమెరికా ఉపాధ్యక్షుడు డిక్ చెనీ, అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే ఈ పథకాన్ని ఆమోదించి 'చతుష్టయాన్ని' ఏర్పాటుకు ప్రయత్నం చేశారు. అప్పటి ఆస్ట్రేలియా ప్రధాని జాన్ హోవర్డ్, భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దీనిని ఆమోదించారు. అమెరికా, భారత్ 'ఎక్సర్సైజ్ మలబార్' పేర ఉమ్మడిగా నౌకా విన్యాసాలు జరుపుతున్నాయి. ఈ విన్యాసాలు 1992 నుంచి కొనసాగుతున్నాయి. జపాన్ నౌకాయాన ఆత్మ రక్షణ బలగాలతో కలిసి 2007లో జపాన్ దీవి ఒకినావాలో ఈ విన్యాసాలు నిర్వహించారు. బంగాళాఖాతంలో జరిగిన విన్యాసాలలో ఆస్ట్రేలియా, సింగపూర్ కూడా భాగస్వాములైనాయి. తద్వారా మలబార్ విన్యాసాలు ద్వైపాక్షిక ఒప్పందం పరిధిని దాటాయి. అయితే ఆస్ట్రేలియా 2008లో ఈ మలబార్ విన్యాసాల నుంచి ఉపసంహ రించుకుంది. కాని ఆస్ట్రేలియా ఇతర చోట్ల అమెరికాతో సైనిక బంధాన్ని తెంచుకోలేదు. 2015 నుంచి జపాన్ క్రమం తప్పకుండా ఈ సైనిక విన్యాసాలలో పాలు పంచుకుంటోంది. మళ్లీ ఇప్పుడు నాలుగు దేశాలతో కూడిన చతుష్టయాన్ని పునరుద్ధించి నందువల్ల భారత్ నిర్వహించే విన్యాసాలలో ఆస్ట్రేలియా కూడా భాగస్వామి అయింది.

ప్రశాంత సముద్రజలాలలో బల ప్రదర్శనలు

చైనాను నివారించాలన్న అమెరికా ప్రయత్నాలకు మనం ఎందుకు సహకరించాలన్నదే ముఖ్యమైన అసలు ప్రశ్న. చైనాలో ఆర్థిక అభివృద్ధి జరిగిన స్థాయిలో ఆ దేశ సైనిక, భౌగోళిక, రాజకీయ శక్తి పెరగలేదు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఇప్పటికీ అమెరికాదే పైచేయి. సైనిక బడ్జెట్, సైన్యం, అణ్వస్త్రాలు, విదేశాల్లో సైనిక స్థావరాలు మొదలైన వాటిలో ఏ దేశమూ అమెరికా దరిదాపుల్లో కూడా లేదు.

అయినా చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడం వలన బీజింగ్‌కు ఇరుగు పొరుగున ఉన్న దేశాలలో పలుకుబడి పెరగడం వలన ఆసియా-పసిఫిక్‌లో అమెరికా అధిపత్యానికి భంగం కలిగింది. అమెరికా భద్రతకు ముప్పు లేకపోయినా సవాలు మాత్రం ఎదురైంది. ఈ సవాలును ఎదుర్కోవడానికి భారతదేశాన్ని తన చెంతన చేర్చుకోవడానికి సరిహద్దు వివాదం ఉపయోగ పడింది. అమెరికా సైనిక వ్యూహంలోకి లాగబడిన భారతదేశం దక్షిణచైనా సముద్రంలో అమెరికాకు ఉపయోగపడే నిఘాకు భారతదేశం అంగీకరించింది. సైనిక వ్యూహంలో భాగంగా అండమాన్ నికోబార్ దీవులను కీలక మిలిటరీ కేంద్రంగా అభివృధి చేస్తున్నారు. భౌగోళికంగా ఈ దీవులు కీలక ప్రదేశంలో ఉన్నాయి. చైనా సముద్ర వాణిజ్య మార్గంలో కీలకంగా ఉండే మలక్కా జలసంధికి అండమాన్ దీవులు సమీపంలో ఉన్నాయి. చైనా వ్యతిరేక సైనిక వ్యూహంలో అండమాన్ దీవులు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి..

భారతదేశ నౌకలకు ఇంధనం నింపుకోవడానికి, యుద్ధ నౌకలను మరమ్మత్తు చేసుకునేందుకు ఇండోనేషియా, సింగపూర్‌లతో ఒప్పందం చేసుకుంది. ఇండోనేషియాలో సబాంగ్ ఓడరేవును, సింగపూర్‌లోని చాంగి నౌకాస్థావరాన్ని, భారత్‌లో యుద్ధ నౌకలు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు జరిగాయి. ప్రశాంత సముద్రజలాలలో బలప్రదర్శనలు చేయడానికి మనదేశం అంగీకరించినందువలన సైనిక కూటములలో ప్రత్యక్ష భాగస్వాములౌతున్నాం.

సత్ఫలితాలిచ్చిన 1988 భారత ప్రధాని రాజీవ్ పర్యటన

సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఉన్నత రాజకీయ, దౌత్య స్థాయిలో చైనాతో భారత ప్రభుత్వం చర్చలు కొనసాగించడం వలన దాదాపు 40 సంవత్సరాలు భారత-చైనా దేశాలు తమ అభివృద్ధిపై కేంద్రీకరించగలిగారు. ఆసియా టైగర్స్‌గా ప్రసిద్ధి పొందారు.

1988 డిసెంబర్‌లో రాజీవ్ గాంధీ చైనా పర్యటన, భారత - చైనా దేశాల సంబంధాలలో ఒక చారిత్రాత్మక మలుపు. ఒక ముఖ్య ఘటన మాత్రమే కాదు. భారత - చైనా దేశాల సంబంధాలను నూతన స్థాయికి చేర్చింది. స్నేహానికి అడ్డంకులను తొలగించింది. చైనా భారత సరిహద్దు సమస్యను శాంతియుతంగా, స్నేహపూర్వంగా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడానికి ఇరువురూ అంగీకరించారు. సరిహద్దు సమస్యకు పరిష్కారం కోసం అనువైన వాతావరణాన్ని సృష్టించాలన్నారు. ఉమ్మడి సరిహద్దు కమిషన్‌ను ఏర్పాటు చేశారు. సరిహద్దు సమస్యను ఇతర ద్వైపాక్షిక సమస్యల నుండి వేరు చేశారు. సరిహద్దు వివాదం ఇతర సమస్యల పరిష్కారానికి అడ్డుకాకూడదన్నారు. అందుకనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాలలో, వ్యాపార వాణిజ్యాలలో, ప్రజల మైత్రీ సంబంధాలలో గణనీయమైన అభివృద్ధిని రెండు దేశాలు సాధించాయి. భారత - చైనాలు కొద్దికాలంలోనే ప్రపంచానికి మార్గదర్శకులౌతాయని భావించారు. మిలిటరీ - అమెరికాను ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పరిపాలిస్తున్నది.

భారత-చైనా దేశ ప్రజల విశాల ప్రయోజనాల దృష్ట్యా ఇరు దేశాల నాయకులు ఉన్నత స్థాయిలో రాజకీయ నిర్ణయాలు తీసుకుని సరిహద్దు సమస్యను పరిష్కరించాలి. చెప్పుడు మాటలు విని యుద్ధ జ్వాలలలో మండిపోవడం అనర్థం. వారెవరూ సైన్యాన్ని మనకు సహాయంగా పంపరు. ఆధునిక ఆయుధాలను మనకు అమ్మి సొమ్ము చేసుకుంటారు. ఆయుధపోటీని పెంచుతారు. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ చెప్పినట్లుగా అమెరికాను మిలిటరీ - ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పరిపాలిస్తున్నది. అమెరికా లాగా మనం సైనిక-రక్షణ రంగ పరిశ్రమల (మిలిటరీ -ఇండస్ట్రియల్ కాంప్లెక్స్) పరిపాలనలోకి వెళ్లరాదు. కార్పొరేషన్లు-సైనికరంగం అమెరికా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని అమెరికా అధ్యక్షుడు తన పదవీ విరమణ సమయంలో వెల్లడించిన వాస్తవం ప్రపంచ ప్రజలందరికీ కనువిప్పు కావాలని యు.ఎస్ పౌరులను ప్రముఖంగా హెచ్చరించారు. మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ వలన పెరుగుతున్న ప్రమాదాల గురించి హెచ్చరించాడు. కానీ ఆయుధ రేసును నివారించలేకపోయాడు.

'తయారైన ప్రతి తుపాకీ, ప్రతి యుద్ధ నౌక, ప్రయోగించిన ప్రతి రాకెట్ -ఆకలి బాధతో ఉన్నవారినుండి దొంగిలించినవే. ధరించటానికి

దుస్తులు లేనివారు ఆయుధాలలో డబ్బు మాత్రమే ఖర్చు చేయటం లేదు. ఆయుధాల తయారీలో కార్మికుల చెమట, శాస్త్రవేత్తల మేధావితనంతో పాటు మన పిల్లల ఆశలు కూడా ఖర్చు చేస్తున్నాం.' (ఏప్రిల్, 16, 1953న) డ్వైట్ డి ఐసెన్ హోవర్.

ఈ యుద్ధాలు ఎవరికోసం?

రక్షణ పరిశ్రమలు నడవడం కోసం యుద్ధాలు కావాలి. యుద్ధాల కోసం అత్యంత ఆధునిక ఆయుధాలను తయారు చేయడానికి ప్రపంచంలోని మేధావులను, సైంటిస్టులను అమెరికా ఆహ్వానించి ఆధునిక సౌకర్యాలను, అవకాశాలను, పనిచేసే వాతావరణాన్ని సృష్టిస్తున్నది. కొత్త కొత్త ఆయుధాలను తయారుచేసి ఇరుపక్షాలకు ఆయుధాలను అమ్ముకుంటున్నది. సోవియట్ పతనం తరువాత ఎల్లపుడూ ఏదో ఒక యుద్ధంలో ఉండే అమెరికాకు కొత్త శత్రువు అవసరం వచ్చింది. ఆ వెతుకులాటలో ఇరాన్, ఇరాక్, లిబియా, సిరియా, ఆఫ్ఘనిస్థాన్‌లు కొంత పని కల్పించాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని తమ తదుపరి కార్యక్షేత్రంగా ఎంచుకుని పావులు కదుపుతున్నారు.

రక్షణ పరిశ్రమల కార్పొరేట్ కంపెనీలకు యుద్ధాలు కావాలి. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను కాపాడే నాయకులకు పదవులు, కమీషన్ల కోసం యుద్ధాలు కావాలి. ప్రజలకు తమ శ్రమకు పూర్తి ఫలం అందాలి. ప్రజలకు ఉపాధి, ఆహారం, గృహం, విద్య, వైద్యం, మంచి జీవితం. అందుకోసం అనవసర యుద్ధాల బారి నుండి, ధృతరాష్ట్ర కౌగిలి నుండి తప్పుకోవాలి. ప్రపంచ శాంతికోసం కృషిచేయాలి.

అమెరికాతో సైనిక ఒప్పందాలు

కమ్యూనిస్టు చైనాను ఎదుర్కోవడానికి యుఎస్ఎ తన విదేశాంగ విధానంలో భాగంగా భారతదేశాన్ని ప్రధాన రక్షణ భాగస్వాములలో ఒకటిగా చేసుకోవాలని కోరుకుంటోంది.

తన వ్యూహాత్మక ప్రయోజనాలకు సాధించడంలో భారతదేశం కీలకమని గుర్తించిన అమెరికా, భారత్‌తో తన సంబంధాన్ని బలోపేతం చేసుకోడానికి ప్రయత్నిస్తూనే ఉన్నది. ఆ ప్రయత్నాలు ఇప్పటికి సఫలమయ్యాయి. ప్రాథమిక ఒప్పందాల స్థాయి నుండి సైనిక ఒప్పందాల స్థాయికి ఎదిగాయి.

భారతదేశాన్ని అమెరికాకు భారీ రక్షణ భాగస్వామిగా చేసుకోవడం వలన భారత సైనిక స్థావరాలను అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు వినియోగించుకోవచ్చు. అమెరికాలో ఆయుధాలు ఉత్పత్తి చేసే వారి దగ్గర నుండి భారత్ నేరుగా ఆయుధాలు కొనవచ్చు.

అమెరికా తన రక్షణ భాగస్వాములతో నాలుగు 'ప్రాథమిక బేసిక్' ఒప్పందాలను కుదుర్చుకుంటుంది. ఈ ఒప్పందాలు "భాగస్వామి-దేశాలతో సైనిక సహకారాన్ని పెంపొందించుకోడానికి అమెరికా ఉపయోగించే సాధారణ సాధనాలు" అని పెంటగాన్ అంటుంది. మనం ప్రాథమిక స్థాయి ఒప్పందాలన్నీ చేసుకున్నాం. ఈ ఒప్పందాల వలన విమానాల్లోను, నౌకల్లోను ఇంధనం నింపడాన్ని, విపత్తు ఉపశమనం అందించడం వంటి కార్యకలాపాలను నిర్వహించడాన్ని ఇది సరళతరం చేస్తుందని పెంటగాన్ అంటుంది.

ఈ నాలుగు ఒప్పందాలలో మొదటిది, జనరల్ సెక్యూరిటీ ఆఫ్ మిలిటరీ ఇన్ఫర్మేషన్ అగ్రిమెంట్ (GSOMIA), 2002లో భారత అమెరికాలు సంతకం చేసిన ఒప్పందం ఇది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య సైనిక సమాచారాన్ని పంచుకునేందుకు వీలు కల్పిస్తుంది.

రెండవ ఒప్పందం, లాజిస్టిక్స్ ఎక్స్చేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ (LEMOA), 2016 ఆగస్టు 29న ఇరు దేశాలు సంతకం చేశాయి. పునఃసరఫరాలు చేయడానికి, మరమ్మతు చేయడానికీ ఇతరుల స్థావరాలను ఉపయోగించడానికి ఇరు దేశాల సైన్యానికి LEMOA ద్వారా వీలు కలుగుతుంది.

మూడవ ఒప్పందం, కమ్యూనికేషన్స్ ఇంటర్ ఆపరబిలిటీ అండ్ సెక్యూరిటీ మెమోరాండమ్ ఆఫ్ అగ్రిమెంట్ CISMOA. 2018 సెప్టెంబరులో 2+2 సంభాషణ సందర్భంగా భారత్ తరఫున మంత్రులు సుష్మా స్వరాజ్, నిర్మలా సీరు. చైనా, పొరుగు ప్రాంతాలపై నిఘా ఉంచడానికి, అమెరికా మిలిటరీ పరికరాలను కొనటానికి, టెక్నాలజీని ఇవ్వటానికి, ఆయుధాలను భారతదేశానికి అమ్మటానికి 2+2 ద్వైపాక్షిక సదస్సులో సంతకాలు చేశారు.

నాల్గవ ఒప్పందం బేసిక్ ఎక్స్చేంజ్ అండ్ కో ఆపరేషన్ అగ్రిమెంట్ (బీకా). ఇది జియోస్పేషియల్ ఉత్పత్తులు, టోపోగ్రాఫికల్, నాటికల్, ఏరోనాటికల్ డేటా, యుఎస్ నేషనల్ జియోస్పేషియల్-ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఎన్జిఎ) ఉత్పత్తులు సేవలను మార్పిడి చేయడానికి అనుమతిస్తుంది.

లండన్‌లోని కింగ్స్ కాలేజీలో అంతర్జాతీయ సంబంధాల ప్రొఫెసర్ హర్ష్ వి. పంత్ అమెరికా వ్యూహాత్మక ప్రణాళికలో భారతదేశపు ప్రాముఖ్యతను ఎత్తిచూపాడు: "ఇండో-పసిఫిక్‌లో శక్తి సామర్థ్యాల సమతుల్యతకు అమెరికాకు భారతదేశం కీలకం. వనరులు పరిమితంగా ఉన్న ఈ సమయంలో, చైనా దూసుకెళ్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన విశ్వసనీయతను పెంచుకోడానికి అమెరికాకు భారతదేశం వంటి భాగస్వాములు అవసరం." ఈ ఒప్పందాలన్నిటిలో భారత్ చేరింది. నాటో కూటమిలోని భాగస్వామ్య దేశాలన్నీ ఈ విధంగా సంతకాలు, చేసి నాటో సైనిక కూటమిలో చేరి ఇరుక్కుపోయి సంక్షోభాలలో చిక్కుకుని దివాళా తీశారు.

జపాన్, ఆస్ట్రేలియా దేశాలు అమెరికాకు సహజ సైనిక మిత్రులు. ఈ ముగ్గురితోపాటుగా భారతదేశాన్ని కలుపుకుని క్వాడ్ అంటే నలుగురు లేక చతుష్టయం అనే ఒక సైనిక కూటమిని ప్రారంభించారు, అమెరికాకు మిలిటరీ స్థావరాలున్నాయి. ఈ ఒప్పందాలవలన సైనిక బంధాలు పెరిగి పరస్పర సహాయ సహకారంతో నౌకాశ్రయాలను వినియోగించుకోవడం, నౌకలకు, విమానాలకు ఆయిల్ నింపుకోవటం, రిపేర్లు చేసుకోవడం లాంటి మిలిటరీ సౌకర్యాలు ఒప్పందంలోని భాగస్వాములందరికీ లభిస్తాయి. గత సంవత్సరం క్వాడ్‌ను మంత్రుల స్థాయికి పెంచి న్యూయార్క్‌లో నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమయ్యారు. రెండవ సమావేశం టోక్యోలో ఈ సంవతంసరం అక్టోబర్‌లో జరిగింది. చైనా నుండి, చైనా కమ్యూనిస్టు పార్టీ దోపిడీ, అవినీతి నుండి క్వాడ్‌లో భాగస్వాములుగా ఉన్నటువంటి దేశాల ప్రజల రక్షణ కోసం క్వాడ్ ఏర్పడిందని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, టోక్యోలో బాహాటంగా ప్రకటించాడు. అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టిన ఘనత రిపబ్లికన్ పార్టీ సెనేటర్ మెకార్థీకే దక్కుతుంది. ప్రభుత్వంలో ఉన్న ప్రజాస్వామిక వాదులందరినీ కమ్యూనిస్టులన్నాడు. సోవియట్ ఏజెంట్లు అంటూ వారందరిపై దాడి చేశాడు. వారిని పదవుల నుండి తొలగించేదాకా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేశాడు. అమెరికన్ ప్రజలలో కమ్యూనిస్టులంటే భయాన్ని, వ్యతిరేకతలు సృష్టించాడు. అతను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా నిజమైన సాక్ష్యాలను చూపించడం లేదని అందరికీ తెలుసు. అయినా అతని అబద్ధాల ప్రచారాన్ని ఆపడానికి

ఐసెన్ హోవర్ లాంటి వారు కూడా భయపడ్డారు. 'నేను ఆ వ్యక్తితో గొడవపడను' అని ప్రెసిడెంట్ ఐసెనోవర్ మెకార్థీ గురించి చెప్తూ వెనక్కి తగ్గాడు. 1950లో ప్రారంభమైన కమ్యూనిస్టు వ్యతిరేకత ఇంకా కొనసాగుతూనే ఉంది. కమ్యూనిజాన్ని నివారించాలనే పేరుతో కొరియా, వియత్నాం యుద్ధాల నుండి ఇండో-పసిఫిక్ క్వాడ్ కూటమి వరకూ సైనిక కూటములను ఏర్పరుస్తున్నారు. మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ తన కార్పొరేట్ సామ్రాజ్యాన్ని స్థిరపరచుకుంటూ, ఆయుధాలను అమ్ముకుంటూ ప్రపంచ ప్రజలను అధర్మ యుద్ధాలలోకి లాగుతున్నది. ఆధునిక కాలంలో సాగిన యుద్ధాలన్నిటిలోనూ కొరియా యుద్ధంలో 1950-53 కాలంలో 20-30లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. రెండవ ప్రపంచయుద్ధ మరణాల కన్నా, హిరోషిమా నాగసాకి అమెరికా అణ్వాయుధ బాంబుల దాడికి మించి, వియత్నాం యుద్ధాన్ని కూడా మించి లక్షలాది మంది కొరియా పౌరులు కార్పెట్ బాంబింగ్ వలన చంపబడ్డారు.

ఎక్కువ స్నేహంతో జీవించవలసిన ఇరుగు పొరుగు దేశాల మధ్య చిచ్చు పెట్టి ఇద్దరికీ ఆయుధాలను, ఫైటర్ విమానాలను, సబ్ మెరైన్లను అమ్ముకోవడమే కాకుండా ప్రపంచ ప్రజలనందరినీ పేదరికంలోకి నెట్టి అసమాన అభివృద్ధిని సృష్టిస్తోంది. అమెరికా దేశం సంవత్సరానికి 732 బిలియన్ డాలర్లను, చైనా 261 బిలియన్ డాలర్లను, ఇండియా 71 బిలియన్ డాలర్లను మిలిటరీకి, ఆయుధాలకు ఖర్చుపెట్టి ప్రపంచ ప్రజల పేదరికాన్ని పెంచుతోంది. ఆయుధాలలో డబ్బు మాత్రమే ఖర్చు చేయడం లేదు. డ్వైట్ డి ఐసెన్ హోవర్ అన్నట్లుగా "ఆయుధాల తయారీలో కార్మికుల చెమట, శాస్త్రవేత్తల మేధావి తనంతో పాటు మన పిల్లల ఆశలు కూడా ఖర్చు చేస్తున్నాం." (ఏప్రిల్, 16, 1953న డ్వైట్ డి ఐసెన్ హోవర్ ప్రసంగం).

చైనా మనను జయించలేదు. మనం చైనాను జయించలేం.

చైనా మనను జయించలేదు. మనం చైనాను జయించలేం. ఆధునిక సాంకేతిక జ్ఞానంతో, అభివృద్ధి చెందిన ఆయుధాలను ప్రయోగించి, అత్యంత శక్తివంతమైన యుద్ధతంత్రంతో అమెరికా ఏ దేశంలోనూ విజయం సాధించలేదు. 2001 సెప్టెంబరు 11న ప్రపంచ వాణిజ్య సంస్థపై దాడి జరిగినప్పటి నుండీ 20 సంవత్సరాలుగా, ఆసియాలో ప్రతీకార యుద్ధాలను అమెరికా సాగిస్తోంది. ఈ యుద్ధాలకు 6.4 లక్షల కోట్ల డాలర్లు (475 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చయిందని అంచనా. గత 20 సంవత్సరాలుగా అమెరికా సాగించిన యుద్ధాలలో చనిపోయిన వారి సంఖ్య 8,01,000. అందులో 3,35,000 మంది నిరాయుధ పౌరులన్నది మరింత బాధాకరం. కొరియా, వియత్నాంలలో చావు దెబ్బ తిన్న అమెరికా పాఠాలు నేర్చుకోకుండా మిలిటరీ - ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ అడ్డుపడింది. ప్రత్యక్షంగా సైనికులను ఆకాశం నుండి క్యూబాలో దించి అవమానాల పాలయ్యింది. ఇరాక్‌లో సద్దామ్ హుస్సేన్, చిలీలో అలెండీ, లిబియాలో కల్నల్ గద్దాఫీ, ఇరాన్ జనరల్ క్వాసిమ్ సొలేమాన్‌లను దారుణంగా హత్య చేసింది. క్యూబా అధినేత ఫిడేల్ కాస్ట్రోను చంపటానికి 638 సార్లు హత్యా ప్రయత్నాలు జరిగాయి. అటువంటి చరిత్ర కలిగిన అమెరికాను నమ్ముకుని యుద్ధ కూటములలో చేరితే మనదేశం ఆర్థికంగా నష్టపోయి అరబ్ దేశాలు, లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాలలో లాగా అభాసుపాలవుతాం. కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదడం సాధ్యం కాదు.


ఆసియాలో అమెరికా భౌగోళిక రాజకీయ వ్యూహానికి భారత్ తలొగ్గాల్సి రావడం విచారకరం. కొన్ని వేల సంవత్సరాలు సాగిన భారత-చైనా మైత్రిలో యుద్ధాలు లేవు. వలస పాలకులు సృష్టించిన సరిహద్దు వివాదాన్ని భారత-చైనా దేశాలు పరిష్కరించుకోవడానికి చేసే ప్రయత్నాలను ఆయుధ వ్యాపార కార్పొరేట్ కంపెనీలు, వారిపై ఆధారపడిన ప్రభుత్వాలు అడ్డుకుంటున్నాయి. రాబోయే కాలానికి భారత-చైనా దేశాలే సాంకేతిక అభివృద్ధికి చిహ్నంగా ఉంటాయని నిరూపించుకుంటున్నారు. అటువంటి సమయంలో సరిహద్దు ఘర్షణలు జరగడం అవాంఛనీయం. వలస రాజ్యాలు వదిలి వెళ్లిన సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోలేకపోవడం భారత - చైనా దేశాల రాజకీయ వైఫల్యం. భారత చైనాలు చిరకాలం శత్రుత్వంతో ఉండలేవు. వేలాది సంవత్సరాల సుదీర్ఘ మైత్రిలో తగాదాపడిన కాలం చాలా తక్కువ. పరిష్కరించుకోలేని సమస్యలు లేవు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అతి పెద్ద దేశాలైన భారత- చైనాలతోనే ప్రపంచ ప్రజల సుస్థిర శాంతి సౌభాగ్యాలు ముడిపడి ఉన్నాయి.

భారతదేశం సైనిక కూటములలో చేరవలసిన అవసరం ఉన్నదా లేదా అని మనం ఆలోచించాలి. సైనిక కూటములలో చేరి చితికిపోయిన దేశాల చరిత్రను మరువరాదు. మనదేశంలో ఒక ప్రాంతంలో స్థానికంగా ఏర్పడిన తగాదాను స్థానిక తగాదాగానే పరిమితం చేసి మన ప్రాంతాన్ని రక్షించుకోవాలి. అందుకవసరమైన చర్యలన్నీ తీసుకోవాలి.

ఉన్నత స్థాయిలో రాజకీయ నిర్ణయాలు తీసుకుని సరిహద్దు సమస్యను పరిష్కరించాలి.

(రచయిత భారత-చైనా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్, మాజీ అధ్యక్షుడు) వీ

హేమచంద్ర



ప్రఖ్యాత సంగీతకారుడు, రచయిత బాలాంత్రపు రజనీకాంతరావు పెద్దకుమారుడు హేమచంద్ర (67) నవంబర్ 12న విజయవాడలోని తన స్వగృహంలో కన్నుమూశారు. సంగీత, సాహిత్యాలపై అపారమైన అభిమానం, అధికారం హేమచంద్ర సొంతం. కళా రంగాల్లోని ఔత్సాహికులను సామాజిక మాధ్యమాలు వేదికగా ఆయన ప్రోత్సహించేవారు. కరోనా రాకముందు వరకు విజయవాడలోని ఆయన నివాసం నిత్యం ప్రముఖుల ఇష్టాగోష్ఠులతో, సాహితీ చర్చలతో సందడిగా ఉండేది. ఈ చర్చల్లో పాల్గొనడానికి దేశ విదేశాల నుంచీ సాహితీవేత్తలు వచ్చేవారు. బహు ప్రాచుర్యం పొందిన 'సాహిత్య నౌకా విహారం' నిర్వహణలో సాయి పాపినేనితో కలిసి హేమచంద్ర కీలక భూమిక పోషించారు.

భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి నివేదిక

***పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛ లేకపోవడం, మైనారిటీలపై, దళితులపై దాడులు ఇవన్నీ కూడా దేశంలో రోజు రోజుకూ దిగజారిపోతున్న ప్రజాస్వామ్య విలువల సూచికలే అని అంటున్నారు* సతీష్ బైరెడ్డి**

భారతదేశం ప్రజాస్వామ్యమనే గుర్తింపును కోల్పోయే ప్రమాదంలో ఉన్నదని స్వీడన్‌కు చెందిన గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వీ-డెమ్ అనే సంస్థ తన అధ్యయనంలో పేర్కొన్నది. 2014లో ఏర్పడిన ఈ సంస్థ 2017 నుండి ప్రపంచ వ్యాప్తంగా తనదైన ప్రమాణాలతో ప్రజాస్వామ్య స్థితిని అంచనావేసి 'ర్యాంకులు' ఇచ్చే ఆనవాయితీని మొదలుపెట్టింది. లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్ (ఉదారవాద ప్రజాస్వామ్య సూచి) పేరుతో ఈ సంవత్సరం కూడ ఆయా దేశాల్లో నెలకొని ఉన్న పరిస్థితులను మదింపుచేసి ర్యాంకులను కేటాయించింది. 174 దేశాలకు గాను మొదటి స్థానంలో డెన్మార్క్ నిలువగా భారతదేశం 90వ స్థానంలో మాత్రమే నిలిచిపోయింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను, స్థానికంగా సేకరించిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ నివేదికను తయారు చేసినట్లు పేర్కొన్నది. ప్రపంచ వ్యాప్తంగా మూడు వేల మంది నిపుణులు, మేధావులతో కూడిన నెట్‌వర్క్ ఈ మొత్తం ప్రక్రియలో పాలుపంచుకున్నదని వీ-డెమ్ ప్రకటించింది. ఈ బృందంలో భారతదేశ మేధావి వర్గం కూడా పాల్గొన్నదని, ఇక్కడి పౌర సమాజం, మీడియా, రాజకీయ పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసాకే తామీ ముగింపుకు వచ్చినట్లు వీ-డెమ్ డైరెక్టర్ స్టాఫిన్ లింద్బర్గ్ పేర్కొన్నారు. ప్రతి దేశంలో 4 వందల రకాల సూచీలను ప్రధానంగా భావప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వతంత్రత, పౌర స్వేచ్ఛ, ఎన్నికల నిర్వహణ పద్ధతి, ప్రమాణాలు, భిన్నాభిప్రాయాలకు మీడియాలో కల్పించే స్థానం, విద్యలో స్వేచ్ఛ లాంటి వాటి ఆధారంగా ప్రజాస్వామ్య స్థితిని అంచనా వేశారు. ప్రపంచ జనాభాలో 54 శాతం జనాభా కలిగిన 92 దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలే రాజ్యమేలుతున్నాయని నివేదిక పేర్కొన్నది. భావప్రకటనా స్వేచ్ఛపై 31 దేశాల్లో తీవ్రమైన ఆంక్షలు విధించారు. ఈ దేశాల్లో విద్యాపరమైన స్వేచ్ఛ 13 శాతంకు పైగా పడిపోయిందని దానిలో భారతదేశం కూడా ఒకటని పేర్కొన్నది. గడిచిన పది ఏళ్లుగా ఈ తీవ్రత మరింత పెరిగిందని శాంతియుతంగా సమావేశమవడం, నిరసన తెలుపడం కూడా 14 శాతంకు పైగా తగ్గిపోయింది. భారతదేశానికి వచ్చేసరికి పౌర సమాజంతో పాటు మీడియా కూడా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. పాలకపక్ష విధానాలపైన కంటే ప్రతిపక్ష పార్టీల వెంటపడేలా, వాటిని బోనులో నిలబెట్టేలా వ్యవహరించాలనే ధోరణిని మీడియా పట్ల ప్రస్తుత ప్రభుత్వం కనపరుస్తున్నది. బ్రెజిల్, టర్కీ, పోలాండ్ లాంటి దేశాలు నిరంకుశత్వం వైపు వెలుతున్నాయని ఆ దిశగానే భారతదేశాన్ని కూడా హిందూ జాతీయవాద ప్రభుత్వం తీసుకెళుతున్నదని వీ-డెమ్ భారత్ పట్ల ఒక నిర్ధారణను ప్రకటించింది. వీ-డెమ్ నివేదిక దాని ప్రమాణాలు, సంవిధానం పట్ల భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ఆయా దేశాల్లోని ప్రభుత్వాల్లో ఉన్న పార్టీల వారిగా ఈ నివేదికపై స్పందనలున్నాయి.

నిజమే వీ-డెమ్ అయినా మరో సంస్థ అయినా కచ్చితమైన నిర్ధారణలకు రాలేకపోవచ్చు. అది సాధ్యం కూడా కాకపోవచ్చును. అయితే ఒక కీలకమైన అంశంపైన వచ్చిన ఒక అభిప్రాయాన్ని, అంచనాను మొత్తంగా కొట్టిపడేయలేము. కనీసంగా ఆయా దేశాల్లోని బుద్ధిజీవులు, విద్యావేత్తలు, ప్రజల్లో పనిచేసే సామాజిక కార్యకర్తలు, సంఘాలకు ఈ సందర్భం ప్రజాస్వామ్య స్థితిని తమ అనుభవాల్లోంచి మధింపు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నది. అసలు భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేదేలేదు ఇదొక బూటకపు ప్రజాస్వామ్యం, బడా బాబుల సంపన్న వర్గాల ఆధిపత్య కులాల ఓటుస్వామ్యం మాత్రమే అనే అభిప్రాయం బలంగా ఉన్నా బావజాల ప్రాతినిధ్యాలు కూడా ఉన్నాయి. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు కుదిరితే మధ్యలోనే మళ్లీ ఎన్నికలు అదేగొప్ప ప్రజాస్వామ్యంగా అతిపెద్ద ప్రజాస్వామ్యంగా ప్రపంచంలో భారతదేశానికి ఓ గుర్తింపు ఉన్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమే! అవి ఎలా జరుగుతున్నాయి, ఎవరి ప్రభావంలో జరుగుతున్నాయి మొత్తంగా వాటి నిర్వహణంతా ప్రజాస్వామికంగా జరగకపోయినా అవి కీలకమే. ఓట్లు, సీట్లకు మాత్రమే కుదించబడ్డ ప్రజాస్వామ్య దేశంలో ఓట్లు ఎక్కువ వచ్చిన వాళ్లకి సీట్లు ఆ నిష్పత్తిలో రాకపోవచ్చు. సీట్లు ఎక్కువ వచ్చిన వారికి మేజారిటీ ఓట్లు రాకపోవచ్చు. అధికారంలోకి వచ్చిన పార్టీకి పోలైన ఓట్లలో అధికం రావచ్చేమోకాని ప్రజలల్లో మెజారిటీ ఉందని కాదు! భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం మెజారిటీ ఓట్లు (ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్) పొందిన పార్టీ అధికారం చెలాయించే విధానం కాబట్టి ఆ పరిధిలోనే మొత్తంగా రాజ్య వ్యవస్థ, పౌర సమాజపు మధ్య ఉండే అనేకానేక వ్యవహారాలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను పరిపూర్ణంగా నెరవేర్చడమే ప్రజాస్వామ్యం కదా! ప్రజలే ప్రజాస్వామ్యంలో సార్వభౌములు కూడా కదా! మరి నిజంగా ఆ పరిస్థితి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకించి వర్తమాన భారత సమాజ అనుభవాల్లోంచి అవలోకించినపుడు మన ప్రజాస్వామ్యం ఎంతుంది? ఎట్లుంది? అని చెప్పడానికి వీలవుతుంది. ఎన్నిక కాబడటమే ప్రజాస్వామ్యం ఏలికలో ప్రజాస్వామ్యం అవసరం లేదనుకుంటున్నారు మన పాలకులు. ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ బద్ధంగా జరిగినపుడు పాలనలోనైనా రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తినైనా చూపాలి కదా. ఎన్నికయ్యాక రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఏ గాలిలో కలుస్తుందో కాని

వారి వారి స్వంత రాజ్యాంగాలు రాజ్యమేలుతాయి. రాజ్యాంగ ఒకానొక మౌలిక సూత్రమైన లౌకికవాదం అపహాస్యం చేయబడుతున్నది. రాజ్య వ్యవహారాల్లో మత జోక్యం, ప్రమేయం ఉండకూడదనే నియమాన్ని 'గంగ'లో కలిపి ఒక మత మందిర నిర్మాణానికి స్వయంగా ప్రధానే 'భూమి పూజ' చేస్తాడు. అదేదో ప్రభుత్వ కార్యక్రమం అయినట్లు. అల్ప సంఖ్యాక వర్గాలే దేశానికి ప్రమాదమని, దేశ భద్రత, ఐక్యత, సమగ్రత అంతా కూడా మెజారిటీ మత విశ్వాసం కలిగి ఉండటంలోనే ఉందనే ప్రచారం అనేక దశాబ్దాలుగా సంఘపరివార్ చేస్తున్నప్పటికినీ గడిచిన దశాబ్దకాలంగా దాని తీవ్రత మరింత పెరిగింది.

దేశంలోని వైవిధ్యం భావప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వతంత్రత, భిన్నాభిప్రాయాల పట్ల నేటి ప్రభుత్వ అసహన వైఖని, అణచివేత చర్యలు కనీస మాత్రంగానైనా ఉన్న ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేస్తున్నాయి. నేటి పాలక భారతీయ జనతాపార్టీ దాని సైద్ధాంతిక సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ మొత్తం ఎదుగుదల అంతా కూడా పరమత అసహనం పూనాదిగా సాధించినదే. అధిక సంఖ్యాక మతోన్మాదాన్నే దేశ భక్తిగా దాని సాంస్కృతిక ఆచరణే జాతీయ వాదంగా బలంగా ప్రచారం చేస్తున్నది. ఇవాళ దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నా, వ్యవసాయానికి వెన్నుముకగా దానిలో అంతర్భాగమైన పశు సంపద వేగంగా తరిగిపోతుంటే లేని బాదంతా గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించమని నినదించడంలో కనపరుస్తున్నవి ఆ శక్తులు. నిజానికి అట్లా కనపరచడంలో గో భక్తి కంటే శతాబ్దాలుగా పశు మాంసం భుజించే, వ్యాపారం చేసే సమూహాలను ప్రధానంగా ముస్లిం, మైనారిటీలను, దళితులను దుర్మార్గులుగా శత్రువులుగా చూపెట్టే పన్నాగమే ఎక్కువగా ఉన్నది. ఒక మత సాంస్కృతిక ఆచరణే దేశీయ సాంస్కృతిక ఆత్మగా, జాతీయతగా చూపెడుతున్నది. ఈ క్రమంలోనే దేశంలో అనేక ప్రాంతాల్లో గోమాంసం బుజిస్తున్నారనో, అమ్ముతున్నారనో దాడులు, హత్యాకాండలు అనేకం జరిగాయి. శాస్త్రీయంగా ఏ ఆహారం స్వీకరించాలనేది ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులో భాగం. ఈ ప్రభుత్వ ఏలుబడిలో తినే హక్కు కూడా ప్రమాదంలో పడింది. కొన్ని వర్గాల ఆహార సంస్కృతిపై జాతీయ వాదం పేరుతో దాడి జరుగుతున్నది. అసలు ఆహార స్వేచ్ఛ పైననే ఇలాంటి దుర్మార్గ దాడి జరిగాక ఇంకా ఏ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుకోగలం.

అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రధాని నరేంద్రమోడీ కాలం చెల్లిన, వలస పాలనా కాలం నాటి చట్టాలను రద్దుపరచాలని పదే పదే మాట్లాడాడు. అలాంటి చట్టాల్లో ఒకటైన రాజద్రోహం చట్టాన్ని బ్రిటిష్ వాళ్లకంటే, గడిచిన అన్ని ప్రభుత్వాలకంటే గత ఆరేళ్ల కాలంలోనే వందలాది మందిపై ప్రధానంగా పౌర సమాజంలో పనిచేసే కార్యకర్తలు, కవులు, కళాకారులు, సృజన జీవులు, బుద్ధిజీవులు, జర్నలిస్టులు, విద్యార్థి సంఘ నాయకులపై విచ్చలవిడిగా ప్రయోగించారు. స్వాతంత్రోద్యమాన్ని అణచివేసేందుకు ఆంగ్లేయులు ఆ చట్టాన్ని ప్రయోగిస్తే నేటి పాలకులు అసమ్మతి గళాలను, కలాలను, భిన్నాభిప్రాయాలను తొక్కివేసేందుకు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టడం, ప్రశ్నించడం నేరం. పాలకులను నిలదీయడం దేశద్రోహమైంది. న్యాయన్యాయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని ప్రత్యేకించి సరిహద్దు దేశాలతో తలెత్తే సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని విమర్శించినా, వ్యతిరేకించినా దేశ ద్రోహుల జాబితాలో చేరినట్టే. ఉపా (యుఎపిఎ) లాంటి క్రూర చట్టాలను రాజకీయ అసమ్మతిని అణచి వేయడానికి ఉపయోగిస్తున్నారు. ఆ చట్టాలు ఉనికిలోకి రావడమే పెద్ద దుర్మార్గమంటే వాటిని విచ్చలవిడిగా ప్రయోగిస్తూ అసమ్మతిని వ్యక్తం చేసేవారిని శతృవులుగా పరిగణిస్తూ ఏళ్ల తరబడి ఎటువంటి విచారణ లేకుండా జైళ్లలో బంధిస్తున్నారు. పచ్చి హంతకులు, మత విద్వేశాలను రెచ్చగొట్టి వేలాది మంది చావులకు కారణమైన వారు కనీసం కేసులు కూడా నమోదు కాకుండా నాయకులుగా దర్జా వెలగబెడుతున్నారు. ఎక్కడో ఓ చోట కేసులు పెట్టినా వెంటనే బెయిలు ఆ వెంటనే నిర్దోషులవుతున్నారు.

దేశంలో రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలను క్రమంగా బలహీన పరిచి రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ఉపయోగిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఆదాయపన్ను శాఖ లాంటివి మొత్తం కేంద్రంలోని ఆధికార పార్టీ దాని మాతృ సంస్థ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగిస్తు విపత్కర పరిస్థితులను సృష్టిస్తున్నారు. చట్టబద్ధ పాలన అనేది ఏనాడో మరుగున పడిపోయింది. ఇవాళ ఎన్ఐఏ అనేది బిజెపి చేతిలో ఒక బ్రహ్మాస్త్రం అయింది. ఎన్ఐఏకి కేసులు అప్పగించడం అంటే ఒక భయానక వాతావరణాన్ని సృష్టించడం అని అర్థం చేసుకోవాలి. అనేక ఆలోచనలకు నెలవయిన, స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలను భూస్థాపితం చేసే పనిలో నిమగ్నమై వాటి వనరులను పూర్తిగా కత్తిరించడమే కాకుండా లాభార్జనే ధ్యేయంగా ఉండే ప్రైవేటు విశ్వవిద్యాలయాలను పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్నారు. ఢిల్లీలోని జెఎన్‌యు లాంటి విశ్వవిద్యాలయాలనైతే దేశ ద్రోహ కేంద్రాలుగా ముద్రవేస్తున్నారు. పౌర సమాజపు ప్రశ్నలను, అసమ్మతిని అణచివేసి స్తబ్దతకు గురిచేసేలా, క్రియా రహితంగా మార్చివేసేలా తప్పుడు కేసుల్లో ఇరికించి అనేక మందిని జైళ్లలో మ్రగ్గిపోయేలా చేస్తున్నారు. పర్యావరణ చట్టాలను పలుచన చేస్తూ, ఆదివాసీలు మరింత విస్తాపనకు గురయ్యేలా ఆ చట్టాలను కూడా పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా మార్చివేస్తున్నారు. కార్మిక చట్టాలకైతే కనీస గౌరవం కూడా లేదు. ఏ బిల్లునైనా చట్టంగా మార్చే ప్రక్రియలో కనీసంగా చేయాల్సిన పార్లమెంటరీ డిబేట్, ఓటింగ్ లేకుండానే చట్టాలుగా మారుస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా అధికారాలన్నిటిని కేంద్రీకరించి తన గుప్పిట్లో పెట్టుకునేలా అనేక చట్టాలను రూపొందించింది కేంద్రం. జిఎస్‌టి లాంటి చట్టాలతో రాష్ట్రాలు ఆర్థిక స్వతంత్రతను కోల్పోయి కేంద్రాన్ని దేబిరించే స్థితిలోకి నెట్టబడ్డాయి. మొన్నటికి మొన్న వచ్చిన నూతన జాతీయ విద్యావిధానం అసలు రాష్ట్రాల ఉనికినే గుర్తించడం లేదు. కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ కాలంలో వలస కార్మికులు ప్రత్యేకించి అసంఘటిత రంగ కార్మికుల పట్ల వ్యవహరించిన తీరులో కనీస మానవీయత కూడా కరువయింది. సనాతన ధర్మాన్ని విశ్వసించే, ఆచరించే బ్రాహ్మణీయ ఫాసిస్టు నాయకత్వ శక్తుల ఏలుబడిలో ప్రజాస్వామ్యం ఎలా ఉంటుంది? అసలు ప్రజాస్వామ్య పూర్వపు భావజాలాన్ని బలంగా ప్రవచిస్తున్న పరివార్ పాలనలో ప్రజాస్వామ్యం అంతరించకుండా అందలమెక్కగలదా? ఇవన్నీ ఒక ఎత్తయితే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువల్ని, వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు

వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆ పార్టీ సాధించిన విజయాలను, వైఫల్యాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తున్నారు **సి.ఎస్.ఆర్. ప్రసాద్**

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి నేటికి వంద సంవత్సరాలు అయ్యింది. అయితే 1920లో తాష్కెంట్‌లో ప్రారంభమైన కమ్యూనిస్టు పార్టీని మాతృకగా గుర్తించాలా లేక 1924లో మన దేశంలో ఏర్పడిన పార్టీని గుర్తించాలా అన్నది వివాదాస్పదమైన అంశం. దాన్ని అలా ఉంచుదాం. రెండు, మూడేళ్ల తేడాని పట్టించుకొని చర్చించాల్సిన అవసరం అంతగా లేదు. మనం ప్రధానంగా ఆలోచించాల్సింది, మాట్లాడుకోవాల్సింది, విమర్శనాత్మకంగా విశ్లేషించుకోవాల్సింది ఈ వందేళ్ల కాలంలో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఏమి సాధించింది, ఏమి సాధించలేదు, విజయాలు, వైఫల్యాలను వాటికి గల కారణాలతో సహా పరిశీలించటం. నేనైతే దీనిని వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం అంటున్నాను. దీనికి కారణం భారతదేశంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు ఉండటం. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర అంటే అది ఆ పేరుతో ఉన్న ఒక పార్టీకి చెందిన అంశంగా మారే అవకాశం ఉంది. పైగా దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలు తమ వారసత్వ మూలాన్ని తొలి పార్టీలోనే గుర్తిస్తున్నాయి. ఆ కారణంగానే దీన్ని భారత కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ల సందర్భంగా గుర్తించటం హేతుబద్ధంగా ఉంటుదన్నది నా అభిప్రాయం.

ఒక వ్యక్తి జీవితంలోనైనా ఒక సంస్థ లేదా పార్టీ చరిత్రలోనైనా వంద సంవత్సరాలు గడవటం పరిశీలించాల్సిన విశేషమే. అయితే వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్రను విజయోత్సాహంగా జరుపుకోవటం ఎంత అవసరమో, దాని గమనశీలతను, ఆచరణను, సమాజంపైన దాని ప్రభావాన్ని నిష్పాక్షికంగా అంచనావేయడం అంతకంటే ప్రధాన అవసరం. చరిత్ర గొప్ప ప్రయోగశాల, అది అనుభవాల గని, గుణపాఠాలను నేర్పే బడి. అందుచేత ఇంత సుదీర్ఘమైన చరిత్ర గలిగిన ఒక ఉద్యమాన్ని అంచనా వేసేటప్పుడు అది భవిష్యత్తుకు మార్గదర్శిగా ఉపయోగపడేలా చూడటం ప్రయోజనకరం. అలా కాకుండా కేవలం సంబరాలకు, గత కీర్తిని ఘనంగా చెప్పుకోవడానికి పరిమితమైతే మనం చరిత్ర సారాన్ని అవగాహన చేసుకోనివాళ్లంగా మిగిలిపోతాం. ఇప్పటికే చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు, ఆలోచనాపరులతోపాటు, సామాన్య ప్రజలలో కూడా మార్క్సిస్టు భావజాలానికి కాలం చెల్లిందని, భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం పేరుకు మాత్రమే మిగిలిందనే విమర్శ ఉన్నది. దీన్నంతటినీ కమ్యూనిస్టేతరుల అవకాశవాద విమర్శగా కొట్టిపారేస్తే మనకే నష్టం. ఆ విమర్శలో నిజానిజాలు ఏ మేరకు ఉన్నాయో వస్తుగతంగా, విమర్శనాత్మకంగా విశ్లేషించుకుంటే భవిష్యత్తులో బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి మనం తోడ్పడగలుగుతాం.

ఈ వ్యాసంలో ముందుగా భారత కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన విజయాలను, దాని సానుకూల అంశాలను క్లుప్తంగానైనా పేర్కొనడానికి ప్రయత్నిస్తాను.

బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం అత్యంత తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించిన కాలంలో ఈ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నిలదొక్కుకోవడం దానికదే గొప్ప విశేషం. ప్రభుత్వ అణచివేతనేకాక మరోవైపు సాంప్రదాయవాదుల, తిరోగమనవాదుల సైద్ధాంతిక దాడులను కూడా తిప్పికొట్టి నిలదొక్కుకోవడం స్వల్ప విజయమేమీ కాదు.

సాంప్రదాయక భూస్వామిక భావజాలం, మతం, కులం, పితృస్వామ్యం సమాజాన్ని గుప్పిట్లో ఉంచుకున్న కాలంలో కమ్యూనిస్టు ఉద్యమం తన తొలి దశలో గొప్ప భావ ప్రచార కర్తవ్యాన్ని చేపట్టింది. ప్రాథమికంగానైనా హేతువాద, మానవతావాద భావాలను విస్తృతంగా ప్రచారం చేసింది. శాస్త్రీయతను ఆలోచనా రంగంలో ప్రవేశపెట్టింది. ఆలోచనాపరులకు ఒక నూతన దృష్టిని– గతితార్కిక భౌతికవాద దృష్టిని– అందించింది. స్వతంత్రమైన, విమర్శనాత్మకమైన లోచూపును భారతీయ విద్యాధిక వర్గానికి అందించింది. చరిత్ర, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం వంటి మానవీయ శాస్త్రాలను ఎందుకు, ఎలా అధ్యయనం చేయాలనే

రక్షణగా నిలువాల్సిన న్యాయ వ్యవస్థ కూడా తన స్వతంత్రతను కోల్పోయిందా? రాజకీయ కార్యనిర్వహణ వ్యవస్థ లాగేసుకున్నదా? అనే స్థితి గత కొంత కాలంగా న్యాయస్థానాలు ప్రధానంగా సుప్రీం కోర్టు తీర్పులు, వ్యాఖ్యానాలు ఆందోళనకరంగా ఉన్నవి. అసలు తీర్పులు ముందుగానే రాయబడుతున్నవా అనేలా వాటి వ్యవహారశైలి మారిపోయింది. బాబ్రీ మసీదు విధ్వంసం కేసు తీర్పులో కూల్చివేత కుట్రలోని నేతలంతా నిర్దోషులయ్యారు. వందల సంవత్సరాలు ఉనికిలో ఉన్న నిర్మాణం నేలమట్టమయింది. నేల మెజారిటీ మతోన్మాదుల పాలయింది. తీర్పునిచ్చిన జడ్జీ పదవి విరమణ అనంతరం మరో పీఠం ఎక్కాడు. న్యాయ వ్యవస్థ అసహనం ఎంతో ప్రశాంత్ భూషణ్ కేసులో తేలిపోతే దాని పక్షపాత వైఖరేమిటో ఆర్నబ్ గోస్వామి బెయిల్‌తో తేలిపోయింది. భావప్రకటనా స్వేచ్ఛకు జైళు, విద్వేశ భాషణకు జైళు ఇది న్యాయవ్యవస్థ ప్రజాస్వామిక స్ఫూర్తి. న్యాయవ్యవస్థ కూడా ప్రజల విశ్వాసం కోల్పోవడం ప్రమాదకర స్థితినే తెలియజేస్తున్నది. అధికార పక్ష అంతిమ లక్ష్యానికి అనుగుణమైన వైఖరిని ప్రదర్శిస్తే ఈ కనీస ప్రజాస్వామ్యం కూడా పరిసమాప్తమైనట్లే. మన మౌనం, భయం విడనాడితే ఈ స్థితిని ఎదుర్కొనేందుకు ఏమైన చేయవచ్చేమో...

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

అంశం మీద ఒక నూతన శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అందించింది. భావజాల రంగంలో కమ్యూనిస్టు ఉద్యమం తొలిదశలో వేసిన ప్రభావం ఫలితంగానే నిలవనీటి చందంగా ఉన్న బౌద్ధిక జీవనంలో పెను మార్పులు సంభవించాయి. కొత్త ఆలోచనల పరంపరకు బీజం పడింది. నూతన భావధార ప్రారంభమైంది. సాంప్రదాయక పండితుల స్థానంలో నూతన తరహా మేధావుల సమూహం రూపొందింది.

తొలి కమ్యూనిస్టు ఉద్యమం కేవలం సైద్ధాంతిక అంశాలలో నూతన భావాలను ప్రచారం చేయడంతోనే సరిపెట్టుకోలేదు. ఆనాటి సమాజంలో చలామణిలో ఉన్న కరుడుకట్టిన ప్రజా వ్యతిరేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఆచరణశీలమైన ఉద్యమాలను కూడా చేపట్టింది. కొన్ని శతాబ్దాలుగా మత, భూస్వామ్య శక్తులు సమాజంపై బలవంతంగా రుద్దిన మూఢ విశ్వాసాలను ప్రశ్నించింది. ప్రశ్నించడమే కాకుండా తాను నమ్మిన నూతన ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఆనాటి సాంప్రదాయక వ్యవస్థతో తలపడింది కూడా.

హిందూ సమాజంలో నరనరానా జీర్ణించుకుపోయిన కుల వ్యవస్థను, ప్రధానంగా అంటరానితనాన్ని తీవ్రంగా ఎండగట్టింది. కుల కట్టుబాట్లతో, కట్నకానుకలు, లాంఛనాలతో, పౌరోహిత్య జోక్యంతో సంబంధంలేని నూతన ఆదర్శ వివాహాల పద్ధతిని ఆచరణాత్మకంగా అందించింది.

స్త్రీలతో సహా అన్ని కులాలవారికి చదువు, వాడుకభాషలో చదువు అనే విలువలను ఆచరణలో పెట్టింది. స్త్రీలను ఉద్యమాలలోకే కాక గెరిల్లా దళాలలోకి కూడా తీసుకువచ్చి వాళ్లల్లో నూతన చైతన్యాన్ని రగిలించింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి బీజాలువేసి ఈ దేశంలో జాతుల సమస్య పరిష్కారానికి ప్రజాస్వామిక మార్గాన్ని అందించింది.

ఈ రకంగా సాంఘిక, బౌద్ధిక రంగాలలో తన ప్రభావాన్ని వేస్తూనే బ్రిటిష్ వలసకాలంలోనూ అధికార మార్పిడి జరిగిన తొలి దశాబ్దంలోనూ దేశవ్యాప్తంగా, పంజాబ్, కేరళ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో అనేక ఆదివాసి, రైతాంగ, కార్మిక పోరాటాలను నిర్మాణం చేసింది. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అది ఒక ఉజ్వలమైన దశ. "తెభాగా" రైతాంగ పోరాటం, పున్నప్రా వాయలార్ పోరాటం వంటివి అనేకం జరిగాయి. వీటన్నింటికి తలమానికం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. అది కేవలం నైజాం నవాబును అధికారం నుండి తొలగించటానికే కాక ప్రధానంగా తెలంగాణలో నిరంకుశ భూస్వామ్య ఆర్థిక సామాజిక పీడనను కూలదోసే లక్ష్యంతో జరిగిన పోరాటం.

అదే విధంగా మహారాష్ట్రలో, గుజరాత్‌లో, బెంగాల్‌లో చారిత్రాత్మక మైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించింది. భారతదేశంలో ఒక సాధారణ రైతు, రైతుకూలి, కార్మికుడు ఒక పోరాట శక్తిగా రూపొందిన కాలం అది. అటు భూస్వామ్య పీడననూ ఇటు వలసవాద ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను ఎదుర్కోవడంలో లక్షలాది మంది బడుగు జీవులు కేవలం తమ ఆర్థిక డిమాండ్ల సాధనకోసమేకాక, ప్రజలందరి హక్కుల సాధనకోసం కూడా పోరాడేటట్లు తీర్చిదిద్దిన ఘనత ఆనాటి కమ్యూనిస్టు ఉద్యమానిది.

భారత కమ్యూనిస్టు ఉద్యమం తొలిదశలో అత్యున్నత స్థాయికి చెందిన నాయకులను, ఆలోచనాపరులను, కార్యకర్తలను సామాన్య ప్రజల నుండి తయారుచేసుకోగలిగింది. నిస్వార్థం, త్యాగం, ప్రజా శ్రేయస్సుకు అంకితం కావడం, ప్రజాస్వామికంగా వ్యవహరించడం వంటి గొప్ప మానవతా విలువలతో కూడిన నాయకులను కార్యకర్తలను రూపొందించుకున్నది. ఈ నూతన ఆదర్శాల మేళవింపుతో కూడిన జీవితాన్ని ఒక ఆచరణీయమైన నమూనాగా ప్రజల ముందు ఉంచగలిగింది.

మొత్తంగా చూస్తే పార్టీ ఏర్పడిన తరవాత తొలి మూడు లేక నాలుగు దశాబ్దాల వరకు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర శ్లాఘనీయమైనది. లక్షలాది మంది ప్రజలను వివిధ రకాల ఉద్యమాలలో సమీకరించింది. వేలాది మంది తీవ్ర నిర్బంధాలకు, చిత్రహింసలకు గురయ్యారు. కుట్ర కేసులను ఎదుర్కొన్నారు. రాజ్య క్రూరత్వానికి బలై అమరులయ్యారు.

అదే సమయంలో మరోపక్కచూస్తే తొలినాటి కమ్యూనిస్టు ఉద్యమం రాజకీయ రంగంతోపాటు సాహిత్య, కళా రంగాలలో కూడా గణనీయమైన మార్పుని సాధించింది. అప్పటివరకు రచయితల దృష్టి ప్రసరించని నూతన సమూహాల జీవితాలలోని చీకటి కోణాలను మార్క్సిజం ప్రభావంలో ఉన్న రచయితలు ఆవిష్కరించారు. కథావస్తువులు మారిపోయాయి. ప్రజల నోటిమాట, భాష సాహిత్య పలుకుబడిగా ఆదరణ పొందాయి. కళారంగంలో సంప్రదాయానికి భిన్నంగా అప్పటికే ప్రపంచంలో ప్రబలంగా ఉన్న నూతన ప్రజాకళా ధోరణులు మన దేశంలోకి ప్రవేశించాయి. ఈ మార్పు చిత్రకళారంగాన్ని, సినిమారంగాన్ని కూడా తాకింది.

ప్రతికూలాంశాలు

ఏర్పడిన తొలి కాలంలో ఇంతగా ప్రజల గుర్తింపును పొందిన, మానవ జీవనంలోని వివిధ అంశాలను తీవ్రంగా ప్రభావితం చేసిన, బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో గాంధీ నాయకత్వ స్రవంతికి ప్రత్యామ్నాయంగా ప్రజా పోరాటాల, వర్గపోరాటాల స్రవంతిని ప్రారంభించిన కమ్యూనిస్టు ఉద్యమం తీవ్ర నిస్తేజానికి, నిస్తబ్ధతకు గురై, అనేకానేక బూర్జువా పార్టీలలోపాటు కమ్యూనిస్టు పార్టీ కూడా ఒకటి అని ప్రజలు అనుకునే స్థాయికి దిగజారింది. రష్యాలోనైనా, చైనాలోనైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కొద్దికాలంలోనే విప్లవాలు విజయవంతమవ్వగా భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం విప్లవాన్ని విజయవంతంచేసే స్థాయికి చేరడం అటుంచి క్రమక్రమంగా నీరసించి బలహీనపడి పోయింది. నేటి సమాజం మీద దాని ముద్ర కనుమరుగైపోయింది. ఈ స్థితికి చేరడానికి దారితీసిన కారణాలను నిజాయితీగా పరిశీలించడం ఎంతైనా అవసరం. బాహ్య పరిస్థితులు అనుకూలంగా లేకపోవడమే ఇందుకు కారణం అనుకుంటే అంతకు మించిన స్వీయద్రోహం మరొకటుండదు. అందుచేత ప్రజా పునాది మీద బలమైన, విస్తృతమైన కమ్యూనిస్టు ఉద్యమం రూపొందాలని నిజాయితీగా కోరుకునేవాళ్లు ఎవరైనా వస్తుగతమైన, లోతైన ఆలోచనలను చేయాల్సిన అవసరం ఉన్నది.

కామ్రేడ్ మావో చెప్పినట్లు ముందు పోతున్న బండి కిందపడిపోతే వెనకనున్న బండి నడిపే వ్యక్తి అందుకు గల కారణాలను సక్రమంగా అవగాహన చేసుకుంటే తప్ప తన బండిని గమ్యస్థానానికి చేర్చలేడు.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన లోపం మార్క్సియన్ తత్వశాస్త్రాన్ని సక్రమంగా అవగాహన చేసుకోలేకపోవడం. మార్క్సిజాన్ని ఒక పరిశీలనా పద్ధతిగా, ఆచరణీయమైన అన్వయ శాస్త్రంగా అవగాహన చేసుకోకపోవడం అతి పెద్ద బలహీనత. మార్క్సిస్టు మూల సూత్రాలను గతితార్కికంగా, చారిత్రక భౌతికవాద దృష్టితో అర్థం చేసుకొని సరైన

జ్ఞానాన్ని పొందలేకపోవడం. దీని కారణంగానే కమ్యూనిస్టు నాయకత్వంలో కూడా భావవాదపు సనాతన ఆలోచనా ఛాయలు మనకు కనపడతాయి. సమాజాన్ని మార్చడంలో, ప్రజలలో చైతన్యీకరణను పెంచడంలో భావజాల ప్రచారానికున్న ప్రాధాన్యతను గుర్తించలేదు. ప్రజలలోనూ అంతకంటే ముఖ్యంగా పార్టీ సభ్యులలో, కార్యకర్తలలో మార్క్సిస్టు సైద్ధాంతిక అవగాహనకు కల్గించే ఎజెండాను ఉద్యమం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఒక వ్యక్తి అనేకానేక పరిస్థితుల ప్రభావంలో కమ్యూనిస్టు ఉద్యమానికి దగ్గర అవుతాడు లేదా పార్టీ సభ్యుడవుతాడు. అంతమాత్రాన ఆ వ్యక్తిలో కమ్యూనిస్టు భావజాల చైతన్యం ఉన్నదని అనుకోవటానికి వీల్లేదు. కార్మికులందరికి కార్మికవర్గ చైతన్యం దానంతట అదే రాదు. అలాంటి కార్మికవర్గ, కమ్యూనిస్టు చైతన్యాన్ని కల్గించాలంటే మార్క్సిస్టు భావజాలాన్ని నిరంతరం ప్రచారం చేయడం, పార్టీలోనూ ప్రజా సంఘాలలోనూ నిరంతర అధ్యయనాన్ని ప్రోత్సహించడం ఉద్యమ బాధ్యత. అత్యంత ప్రధానమైన ఈ బాధ్యతను కమ్యూనిస్టు ఉద్యమం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

మార్క్సిజం ప్రధానంగా అన్వయ శాస్త్రం. నిర్దిష్ట సమాజ స్థితికి అనుగుణంగా మార్క్సిస్టు మూల సూత్రాలను అన్వయించుకోవలసిన బాధ్యత పార్టీ నాయకత్వానిది. అలాకాకుండా మార్క్స్ రచనలలోనూ లెనిన్ రచనలలోనూ ఉన్న వాక్యాలను చిలక పలుకుల్లాగా ఉటంకిస్తూ సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తే అది యాంత్రిక వాదం అవుతుంది. ఏ సమాజాన్నయితే సమూలంగా మార్చాలని కమ్యూనిస్టు పార్టీ భావిస్తుందో ఆ సమాజపు మూలాలను ఉద్యమ నాయకత్వం శోధించగలగాలి. ప్రతి సమాజానికి తనదంటూ విలక్షణమైన నాగరికత, సంస్కృతి, విలువలు, అలవాట్లు, కట్టుబాట్లు ఉంటాయి. ప్రతి సమాజం మీద వేల సంవత్సరాల ప్రాచీన భూస్వామ్య, రాజరిక వ్యవస్థల, మత వ్యవస్థల పట్టు బలంగా ఉంటుంది. ఆయా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ప్రజలను దోపిడీ చేయడానికి, కర్మవాదానికి గురిచేయడానికి ఉపకరించే రీతిలో పురాణాలు, ఇతిహాసాలు, నైతిక సూత్రాల గ్రంథాలు ఉంటాయి. ఇది ప్రజా జీవితంలో అంతర్భాగం అయిపోతాయి. వీటి విష కౌగిలి నుంచి ప్రజలను బయటపడేయాలంటే ముందు వాటిని అధ్యయనం చేయాలి. ఏ వ్యవస్థను నీవు నిర్మూలించదలచుకొన్నావో ఆ వ్యవస్థ మూలాల్ని నీవు అర్థం చేసుకోవాలనీ, చైనా సమాజం మీద విస్తరించిన కన్‌ఫ్యూషియస్ భావజాలాన్ని ప్రజల మనస్సుల నుండి తొలగించకుండా వాళ్ల మనస్సుల్లోకి కమ్యూనిస్టు భావజాలాన్ని ఎక్కించలేమని మావో అన్నారు. అయితే ఆ పనిచేయాలంటే ముందుగా కన్‌ఫ్యూషియస్ భావజాలాన్ని లోతుగా అధ్యయనం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాంటి స్థితే మన దేశంలోనూ ఉంది. మను ధర్మశాస్త్రం, కౌటిల్యుని కుటిలనీతి, అన్నింటికి వేదాలే మూలం అనే సనాతన భావన మన సమాజంలో పాతుకుపోయాయి. ఇప్పటికీ వీటి పట్టు ఈ దేశ ప్రజలమీద వర్గాల కతీతంగా బలంగా ఉంది. ఉపనిషత్తులు, రామాయణం, భారతం, భాగవతం వంటి ఇతిహాసాలు ఈ దేశీయుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. ఆ ప్రభావాన్ని నిర్వీర్యం చేయాలంటే భారత కమ్యూనిస్టు ఉద్యమం వాటిని కూలంకషంగా అధ్యయనం చేయాలి. వాటిలో ఉన్న అపచైతన్యాన్ని ఎండగట్టాలి. వాటి వెనుక ఉన్న ఆధిపత్య వర్గాల ప్రయోజనాల్ని ప్రజలకు ఎరుక పరచాలి. అలాంటి ప్రయత్నం ఇక్కడ అరకొరగా, అందులోనూ తొలికాలంలో మాత్రమే జరిగింది.

సైద్ధాంతిక భావజాల అధ్యయనం పట్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం ప్రదర్శించిన నిర్లక్ష్య ఫలితాన్ని మరొక కోణం నుండి కూడా పరిశీలించవచ్చు. మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రతిపాదించిన సిద్ధాంతానికి లెనిన్ ఆచరణాత్మక మెరుగులు దిద్దాడు. స్టాలిన్ కూడా విప్లవ కేంద్రాన్ని కాపాడే క్రమంలో సామ్రాజ్యవాద దేశాలతో నిరంతరం ప్రత్యక్ష, ప్రచ్ఛన్న యుద్ధ ప్రమాదాన్ని ఎదుర్కొంటూ కూడా మార్క్సిజానికి భాష, జాతుల సమస్యవంటి విషయాలలో కొన్ని చేర్పులు చేశారు. చైనా విప్లవ క్రమంలో మావో ఒకవైపు పటిష్టవంతమైన విప్లవ పోరాట సైనిక వ్యూహాన్ని, ఎత్తుగడల్ని తన దేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందిస్తూనే మరోపక్క మార్క్సిజాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తూ సుసంపన్నం చేశారు. ఆచరణ, వైరుధ్యాలు, ఐక్యసంఘటన, రచయితలకు, కళాకారులకు దిశా నిర్దేశం చేయడం, వ్యవసాయిక విప్లవం, సాంస్కృతిక విప్లవం వంటి అనేక అంశాలపై నూతన సూత్రీకరణలను రూపొందించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమం తొలితరం నాయకత్వంతో పోల్చుకుంటే స్టాలిన్, మావోలు విద్యాధికులేమీ కాదు. కాని భారత కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం, మార్క్సియన్ సిద్ధాంతానికి దేశీయమైన చేర్పులు చేసి పరిపుష్టం చేసిన ఉదాహరణ ఒక్కటి కూడా లేదు. దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి.

ఒకటి, మార్క్సిజాన్ని తాత్విక సిద్ధాంతంగా అర్థం చేసుకొని దాన్ని చైతన్యీకరణకు అన్వయించకపోవటం. రెండు, భారత సమాజపు నిర్దిష్ట పరిస్థితినీ ఈ సమాజాన్ని వేల సంవత్సరాలుగా పట్టి పీడిస్తున్న కులం, మతం, పితృస్వామ్యం వంటి సామాజిక సమస్యల్ని, సామాన్య ప్రజల మానసిక స్థితిని అంచనా వేయలేకపోవడం. ఇలాంటి స్థితిలో ఉన్న నాయకత్వం సహజంగానే కింది నాయకత్వాన్ని గానీ, కార్యకర్తలను గానీ సిద్ధాంతపరంగా చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టలేదు. ఒకవేళ చేపట్టినా అవి అరా కొరా చర్యలు మాత్రమే. కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నంత మాత్రాన వ్యక్తికి కమ్యూనిస్టు భావజాలం అబ్బింది అనుకోవడం భ్రమ. ఉద్యమాల క్రమంలో పార్టీకి దగ్గరైన వివిధ వర్గాల ప్రజల్లో కమ్యూనిస్టు భావజాలాన్ని, చైతన్యాన్ని అందించాల్సిన బాధ్యత పార్టీది. దాన్ని నిర్లక్ష్యం చేస్తే పార్టీలోనూ, ప్రజా సంఘాలలోనూ అనేక అన్యవర్గ పెడధోరణులు ప్రబలుతాయి. సమస్యను అవగాహన చేసుకోవడంలోనూ, పరిష్కారాన్ని తెలుసుకోవడంలోనూ సభ్యులు భావ వాదానికి, వ్యక్తి వాదానికి గురి అవుతారు. ఈ క్రమం మెల్లగా పార్టీని చీడపురుగులా తొలిచివేస్తుంది. రూపం గంభీరంగా ఉండవచ్చుగాని సారం నిర్జీవంగా ఉంటుంది.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మరొక ప్రధానమైన బలహీనత మార్క్సిజాన్ని కేవలం ఒక రాజకీయ ఎజెండాగా మాత్రమే భావించడం. మిగిలిన బూర్జువా పార్టీల లాగానే కమ్యూనిస్టు పార్టీ కూడా ఎన్నికలలో పోటీచేసే ఒకానొక రాజకీయ పార్టీ అనే భావన పార్టీలో అన్ని స్థాయిలలో బలపడింది. నిజానికి మార్క్సిజం ఒక సమగ్ర సిద్ధాంతం. మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను ప్రభావితం చేసే శక్తి దానికున్నది. బూర్జువా పార్టీలకు, కమ్యూనిస్టు పార్టీకి ఉండే మౌలికమైన వ్యత్యాసం అదే. అది ప్రజలను అన్ని రకాల దోపిడీల నుండి అంతిమంగా విముక్తి చేసే లక్ష్యంతో ఏర్పడింది. ఆ అంతిమ లక్ష్య సాధనకోసం ప్రయాణించే క్రమంలో సమాజంలో ఉండే వివిధ రకాల వైరుధ్యాలను అవగాహన చేసుకొని, వాటి పరిష్కారానికి సరైన మార్గాలను అనుసరిస్తూ, శత్రువును ఏకాకిని చేస్తూ, తన మిత్రులను పెంచుకుంటూ ముందుకు సాగితే

తప్ప విప్లవం విజయవంతం కాదు. అదే సమయంలో ఎప్పటికప్పుడు భూస్వామ్య భావజాలాన్ని, విలువలను ఎండగడుతూ వాటికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు ఆదర్శాలను, విలువలను ప్రయోగాత్మకంగా ఆచరణలో విజయవంతం చేయడమే కమ్యూనిస్టు ఉద్యమ గొప్పదనం. అదే విధంగా కులం, మతం, పురుషస్వామ్యం, జాతి, తెగ, ఆదివాసి, భాష, సంప్రదాయాలు వంటి సామాజిక సమస్యల మీద ఒక నూతన ఎరుకను ప్రజలలో కలిగించాల్సిన బాధ్యత కూడా కమ్యూనిస్టు ఉద్యమానిదే. ఆ క్రమంలోనే అది తన సభ్యులలో తలయెత్తే పెడధోరణులను నిర్మూలించగలుగుతుంది. అంటే కమ్యూనిస్టు పార్టీకి విశాలమైన, వైవిధ్య భరితమైన, దీర్ఘకాలిక ఎజెండా ఉండాలని అర్థం. బూర్జువా పార్టీలకు అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక ఎజెండా. కాని కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం దీనంతటినీ విస్మరించి కమ్యూనిస్టు పార్టీని కూడా క్రమంగా ఎన్నికల ఎజెండాకు కుదించివేసింది.

పార్లమెంటరిజానికి, చట్ట సభలలో స్థానాలు సంపాదించడానికి మధ్యగల మౌలికమైన తేడాను నాయకత్వం అర్థం చేసుకోలేదు. పార్లమెంటరిజం అంటే కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే కాదు. బూర్జువా రాజ్యాంగం ఇచ్చే అన్ని అవకాశాలను తన భావజాల ప్రచారానికి, వివిధ ప్రజా శ్రేణులను సంఘటితం చేసుకోవడానికి, ప్రజా ఉద్యమాల నిర్మాణానికి ఉపయోగించుకోవడం. పార్లమెంటు వేదికగా పాలకవర్గాన్ని ఎండగట్టడం. బూర్జువా రాజ్యాంగం బయటకు ఎంత ఉన్నతమైనదిగా ఆదర్శవంతమైనదిగా కనిపించినా అంతిమ ఆచరణలో అది ఆధిపత్య వర్గాల చేతి పనిముట్టుగా ఎలా ఉపయోగపడుతుందో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంతిమంగా బూర్జువా నియంతృత్వంగా ఎలా పరిణామం చెందిందో ప్రజలకు అర్థం చేయించడానికి శాసన సభలను వేదికలుగా ఉపయోగించగలగాలి. అంతేగాని చట్ట సభల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలనుకోవడం అచారిత్రకం, పెద్ద భ్రమ. ఈ భ్రమకు కమ్యూనిస్టు ఉద్యమం పూర్తిగా లోనైంది. దాని ఫలితమే విప్లవచేవ చచ్చి, రాజకీయ అవకాశవాదంతో సహా బూర్జువా పార్టీలలో ఉండే సకల అవలక్షణాలు కమ్యూనిస్టు పార్టీల్లో ప్రవేశించాయి. ప్రజలలో పోరాటశీలతను పెంచడానికి బదులుగా వాళ్లలో ఎన్నికల మీదా, బూర్జువా రాజ్యాంగం మీదా నమ్మకాన్ని పెంచి, ప్రజలను కేవలం ఓటర్లుగా పరిగణించే స్థాయికి పార్టీలు దిగజారాయి. వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించుకోవడానికి బదులు ఎన్నికల్లో ఎలాగోలా ఎక్కువ సీట్లు సంపాదించుకోవడం మీదే దృష్టి కేంద్రీకరించాయి. దీని ఫలితంగానే పార్టీలో అవకాశవాదంతో పాటు అవినీతి, బూర్జువా పార్టీల తోకపట్టుకొని ప్రయాణించే అవలక్షణం ప్రబలింది.

కమ్యూనిస్టు పార్టీ శ్రామికవర్గం తరఫున రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్నది మార్క్సిజం మౌలిక సూత్రం. రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం అంటే, రాజ్యాంగ యంత్రం మీద ఆధిపత్యాన్ని సంపాదించడం. అప్పుడే పాత రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి శ్రామికవర్గ ప్రయోజనాలను కాపాడే నూతన రాజ్యాంగాన్ని నిర్మాణం చేయడం సాధ్యమవుతుంది. శ్రామిక రాజ్య, సమసమాజ స్థాపన దిశగా ప్రయాణించడానికి అవకాశం ఏర్పడుతుంది. కేవలం కొన్ని రాష్ట్రాలలో అధికారాన్ని సంపాదించినంత మాత్రాన ఇది సాధ్యం కాదు. ఈ దిశలో ప్రయాణించిన ఫలితంగానే పార్టీలు ఆర్థికవాద ఊబిలో కూరుకుపోయాయి. తొలి దశాబ్దిలో వెల్లువెత్తిన పోరాట చైతన్యం నీరుగారిపోయింది. పార్టీ నిర్మాణంలోనూ ఆచరణలోనూ మార్క్సిస్టు విలువలు శూన్యమైపోయాయి.

విప్లవం విజయవంతం కావాలంటే, దేశంలో విప్లవకర కమ్యూనిస్టు పార్టీ వుండాలనీ, దాని నాయకత్వానికి ఆగామి దృష్టి, దార్శనికత అవసరమని కామ్రేడ్ స్టాలిన్ చెప్పాడు. అంటే సమాజపు చలనాల్ని గతితార్కిక దృష్టితో ముందుగానే పసిగడుతూ దానికనుగుణంగా ఎత్తుగడల్ని రూపొందించుకోగలిగిన స్థితి నాయకత్వంలో ఉండాలి. అలాంటి అవగాహన ఉంటే తప్ప ఎప్పటికప్పుడు తలెత్తే సమస్యల్ని మార్క్సియన్ భావజాల అన్వయింపు వెలుగులో అవగాహన చేసుకునే పరిస్థితి ఉండదు. పార్టీ తనదైన దీర్ఘకాలిక ఎజెండాను రూపొందించుకోవడానికి బదులు పాలకవర్గాల ఎజెండాల సుడిగుండంలో చిక్కుకుపోతుంది. మార్క్సేతర ఆలోచనాపరుల విపరీతపు, వితండ వాదాలను ఎదుర్కోలేక ఆత్మరక్షణ స్థితిలో పడిపోతుంది. రష్యాలో వ్యవస్థ కుప్పకూలిపోవడం, తూర్పు ఐరోపా దేశాలలో సంపన్న వర్గాలు తిరిగి అధికారంలోకి రావడం, కమ్యూనిజానికి కాలం చెల్లిందనే సిద్ధాంతం ప్రబలడం వంటివి జరిగినప్పుడు భారత కమ్యూనిస్టు నాయకత్వం వాటిని అర్థం చేసుకుని తిప్పి కొట్టలేని నిస్సహాయ స్థితిలో పడిపోవడం దీనికి ఉదాహరణ. అదేవిధంగా దళిత, స్త్రీవాద, ముస్లిం మైనారిటీ అస్తిత్వవాద ఉద్యమాలు తలెత్తినప్పుడు కూడా పార్టీలు గందరగోళపడి వాటిపట్ల అచారిత్రక, అపసవ్య వైఖరులను అవలంబించడం కూడా పార్టీల్లో లోపించిన దార్శనికతకు తార్కాణం.

ఈ లోపాలన్నింటితోపాటు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాల్లో అతి ముఖ్యమైనవాటిని ఇక్కడి ఉద్యమం నిర్లక్ష్యం చేసింది. అందులో మొదటిది కేంద్రీకృత ప్రజాస్వామ్యం. అంటే అర్థం పార్టీలో ఏ నిర్ణయమైనా కిందిస్థాయిలో జరగాలి. పైస్థాయి కమిటీలు కింది స్థాయి కమిటీల నిర్ణయాలను అమలుపరిచే యంత్రాంగంగా, వాటిని గైడ్‌చేసేవిగా మాత్రమే ఉండాలి. ఇది పార్టీలో ప్రజాస్వామ్యానికి షరతు. దీన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగానే కమ్యూనిస్టు పార్టీల్లో బ్యూరాక్రాటిక్ తత్వం పెరిగింది. ఇది అంతిమంగా నాయకత్వపు నియంతృత్వానికి దారితీస్తుంది. కిందిస్థాయి కమిటీలు, సాధారణ పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు చొరవను కోల్పోతారు. చైతన్యశీలత తగ్గిపోతుంది. సృజనాత్మకత లోపించి ప్రతి విషయంలోనూ పై స్థాయి నాయకుల ఆదేశాల కోసం ఎదురుచూసే స్థితి రూపొందుతుంది. ఫలితంగా సమాజంలో ఉండే ఆధిపత్య భావజాలం పార్టీలోనూ బలపడి చెప్పేవాళ్లు కొందరు, చేసేవాళ్లు కొందరు అనే పద్ధతి ప్రారంభమవుతుంది.

రెండో సూత్రం, విమర్శ-స్వీయ విమర్శ. ఇది అతి ముఖ్యమైన మార్క్సియన్ పద్ధతి. వర్గ సమాజంలో జీవించే మనం తప్పనిసరిగా నిత్య జీవితంలో అనేకానేక అపచైతన్యాలకు, అన్యవర్గ భావాలకు గురి అవుతాం. ఎప్పటికప్పుడు మనల్ని మనం విమర్శనాత్మకంగా పరిశీలించుకుని, లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకోకపోతే మనం కమ్యూనిస్టులంగా మిగలం. ఇది మొక్కుబడి కోసం రూపొందిన సూత్రం కాదు. దీన్ని సక్రమంగా వినియోగించుకుంటే తప్ప పార్టీలో ప్రవేశించిన అన్యవర్గ, పెత్తందారీ ధోరణులను రూపుమాపడం సాధ్యం కాదు. సరైన, నిజాయితీతో కూడిన విమర్శకు అవకాశం లేకపోతే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం క్షీణించి, కొందరు నాయకుల ముఠాగా పార్టీ

మిగిలిపోతుంది. ఇలాంటి చీడపురుగు ప్రవేశించినందుచేతనే మావో "బంబార్డ్ ది హెడ్‌క్వార్టర్స్" అనే నినాదాన్ని సాంస్కృతిక విప్లవకాలంలో ఇచ్చారు. నాయకత్వాన్ని ప్రశ్నించే, విమర్శించే అవకాశం పార్టీకి ఆక్సిజన్‌లాంటిది. ఇంతటి శక్తివంతమైన విమర్శ-స్వీయ విమర్శను భారత కమ్యూనిస్టు ఉద్యమం అమలుపరిచిన దాఖలాలు ఏమీ కనపడవు.


మూడోది, పార్టీలో వివిధ పంథాల మధ్య సైద్ధాంతిక పోరాటాన్ని నిర్వహించడం. కమ్యూనిస్టులు సృజనశీలురు. ఆ కారణంగా వాళ్లకు స్వీయభావాలు ఉంటాయి. భావాలు కలిగివుండడం దానంతట అది తప్పుకాదు. అది క్రమశిక్షణా వ్యతిరేకమూ కాదు. పార్టీలో పంథాల మధ్య భిన్నాభిప్రాయాలుండడం సహజమూ, ఉపయోగకరం కూడా. నిజానికి ఇది కార్యకర్తల్ని రాజకీయంగా చైతన్యవంతుల్ని చేయడానికి ఉపకరిస్తుంది. దీన్ని ఎంత ప్రజాస్వామికంగా నిర్వహిస్తే పార్టీ అంత శక్తివంతం అవుతుంది. ఇలాంటి భిన్నాభిప్రాయాలు తలెత్తినప్పుడు వాటిని ఎలా పరిష్కరించుకోవాలో చరిత్ర తెలియజేస్తుంది. భిన్నాభిప్రాయాన్ని ఆహ్వానించడం, గౌరవించడం, చర్చకు అవకాశం ఇవ్వడం ఉత్తమ కమ్యూనిస్టు విలువ. రష్యాలోనూ, చైనాలోనూ కమ్యూనిస్టు పార్టీలు ఒకవైపు విప్లవాన్ని నిర్వహిస్తూనే మరోవైపు భిన్న పంథాల మధ్య పోరాటాన్ని ఆదర్శవంతంగా నిర్వహించాయి కాబట్టే ఆ పార్టీల్లో చీలికలు పేలికలు ఏర్పడలేదు. సాంస్కృతిక విప్లవకాలంలో మావో, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసేవాళ్లమీద ముద్రలు వేయకండి అని పిలుపునిచ్చారు. రివిజనిజం మీద సైద్ధాంతికంగా పోరాడాలేగానీ, రివిజనిస్టుల మీద కాదు అన్నారు. ఇలాంటి ధోరణి మనదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో లేదు. భిన్నాభిప్రాయాన్ని సహించలేకపోవడం, దాన్ని వ్యక్తం చేసినవాళ్లను క్రమశిక్షణా చర్య పేరుతో లొంగదీసుకోవడం ఇక్కడి ఉద్యమానికి చేటు తెచ్చింది. మనదేశంలో కొన్ని పదుల కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడడానికి విమర్శ-స్వీయ విమర్శ, రెండు పంథాల మధ్య పోరాటం సక్రమంగా జరగకపోవడమే ప్రధాన కారణం.

మనదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైన తొలి కాలంలో మన శత్రువులు కూడా మనల్ని ఆదర్శనీయమైన వ్యక్తులుగా గుర్తించకతప్పని పరిస్థితి ఉండేది. కాని క్రమక్రమంగా కమ్యూనిస్టు పార్టీలు బూర్జువా పార్టీల స్థాయికి దిగజారి ఆ బూర్జువా విలువలే ఉద్యమంలోనూ ప్రవేశించాయి. మత సంప్రదాయాలు, కుల పట్టింపులు, సంప్రదాయ వివాహపద్ధతి, మగపెత్తనం, వ్యాపారీకరణ, ఆర్థిక అరాచకవాదం, రాజకీయ అవకాశవాదం, పెత్తందారీతనం వంటి లక్షణాలన్నీ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ప్రవేశించాయి. కమ్యూనిస్టులంటే ప్రత్యేకమైన గౌరవం లేకుండా పోయింది. వాళ్లు ఆదర్శవంతమైన ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని సమాజం ముందుంచడంలో విఫలమయ్యారు. తాము పార్టీలో పనిచేస్తున్నా, కమ్యూనిస్టు నైతికతను తమ జీవనానికి అన్వయించుకోలేక పోయారు. కనీసం తమ కుటుంబ సభ్యులనైనా ప్రభావితం చేయలేని దుస్థితి ఏర్పడింది. వీళ్లూ అందరిలాంటివాళ్లే అనే చులకన భావన ఏర్పడింది. సాంస్కృతిక జీవనంలో ప్రత్యామ్నాయ విలువలని ఆచరణీయంగా చూపించని ఏ ఉద్యమాన్నీ ప్రజలు గౌరవించరు. అది అంతిమంగా ఉద్యమాలు నీరుగారిపోవడానికి దారితీస్తుంది.

ఈ లోపాలు, విమర్శలు ఎవరినీ నిరుత్సాహపరచడానికి కాదు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిపోయిందని వాదించడానికి కాదు. దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమమంతా ఇంతటి పెడధోరణులకు గురై దారితప్పిందని నా అభిప్రాయం కాదు. ఈ విష కౌగిలి నుండి తప్పించుకుంటూ మార్క్సిజాన్ని శాస్త్రంగానూ, శస్త్రంగానూ పరిగణిస్తూ, సమాజపు చలనశీలతను అర్థం చేసుకుంటూ విముక్తి దిశగా ప్రజలను ముందుకు నడిపిస్తూ, వాళ్లతో కలసి అడుగులు వేస్తున్న శక్తులు ఇంకా మిగిలే ఉన్నాయి. సమాజంలో తలెత్తుతున్న నూతన వైరుధ్యాలను గుర్తించి, మార్క్సిజం లెనినిజం వెలుగులో వాటి పరిష్కారాల గురించి ప్రయత్నిస్తున్న శక్తులు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను, నూతన ఆలోచనలను, ధోరణులను, వాదాలను పరిశీలిస్తూ వాటిని స్థానిక పరిస్థితులకు అన్వయిస్తూ మార్క్సియన్ భావజాలాన్ని పటిష్టవంతం చేస్తున్న శక్తులూ ఉన్నాయి. పార్టీ నాయకులో, కార్యకర్తలో తమను విముక్తి చేస్తారనే పరాధీన భావనను తొలగించి, ప్రజలలో స్వీయ విముక్తి చైతన్యాన్ని పెంపొందిస్తున్న శక్తులు కూడా ఉన్నాయి. ఇవే స్టాలిన్ చెప్పినట్లు ఆగామి దృష్టిగల దార్శనిక శక్తులు. వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అందిస్తున్న అద్భుతమైన గుణపాఠాలను స్వీకరిస్తూ, రివిజనిస్టు చీడ తమ నిర్మాణంలో, చైతన్యంలో చొరబారకుండా కాపాడుకుంటే ఈ శక్తులే రాబోయే కాలపు కమ్యూనిస్టు విప్లవ వేగుచుక్కలవుతాయి.

(రచయిత విప్లవ రచయితల సంఘం సభ్యులు) వీ

దేవిప్రియ



కవి, సీనియర్ పాత్రికేయులు, దేవిప్రియగా పాఠకులకు తెలిసిన ఖాజా హుస్సేన్ (72) అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 21న మృతి చెందారు. దేవిప్రియ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, తాడికొండ. ఆంధ్రజ్యోతి, ఉదయం పత్రికల్లో రన్నింగ్ కామెంట్రీ రాశారు. ప్రజాతంత్ర, హైదరాబాద్ మిర్రర్, మనోరమలతో పాటు సిటీలైన్ ఆంగ్ల పత్రికలోనూ టివి చానళ్లలోనూ పనిచేశారు. 1970లో అక్షరాస్త్రం పట్టిన పైగంబర కవుల్లో దేవీప్రియ ఒకరు. అమ్మచెట్టు, సమాజానంద స్వామి, గరీబు గీతాలు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, చేప చిలుక, అరణ్యపురాణం, గంధకుటి, పిట్ట కూడా ఎగిరిపోవాల్సిందే, గాలిరంగు, తదితర పుస్తకాలు రాశారు. ఆకాశవాణి కోసం 'రాణీపువ్వు' నృత్యరూపకం, 'ఆడతోడు-మగనీడ' నాటిక, మహాత్ముడు, పట్టాలు తప్పిన బండి, కాలం కార్చిన కన్నీరు తదితర రంగస్థల నాటికలతోపాటు గేయాలు, పద్యాలు రాశారు. గాలి రంగు కవితా సంపుటికి 2017, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. అమ్మచెట్టు కవితా సంకలనానికి ఫ్రీవర్స్ ఫ్రంట్‌తో పాటు తెలుగు యూనివర్సిటీ సాహిత్య ఉత్తమ సాహిత్య పురస్కారం, ఆంధ్రప్రదేశ్ హంస అవార్డు అందుకున్నారు.

ఓడిపోయినా కొనసాగుతున్న ట్రంపిజం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించాలనే ఉద్దేశ్యంతోనే బైడెన్ నెగ్గాడు గానీ విధానాల అమల్లో ఒకటేననీ, అధికారం పట్ల పాలకులకు ఉండే పిచ్చి ట్రంప్‌లో కనబడుతోందనీ అంటున్నారు రాజేంద్రబాబు అర్విణి

"ట్రంప్ ఓడిపోయాడు, కాని ట్రంపిజం కొనసాగుతూనే ఉన్నది" అని ఒక అంతర్జాతీయ టి.వి. ఛానల్ వ్యాఖ్యానించింది. అవును నిజం! ట్రంప్ వ్యవహార పద్ధతులు, ఒక రాజ్యాధినేతగా ఆయన నియమ విరుద్ధ ఆలోచనా సరళి, పాలనా పద్ధతులు సమర్థించి ఆయనకు ఓటేసిన వాళ్లు అమెరికాలో 7 కోట్ల మంది ఉన్నారు. అమెరికాలో నివసించే వారి జనాభా 33 కోట్లకు పైచిలుకుగా ఉన్నా, రిజిస్టర్డ్ ఓటర్లు 15 కోట్ల 30 లక్షలు మాత్రమే. పోలయిన ఓట్లలో 7 కోట్లు ట్రంప్‌కు వస్తే, 7 కోట్ల 40 లక్షల ఓట్లు బైడన్‌కు వచ్చాయి. జ్యాత్యహంకారం కలిగిన వాళ్లు, తెల్ల రంగు చర్మంతో పుట్టిన వాళ్లు ఇతరుల కంటే అధికులు అని విశ్వసించే వాళ్లు, మనుషుల మధ్య విభజన వాదాన్ని సంకల్పితంగానో, అసంకల్పితంగానో సమర్థించే వాళ్లు, మహిళలు పురుషుల సెక్స్ అవసరాల కోసమే పుట్టారని భావించేవాళ్లు (తన కూతురు ఇవాంకా ట్రంప్ అవయవ సౌష్టవాన్ని పొగుడుతూ ఆమె తన కూతురు కాకపోయి ఉంటే ఆమెతో డేటింగ్ చేసి ఉండేవాణ్ణి అని నిర్లజ్జగా అసాంఘిక నీచ సంస్కృతికి ప్రతినిధిగా డోనాల్డ్ ట్రంప్ చెప్పిన మాట గుర్తుందా!) అమెరికాలో నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటేశారు. "ట్రంప్ వంటి మిత్రుడు ఉంటే చాలు ... ప్రత్యేకంగా వేరే శత్రువులు ఉండాల్సిన అవసరం లేదు" అని ఐరోపా సంఘం అధ్యక్షుడిగా ఓ సంవత్సరం క్రితం వరకు పనిచేసిన డోనాల్డ్ టస్క్ పేర్కొన్నాడంటే ఆయన వ్యహారశైలి ఎంత ప్రజా వ్యతిరేకమయినదో అర్థం చేసుకోవచ్చు. కరోనా మహమ్మారి గురించి ఎంత నిర్లక్ష్యం వహించాడో, కోటి మందికి పైగా ఆ వ్యాధి వ్యాపించినా, ఆ దేశంలో కరోనా మృతుల సంఖ్య లక్షల్లో ఉన్నా, అమెరికన్లను కరోనా ఏమీ చెయ్యలేదులే అని మూర్ఖంగా వాదిస్తూ, బహిరంగ సభల్లో మూతికి కట్టుకున్న మాస్కును తీసి గాల్లోకి విసిరేసి మాస్క్ ధరించడాన్ని ఎద్దేవా చేసిన వైనం ప్రపంచం మొత్తం టి.వి. లలో వీక్షించింది. అమెరికాలో వైరస్ బారినపడింది ఎక్కువగా అల్పాదాయ వర్గాల నల్ల జాతి ప్రజలే అన్న సంగతి అందరికీ తెలిసిందే. నల్ల జాతి ప్రజల పట్ల, పేద ప్రజల పట్ల ట్రంప్‌కున్న నిర్లక్ష్య భావమే ఈ వైఖరికి కారణం.

బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజిక ఆలోచనాశీలి, రాజకీయ విశ్లేషకుడు, భాషా శాస్త్రవేత్త, ప్రపంచ మేధావి వర్గంలో సముచిత స్థానం పొందినవాడు అయిన నోమ్ చామ్స్కీ మామూలుగా ఎన్నికల ప్రచారానికి గాని, ఎన్నికల ప్రహసనానికి గాని దూరంగా ఉంటాడు. ఎన్నికల ద్వారా వ్యవస్థలో మార్పు రాదు అని ఆయన ప్రగాఢ విశ్వాసం. క్లింటన్ నుండి ఒబామా దాకా – రిపబ్లికన్ కానివ్వండి, డెమోక్రట్ కానివ్వండి – అమెరికా అధ్యక్షుని విధానాలను, చర్యలను తీవ్రంగా సహేతుక విమర్శ చేసే వాడు. నోమ్ చామ్స్కీ 91 ఏళ్ల జ్ఞానవంతుడు. అమెరికా ఎన్నికలకు నాలుగు రోజుల ముందు అక్టోబర్ 30, 2020 నాడు న్యూ యార్క్ టైమ్స్ జర్నలిస్ట్ ఐజాక్ చొట్నర్‌కు సుదీర్ఘమయిన ఇంటర్వ్యూ ఇస్తూ ఈసారి ఎన్నికలలో ట్రంప్‌కు వ్యతిరేకంగా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థికి ఓటు వెయ్యడం చారిత్రక అవసరం అని చెప్పాడు. "మానవ చరిత్రలో నికృష్టమయిన నేర స్వభావం కలిగినవాడు" అని ట్రంప్ గురించి తన అభిప్రాయం వెల్లడించాడు.

అమెరికాలో ఎంతో మంది మన్ననలు పొందిన విశ్రాంత సైనిక అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జాన్ నాగల్ ప్రస్తుత సైనిక మండలి ముఖ్య అధికారి జెనరల్ మిల్లెకు ఒక బహిరంగ లేఖ రాస్తూ ట్రంప్ ఓడిపోయిన తర్వాత ఓటమిని అంగీకరించక గెలిచిన అభ్యర్థికి అధికారం అప్పగించడానికి నిరాకరించిన పక్షంలో శ్వేతసౌధం నుండి ఆయన్ను బలవంతంగా తొలిగించాల్సిన తన రాజ్యాంగ విధిని గుర్తు చేసిన సంగతిని నోమ్ చామ్స్కీ ఈ సందర్భంగా తన ఇంటర్వ్యూలో ఉటంకించాడు. అధికార బదిలీకి ట్రంప్ అంగీకరించకపోతే సైన్యం చొరవతో ఆయన్ను అధికార పీఠం నుండి తొలగించాల్సి వస్తుందని ఎన్నికలకంటే ముందే నోమ్ చామ్స్కీ సూచన ప్రాయంగా తెలియపరిచాడు. దాదాపు 80 లక్షల మంది అమెరికన్ పౌరులు బ్రిటన్ లాంటి యూరప్ దేశాలలో, కెనడా తదితర ప్రాంతాలలో నివసించే వారున్నారు. వారిలో 50 లక్షల మందికి ఓటు హక్కు గలవారు. ఇదివరకు జరిగిన అధ్యక్ష ఎన్నికలలో ఓటు వేయాలన్న ఆసక్తి వారిలో కనిపించేది కాదు. కానీ, అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షపదవి పలచనయి పోతుందన్న కలతతో ట్రంప్ ఎట్టి పరిస్థితిలోను గెలవకూడదు అన్న లక్ష్యంతో వారిలో అధిక సంఖ్యాకులు ఈ దఫా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార హోరులో ఒక్కసారి నా మదిలో కార్ల్ మార్క్స్ తళుక్కున మెరిశాడు. మార్క్స్, ఏంగిల్స్‌లు తమ కమ్యూనిస్టు మేనిఫెస్టోను "యూరప్‌ను కమ్యూనిస్టు భూతం వెంటాడుతున్నది" అన్న వాక్యాలతో ప్రారంభించారు. ఈ ఎన్నికలలో ట్రంప్ కమ్యూనిస్టు "భూతం" తనను వెంటాడుతున్నట్టు, తాను ఓడిపోతే అమెరికా యావత్తు కమ్యూనిస్టుల మయం అయిపోతుందని అరిచి బొబ్బలు పెట్టే ప్రయత్నం చేశాడు. వామ పక్ష భావాలు గల డెమొక్రటిక్ పార్టీ నాయకులు బైడన్‌ను ప్రభావితం చేస్తారని, ఆయన్ను గెలిపిస్తే ప్రభుత్వం వామపక్ష ప్రభుత్వం అయిపోతుందని అమెరికన్లను భయపెట్టే ప్రయత్నం చేశాడు. ఓట్ల లెక్కింపు కూడా 'డొమినియన్' అన్న సంస్థ చేపట్టిందని, అది అతి వాద వామ పక్ష సంస్థ అని, అందుకే ఓట్ల లెక్కింపులో ఎన్నో అక్రమాలు జరిగి తాను నష్ట పోయానని చెప్పుకొచ్చాడు. నిజానికి ట్రంప్ ప్రత్యర్థి జో బైడన్ వామపక్ష అభిప్రాయాలు కలిగిన వాడేమీ కాదు. డెమొక్రటిక్ పార్టీలో బెర్నీ సాండర్స్‌కు అభ్యుదయ విధానాలను సమర్థిస్తాడని పేరుంది.

అధ్యక్ష పదవికి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చెయ్యాలని రెండు సార్లు విఫల ప్రయత్నం చేశాడు సాండర్స్. సాండర్స్‌ను అభిమానించే వాళ్లు అమెరికాలో చాలా మందే ఉన్నారు. అభ్యుదయ ధోరణి, వామపక్ష భావాలు, సోషలిస్టు భావజాలం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు అసహనం, భయం. అందుకే వాటి బూచిని చూపించినట్టుగా చూపించి ప్రజలను భయపడమంటారు. (వామ పక్ష భావాలు కలిగిన డెమొక్రటిక్ పార్టీ నాయకులు సాండర్స్, వారెన్ ప్రభృతులను పార్టీకే పరిమితం చెయ్యాలని, ప్రభుత్వంలో చోటు కల్పించ కూడదని బైడన్ అభిలషి స్తున్నాడని వార్తలు వస్తున్నాయి.)

ఓట్ల లెక్కింపు సజావుగా జరగలేదని పదే పదే ఫిర్యాదు చేసిన డోనాల్డ్ ట్రంప్ న్యాయస్థానంలో ఒక్క సాక్ష్యం కూడా దఖలు పరచలేక పోయాడు. తాను ఓడిపోయానన్న అక్కసుతో ఓట్ల లెక్కింపుపై 300కు పైగా ట్వీట్లు పెట్టిన అధ్యక్షుడు బహుశా ప్రపంచంలో ట్రంప్ ఒక్కడేనేమో!

ఇవిఎంల ద్వారా జరిగే వోటింగ్‌పై భారత్‌లో కూడా అనుమానాలు ఉన్నాయి కానీ ఈ ఎన్నికల సందర్భంగా ఓట్ల లెక్కింపుపై అమెరికాలో జరిగినంత రభస ఏ దేశంలోను జరగలేదు. ఓడిపోయినా నేను పదవి వీడను అని మొరాయించుకొని కూర్చున్న ట్రంప్ ప్రపంచ చరిత్రలోనే మూర్ఖాగ్రేసరుడుగా నిలిచిపోవడం ఖాయం! అమెరికాలో కొంత మంది జాత్యహంకారులు డోనాల్డ్ ట్రంప్‌పై జో బైడన్ విజయం సాధించలేదని, అక్రమ మార్గంలో అమెరికా అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకోవడానికి తాపత్రయ పడుతున్నాడని ఇప్పటికీ అభిప్రాయపడుతూనే ఉన్నారు. ఇటీవల వాషింగ్టన్‌లో వైట్ హౌజ్‌కు కూతవేటు దూరంలో ట్రంప్ మద్దతుదారులకు, బ్లాక్ లైవ్స్ మ్యాటర్ సమర్థకులకు జరిగిన ఘర్షణలే ఇందుకు ఉదాహరణ. ప్రపంచంలో కొంత మంది ప్రభుత్వాధినేతలు కూడా వోటింగ్‌లో బైడన్ ఆధిక్యతను గుర్తించడానికి తాత్సారం చేశారు, చేస్తున్నారు. ఉదాహరణకు ట్రంప్ భార్య మెలినియ ట్రంప్ పుట్టి పెరిగిన స్లోవేనియా (ఇది పర్వత సానువులు చుట్టూ పరచుకొని ఉన్న ఒక యూరప్ దేశం) ఇప్పటికీ ట్రంప్ అమెరికా అధ్యక్షుడే అన్న పిచ్చి నమ్మకంతో ఉన్నారు. గమ్మత్తేమిటంటే, ట్రంప్ భార్య తన భర్త ఓటమిని అంగీకరించి, తన భర్తను కూడా ఓటమిని అంగీకరించమని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుండగా, ఆమె పుట్టిపెరిగిన దేశం మాత్రం "ట్రంప్ ఓడిపోలేదు, ఆయన ఇంకా అమెరికా అధ్యక్షుడుగా కొనసాగుతున్నాడు" అని భీష్మించుకుని కూర్చుంది. చైనా కూడా చాలా ఆలశ్యంగా బైడన్ పేరును ప్రస్తావించకుండా అమెరికా ఎన్నికలపై తన విశ్లేషణ ప్రకటించింది. భాతదేశం నుండి ప్రధాన మంత్రి మోడీ కంటే ముందు బైడన్‌కు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపాడు. బైడన్ గెలిచాడన్న విషయాన్ని మోడీ తొందరగా ఆకళింపు చేసుకోలేకపోయాడు. బైడన్ గెలుపు పట్ల మొదట రాహుల్ గాంధీ హర్షం ప్రకటించడాన్ని గమనించిన ఒక రాజకీయ విశ్లేషకురాలు "మోడీకి జె,కె పట్ల కొంత విముఖత ఉన్నట్లుంది" అని ఒక సెటైర్ వేసింది. జె.కె. అంటే జమ్మూ కశ్మీర్ అన్న అర్థం వస్తుంది, అలాగే జో బైడెన్, కమలా హరిస్ అని కూడా అర్థం చేసుకోవచ్చు. గత సంవత్సరం అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో "హోఢీ మోడీ" అని పెద్దపెట్టున సంబరాలు చేసి, 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్' అని నినాదాలు హోరెత్తించిన మోడీ మొదట్లో గాభరా పడిపోయి, ఆ తర్వాత సర్దుకొని బైడన్‌కు శుభాకాంక్షలు తెలిపాడు. మరొక దేశం అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడం, అందునా ఎన్నికలలో ఒకరి పక్షం వహించడం ఒక దేశ ప్రధాన మంత్రికి తగని పని. ట్రంప్ తన చుట్టూ ఒక జాత్యహంకార దేశాధినేతల కూటమిని తయారు చేసుకున్నాడు. వారు ట్రంప్‌కు బాండు మేళాలు మోగిస్తూ ఉంటారు. ఆ గుంపులో ఒకరుగా మోడీ ఉండేవాడు. ఇప్పుడు బైడన్‌తో ఆయన సంబంధాలు ఎలా సంబాళిస్తాడో వేచి చూడాల్సిందే!

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ కొంత ప్రత్యేకమయినది. మామూలుగా ప్రజాదరణ పొందిన వారే అధికార పీఠం అధిష్టించాలన్నది ప్రజాస్వామ్యంలోని ప్రాథమిక సూత్రం. రెండున్నర శతాబ్దాల సుదీర్ఘ ప్రజాస్వామిక చరిత్ర కలిగినదని గొప్పలు చెప్పుకొనే అమెరికాలో మాత్రం ఎక్కువ మంది ప్రజల ఓట్లు సంపాదించిన వ్యక్తి ప్రెసిడెంట్ అవడం ఖాయం అన్న గ్యారంటీ లేదు. 2016 ఎన్నికలలో హిల్లరీ క్లింటన్‌కు డోనాల్డ్ ట్రంప్ కంటే 28 లక్షల ఓట్లు (అంటే 2.1 శాతం) ఎక్కువ వచ్చాయి. అయినా డోనాల్డ్ ట్రంప్ గెలిచి అధ్యక్ష పీఠం అధిరోహించి నాలుగేళ్లు పరిపాలన కొనసాగించాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఎలెక్టొరల్ కాలేజీ ఓట్లపై ఆధారపడి ఉంటాయి. ప్రతి రాష్ట్రానికి దాని జనాభాను బట్టి కొన్ని ఎలెక్టొరల్ ఓట్లు కేటాయించబడి ఉంటాయి. ఉదాహరణకు టెక్సాస్ పెద్ద రాష్ట్రం. జనాభా ఎక్కువ. వెర్ మౌంట్ రాష్ట్రం చిన్నది. జనాభా తక్కువ. టెక్సాస్‌కు 38 ఎలక్టొరల్ కాలేజీ ఓట్లు ఉంటే వెర్మౌంట్‌కు కేటాయించబడ్డవి 3 ఓట్లు మాత్రమే. పోటీలో ఉన్న అభ్యర్థులలో ఎవరికీ ఎక్కువ ఓట్లు పోలయితే ఆ రాష్ట్రానికి ఉన్న మొత్తం ఎలెక్టోరల్ కాలేజీ ఓట్లన్నీ ఆ అభ్యర్థి ఖాతాలోనే జమ అవుతాయి. టెక్సాస్ రాష్ట్రంలో మొన్న జరిగిన 2020 ఎన్నికలలో ట్రంప్‌కు 5,873,085 ఓట్లు రాగా జో బైడన్ 5,235,216 ఓట్లు తెచ్చు కోగలిగాడు. (ట్రంప్‌కు 52.07 శాతం, బైడన్‌కు 46.42 శాతం). ఆ రాష్ట్రంలో ట్రంప్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి కాబట్టి ఆ రాష్ట్రానికి కేటాయించిన 38 ఎలెక్టొరల్ కాలేజీ ఓట్లు మొత్తం ట్రంప్ ఖాతాలోనే పడ్డాయి. ఈ రకమైన ఎన్నికల విధానం పట్ల చాలా మంది అమెరికన్‌లు అసంతృప్తితో ఉన్నారు. అయినా ఎన్నికల పద్ధతిలో సంస్కరణలు చేపట్టాలన్న ఆలోచనను గెలిచిన అభ్యర్థులు ముందుకు తీసుకెళ్లడం లేదు. ఇలాంటి ఎలెక్టొరల్ కాలేజీ పద్ధతిలో ప్రజాస్వామికత లోపించిందని విమర్శకుల అభిప్రాయం. "ఒక వ్యక్తికి ఒక ఓటు" అన్నది ప్రజాస్వామ్య బద్ధమైన ఏర్పాటు అని, దీనికి విరుద్ధంగా ఒక రాష్ట్రానికి కొన్ని ఓట్లు కేటాయించడం, ఆ ఓట్లన్నీ ఎవరో ఒక వ్యక్తికి చెందడం ప్రజాస్వామ్య విరుద్ధం.

అమెరికా ఎన్నికల నియమావళి ప్రకారం ఈ సంవత్సరం డిసెంబర్ 14 వరకు అన్ని అభ్యంతరాలను పరిష్కరించి, ఆనాడు ఎన్నికల ఫలితాలు అంతిమంగా ప్రకటించాలి. ఆ తర్వాత వచ్చే సంవత్సరం జనవరి 20న కొత్త అధ్యక్షుడు పదవీ స్వీకారం చేస్తాడు. అప్పట్నుంచి కొత్త అధ్యక్షుని పాలన ఆరంభమవుతుంది. ఇప్పుడొస్తున్న వార్తలను బట్టి డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఆరోపణలలో బలం లేదని, మెజారిటీ ఎలక్టొరల్ కాలేజీ ఓట్లు పొందిన జో బైడన్‌ను విజేతగా ప్రకటించబోతున్నారని మీడియాతో పాటు, ప్రపంచదేశాల అధినేతలు చాలా మంది ఒక అభిప్రాయానికి వచ్చారు. బైడన్ గెలుపు దాదాపు ఖాయం అయిపోయింది కాబట్టి, బైడన్ అధ్యక్ష పాలన ఎలా ఉండబోతుందో అన్న ఆసక్తి సహజంగా అందరిలోనూ ఉంటుంది. జో బైడన్ పూర్వ చరిత్ర పరిశోధిస్తే చాలావరకు ఆశాభంగం తప్పదు. ట్రంప్ మొరటుగా, దురుసుగా, కర్కశంగా

కనిపిస్తాడు. బైడన్ సౌమ్యంగా, ఎదుటివాని మనసు నొప్పించని తరహాలో అగుపడతాడు. కానీ, ఇద్దరూ చేసే పనులలో పెద్ద తేడా ఉండదు. ఇంగ్లిష్‌లో "లెస్సర్ ఈవిల్" అన్న పద ప్రయోగం ఒకటి ఉంది. అంటే, "ప్రమాదకారే కానీ, కొంచెం తక్కువ ప్రమాదకారి" అని అర్థం. అమెరికా అధ్యక్షుడు ఎవరైనా ప్రపంచ మానవాళికి ప్రమాదకారియే! ఎందుచేతనంటే, అమెరికా పాలక వర్గాల సంస్కృతి వ్యాపార సంస్కృతి. యుద్ధోన్మాదాన్ని పెంచిపోషించే తత్త్వం వారి ఆయుధాల వ్యాపారానికి అవసరం. వారి దేశంలో కూడా ఆయుధ వ్యాపారులు తుపాకీ సంస్కృతినే పెంచి పోషిస్తారు.

ఇక బైడన్ విషయానికొస్తే, 1973లో 29 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు డెలావేర్ రాష్ట్రం నుండి అమెరికా సంయుక్త రాష్ట్రాల సెనేట్‌కు ఎన్నికయ్యాడు. డెలావేర్‌లో తెల్ల జాతి వాళ్ల జనాభా ఎక్కువ. తెల్లజాతి వారు అందరికంటే అధికులు అన్న ఫాసిస్టు భావం కలిగిన డెలావేర్ ఓటర్లు రిపబ్లికన్ పార్టీనే ఎక్కువగా అభిమానించేవారు. "తెల్లవారి ఆధిక్యతను కాపాడడానికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థినే గెలిపించాల్సిన అవసరం లేదు, నేను కూడా ఆ పని చెయ్యగలను'' అని జాత్యహంకారులకు భరోసా కల్పించి డెమొక్రటిక్ పార్టీ నుండి ఎన్నికయ్యాడు.

అప్పట్నుంచి అదే విజయ రహస్యాన్ని జాగ్రత్తగా అవలంబిస్తూ బయటికి జాత్యహంకారం కనపడకుండా అంతర్గతంగా అదే పాటపాడుతూ నెగ్గుకువస్తున్నాడు. నల్లజాతికి చెందిన విద్యార్థులు తమ నివాసాలకు దూరంగా తమకు మాత్రమే ప్రత్యేకించబడ్డ పాఠశాలలలోనే చదవాలన్న నిబంధన ఒకప్పుడు ఉండేది. అలా కాకుండా ఆ నిబంధనను రద్దు చెయ్యాలని, తెలుపు నలుపు పిల్లలందరూ తమకు పొరుగున ఉండే స్కూల్‌లో కలిసి చదువుకునే ఏర్పాటు ఉండాలని 1975 నుండి 1980 వరకు ఒక ఉద్యమం నడిచింది. ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించినవాడు ఈ బైడన్. రాజకీయ ఖైదీల విషయంలో, నేరస్తులుగా శిక్షించబడి జైలు జీవితం గడుపుతున్న వారి విషయంలో కఠినమైన బిల్లులను ప్రవేశపెట్టిన వాడు, వాటిపై అమానవీయ చర్చలకు ఆజ్యం పోసినవాడు బైడన్. వాటిల్లో కొన్ని : వీరికి పెరోల్ అవకాశం ఉండకూడదు; శిక్షా కాలం ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిది; చట్ట వ్యతిరేకంగా సేకరించిన సాక్ష్యాన్ని కూడా కోర్టులు అనుమతించాలి; నేరం రుజువయిన కేసులను పై కోర్టుకు అపీల్ చేసుకునే అవకాశం గాని పునర్విచారణ జరపమని కోరే స్వేచ్ఛ గాని ఉండకూడదు; మైనారిటీలుగా పరిగణించే వయస్సును తగ్గించాలి; అనుమానితుల ఆస్తులను జప్తు చేసే అధికారం పోలీసులకు ఉండాలి. ఇలాంటి నిబంధనలు ఎన్నో చట్టాలుగా తయారవ్వాలని ఆయన కృషి చేశాడు. తానే స్వయంగా అలాంటి చట్టాలు చాలా వాటికి లిఖిత రూపం ఇచ్చాడు. "1976వ సంవత్సరం నుండి అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన నేర సంబంధమయిన ప్రతి బిల్లు పై డెలావేర్ నుండి వచ్చిన సెనేటర్ జో బైడన్ ముద్ర ఉంటుంది" అని ఆనాటి అధ్యక్షుడు బిల్‌క్లింటన్ స్వయంగా అమెరికా సెనేట్‌లో ప్రకటించాడంటే బైడన్ ఎంత కరడు గట్టిన మనస్తత్వం కలవాడో అర్థం చేసుకోవచ్చు. 1980 నుండి 2005 వరకు అమెరికా జైళ్లలో ఖైదీల సంఖ్య 734 శాతం వరకు పెరిగిందంటే అది బైడన్ ప్రయత్నాల వల్ల చట్ట రూపం ధరించిన అనేక కర్కశ నిర్ణయాల వల్లనే అని అమెరికా సెనెటర్లు చాలా మంది ఒప్పుకుంటారు. డెమొక్రటిక్ పార్టీ సమావేశాలలో యుద్ధాలకు అనుకూలంగా కేకలతో, పెడబొబ్బలతో వాదన కొనసాగించేవాడట బైడన్. ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధానికి, ఇరాక్‌లో ఆయుధాలను ధ్వంసం చేసిన చర్యకు అమెరికా సెనేట్‌లో సమర్థన లభించడానికి తన శక్తియుక్తులను వినియోగించినవాడు బైడన్.

డెమొక్రట్స్ గాని, రిపబ్లికన్స్ గాని ఒకే వర్గ ప్రయోజనం కోసం పని చేస్తారన్న విషయం గుర్తు పెట్టుకోవాలి. బైడన్‌కు ఓటు వేసినవాళ్లు చాలామంది ట్రంప్ చేతుల్లోకి మళ్లీ అధికారం వెళ్లగూడదన్న ఆలోచనతో ఓటు వేశారు గాని, బైడన్ ఒక ఆదర్శవంతమయిన పాలనానుభవం తమకు కలగజేస్తారని కాదు. నోమ్ చామ్స్కీ కూడా అదే ఉద్దేశంతో ట్రంప్‌ను ఓడించండి అని పిలుపునిచ్చాడు. అంతే కాని, బైడన్ తమ కష్టాలను కడతేరుస్తాడని కాదు. ట్రంప్ గెలిస్తే అమెరికా ప్రతిష్ఠ మరింత దిగజారిపోతుందన్న భయమే కాని బైడన్‌కిది పాజిటివ్ ఓటు కాదు.

అమెరికా ఎన్నికల్లో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని మెజారిటీ అమెరికన్లు తిరస్కరించడంతో పాటు ఒక చిన్న వెలుగు రేఖ తళుక్కుమంది. అది ఆసియా మూలాలు కలిగిన ఒక మహిళ, తల్లి భారతీయురాలు తండ్రి జమైకా దేశస్థుడు, నల్ల జాతి మహిళ; చురుకైన, కార్యదక్షత కలిగినదానిలా కనిపిస్తున్న మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికవడం. ఈ అంశం అమెరికా చరిత్రలోనే ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కావడానికి ముందస్తు సూచన అయి ఉండవచ్చు.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ



పైలం సంతోష్

ప్రజా గాయకుడు, అరుణోదయ కళాకారుడు పైలం(అదూరి) సంతోష్ (45) మృతి చెందారు. శ్వాస సంబంధిత సమస్యతో కొద్ది రోజులుగా నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 22న మరణించారు. సంతోష్ స్వగ్రామం సూర్యపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామం. అసలు పేరు ఆదూరి బ్రహ్మయ్య. జనశక్తి పార్టీలో కళాకారుడిగా, గాయకుడిగా పనిచేస్తూ 25 సంవత్సరాల క్రితం కట్టంగూర్ మండలం దుగినెల్లి గ్రామంలో స్థిరపడ్డారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన ఆట పాటలతో చురుగ్గా పాల్గొన్నారు. 'అమ్మ పైలంగా ఉండు మాయమ్మ' అనే పాటలోని పైలం అనే పదం ఇంటి పేరుగా మారింది. చుండూరు, కారంచేడు ఘటనలకు వ్యతిరేకంగా 'చుండూరు గ్రామాన జరిగిన ఘోరం ఓయమ్మ లారా మాయమ్మ లారా' అంటూ పాడి తన నిరసన తెలిపాడు. కూలీరేట్లు పెంచాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, దున్నే వాడికే భూమి దక్కాలని, కుల వివక్ష రూపుమాసిపోవాలని నినదిస్తూ అనేక ప్రదర్శనలిచ్చాడు.

చిలే, బొలీవియాల్లో ప్రజా ఉద్యమాల జయభేరి

లాటిన్ అమెరికా దేశాలన్నిట్లో, ప్రధానంగా ఇటీవల చిలే, బొలీవియాల్లో విజృంభిస్తున్న ప్రజా ఆకాంక్షల విజయాలను వివరిస్తున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

ఎక్కడ విలువైన ఖనిజ సంపద, ఇంధన నిక్షేపాలుంటాయో అక్కడ అమెరికా తమ డేగ రెక్కలతో వాలిపోతుంది. ఆ దేశ రాజ్య వ్యవస్థను చిన్నాభిన్నం చేసి తనకనుకూల వ్యక్తులను అధికారంలో ప్రతిష్టిస్తుంది. దశాబ్దాలుగా లాటిన్ అమెరికా దేశాలలో అదే జరుగుతుంది. ఇప్పటికీ ఉత్తర అమెరికా దక్షిణ అమెరికాను తమ పెరడులా భావిస్తోంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం లాటిన్ అమెరికన్ దేశాలలో జాతీయ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం మరింత తీవ్రమయ్యాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా, మానవహక్కుల పరిరక్షణకు పోరాడుతున్నానని పదే పదే ప్రకటించుకుంటున్న ఉత్తర అమెరికా ఆచరణలో లాటిన్ అమెరికా ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోంది. నియంతలకు, మితవాదులకు అండగా నిలిచి తన గూఢచారి శాఖ(సిఐఎ) ద్వారా కుట్రలు పన్ని ప్రజా ప్రభుత్వాలను కూలదోస్తోంది. ఈ సత్యాలను అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) నివేదికలే పలుమార్లు బహిర్గతం చేశాయి. అర్జెంటినా, మెక్సికో, చిలే, వెనిజులా, బ్రెజిల్, బొలీవియా వంటి దేశాలలో చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు తార్కాణం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకొచ్చిన ఏ దేశాన్నీ సామ్రాజ్యవాదులు సహించరు. 'బొలివేరియన్ పింక్ రివల్యూషన్' ద్వారా వెనిజులా, బొలీవియా, బ్రెజిల్, అర్జెంటీనా, ఈక్వెడార్, ఎల్‌సాల్వెడార్, నికరాగ్వా, ఉరుగ్వేల్లో అధికారంలోకి వచ్చిన ప్రత్యామ్నాయ ప్రభుత్వాల్లో కొన్నిటిని అమెరికా సైనిక, పార్లమెంటరీ కుట్రల ద్వారా కూల్చివేసింది. అయినా, ఇప్పటికీ వెనిజులా, అర్జెంటీనా, నికరాగ్వా వంటి దేశాలు అమెరికా కుట్రలను ఉద్యమాల ద్వారా ఎదిరించి నిలిచాయి. ఇప్పుడు చిలే, బొలీవియాలు ఆ ఉద్యమ పథంలోనే పయనిస్తున్నాయి. తీవ్ర నిర్బంధం మధ్యన అక్టోబర్ 18న బొలీవియాలో అధ్యక్ష, పార్లమెంటుకు జరిగిన ఎన్నికల ఫలితాలు ప్రస్తుత అధ్యక్షురాలు అనీజ్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా రావడం ఆహ్వానించదగింది. సంవత్సరం క్రితం మొరేలిస్‌ను కూలదోసిన అమెరికా కుట్రలో ప్రధాన ఏజెంట్‌గా వ్యవహరించిన లూయిస్ ఫెర్నాండో కమాచోకు బొలీవియన్ ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిగా అధికార దుర్వినియోగం చేసి, కార్పొరేట్ మీడియా సహకారంతో ఎన్ని కుతంత్రాలు పన్నినా బొలీవియాలో ఫలితాలు పెట్టుబడిదారి శక్తులకు వ్యతిరేకంగా వచ్చాయి. అలాగే చిలేలో అక్టోబర్ 25న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో సైనిక పాలకుల నీడలో రూపొందిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలంటూ 78 శాతం ప్రజలు ముక్తకంఠంతో కోరారు.

చిలేలో నియంతృత్వ వ్యతిరేక ప్రజాఉద్యమం

చిలేలో అతివాద నినాదాలతో 1946లో అధికారంలోకి వచ్చిన 'గోంజాలిజ్ మెదెలా', ఆ తర్వాత 1952లో అధికారంలోకి వచ్చిన 'కార్లోస్ ఇబినిజ్' సామ్రాజ్యవాద అమెరికా అనుకూల విధానాలనే అనుసరించారు. 1970లో అధికారంలోకి వచ్చిన 'సాల్వడార్ అలెండీ' సుప్రసిద్ధ కవి, సోషలిస్టు భావాలు కలవాడు. అమెరికా విధానాలను అనుసరించడానికి నిరాకరించినందుకు అలెండీ నియమించిన 18 రోజులకే మిలటరీ నియంత జనరల్ 'ఆగస్టో పినోషెట్' అమెరికా సిఐఎ సహకారంతో 1973 సెప్టెంబర్ 11నాడు ఆయన ప్రభుత్వాన్ని కుట్ర ద్వారా కూల్చి దేశాధ్యక్షుడు అలెండీని అమెరికా సిఐఎ ప్రోద్బలంతో హత్య చేశారు. అలెండీ ప్రజాహిత కార్యక్రమాలతో సమసమాజ నిర్మాణ స్వప్నంతో పాలన సాగించారు. ఆయన స్థానంలో అధికారం చేపట్టిన జనరల్ అగస్టో పినోషెట్ 1990 వరకు సైనిక నియంతృత్వాధికారాలతో పాలన సాగించాడు. పినోషెట్ 1980లో నూతన రాజ్యాంగాన్ని తప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు అనుకూలంగా మార్పు చేశాడు. అధ్యక్ష తరహా పాలన పద్ధతి ప్రవేశ పెట్టాడు. సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక సంస్కరణలు అమలు చేశాడు.

పినోషెట్ పాలించిన 17 ఏళ్లలో 3200 మందిని ఉరితీశాడు. వేలాది మంది కనిపించకుండా పోయారు. 80 వేల మంది జైలు పాలయ్యారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినవారినల్లా ప్రభుత్వ వ్యతిరేకులని దేశద్రోహులని ముద్ర వేశాడు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారు. పినోషెట్ సైనిక నియంతృత్వ పాలనలో ప్రభుత్వ, పాలనాపరమైన కీలక పదవులన్నింటిని బంధుమిత్రులకు కట్టబెట్టాడు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేట్‌పరం చేశాడు. దేశీయ పరిశ్రమల రక్షణ కొరకు ఉన్న టారీఫ్‌లను రద్దు చేశాడు. అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల భూమిని ప్రజల నుండి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టాడు. ప్రపంచీకరణ విధానాలు అమలులోకి తెచ్చిన లాటిన్ అమెరికన్ దేశాలలో చిలే మొదటిది. దీని ఫలితంగా కొద్ది మంది పెట్టుబడిదారుల ఆస్తులు, లాభాలు బాగా పెరిగిపోయాయి. కార్మికుల రైతుల జీవితాలు చితికిపోయాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగింది. ఆర్థిక అంతరాలు తీవ్రమయ్యాయి. ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగింది.

ఎకనమిక్ కమిషన్ ఫర్ లాటిన్ అమెరికా అండ్ కరేబియన్ (ఇసిఎల్ఎసి) అంచనా ప్రకారం చిలేలో ఒక శాతం సంపన్నుల దగ్గర 26.5 శాతం సంపద పోగుపడగా అట్టడుగు అల్పాదాయ వర్గాలైన 50 శాతం ప్రజల వద్ద 2.1 శాతం సంపద ఉందంటే ప్రజలు ఎంత దుర్భర స్థితిలో జీవించారో అర్థమవుతుంది. ఈ దుర్భర స్థితిలో ప్రజలు చావో

రేవో తేల్చుకోవాలన్న సంకల్పంతో దేశాధ్యక్షుడు, నియంత పినోషెట్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలన్న డిమాండ్‌తో 1990లో ప్రజా ఉద్యమం ప్రజ్వరిల్లింది. ప్రజా ఒత్తిడికి తలొగ్గక తప్పలేదు. అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. కానీ 1998 వరకు సాయుధ దళాల కమాండర్‌గా కొనసాగుతూ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేశాడు. భద్రతా దళాల సభ్యులపై మానవ హక్కుల విచారణను తరచు అడ్డుకున్నారు. ఇలా 1998 వరకు కొనసాగాడు. 1990లో రాజ్యాంగ సవరణ జరిగి ప్రజాస్వామ్య పద్ధతి పునరుద్ధరించ బడింది. అయితే సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల దోపిడీకి ఉపయోగపడే నిబంధనలు అలాగే ఉన్నాయి. అందువల్ల నియంత పినోషెట్ తొలగిపోయినా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు. ఆ తర్వాతి అధ్యక్షులు రుయిజ్ తగ్లె, రికార్డో లాగోస్, మిచెల్లీ బచెలెట్, సిసిలియా మొరెల్, సెబాస్టియన్ పినేరా పాలనలో ప్రజల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులు రాలేదు. ప్రస్తుత అధ్యక్షుడు పినేరా సంపన్న బిలియనీర్లలో ఒకడు.

గత సంవత్సరం అక్టోబర్ 14న మెట్రో రేట్లు బాగా పెరిగిన సందర్భంలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఆ నిరసనలు ఆర్థిక విధానాలు మారాలనే డిమాండ్‌గా ముందుకు వచ్చాయి. పినోషెట్ ప్రారంభించిన ప్రయివేటు పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, విద్య, వైద్య వ్యవస్థను పటిష్టం చేయడానికి నిధులు పెంచాలనే డిమాండ్లతో పాటు స్థానిక గిరిజన తెగల హక్కులు కాపాడాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. పైన పేర్కొన్న సమస్యలకు కారణం దేశంలో అమలు జరుగుతున్న మార్కెట్ శక్తుల ఆధీనంలోని ప్రపంచీకరణ ఆర్థిక విధానాలూ, వాటిని కాపాడుతున్న రాజ్యాంగమేనని ప్రజలు గ్రహించారు. రాజ్యాంగాన్ని మార్చుకుంటే తప్ప ప్రజానుకూల ఆర్థిక విధానాలు అమలు జరపడం సాధ్యం కాదని, కాబట్టి రాజ్యాంగాన్నే మార్చాలనే లక్ష్యంతో పోరాటాలను ఉధృతం చేశారు. ఉద్యమకారులు దేశ ద్రోహులని, వారు ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారని దేశాధ్యక్షుడు పినేరా ఆరోపించారు. దేశంలో అక్టోబర్ 18న అత్యవసర పరిస్థితి ప్రకటించారు. మరుసటి రోజు నుంచి కర్ఫ్యూ విధించాడు. ప్రజలపైకి సైన్యాన్ని పంపాడు. పోలీసుల, సైన్యం అరాచకాలకు అంతులేదు. చెప్పలేనంత భయంకర వాతావరణాన్ని సృష్టించారు. మహిళలపై సైనికులు అత్యాచారాలకు తెగబడ్డారు.

చిలే ఉద్యమ తీవ్రత అసాధారణమైనది. దాని దాటికి చిలే రాజధాని శాంటియాగోలో నిరుడు నవంబర్‌లో జరగాల్సిన ఆసియా, పసిఫిక్ దేశాల సహకార సంస్థ ఎపెక్ వార్షిక శిఖరాగ్ర సదస్సు రద్దయింది. అక్కడే జరగాల్సిన వాతావరణ శిఖరాగ్ర సదస్సు స్పెయిన్‌లోని మాడ్రిడ్‌కు తరలిపోయింది. కర్ఫ్యూలు, కాల్పులు, అరెస్టులతో ప్రభుత్వం ఎంత బెదిరించినా సాధారణ పౌరుల ఆగ్రహావేశాలు చల్లారలేదు. పది లక్షల మంది ప్రజానీకం చిలే రాజధాని శాంటియాగో ప్లాజాను దాదాపు నెలరోజుల పాటు ఆక్రమించి తమ డిమాండ్లకు తలొగ్గితే తప్ప అక్కడ నుంచి కదిలేది లేదని బైటాయించారు. అధ్యక్షుడు పినేరా రాజీనామా చేయాలని ముక్తకంఠంతో ప్రజలు నినదించారు. మహిళలే ముందుండి నడిపించిన ఆ ఉద్యమంలో పోలీసు కాల్పులకు 36 మంది చనిపోగా, 12,000 మంది గాయపడ్డారు. వేలాది మందిని ఖైదు చేశారు. అదే సమయంలో ఉద్యమకారుల డిమాండ్లు పెరిగాయి. నీరు, భూమి కబ్జా పెట్టి సామాన్యులకు దక్కకుండా చేస్తున్న ప్రభుత్వ విధానాలు రద్దుకావాలంటూ డిమాండ్ చేశారు. ఆదివాసీ తెగలకు కనీస హక్కులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం నవంబర్ 15న చిలే నేషనల్ కాంగ్రెస్ 2020 ఏప్రిల్‌లో రాజ్యాంగ మార్పుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని ఉద్యమకారులతో అంగీకారానికి వచ్చింది. ఇది చిలే ప్రజల గొప్ప చారిత్రాత్మక విజయం.

ప్రస్తుత రాజ్యాంగం ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రజానుకూల సంస్కరణలు తేవడానికి గత ఏప్రిల్‌లో నూతన రాజ్యాంగ రచనకు సంబంధించి రిఫరెండం జరగాల్సి ఉంది. కానీ కరోనా విరుచుకుపడడంతో అది వాయిదా పడింది. అంతిమంగా చిలే ప్రజలు అక్టోబర్ 25న కొత్త రాజ్యాంగం ముసాయిదాను తయారు చేయడానికి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో 75 లక్షల మంది పాల్గొనగా వారిలో 78.27 శాతం మంది అనుకూలంగా స్పందించారు. అయితే రాజ్యాంగ రచన ఎలా జరగాలి, రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులు ఎవరు ఉండాలి. ఎవరు ఉంటే ఆర్థిక సామాజిక విధానాలు ప్రజానుకూలంగా ఉంటాయని ఆలోచించి రాజ్యాంగ పరిషత్ సభ్యుల ఎంపికకు కూడ ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించు కున్నారు. అందుకు మొదటి మెట్టుగా రాజ్యాంగం మార్చాలా లేదా అనే అంశంపై, దానితో పాటు రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులను ప్రజలే నేరుగా ఎన్నుకోవాలా లేదా ఇతర పద్ధతిని అనుసరించాలా అనే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించుకున్నారు. అక్టోబర్ 25న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో రాజ్యాంగాన్ని మార్చాలని, సభ్యులను ప్రజలే ఎన్నుకోవాలనే ప్రతిపాదనలు ఆమోదం పొందడం జరిగింది. 2021 ఏప్రిల్‌లో 155 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో స్త్రీ, పురుషులకు సమ ప్రాతినిధ్యం కల్పించడం చారిత్రాత్మకం కానుంది.

1973 నుంచి చీకటి రాజ్యంలో బతికిన చిలే ప్రజలు ఇకముందు వెలుగులు చూడనున్నారు. పినోషెట్ అమలు జరిపిన క్రూరమైన హింసాయుత రాజ్యంలో చిత్రహింసలు, అకారణంగా హత్యలు, నిర్బంధంలో ప్రజలను ఉంచి హింసించడానికి ఇక చరమగీతం పాడటానికి చిలే ప్రజలు ముందుకు సాగుతున్నారు. ప్రపంచీకరణ యుగంలో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కే విధానాలను సామ్రాజ్యవాదులు ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి వాటి స్థానంలో తమ చెప్పు చేతల్లో ఉండేవారిని గద్దెనెక్కిస్తున్న కాలంలో... దానిని వ్యతిరేకిస్తూ మా భవిష్యత్‌ను మేమే నిర్ణయించుకుంటామనే ఈ ప్రజా ఉద్యమం ప్రపంచీకరణకు గట్టి ఎదురుదెబ్బ కానున్నది. పాత రాజ్యాంగాన్ని పాతిపెట్టి ప్రజానుకూల విధానాలతో నూతనంగా రూపొందించే రాజ్యాంగం ఆర్థిక సామాజిక రంగాలలో చిలే ప్రజలందరికీ న్యాయం చేకూర్చవచ్చు. సమాజంలో నెలకొన్న అనిశ్చితి, అశాంతిని తొలగించడమే నూతన రాజ్యాంగం లక్ష్యం కావాలని ప్రజలు ధృడంగా భావిస్తున్నారు.

చిలే ప్రజాస్వామ్య ఉద్యమం సాధించిన చరిత్రాత్మకమైన విజయం వెనక నిత్యం అణచివేతనూ, హింసనూ చవిచూసిన మహిళాశక్తి ఉంది. పినోషెట్ కాలం నాటి సైన్యం ఆగడాలతో పెద్దగా పరిచయంలేని యువతరం ఉంది. అందుకే ఈ ఉద్యమం నిలకడగా, ధృఢంగా సాగింది. ఉచితంగా మంచినీరు, ఉచిత విద్య, పెన్షన్ విధానం, ఆరోగ్య సంరక్షణ, పౌరుల ఆస్తులకు రక్షణ కావాలని చిలే ఉద్యమం కోరింది. వీటన్నిటికీ అనువైన ప్రజాతంత్ర రాజ్యాంగ రచనకోసం ఇప్పుడు 155 మందితో రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పడబోతోంది. దానికి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో

ఎన్నికలుంటాయి. అందులో 50 శాతం మంది మహిళలే ఉండాలి అనే ఒక ప్రగతిశీల నిర్ణయం తీసుకున్నారు. ఇది ప్రపంచ చరిత్రలో ప్రగతిశీల అంశం. ఇప్పుడు అది రాజ్యాంగ పరిషత్‌లో స్థానిక గిరిజన తెగల ప్రతినిధులకు కూడా స్థానం కల్పించాలనే అంశంపై చర్చ జరుగుతున్నది.

ఒకరకంగా చెప్పాలంటే నూతన రాజ్యాంగ పరిషత్‌లో సమాజంలో ఉన్న వివిధ సామాజిక సమూహాలకు ప్రాతినిధ్యం కల్పించి వారి భవిష్యత్తుని రూపొందించుకునే అవకాశం కల్పించబడుతున్నది. ఇది ప్రపంచానికే ఒక ఆదర్శం కానున్నది. ఒక సంవత్సరం లోపు నూతన రాజ్యాంగ రచన పూర్తి కావాల్సి ఉంది. 2022 ఆగస్టులోగా నూతన రాజ్యాంగం ఆమోదించాలా లేదా అని రిఫరెండం నిర్వహిస్తారు. ఆ తర్వాతే చట్టసభలు ఆవిర్భవిస్తాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఒక కొత్త సమాజాన్ని కలగంటున్న క్షతగాత్రి చిలే ఆ కృషిలో విజయం సాధిస్తే అది నియంతలపై, నిత్యం నియంతృత్వంతో పోరాడే ఎన్నో దేశాలకు స్ఫూర్తిదాయకం కానుంది. మొత్తంగా ఈ విజయం లాటిన్ అమెరికాలోనూ, ఇతర ప్రపంచ దేశాల్లోనూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం కానుంది.

నూతన రాజ్యాంగ నిబంధనలు సమాజ పరివర్తనకు దోహదపడేలా ఉండాలి. పెట్టుబడిదారుల నుండి వనరులు, పరిశ్రమలు, విద్య, వైద్యం ప్రజాపరం కావాలి. పరిశ్రమలు, వ్యవసాయం, సహజవనరులు జాతీయం చేయాలి. నియంతృత్వ ఉద్యోగస్వామ్యం నుంచి పాలన పగ్గాలు ప్రజలు చేపట్టాలి. భూస్వాముల భూములు భూమిలేని రైతులకు పంపిణీ చేయాలి. ప్రభుత్వ నేతలు ప్రజావ్యతిరేకంగా మారినప్పుడు వెనుకకు (రికాల్) పిలిచే నిబంధన ఉండాలి. పోలీసులు, సైన్యం రద్దు చేయబడి ప్రజా సైన్యం ఏర్పాటు కావాలి. ప్రజా ద్రోహులను విచారించి శిక్షలు వేయాలి. జనత ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పడాలంటే ప్రజాతంత్ర రాజ్యాంగం ఉండాలి. అశేష శ్రామిక వర్గానికి, రైతాంగానికి, పేద ప్రజలకు వెన్నుగా, దిక్సూచిగా నిలిచే విప్లవ పార్టీ ఉండాలి. ఇది నిత్యం ప్రజలను అప్రమత్తం చేసే భావజాలాన్ని, పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు తిరిగి తలెత్తకుండా నిరోధించే చైతన్యాన్ని అందించాలి. అప్పుడు మాత్రమే దశాబ్దాల ప్రజా నెత్తుటి త్యాగాల ఫలాలు ప్రజలు అనుభవిస్తారు.

బొలీవియా ఎన్నికల్లో 'మాస్' అఖండ విజయం

బొలీవియా ఒక కోటి జనాభా గల చిన్న దేశం. 1538లో స్పెయిన్ ఆక్రమణలోకి వెళ్లింది. 1809లో స్పెయిన్‌కు వ్యతిరేకంగా సైమన్ బొలివర్ నాయకత్వం కింద ప్రజలు తిరుగుబాటు చేశారు. 1824లో స్వాతంత్రం పొందింది. సైమన్ బొలివర్ బొలీవియా రాజ్యాంగాన్ని రచించాడు. ఈ దేశం అనేక అంతర్యుద్ధాలు, సరిహద్దు యుద్ధాలు చవిచూసింది. సైన్యాధిపతి సైమన్ బొలివర్ గొప్ప రాజనీతిజ్ఞుని గౌరవార్థంగా ఈ దేశానికి బొలీవియా అనే పేరు స్థిరపడింది. ఈయన నాయకత్వంలోనే వెనుజులా, పేరూ, కొలంబియా దేశాలు స్పెయిన్ వలస నుండి విముక్తి పొందాయి. బొలీవియాలో 1952లో అధికారంలోకి 'టువాజ్', 1964లో అధికారంలోకి వచ్చిన 'విక్టర్ రోపాజ్ ఈస్టెన్‌దారో'లు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కొన్ని సానుకూల సంస్కరణలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించి భంగపడ్డారు. 1964 నుంచి 1978 వరకూ అనేక సైనిక తిరుగుబాట్లు జరిగాయి. లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికా అనుకూల విధానాలను అనుసరించిన నాయకులు మాత్రమే అధికారంలో కొనసాగగలిగారు. లేకపోతే నాయకుల హత్యలు, ప్రభుత్వాలపై కుట్రలు తప్పలేదు. అయినా ప్రజలు మాత్రం తమ స్వాతంత్ర్య పోరాట దీక్షను వదిలిపెట్టలేదు. ఈ పోరాటాలకు నాయకత్వం వహించిన నాయకుల్లో చెగువెరా ముఖ్యుడు. పోరాట ఫలితంగా 1979లో బొలీవియాలో ప్రజాస్వామ్యం పునరుద్దరించబడింది. ఈ దేశాధ్యక్షుడు పార్లమెంట్ సలహా మేరకు పరిపాలన సాగిస్తాడు.

ఆదివాసీలు మెజారిటీగా ఉన్న బొలీవియాలో ఐదు వందల సంవత్సరాల తరువాత దేశాధ్యక్షుడిగా ఉన్న కార్లోస్ మెసాను తన నిరసనల ద్వారా గద్దె దింపి తొలిసారిగా ఆ సామాజిక తరగతులకు చెందిన ఇవో మొరేలిస్ 2006 జనవరి 22న దేశాధ్యక్షుడయ్యారు. 2006లో తొలిసారి మొరేలిస్ అధ్యక్ష పదవిని చేబట్టినప్పుడే లా పాజ్‌లోని అమెరికా రాయబార కార్యాలయం అతన్ని 'చట్టవిరుద్ధ కోకా ఆందోళనకారుడు'గా వ్యాఖ్యానించింది. అతన్ని పదవీచ్యుతుణ్ణి చేయడానికి అప్పటి నుంచే కుట్రలు మొదలైనాయి. మొరేలిస్ కీలకమైన రంగాలను జాతీయం చేయడానికి ప్రయత్నిస్తే అతన్ని శిక్షిస్తామన్నారు. అయితే మొరేలిస్ అమెరికా సామ్రాజ్యవాద బడా కంపెనీలకు లొంగుబాటు ప్రదర్శించలేదు. బొలీవియాలో 2019 అక్టోబర్ 20న జరిగిన ఎన్నికల్లో (మువ్‌మెంట్ టువార్డ్స్ సోషలిజం–మాస్) పార్టీ నేత ఇవో మొరేలిస్ మరోసారి ఘన విజయం సాధించారు. మొరేలిస్ గెలిస్తే తాము ఆ ఎన్నికను గుర్తించబోమని ప్రతిపక్షాలు ఎన్నికలకు ముందే ప్రకటించాయి. అయితే ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ అనేక దేశాలు ఆ ఎన్నికను గుర్తించలేదు. అక్రమాలపై విచారణ జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అమెరికా దేశాల సంస్థ అలాంటి విచారణ జరిపి అక్రమాలు జరిగినట్టు నిరూపిస్తే మరోసారి ఎన్నికలు జరపడానికి తాను సిద్దమే అని మొరేలిస్ ఎన్నికైన వెంటనే ప్రకటించారు.

గత సంవత్సరం నవంబర్‌లో మొరేలిస్ అధ్యక్ష ఎన్నికను వివాదాస్పదం చేస్తూ మూడువారాల పాటు జరిగిన నిరసన ప్రదర్శనలకు సంపన్న వర్గాల ప్రతినిధి మాజీ అధ్యక్షుడు కార్లోస్ మెసా నాయకత్వంలోని ప్రతిపక్ష పార్టీలు పిలుపు ఇచ్చాయి. నవంబర్ 10న సంపన్న కూటమి శ్రేణుల్లో పోలీసులు చేరడంతో అది తిరుగుబాటు రూపం తీసుకుంది. సైన్యం కూడా తటస్థత విడనాడి అంతిమంగా నవంబర్ 17న అమెరికా ప్రోత్సాహంతో సైనిక తిరుగుబాటు ద్వారా సరళీకృత ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజాశ్రేయస్సుకు పెద్దపీట వేసి, సామాజిక రాజకీయ మార్పుల కోసం కృషి చేస్తున్న మూలవాసుల నాయకుడు, దేశాధ్యక్షుడు ఏవో మొరేలిస్‌ను పదవీచ్యుతుడ్ని చేసింది. మితవాదుల సైనిక కుట్రతో మొరేలిస్ దేశం విడిచి అర్జెంటైనాలో ప్రవాస జీవితం గడపాల్సి వచ్చింది. ఇవో మొరేలిస్ గత సంవత్సరం సైనిక కుట్రతో అధికారం నుంచి తొలగించటం లాటిన్ అమెరికా ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మూలమలుపు అని డోనాల్డ్ ట్రంప్ వర్ణించిన విషయం తెలిసిందే. కానీ అదే ట్రంప్ హయాంలో మాస్ ప్రతినిధి ఆర్సే తిరిగి అధికారాన్ని చేపట్టబోతున్నాడు. బొలీవియా తాత్కాలిక అధ్యక్షురాలిగా సైన్యం చేతిలో కీలుబొమ్మ అయిన స్వయం ప్రకటిత అధ్యక్షురాలిగా జీమైన్ అనీజ్ అధికారం చేపట్టారు.

బొలీవియాలో అపార ఇంధన, ఖనిజ వనరులున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలో 70 శాతం లిథియం ఇక్కడే ఉంది. లిథియంను విద్యుత్‌కార్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో వినియోగిస్తారు. ఇప్పటికే పొరుగున ఉన్న

అర్జెంటీనా, చిలే దేశాల్లో లిథియం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. బొలీవియాలో మాత్రం ప్రభుత్వరంగ సంస్థతో పొత్తు పెట్టుకోవడం ద్వారా తవ్వకాలు సాగించాలని మొరేలిస్ పట్టుబట్టారు. ఆయన పలు విదేశీ కార్పొరేటు కంపెనీలను దేశం నుంచి బయటకు పంపించారు. దీంతో తలపట్టుకున్న ట్రంప్ పశ్చిమాసియా మాదిరిగా ఈ ప్రాంతాన్ని గుప్పెట పెట్టుకోవాలన్న దురాశతోనే బొలీవియాలో సైనిక తిరుగుబాటును ప్రోత్సహించాడు. లాటిన్ అమెరికా దేశాలలోనే మొదటి భూమిపుత్ర నాయకుడు, స్థానిక తెగల సామాజిక, ఆర్థికాభివృద్దికి పాటుపడిన నేత. ఆయన హయాంలో పేదరికం 45 నుంచి 25 శాతానికి తగ్గిపోయింది. అనేక సామాజికాభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేశారు. గనులనూ, వనరులనూ ప్రభుత్వ రంగంలోకి తెచ్చి, విద్యనూ వైద్యాన్నీ సార్వత్రికం చేశారు. సహజవాయువును జాతీయం చేయగా సమకూరిన సొమ్మును దారిద్ర్య నిర్మూలన పథకాలకు ఉపయోగించాడు.

గత సంవత్సరం నవంబర్‌లో మొరేలిస్‌పై జరిగిన కుట్రకు లూయిస్ ఫెర్నాండో కామ్‌చో ప్రధాన కారకుడు. పచ్చి మితవాద ఫాసిస్టు భావజాలం కలిగిన వ్యక్తి ఆయన. అలాగే ఎన్నికలు జరిగే వరకు అధ్యక్ష స్థానంలో ఉన్న అనీజ్ కూడా తిరుగుబాటులో ప్రధాన భాగస్వామి. తిరుగుబాటు అనంతరం అనీజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా పాలిస్తూ గత ఏడాది మే, సెప్టెంబరు మాసాలలో జరపతలపెట్టిన ఎన్నికలను రద్దు చేశారు. దాదాపు 14 ఏళ్లపాటు బొలీవియాలో సాగిన విప్లవ క్రమాన్ని ఫాసిస్టు, జాత్యహంకార రాజకీయ విధానాలతో మితవాద శక్తులు సంవత్సర కాలంలోనే ధ్వంసం చేశాయి. బొలీవియా స్వరూపాన్నే నాశనం చేశాయి. మొరేలిస్ ఇజ్రాయెల్ దేశాన్ని తీవ్రవాద దేశంగా గుర్తిస్తే, అనీజ్ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడిఎఫ్) చేత బొలీవియా సైన్యానికి శిక్షణ ఇప్పించింది. దేశ సహజ వనరులన్నింటిని ప్రైవేట్‌పరం చేసింది. ఐఎంఎఫ్ నుండి రుణాలు తీసుకుంది. మొరేలిస్ చేపట్టిన స్వావలంబన విధానాలను వదిలేసి కార్పొరేట్ సంస్థల దోపిడీకి ఎర్ర తివాచి పరిచింది. పర్యావసానంగా గత పదకొండు నెలల తాత్కాలిక ప్రభుత్వ పాలనలో ఆర్థిక రంగం దిగజారింది. నిరుద్యోగం 3.9 శాతం నుంచి 11.8 శాతానికి చేరింది. నిర్మాణ రంగం 30 శాతం, ఉత్పత్తి రంగం 16 శాతం పడిపోయింది. ద్రవ్యలోటు ఆరు నుంచి తొమ్మిది శాతానికి పెరిగింది. సంపద కేంద్రీకరణ పెరిగింది. ఆర్థిక వృద్ధిరేటు ఆరు శాతం తిరోగమనంలోకి పడిపోయింది.

సంవత్సర కాలంగా సైనిక పాలనలో అణగారిన వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కుట్రకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఉద్యమకారులపై అనీజ్ ప్రభుత్వం దారుణ నిర్బంధ కాండను ప్రయోగించింది. సకాబే, సెంకాతా నగరాల్లో వందలాది మందిని హత్య చేయించింది. ఉద్యమకారులపై తప్పుడు కేసులు పెట్టి వేధించింది. దీంతో అనీజ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, సుదీర్ఘకాలం ప్రదర్శనల ద్వారా ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ కాలంలో మితవాద శక్తులకు ఆదరణ అడుగంటిపోయింది. దీంతో అనీజ్ తిరిగి పోటీ చేయకూడదని నిర్ణయించుకుంది. మొరేలిస్ ప్రభుత్వంలో లూయిస్ ఆర్సే ఆర్థికమంత్రిగా పనిచేశారు. సంపన్నులపై కొత్త పన్ను విధానాన్ని అమలు చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణకు ఆయన అంకితమయ్యారు. ప్రకృతి వనరులను ప్రైవేటుపరం చేయడానికీ, బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు నిరాకరించారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓట్లు వేయడమే కాదు, ఉద్యోగాలు, అవకాశాలు, అధికారాలు ప్రజలందరికీ అందుబాటులో ఉండటం అని మొరేలిస్ మాస్ పార్టీ ఆచరించి చూపింది. ఇది మొత్తం లాటిన్ అమెరికాకే ఒక ఆదర్శంగా నిలిచిపోయే ప్రయోగం. అందుకే అమెరికా సామ్రాజ్యవాదులు తమ పెరడులో జరుగుతున్న ప్రగతిశీల అభివృద్ధిని గొంతునులమదలిచారు.

మాస్ పార్టీని అణగదొక్కాలని అనీజ్ ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించిందో అంతకు రెట్టించిన బలంతో ఆ పార్టీ ఉవ్వెత్తున ఎగసిపడింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు మాస్ పార్టీ గత సంవత్సర కాలంగా రాజీ లేని పోరాటం సాగించింది. ఎన్నికలను వాయిదాల మీద వాయిదాలు వేస్తున్న ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఆగస్టులో మాస్, దాని మిత్ర పక్షాలు కలసి రోడ్ల దిగ్బంధన ఆందోళనకు పిలుపునివ్వగా, మూలవాసీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆ ఆందోళనను జయప్రదం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో నెలల తరబడి జాప్యం చేసిన ఎన్నికలను అక్టోబర్‌లో నిర్వహించేందుకు అనీజ్ అంగీకరించారు. గత అక్టోబర్ 18న జరిగిన బొలీవియా అధ్యక్ష ఎన్నికల్లో మూవ్‌మెంట్ టువర్డ్స్ సోషలిజం పార్టీ(మాస్) అఖండ విజయం సాధించింది. ఫాసిస్టు, మితవాద శక్తులతో కలసి అమెరికా ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ వాటన్నిటిని తుత్తునియలు చేస్తూ బొలీవియా ప్రజలు మొరేలిస్ నేతృత్వంలోని మూవ్‌మెంట్ టువార్డ్స్ సోషలిజం(ఎంఎఎస్) పార్టీకి బ్రహ్మరథం పట్టారు. మాస్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ ఆర్థిక మంత్రి లూయిస్ ఆర్సే 55 శాతం ఓట్లతో తిరుగులేని ఆధిక్యత సాధించారు. పార్లమెంట్ ఉభయ సభల్లోను మొరేలిస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లభించింది.

అమెరికా, దాని తైనాతీల దన్నుతో బరిలోకి దిగిన మాజీ అధ్యక్షుడు, మితవాద సిటిజెన్స్ కమ్యూనిటీ పార్టీ ఆధ్వర్యంలోని కూటమి అభ్యర్థి కార్లోస్ మెసాకు 31.2 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. మొరేలిస్‌ను కూలదోసిన అమెరికా కుట్రలో ప్రధాన ఏజెంట్‌గా వ్యవహరించిన లూయిస్ ఫెర్నాండో కమాచోకు బొలీవియన్ ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిగా అధికార దుర్వినియోగం చేసి, డబ్బు, కార్పొరేట్ మీడియా సహకారంతో ఎన్ని కుతంత్రాలు పన్నినా లూయిస్ ఫెర్నాండో కామ్‌చోకు 14.1 శాతం ఓట్లు లభించాయి. ఈ ఓటమిని మితవాద శక్తులు అంగీకరించక తప్పలేదు. వామపక్ష పార్టీ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో మొరేలిస్ తిరిగి బొలీవియా చేరుకున్నారు. నూతన అధ్యక్షుడు ఆర్సే ప్రభుత్వానికి అవసరమైన సలహాలను మాస్ పార్టీ నాయకుడిగా మొరేలిస్ అందించనున్నారు. ఇంత జరిగినా మితవాద, ప్రతిఘాతక శక్తులు ఆర్సే పార్టీ కార్యాలయంలో ముఖ్యమైన సమావేశంలో ఉండగా బాంబు దాడికి పాల్పడ్డారు.

ఈ ఎన్నికల్లో అనేక మంది మాస్ అభ్యర్థులను పోటీకి అనర్హులుగా ప్రకటించారు. పోటీలో ఉన్నవారి మీద పోలీసు దాడులు చేయించారు. అధ్యక్ష పదవికి పోటీపడిన ఆర్సేని అనేకసార్లు అనర్హునిగా ప్రకటిస్తామని బెదిరించారు. మితవాద శక్తులు ఎన్నికల సంఘం మీద వత్తిడి తెస్తూ నిరసన ప్రదర్శనలకు దిగాయి. ఎన్నికల రోజున హింసకు పాల్పడ్డారు. మూలవాసులపై భౌతిక దాడులు చేశారు. అయినా 88 శాతం ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇక మీడియా సంగతి చెప్పనవసరం లేదు. వాస్తవాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయేమోనన్న అనుమానంతో స్థానిక, విదేశీ జర్నలిస్టులపై ఆంక్షలు విధించారు. టెలిసుర్, ఆర్ టివీ ఛానల్స్ ప్రసారాల అనుమతులను రద్దు చేశారు. పదిహేను సామాజిక రేడియోలను మూయించారు. కొందరు జర్నలిస్టుల మీద రౌడి మూకలను

సంపాదకునిగా ఫ్రెడరిక్ ఎంగెల్స్

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఎంగెల్స్ లోని సంపాదక పార్శ్వాన్ని వివరిస్తున్నారు **కొండూరి వీరయ్య**

ఎంగెల్స్ ద్విశతి ఉత్సవాలు ముగింపుకు వస్తున్నాయి. మార్క్సిజానికి ఎంగెల్స్ అందించిన సేవల గురించి అనేక విశ్లేషణలు, వివరణలు, వ్యాఖ్యానాలు వచ్చాయి. ఈ సందర్భంగానే మార్క్సిజం మౌలిక సూత్రాలను క్రోడీకరించే క్రమంలో ఎంగెల్స్ మార్క్స్ సూత్రీకరణలను, నిర్ధారణలను వక్రీకరించాడా అన్న చర్చ కూడా గణనీయంగానే జరిగింది. ఇదే పత్రిక గత సంచికలో సంపాదకుడు రాసిన వ్యాసంలో కూడా దాని ప్రస్తావన ఉన్నప్పటికీ మౌలికంగా ఆ వ్యాసం ఎంగెల్స్‌ను ఒక రాజకీయ అర్ధశాస్త్రవేత్తగా వ్యాఖ్యానించటంపైనే ఎక్కువగా కేంద్రీకరించింది. ఎంగెల్స్-మార్క్స్‌ల మధ్య ఉన్న మేధో వైవిధ్యాన్ని వైరుధ్యంగా చూపించే ప్రయత్నాల నేపథ్యంలో ఈ వ్యాఖ్య అవసరమని భావిస్తున్నాను.

యోధుడు-సారధి లాంటి జోడీ మార్క్స్-ఎంగెల్స్‌లది. అర్జనుని పప్రస్తాన లేకుండా కృష్ణుడు గురించిన చర్చ అసమగ్రంగా ఉన్నట్లే కృష్ణుడు ప్రస్తావన లేకుండా అర్జునుని గురించిన చర్చ కూడా అసమగ్రమే అవుతుంది. మార్క్స్ - ఎంగెల్స్‌ల గురించిన చర్చ కూడా అదే కోవకు చెందినది. మహాభారతంలో సారధిగా ఉన్న కృష్ణుడు ఆయుధ ప్రయోగం చేయలేదు. కానీ ఎంగెల్స్ పీడిత ప్రజల విముక్తి కోసం అక్షరాన్నీ ఆయుధాన్నీ పట్టిన వీరుడని గుర్తు చేయటానికి సంశయించనవసరం లేదు. ఎంగెల్స్ ప్రతిపాదిత విప్లవ కార్యాచరణలో ప్రజాస్వామిక హక్కులు, ప్రజాతంత్ర పనివిధానం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం (ప్రత్యేకించి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ చర్చల నేపథ్యంలో), భిన్న దృక్పథాలు కలిగిన వ్యక్తులు, సంస్థలు, సంఘాల మధ్య రాజకీయ ఏకాభిప్రాయానికి కృషి చేయటం వంటివి మౌలిక చర్యలుగా కనిపిస్తూ ఉంటాయి.

నాటి శాస్త్ర విజ్ఞాన రంగంలో పురోగమించిన నవయుగ పోకడలు (ఎన్‌లైటెన్‌మెంట్) స్ఫూర్తికి అనుగుణంగా ఎంగెల్స్ తొలినాళ్లల్లో విప్లవాత్మక రాజ్యాంగతత్వం, ప్రజాబాహళ్య రాజకీయాలు (ఆ కాలంలో రాజకీయాలు కులీన వర్గాలకు మాత్రమే పరిమితమైన క్షేత్రంగా ఉండేవి), వ్యక్తిగత హక్కులు, వర్గ అసమానతలు, పారిశ్రామికాభివృద్ధి పర్యవసానాలు, జర్మనీలో జాతీయవాదం వంటి అనేక అంశాల్లో పురోగామి దృక్పథాన్ని అలవర్చుకున్నాడు. యువ హెగెలియన్లల్లో ఈ విప్లవాత్మక రాజ్యాంగతత్వం ప్రధాన ధోరణిగా ఉండేది. (రాజ్యాంగం న్యాయబద్ధంగా రూపొందించగలిగితే తదుపరి పాలన అంతా రాజ్యాంగబద్ధంగా సాగుతుందన్న ఆశాభావం). 19వ శతాబ్దిలో సాగిన విప్లవోద్యమాలు, విముక్తి ఉద్యమాలన్నింటిలోనూ రాజ్యాంగ రూపకల్పన ప్రధాన ఎజెండాగా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవచ్చు. జర్మన్, ఫ్రెంచి విప్లవోద్యమాలను విదేశీ శక్తుల సహకారంతో పాలకవర్గం (కొత్తగా అధికారం చేజిక్కించుకున్న బూర్జువావర్గం) రక్తపాతంతో అణచివేసిన తర్వాత బూర్జువా వర్గపు ప్రజాతంత్ర స్వభావం పట్ల యూరోపియన్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఛార్టిస్టులు, యువ హెగెలియన్ మేధో శ్రేణుల్లో సైద్ధాంతిక చర్చలు మొదలయ్యాయి. ఈ సమయంలోనే లండన్ చేరుకున్న మార్క్స్ అప్పటికే తన శేషజీవితానికి సరిపడా లక్ష్య నిర్దేశం చేసుకుని ఉన్నాడు.

అయితే మార్క్స్ నిర్దేశించుకున్న అధ్యయన శైలి గతితార్కికమైనది. అంటే నిరంతరం సమాజంలో జరిగే ఆర్థిక సాంఘిక, రాజకీయ, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో జరుగుతున్న పురోగమనాన్ని అధ్యయనం చేసి ఇతర రంగాల్లో వ్యక్తమవుతున్న గతితార్కిక అభివృద్ధి క్రమాన్ని ఇముడ్చుకునే విధంగా తన సైద్ధాంతిక నిర్ధారణలు, అంచనాలను తాజా పర్చుకునే దిశగా సాగించే అధ్యయనం. పెట్టుబడి మొదటి సంపుటం 1864లోనే పూర్తైనా 1874 వరకూ అందులోని నిర్ధారణలను, అంచనాలను మార్క్స్ తాజా పరుస్తూనే ఉన్నాడు. రెండు, మూడు సంపుటాల రచన క్రమంలో ముందుకొచ్చిన అనేక కొత్త వివరాల్లో మొదటి సంపుటంలో విశ్లేషణను బలోపేతం చేయటానికి ఉపయోగించే అంశాలన్నింటినీ మొదటి సంపుటానికి జోడిస్తూ వచ్చాడన్న ఒక్క ఉదాహరణ చాలు మార్క్స్

ఉసిగొల్పారు. ఇంత అరాచకం సృష్టించినప్పటికీ మాస్ పార్టీ నేత ఆర్సే గెలుపొందాడు. అయితే అమెరికా సామ్రాజ్యవాదులు ఈ పరిణామాన్ని సహిస్తారా? మాస్ విజయాన్ని వమ్ము చేసే కుట్రలకు పాల్పడతారా? వేచి చూడాలి.

ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులకు తాజా ఎన్నికల్లో ఘన విజయం లభించినప్పటికీ రాబోయే ఐదేండ్లలో అధ్యక్షుడు ఆర్సే ప్రభుత్వ నడక నల్లేరు మీద నడకలా ఉంటుందని చెప్పలేం. ఎందుకంటే గత ఏడాది కాలంగా దాడులు, దౌర్జన్యాలు, హింసతో చెలరేగిన ఈ జాత్యహంకార, మితవాద, పారా మిలిటరీ గ్రూపులు తాత్కాలికంగా స్తబ్దుగా ఉన్నా, అవకాశం చూసుకుని మళ్లీ చెలరేగవచ్చు. కాబట్టి ఈ శక్తుల పట్ల మాస్ ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచాలి. అమెరికాతో కుమ్మక్కయిన పోలీసు, మిలిటరీ, మితవాద శక్తుల కుట్రలకు బొలీవియాలో తాత్కాలికంగా తెరపడింది. అవి తిరిగి మరోమారు తలెత్తలేవని చెప్పలేం. దానికిగాను పలు ఆటంకాలను అధిగమించాల్సి ఉంది. అయితే ఈ విజయంతో సంతృప్తి చెంది ఆదమరవకుండా అమెరికా కుట్రలను నిరంతరం కనిపెట్టటంతో పాటు విధానపరమైన మార్పులను చేపట్టి పురోగమించడం ఎలా అనే అతిపెద్ద సవాలు ఆ పార్టీ ముందు అధ్యక్షుడు ఆర్సే ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

అధ్యయన శైలిని అర్థం చేసుకోవటానికి.

ఈ విలక్షణ అధ్యయన క్రమాన్నే లెనిన్ నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనంగా నాలుగు పదాల సముదాయంగా క్రోడీకరించాడు. ఈ సూత్రాన్ని ఉద్యమ రూపకల్పన సమయంలో అనుసరించే ఎత్తుగడలు, వ్యూహానికి పరిమితం చేసి మాట్లాడుకోవటం దైనందిన కమ్యూనిస్టు పరిభాషలో కనిపిస్తున్న అంశమే. ఈ గతితార్కిక అధ్యయన శైలిని అనుసరించే క్రమంలో మార్క్స్ తానుగా నిర్ధారణకు వచ్చిన అనేక విషయాలను నిర్ధారణల రూపంలో నమోదు చేయటానికి అవకాశం దక్కలేదు. అటువంటి అనేక సందర్భాలు మార్క్స్ మరణానంతరం ఆయన రాతప్రతుల రూపంలో మరుగునపడే ప్రమాదానికి చేరువలో ఉన్నసమయంలో ఎంగెల్స్ వాటికి ఓ రూపాన్నిచ్చే ప్రయత్నం చేశాడు. కీలకమైన రాజకీయ అర్థ శాస్త్రానికి సంబంధించిన సూత్రాలైనా, సాయుధ గెరిల్లా ఎత్తుగడలైనా జనరంజక భాషలో వివరించగల నేర్పు ఎంగెల్స్ స్వంతం. ఈ నేర్పుతోనే మరుగున పడిన మార్క్స్ మేధస్సును వెలుగులోకి తెచ్చేందుకు దాదాపు దశాబ్ద కాలాన్ని వెచ్చించాడు. మార్క్స్ జీవితకాలంలో ప్రచురణకు నోచుకోని అనేక రచనలు, వ్యాఖ్యానాలను తాజా ముందుమాట, పరిచయాలతో ప్రపంచ విప్లవోద్యమానికి అందించిన సంపాదకుడు ఎంగెల్స్. మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ నాటి కమ్యూనిస్టు శ్రేణులకు అందుబాటులోకి తెచ్చిన కొన్ని రచనల విషయంలోనే వ్యాసం ఆరంభంలో ప్రస్తావించిన అభ్యంతరాలు ముందుకొచ్చాయి.

మార్క్స్ 1883లో మరణించిన తర్వాత పెట్టుబడి గ్రంథాన్ని సంస్కరించి అచ్చుకు సిద్ధం చేసే కీలకమైన సంపాదక యజ్ఞానాన్ని ఆరంభించాడు ఎంగెల్స్. మరో వైపున ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న వర్కర్స్ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు, సోషల్ డెమొక్రటిక్ పార్టీలకు దిశా నిర్దేశం చేయటంలో కూడా ఎంగెల్స్ క్రియాశీలక పాత్ర పోషించాడు. అయితే ఈ విధంగా వివిధ దేశాలకు దిశా నిర్దేశం చేసే ప్రయత్నంలోనే మార్క్సిజం పరిణామ క్రమాన్ని ఓ చారిత్రక నేపథ్యంలో సులభంగా సాధారణ కార్యకర్తలు సైతం అర్థం చేసుకోవటానికి వీలుగా రూపొందించాడు.

మార్క్స్ రచనలను సులభ శైలిలో కార్మికవర్గ నాయకులను వివరించే ఎంగెల్స్ ప్రయత్నం మార్క్స్ జీవిత కాలంలోనే మొదలైంది. ప్రత్యేకించి మొదటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటుతో ఈ అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా ముందుకొచ్చింది. అప్పటికే పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటాన్ని అచ్చుకు సిద్ధం చేయటంలో తుది అడుగులు వేస్తున్న మార్క్స్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమన్వయానికి కావల్సినంత సమయం ఇచ్చే స్థితిలో లేదు. దాంతో 1870 నుండీ ఈ బాధ్యత ఎంగెల్స్‌కు అప్పగించాడు మార్క్స్. ఎంగెల్స్‌కు 12 భాషల్లో మాట్లాడగల రాయగల సామర్థ్యం కూడా ఇంటర్నేషనల్ నిర్వహణ బాధ్యత ఎంగెల్స్‌కు అప్పగించటానికి ప్రోత్సహకారిగా మారింది. ఎంగెల్స్ మిత్రులు "12 భాషల్లో ఎంగెల్స్ చిందులేయగలడు" అని గుర్తు చేసుకున్నారు.

1878 నాటికి మార్క్స్ దాదాపు రచనా వ్యాసంగాన్ని ఆరోగ్య కారణాల రీత్యా నిలిపివేసినా వివిధ దేశాల నుండి సమాచారాన్ని సేకరించటం, లేఖలు రాయటం, సమకాలీన సాహిత్యంలో ముఖ్యమైన రచనలను ఎన్నుకుని వాటిపై నోట్సు రాసుకోవటం మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాడు. 1878 నుండి ఎంగెల్స్ మార్క్స్‌కు కళ్లు చెవులు లాగా పని చేశాడు. విల్హెల్మ్ లిబ్నెక్ట్‌తో సహా సమకాలీన జర్మన్ సోషలిస్టులు మార్క్సిజాన్ని జనరంజకంగా విస్తరిస్తున్న విప్లవోద్యమాలకు చేరవేయటంలో సమర్థవంతమైన పాత్ర పోషించలేకపోతున్న తీరును గమనించిన ఎంగెల్స్ పలు కరపత్రాలు, బుక్లెట్లు రాసేందుకు సిద్ధమయ్యాడు. ఈ కాలంలోనే ప్రొధాన్ ప్రభావంలో ఉన్న జర్మన్ సోషల్ డెమొక్రసీ పత్రికలో ఇళ్ల స్థలాల సమస్య గురించిన వ్యాసాల ద్వారా (ది హౌసింగ్ క్వశ్చన్) ప్రొధానిజానికి, మార్క్సిజానికి మధ్య ఉన్న తేడాని కార్మికులకు, సోషల్ డెమొక్రసీ నాయకులకు విడమర్చి వివరిస్తూ ఎంగెల్స్ వ్యాసాలు రాశాడు. చారిత్రకభౌతిక వాదం సిద్ధాంతం ఆచరణాత్మక అధ్యయనం గురించి పరిచయం చేయటం కోసం జర్మనీలో రైతు యుద్ధాలు రచనను తాజా తొలిపలుకులతో వెలుగులోకి తెచ్చాడు.

మార్క్సిస్టు మౌలిక రచనల్లో కొన్నింటిని పరిశీలిస్తే ఎంగెల్స్ సంపాదక సామర్థ్యం ఎలాంటిదో అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది. 'వేతనశ్రమ – పెట్టుబడి' కరపత్రం 1849లో మార్క్స్ రాసినది. ఈ కరపత్రంలో "శ్రమ" అన్న పదమే కనిపిస్తుంది. అదనపు విలువ సృష్టికి మూలం శ్రమ శక్తిలోనే ఉంది అన్నది మార్క్స్ వినూత్నంగా ఆవిష్కరించిన పెట్టుబడిదారీ చలన సూత్రం. మార్క్స్ ఇదే అర్థంతో రాసినా 1849 నాటి కరపత్రంలో మాత్రం శ్రమశక్తి అన్న పదం కనిపించదు. ఈ కరపత్రం 1891 నాటి పునర్ముద్రణకు రాసిన ముందుమాటలో ఎంగెల్స్ ఈ అంతరాన్ని పూరిస్తూ రాసిన వాక్యాలు గమనించదగ్గవి. 'మార్క్స్ కేవలం తన మేధో సామర్థ్యాన్ని సాధారణ పాఠకుల ముందు పెట్టాలి అనుకుని ఉంటే ఆయన రచనలు మక్కికి మక్కి అలానే జనం ముందుకు వచ్చేవి. కానీ ఆయన రాసిన రచనలు కేవలం తన మేధోకృషి గురించిన గొప్పలు చెప్పుకోవటానికి కాదు. తన రచనలు ఉద్యమ పథంలో ఉన్న కార్మికుల చైతన్యాన్ని పెంపొందించేందుకే అన్న అవగాహనతో రాసిన రచనలు అవి. కాబట్టే తన పాత రచనలను కొత్త ఆవిష్కరణల నేపథ్యంలో పున:పరిశీలించి ఉండేవాడు. కీలక భావనలు పాఠకునికి చేరేలా అవసరమైన మార్పులు చేసి ఉండేవాడు' అని రాశాడు. (సంకలిత రచనలు, సంపుటి 27, పేజీలు 194–195). 1849 నాటి ప్రతి ప్రకారం కార్మికుడు తన శ్రమను పెట్టుబడిదారునికి అమ్ముకుంటాడు. కానీ 1891 నాటి ప్రతి ప్రకారం కార్మికుడు శ్రమశక్తిని అమ్ముకుంటాడు. ఇది పైకి చూడటానికి మాటలను అటు ఇటు మార్చినట్లు కనిపిస్తున్నా ముందుకు తెచ్చింది మాత్రం రాజకీయ అర్థశాస్త్రంలోని అత్యంత కీలకమైన ఆవిష్కరణ. మార్క్సిజంపై దాడి చేసే మేధావులు నేటికీ శ్రమ–శ్రమ శక్తిల అవగాహనలో ఉన్న అంతరాన్ని కప్పి ఉంచేందుకే ప్రయత్నం చేయటం గమనార్హం.

కమ్యూనిస్టు ప్రణాళికలో కూడా ఇటువంటి సందర్భం మనకు కనిపిస్తుంది. కమ్యూనిస్టు ప్రణాళిక 1888 నాటి ఇంగ్లిష్ పునర్ముద్రణకు, 1890 నాటి జర్మన్ ప్రతికి రాసిన ముందుమాటల్లో 'ప్రణాళిక' సమకాలీన ప్రాధాన్యతను వివరించే క్రమంలో ఇది చారిత్రక పత్రం, దీన్ని మార్చే హక్కు నాకు గానీ మార్క్స్‌కు గానీ లేవని స్పష్టం చేస్తాడు. అదేసమయంలో పాఠకుల సౌకర్యం కోసం 1848 నుండీ 1890 మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ, రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులను మార్క్సిజపు మౌలిక సిద్ధాంతం చారిత్రక భౌతికవాద సూత్రాల వెలుగులో వివరిస్తాడు. ఈ ముందుమాటలు చదివిన తర్వాత ప్రణాళిక ప్రధాన పాఠం చదివితే అదేదో కాలం చెల్లిన పత్రం అన్న భావనే కలుగదు.

అందుకే నేటికీ ఈ పత్రం ప్రపంచ వ్యాప్తంగా పీడితులను సమాజమార్పు దిశగా, పండితులను మేధో విన్యాసాల దిశగా ప్రేరేపిస్తూనే ఉంది.

పెట్టుబడి గ్రంథాన్ని సంస్కరించి ప్రచురించే క్రమంలో ఎంగెల్స్ మార్క్స్ నిర్ధారణలను మార్క్స్ ప్రస్తావించిన స్ఫూర్తితో ప్రస్తావించలేదనీ, వివరణల పేరుతో ఎంగెల్స్ చేసిన అనేక మార్పులు మౌలికంగా మార్క్సిజంపై పెట్టుబడిదారీ మేధావులు దాడి చేయటానికి దారితీశాయన్నది ఎంగెల్స్ గురించి ఉన్న మౌలిక విమర్శ. దీని లోతుపాతులు క్లుప్తంగానైనా ప్రస్తావించుకోవాలంటే పెట్టుబడి గ్రంథం ప్రచురణ క్రమాన్ని అర్థం చేసుకోవాలి. అధ్యయనం చేయాలి.

పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటి 1864లోనే పూర్తయ్యింది. మిగిలిన రెండు సంపుటాల కోసం ఎదురు చూడకుండా మొదటి సంపుటాన్ని ప్రచురించాలని 1866లో ఎంగెల్స్ ప్రతిపాదిస్తాడు. దీనికి సమాధానంగా "రాత ప్రతి సిద్ధంగానే ఉన్నప్పటికీ దాన్ని అచ్చుకు సిద్ధం చేయాలంటే నేను మాత్రమే చేయగలను. చివరకు నీకు కూడా సాధ్యం కాదు." అని సమాధానమిస్తాడు. ఓ విలేకరికి ఇచ్చిన సమాధానంలో మార్క్స్ "పెట్టుబడి గ్రంథాన్ని ఓ క్రమంలో రాయాలనుకున్నాను. దీనికి కావల్సిన సమాచారం అంతా సేకరించాను. చిత్తు ప్రతి సిద్ధం చేశాను. ఆ తర్వాతనే మొదటి సంపుటాన్ని సిద్ధం చేశాను. మొదటి సంపుటం రాయటానికి ఉపయోగపడిన కీలక సమాచారం అంతా చిత్తు ప్రతిగానే మిగిలిపోయింది" అంటాడు మార్క్స్. (సంకలిత రచనలు 48వ సంపుటి). అంటే పెట్టుబడి 2, 3 సంపుటాలు రాయటాన్ని మార్క్స్ మొదటి సంపుటం కంటే ముందే పూర్తి చేశాడు. ఇదే విషయాన్ని మరో చోట ప్రస్తావిస్తూ ఎంగెల్స్ "1864-67 మధ్య కాలంలోనే పెట్టుబడి 2, 3 సంపుటాలుగా చెప్పబడుతున్న భాగాలను మార్క్స్ పూర్తి చేశాడు" అని స్పష్టం చేస్తాడు. (సంకలిత రచనలు 37వ సంపుటి). మూడవ సంపుటంలో ఎక్కువ భాగం 1864-65 మధ్యకాలంలోనే పూర్తి అయ్యిందని రెండో సంపుటానికి రాసిన ముందు మాటలో కూడా ప్రస్తావిస్తాడు. ఈ భాగాలు పూర్తి చేసిన తర్వాతనే మొదటి సంపుటాన్ని వివరించేందుకు మార్క్స్ పూనుకున్నాడని ఎంగెల్స్ వివరిస్తాడు. అయితే ఇదంతా సమాచారం రూపంలో సిద్ధంగా ఉందే తప్ప నిర్ధారణలు, ఆవిష్కరణల రూపంలో కాదు. పెట్టుబడి గ్రంథం 2, 3 సంపుటాలను అచ్చుకు సిద్ధం చేసే క్రమంలో ఎంగెల్స్ చేసిన పని మార్క్స్ ఆవిష్కరణలకు ఓ రూపాన్నివ్వటమే.

సరుకుల విలువ గురించిన సూత్రీకరణ విషయంలోనూ సంపాదకుడిగా ఎంగెల్స్ తీసుకున్న జాగ్రత్త రచయిత చెప్పదల్చుకున్న భావానికి, సంపాదకుడు ఇచ్చే విలువను మనముందుంచుతుంది. సోమ్బార్ట్‌కు 1895 మార్చి 11న రాసిన లేఖలో ఎంగెల్స్ "సరుకుల విలువ గురించి ప్రస్తావించేటప్పుడు నేను తాజా ఆర్థిక దశకు (పెట్టుబడిదారీ దశకు) మాత్రమే పరిమితం కావాలి. ఎందుకంటే ఈ దశలో మారకపు విలువ, సరుకుల ఉత్పత్తి ఏ సామాజిక రూపంలో ఉనికిలో ఉన్నాయో అంతవరకే పరిమితం కాగలను" అని పెట్టుబడి గ్రంథాన్ని ఎడిట్ చేయటంలో తనకు తాను విధించుకున్న ఆంక్షలను వివరిస్తాడు.

కానీ ప్రత్యేకించి 1992లో మార్క్స్ ఎంగెల్స్ సమగ్ర రచనలు (ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న యాభై సంపుటాలు సంకలిత రచనలు - ఈ రచనల కూర్పు చరిత్ర మరో సందర్భంలో వివరిస్తాను) పేరుతో వచ్చిన రచనల నేపథ్యంలో పెట్టుబడి సంకలనంలో ఎంగెల్స్ పాత్ర గురించి చర్చ పున:ప్రారంభమైంది. ఈ సందర్భంగానే పెట్టుబడి గురించిన నాలుగు ముసాయిదాలు కూడా వెలుగు చూశాయి. ఈ చిత్తు ప్రతులను ఎంగెల్స్ సంపాదకత్వంలో వెలువడిన పెట్టుబడి సంపుటాలకు మధ్య ఉన్న తేడాలను భూతద్దంలో చూడటం మొదలైంది. మూడో సంపుటం 13-15 అధ్యాయాల్లో వివరించిన లాభాల రేటు పతనం సిద్ధాంతం మీద కొత్తతరం పరిశోధకులు దండెత్తారు. మార్క్స్ 1864-65లో రాసుకున్న చిత్తు ప్రతిలో ఉన్నదానికంటే పెట్టుబడి గ్రంథం మూడో సంపుటంలో ఉన్న వివరణ సమగ్రంగానూ, గతితార్కిక అధ్యయన శైలికి అనుగుణంగానూ ఉందన్నది ఈ విమర్శకుల వాదన. లాభాల రేటును ప్రభావితం చేసే కారకాల విషయంలో మార్క్స్ ప్రస్తావించిన కారణాలకు ఎంగెల్స్ పరిమితం కాలేదన్నదని మరో వాదన. అత్యంత కీలకమైన ఈ నిర్ధారణ లేదా సూత్రీకరణ విషయంలో నిర్దిష్టత లోపించిందనీ, భవిష్యత్తులో తలెత్తనున్న పరిణామాలు, దోహదం చేయనున్న కారణాలను ఇముడ్చుకునే రీతిలో ఎంగెల్స్ వివరణ విశాలంగా ఉన్నదన్నది మరో విమర్శ. మరి కొందరు విమర్శకులు లాభాల రేటు పతనం సూత్రీకరణలకు మార్క్స్ ఇచ్చిన ప్రాధాన్యతను మించి ఎంగెల్స్ శాశ్వతత్వాన్ని ఆపాదించారని విమర్శించారు.

లాభాల రేటు పతనాన్ని నిలువరించేందుకు, నివారించేందుకు పెట్టుబడి అనుసరించే అనేక మార్గాల గురించి వివరిస్తూ ఎంగెల్స్ పెట్టుబడి మూడో సంపుటం మొదటి భాగంలో ఓ అధ్యాయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తాడు. పెట్టిన పెట్టుబడి తిరిగి రాబట్టుకోవటానికి పెట్టుబడిదారీ వర్గం ఎన్నో ప్రయోగాలు చేస్తుందనీ, ఎన్నో రూపాల్లో తన పెట్టుబడి తిరిగి సాధ్యమైనంత తక్కువ కాలంలో తిరిగి రాబట్టుకునే మార్గాలు అన్వేషిస్తుందన్నది ఈ అధ్యాయంలోని సారాంశం. నేడు మనం చూస్తున్న ద్రవ్య పెట్టుబడి, సేవా రంగాల్లో గుత్త సంస్థలు ఆవిర్భావం, ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి రంగం వాటా తగ్గి ఉత్పత్తేర రంగాల వాటా పెరగటం వంటి పరిణామాలకు సంక్షిప్త వివరణలు ఈ అధ్యాయంలో ఉన్నాయంటే నోరెళ్లబెట్టడం నేటి నోబెల్ గ్రహీతల వంతవుతుందనటంలో సందేహం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ విమర్శకులు ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కినా చివరకు ఎంగెల్స్ కూడా మార్క్స్ రచనా శైలిని స్వీకరించాడని అంగీకరించకతప్పలేదు. అందుకే సీగెల్ అనే అర్థశాస్త్రవేత్త 'ఎంగెల్స్ మార్క్స్‌ను వక్రీకరించాడని చెప్పలేం. ఎందుకంటే మార్క్స్ రచనల్లోనే అనేక సంశయాలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ఇటువంటి సంశయాలకు సమాధానం చెప్పటానికి మార్క్స్ చిత్తుప్రతులు, నోట్సులు, లేఖలను ఆధారం చేసుకున్నాడు ఎంగెల్స్' అని నిర్ధారించాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చక్రాలు సున్నితంగా కదలటానికి లాభం అన్నది కందెన నూనె వంటిది. కందెన లేని ఇరుసులు గానీ, చక్రాలు కానీ మొరాయిస్తాయి. అదే విధంగా లాభాలు రాని రంగాల్లో లేదా తక్కువ లాభాలు వచ్చే రంగాల్లో పెట్టుబడులు ప్రవేశించటానికి నిరాకరిస్తూ ఉంటాయి.

ఈ సందర్భంలోనే పెట్టుబడి గ్రంథంలోని మరో చర్చను ఎంగెల్స్ ఓ కొలిక్కి తీసుకొచ్చిన తీరును మనం పున:శ్చరణ చేసుకోవాలి. లాభాల రేటు పతనానికి, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికీ మధ్య ఉన్న సంబంధం గురించిన చర్చ అది. తగినన్ని లాభాలు వస్తాయన్న నమ్మకం, ఆశ లేనప్పుడు పెట్టుబడి వినియోగంలోకి రావటానికి తయారుకాదు.

అటువంటి పరిస్థితుల్లో కొత్త పెట్టుబడులు, కొత్త కొత్త పెట్టుబడిదారులు తెరమీదకు రారు. రావు. అధికోత్పత్తి, గాలివాటు వ్యాపారాలు, సంక్షోభం, వినియోగంలోకి రాని మిగులు పెట్టుబడులు ఈ దశలో కనిపించే మౌలిక లక్షణాలు. ఈ పరిణామం మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడనే ప్రశ్నార్ధకం చేస్తుంది. ఇక్కడ పెట్టుబడి కదలిక రెండు రకాలుగా ప్రభావితమవుతుంది. కొత్త పెట్టుబడుల కొరత సామర్ధ్య వినియోగంలో ఎగుడుదిగుళ్ల రూపంలో (ఉదాహరణకు ప్లాంట్ లోడ్ ఫాక్టర్) వ్యక్తమవుతుంది. సమకాలీన భారతదేశ ఆర్థిక వ్యవస్థనే పరిశీలిస్తే గత నాలుగేళ్లల్లో ఈ లక్షణాలు పుష్కలంగా వ్యక్తమవుతున్నాయి. ఏ రంగంలో అధికోత్పత్తి కుప్పలు తెప్పలుగా పోగుపడుతోంది. పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందన్న నమ్మకం లేకపోవటంతో పెట్టుబడిదారుల వద్ద మిగులు పెట్టుబడి పోగుపడుతోంది. రిజర్వు బ్యాంకుతో సహా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ మిగులు నిధుల సమస్యనెదురొంటోంది. రిజర్వు బ్యాంకు 2018లో విడుదల చేసిన ఓ నివేదికలో వినియోగదారుల నమ్మకం 23 శాతానికి పడిపోయిందని అంచనా వేసింది. ఇవన్నీ పెట్టుబడి మూడో సంపుటాన్ని కళ్లముందు విశదీకరించే పరిణామాలు.

గ్రండ్రిస్ గ్రంథం వెలుగు చూసేనాటికి ఎంగెల్స్ కూడా మరణించాడు. ఎంగెల్స్ మీద దాడికి దిగుతున్న వారంతా ఆయన తెలిసే గ్రండ్రిజ్‌ను పక్కన పెట్టేశాడని ఆరోపిస్తున్నారు. లాభాల రేటు పతనం గురించి మార్క్స్ 1857-58లో ప్రస్తావించిన మాట వాస్తవమే. ఎంగెల్స్ తుదిరూపునిచ్చిన పెట్టుబడి గ్రంథంలోనూ అదే మార్క్స్ అవగాహన మరింత విపులంగా మనముందుంది. ఇక్కడ వక్రీకరణ కంటే మించి మార్క్స్ రాసిన మాటల్లో యథాతథంగా లేదన్నదే విమర్శగా కనిపిస్తుంది. 1861-63 మధ్య మార్క్స్ రాసుకున్న మరో 23 చిత్తు ప్రతులను కూడా సంస్కరించాలన్న లక్ష్యాన్ని ఎంగెల్స్ తనకు తానుగా నిర్దేశించుకున్నా కాలం ఆయన్ను ఆపని పూర్తి చేయనివ్వలేదు.

అయితే ఈ నోట్సులను మదింపు చేసిన తర్వాతనే పెట్టుబడి మూడో సంపుటం ఎంగెల్స్ పూర్తి చేశాడన్నది నిస్సందేహం. దీనికి ఆధారంగా మూడో సంపుటానికి ఎంగెల్స్ రాసిన ముందుమాటను ప్రస్తావించుకోవచ్చు. మార్క్స్ రాసుకున్న 23 చిత్తు ప్రతుల్లో ఒకటి మూడో సంపుటంలోని లాభాల రేటు – మిగులు విలువ రేటు అన్న అధ్యాయానికి సంబంధించినది. ఎక్కువ భాగం ఇది గణిత సమాసాల రూపంలో ఉంది. దీని గురించి ముందుమాటలో ప్రస్తావిస్తూ ఎంగెల్స్ "మూడో సంపుటం కోసం తయారు చేసుకున్న చిత్తు ప్రతుల్లో అనేకం నోట్సులు అసంపూర్ణంగా మిగిలిపోయాయి. మరీ ముఖ్యంగా లాభాల రేటు మిగులు విలువ మధ్య సంబంధాన్ని వివరిస్తూ రాసుకున్న పూర్తి నోట్సు ఒకటి ఉంది. అయితే అది ప్రధానంగా గణిత సమాసాల రూపంలో ఉంది. ఈ నోట్స్‌ను నా కోసం సంస్కరించే బాధ్యతను మా మిత్రులు శామ్యూల్ మూర్ స్వీకరించాడు. గతంలో కేంబ్రిడ్జిలో గణితశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసిన అనుభవం ఉన్నందున ఈ పని మూర్‌కు అప్పగించాను. మూర్ ఇచ్చిన వివరణ, మూల ప్రతిలోని ప్రధాన భాగంతో జోడించి మూడో అధ్యాయానికి తుదిరూపం ఇచ్చాను" అని స్పష్టంగా చెప్పాడు. (సంకలిత రచనలు, సంపుటి 37). అంతే కాదు. ఈ అధ్యాయానికి తుది రూపం ఇచ్చే క్రమంలో ఉపయోగించకుండా పక్కన పెట్టిన మార్క్స్ నోట్సుల గురించి అధ్యాయం చివర్లో ఇచ్చిన వివరణ సంపాదకుడిగా ఎంగెల్స్ నిబద్ధతకు, ప్రతిభాపాటవాలకు, పారదర్శకతకు నిలువెత్తు ఉదాహరణ.

"రాత ప్రతుల్లో లాభాల రేటు, మిగులు విలువ మధ్య సంబంధాన్ని వివరించే గణాంకాలు ఉన్నాయి. అవి చాలా ప్రత్యేకమైనవి. ఆసక్తికరమైనవి. ఆ లెక్కలన్నీ గమనిస్తే లాభాల రేటు, మిగులు విలువ ఎప్పుడు అనులోమానుపాతంలో ఉంటాయో ఎప్పుడు విలోమాను పాతంలో ఉంటాయో తెలుసుకోవచ్చు. ఈ రెండు రేట్ల మధ్య ఉన్న సంబంధాన్ని గ్రాఫ్ చిత్రాల రూపంలో కూడా మార్క్స్ నమోదు చేసి ఉంచాడు. అయితే ఇక్కడ ఈ లెక్కలను, దాని ఆధారంగా గీసిన గ్రాఫ్‌లను యథాతథంగా ముద్రించటం లేదు. ఆ అంశంపై ఆసక్తి కలిగిన ప్రత్యేక పాఠకులు తాము ఈ విషయం గురించి లోతైన పరిశోధన సాగించదల్చుకుంటే ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతోనే ఈ వివరణ ఇస్తున్నాము." అంటూ పాదసూచికలో వివరించాడు ఎంగెల్స్.

ఈ రెండు ప్రస్తావనలూ పరిశీలిస్తే ఎంగెల్స్ మార్క్స్ రాతప్రతులను పక్కకు నెట్టేశాడని అనుకోవడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు. పైగా ఎడిటర్‌గా తన విచక్షణ ఎక్కడ ఉపయోగించాడు, ఎందుకు ఉపయోగించాడో కూడా వివరంగా నమోదు చేసి ఉంచాడు. అంతేకాదు. డ్యూరింగ్ ఖండన గ్రంథానికి 1885లో రాసిన ముందుమాటలో గణితశాస్త్రం గురించి మార్క్స్ ప్రత్యేకంగా అధ్యయనం చేసాడనీ, ప్రకృతి శాస్త్రాల అధ్యయనంలో భాగంగా తాను గణితం గురించి వచ్చిన అంచనాలను, మార్క్స్ అవగాహనను కలిసి మరో సందర్భంలో ప్రచురించేందుకు ప్రయత్నం చేస్తామని కూడా ప్రస్తావిస్తాడు. కాబట్టి మార్క్స్ రాసిన చిత్తు ప్రతులను ఎంగెల్స్ విస్మరించాడన్న విమర్శకు తావే లేదు.

చివరిగా 1895లో సోమ్బర్ట్‌కు రాసిన లేఖలో "పెట్టుబడి మూడో సంపుటాన్ని మరింత ఆకర్షణీయంగా తయారు చేయగలనన్న నమ్మకం మీకు నాపై ఉన్నందుకు ధన్యవాదాలు. కానీ నాకు అటువంటి అభిప్రాయం లేదు. మార్క్స్‌ను మార్క్స్ మాటల్లో చెప్పటానికే నేను కట్టుబడి ఉన్నాను." (సంకలిత రచనలు, సంపుటి 50) అని స్పష్టంగా వక్కాణించాడు. "మూడో సంపుటాన్ని సంస్కరించే ప్రయత్నంలో (ఎడిట్ చేయటంలో) సాధ్యమైనంత వరకు సాధికార రచనను పాఠకులు ముందుంచటానికీ, సాధ్యమైనంత వరకు మార్క్స్ మాటల్లోనే చెప్పటానికి ప్రయత్నం చేశాను. అనివార్యం అయినప్పుడు మాత్రమే నా మాటలు ప్రస్తావించాను. అటువంటప్పుడు కూడా పాఠకులు నా మాట చదువుతున్నాడా మార్క్స్ మాట చదువుతున్నాడా అన్న గందరగోళానికి గురికానీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాను." అని 1895 మే-జూన్‌లో రాసుకున్న అనుబంధంలో ఎంగెల్స్ వివరించాడు.

"మార్క్స్ రచనలకు తోడ్పాటునందించటంతో పాటు ప్రతి అంశంపైనా నాకంటూ ఓ ప్రత్యేకమైన అధ్యయనం, అవగాహన ఉన్నాయనటంలే సందేహం లేదు. అయితే చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రాలకు సంబంధించినంత వరకు మౌలిక ఆవిష్కరణలు మార్క్స్ స్వంతమే. నేనందించిన తోడ్పాటును మార్క్స్ కూడా స్వతంత్రంగా సాధించగలిగి ఉండేవాడు" అన్న ఎంగెల్స్ నమ్రత విప్లవోద్యమంలో పని చేసే సంపాదకులందరూ నేర్చుకుని ఆచరించదగ్గ లక్షణం.

(రచయిత పాత్రికేయులు) వీ

స్త్రీలు - న్యాయ వ్యవస్థ - 3

***పితృస్వామిక సమాజంగా ఉన్న భారత సమాజంలో స్త్రీల పట్ల న్యాయవ్యవస్థ వైఖరి కూడా ఆధిపత్య సంస్కృతికి అనుగుణంగానే ఉందని అంటున్నారు* హేమ వెంకట్రావు**

(గత సంచిక తరువాయి)

న్యాయ వ్యవస్థకు, శాశనసభలకు మధ్య అవినాభావ సంబంధం కొరవడిందని కొన్ని అంశాలు రాజకీయం చేస్తారనడానికి ట్రాన్స్ జెండర్ కేసులో ఒకటి ఉదాహరణగా చెప్పవచ్చును. మన దేశంలో 4.8 మిలియన్‌ల ట్రాన్స్ జెండర్స్ లేదా థర్డ్ జెండర్స్ (లింగమార్పిడి కలిగినవారు) ఉన్నారు. 2018లో సుప్రీంకోర్టు తమ లింగం వారితో సెక్స్‌లో పాల్గొనడం నిషిద్ధమైన 377 సెక్షన్‌ను రాజ్యాంగానికి విరుద్ధమని ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తులు వేసిన 2014 పిటిషన్‌లో తీర్పును వెలువరించింది. వారు తమ లింగాన్ని మార్చుకోవడానికి 2019లో ట్రాన్స్ జెండర్ వ్యక్తుల రక్షణకోసం చట్టం చేశారు. దీని ప్రకారం సెక్స్ మార్పిడికి చట్టరీత్యా అనుమతి దొరికినా వారిపై జరిగే వివక్షతపై, కానీ ఒకే లింగంతో ఉన్నవాళ్ల మధ్య పెళ్లిళ్లను లేదా లింగ మార్పిడి చేసుకున్నవారికి ఇంకా అనుమతిని చట్టం ఇవ్వలేదు. వీరు దత్తత తీసుకోవచ్చు. అలాగే శస్త్ర చికిత్స లేకుండా తమ లింగమార్పిడికి సంబంధించి తీసుకునే నిర్ణయాలకు ఈ చట్టంలో విలువలేదు. తప్పనిసరిగా ఉద్యోగాలలో, విద్యా సంస్థలలో 2 శాతం రిజర్వేషన్ కోటాను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఈ చట్టంలో ప్రస్తావించి చేర్చలేకపోయింది. వీరిపై జరిగిన దాష్టీకాలకు చాలా తక్కువ శిక్షలు వేయడం విమర్శలకు గురవుతుంది. ఈ చట్టం ప్రకారం అడ్డుకోవడం నేరం. వీరు తమ లింగ మార్పిడి మార్పు పత్రాల కోసం జిల్లా కలెక్టరుకు వినతి చేసుకోవాలి. కొన్ని రాష్ట్రాలలో వీరికి సంక్షేమ పథకాలు అమలు చేయడం తప్పనిసరి కాదు.

సాధారణ స్త్రీల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా న్యాయాన్ని అందించే జడ్జీలు, బాధితుల కోసం వాదించే న్యాయవాదులపైన సామాజిక ప్రభావం ఎలా ఉందో గమనిస్తే న్యాయం దొరుకుతుందా అనే అనుమానం మనకు రాకపోదు. ఇప్పటికీ మహిళా న్యాయవాదుల కంటే పురుష న్యాయవాదులే సంఖ్య రీత్యా ఎక్కువ. ఇది కుటుంబ రీత్యా, వృత్తి రీత్యా బాధ్యతలు రెట్టింపు కావడం వలన నిరంతరం అధ్యయనం నైపుణ్యత అవసరం వలన వెనకపడి పోతుంది. దీనికి కారణం ఈ వృత్తి మీద ఎక్కువ సమయాన్ని కేటాయించాలని ఇది కుటుంబ స్త్రీలకు వీలుకాదని, స్త్రీ మనస్తత్వం సున్నితమైనది కాబట్టి క్రిమినల్ కేసులు మహిళల కంటే పురుషులే బాగా చేయగలరని ప్రజలు, కొంతమంది జడ్జీలు తమ అభిప్రాయంగా కలిగి ఉంటారనేది సాక్ష్యాత్తు (పేరు చెప్పలేదు) సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది తెలిపారు. ఏది ఏమైనా మహిళలు కుటుంబ సంబంధమైన కేసులే ఎక్కువ. గట్టిగా మాట్లాడితే దురుసుతనంగా ముద్ర వేస్తారు. అందుకు పదవులను కూడా కోల్పోతారు.

స్త్రీలు క్రిమినల్ కేసులలో ఎక్కువగా క్రిమినల్స్‌తో కలిసి పని చేయవలసి రావడం, వీరిలో కొందరు క్లైంట్స్ క్రిమినల్ స్వభావం కలిగి ఉండడం చేత సేఫ్ కాదనే వాదనలు ఉన్నాయి. అందుకు గతంలో సుమారు 15 సం॥లకు ముందు ఇద్దరు మహిళా లాయర్లు హత్యకు గురికావడం ఆందోళనకు గురి చేసింది. వృత్తిపరంగా ఒక హెచ్చరికను జారీ చేసింది. ఇది ఒక సామాజిక స్థితిని ప్రతిబింబించింది. ఇందుకు కొంత మంది మహిళలు మినహాయింపుగానే పని చేస్తున్నారు. మనకు చాలా ఆశ్చర్యకరంగా కనిపించే విషయమేమంటే మహిళా న్యాయవాదులు బిగుతు దుస్తులు ధరించకూడదు అని కోర్టులలోనూ నోటీసులు ఉంటాయి. ఇందుకు కుటుంబం, సమాజం, భావజాలం ప్రధాన కారణాలుగా అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు స్త్రీలు భయపడే పరిస్థితుల నుంచి స్త్రీ సమస్యల పట్ల న్యాయం కోసం ఎందరో మహిళా న్యాయవాదులు పనిచేస్తున్నారన్నది కూడా వాస్తవ దూరం కాదు. ఇక్కడా లైంగిక వేధింపులకు మహిళా న్యాయవాదులు గురైనా కంప్లైంట్స్ తక్కువగా నమోదు అవుతున్నాయి.

ఇకపోతే న్యాయం చేయవలసిన జడ్జీలకే న్యాయం దొరుకుతుందా అనే అనుమానం జడ్జీల నియామకం చూస్తే కలుగుతుంది. దేశంలో 1959లో మొట్టమొదటి మహిళ హైకోర్టు జడ్జీ కాగా, మొత్తం 554 జడ్జీలలో 64 మంది మాత్రమే మహిళా జడ్జీలు ఉన్నారు. జడ్జీలు ఏ తప్పు చేసినా ఒక చులకన భావంతో స్త్రీలను చూడడం జరుగుతుందని జడ్జీలే స్వయంగా చెబుతారు. జడ్జీల నియామకంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2015లో అవసరమైతే రిజర్వేషన్ పద్ధతిని ప్రవేశ పెట్టాలని అభిప్రాయపడింది. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

పురుష జడ్జీల భావజాలం ఇంకా చెప్పుకోనంత మారలేదు. నీకు మొగుడొద్దు కానీ భరణం కావాలా అనే జడ్జీలు ఉన్నారు. ఏదో జాలీ, దయతో వ్యవహరిస్తామన్న ధోరణి తప్ప అది హక్కుగా గుర్తించరు. చాలామంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కుటుంబ, వరకట్న కేసులతో బాధితుల నుంచి కూడా ఆశించడం ఇంకా కొనసాగుతోంది. లంచగొండితనం, కేసుల పరిష్కారంలో విపరీత జాప్యం, అంటే న్యాయం జరగకపోవడం అనేది ముమ్మాటికీ నిజం. తీర్పులలో 100 మంది దోషులు తప్పించుకోవచ్చు కానీ ఒక్క నిర్దోషి తప్పించుకోకూడదు అనే సూత్రం ఈ విషయంలో బాగా పని చేస్తుంది. గృహహింస అంటే నాలుగు గోడల మధ్య జరిగే మానసిక, భౌతిక దాడి సాక్ష్యాధారాలు ఉండవు. ఉన్నా సాక్ష్యం చెప్పడానికి కోర్టుల చుట్టూ తిరగాలి అనే అపోహతో ఎవరూ ముందుకురారు. నాలుగు గోడల మధ్య జరిగే హింసకు ప్రత్యక్ష

సాక్ష్యాధారాలు అవసరం లేదని చెప్పే హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నప్పటికీ బెనిఫిట్ ఆఫ్ డౌట్ (సందేహం ఉండటం)తో దోషులను జడ్జీలు వదిలివేయడం జరుగుతుంది.

దీనివలన కోర్టులలో సంవత్సరాల తరబడి జరిగే కేసులు విచారణ అటు స్త్రీలకు నిలువనీడలేక ఆర్థికంగా రోడ్డు మీద పడివేసే కుటుంబం, సమాజం నుంచి వచ్చే మాటల తూటాలు కుటుంబ హింస కంటే ఎక్కువ. అభద్రతతో స్త్రీలు కోర్టులకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. వచ్చినా ఒక కోర్టు నుంచి పై కోర్టుకు అప్పీల్లు స్త్రీల మనోధైర్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఇక దళిత, వెనకబడిన స్త్రీలకు న్యాయం నేతిబీరకాయ చందమే.

న్యాయస్థాన సిబ్బందికి కుటుంబ హింసకు సంబంధించిన లేదా ఏ కేసులైనా కూడా అవి అంకెలు మాత్రమే. వాటి వెనుక స్త్రీల జీవితాలు వాటి తడి మరకలు కనపడవు. ఒక్కో ఫైలింగ్‌కు డబ్బు ఎంత పరోక్షంగా, ప్రత్యక్షంగా అన్నదే ముఖ్యం. కేసులు ఫైలు చేసే న్యాయవాదులకు స్త్రీవాద సామాజిక న్యాయ దృక్పథం అన్నది మౌలికం కానేకాదు. పైగా సమాజం ఇలాగే ఉంటుంది. స్త్రీలలాగే కుటుంబం కోసం ప్రవర్తించాలి అన్న ధోరణి న్యాయవాదులలోనూ ఉంటుంది.

విస్తృత సామాజిక రంగంలో పెరుగుతున్న అసంతృప్తుల వ్యక్తీకరణ మొదట సాత్వికంగా తర్వాత క్రియాశీలక ప్రతిఘటనగా మారుతున్న సమయంలో ఆ ప్రతిఘటనలు తటస్థం చేయడానికి అనేక చట్టాల సవరణలు వస్తున్నాయి. పాలకులు మాత్రం అసలు వాటి జోలికి పోకుండా సమస్యలను విడివిడి కేసులుగా విడగొట్టి ఎక్కడికక్కడ సర్దుబాట్లు చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ఘటనకు ఒక్కో కారణాన్ని చూపించి బాధితులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే తప్పిదంగా తేల్చి బాధితులనే నేరస్థులుగా చూపు కుట్రలను అన్నివైపుల నుంచి ముందుకొస్తున్నాయి. ఏ ప్రజా ఉద్యమాల ద్వారా వచ్చాయో వాటికి భిన్నంగా పాలకుల సవరణలు ప్రజలు నిరోధించగలగాలి. ఏ ప్రజా పోరాటాల ఫలితంగా అటువంటి చట్టాలు వచ్చాయో అవే చట్టాలు దుర్వినియోగం అవుతుంటే ప్రజలు, మేధావులు, ప్రగతిశీల శక్తులు నిర్లిప్తంగా ఉంటే అవి పాలకుల చేతుల్లో ఆయుధాలుగా మారి స్త్రీలను మరోతరం వెనక్కి నెట్టివేస్తాయి. అందుకు ఉదాహరణగా 498ఎ, ఎస్.సి, ఎస్.టి చట్టాల వ్యతిరేక తీర్పులను మనం గమనించవచ్చు.

రాజకీయ అధికారంతో మనువాదాన్ని జాతీయత పేరు మీద మతాన్ని ఆసరాగా తీసుకొని పబ్బం గడుపుకోవాలన్న రాజకీయ స్వార్థం ఈ రోజున బ్రాహ్మణీయ, పితృస్వామ్య ఆధిపత్యంతో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ న్యాయవ్యవస్థపై ప్రభావం చూపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా 498ఎ, ఎస్‌సి, ఎస్‌టి చట్టాలను సవరించడానికి చేసిన ప్రయత్నాల మార్పులు చెప్పుకోవచ్చు. వారి భావజాలంతో చట్టంతో ఉన్న కొంచెం నమ్మకాన్ని వమ్ము చేశారు. దీనివలన కాస్తో కూస్తో భయపడి 'హింస'ను తగ్గించడానికి అవకాశాలు ఉన్న తరుణంలో ఇది పురుషులకు మరింత స్వేచ్ఛనిచ్చి హింసను విచ్చలవిడిగా ప్రయోగించే స్థితికి మళ్లీ పురుషులను తీసుకెళ్లింది. స్త్రీలను కుటుంబానికి కట్టు బానిసలా చేయడానికి మళ్లీమళ్లీ కోర్టుకు వెళ్లకుండా హింసను భరించేలా చేయాలన్న రాజకీయ కుట్ర దీనివెనక ఉంది.

సామాజిక చైతన్యమే పౌర సమాజంలో హింసను నిలువరించగలదు. ఎన్ని చట్టాలు చేసినా హింసాపర్వం సమాజంలో కొత్త రూపాల్లో వస్తున్నప్పుడు భవిష్యత్ దర్శనం చేసే మేధావులైన న్యాయవాదులు, మేధావులు ప్రజల సామూహిక చైతన్యంలోకి ప్రవేశించకుండా స్త్రీ ఉద్యమాలతో చేయి కలిపి నడవకుండా సంస్కరణలు సాధ్యం కాదు.

మహిళా కేసులు పరిష్కరించడంలో పోలీసుల పాత్ర కీలకమైంది. పోలీస్ వ్యవస్థ బ్రిటిష్ కాలం నాటిది. ప్రతి రోజూ మనం దేశంలో ఎక్కడో ఒక చోట పోలీసుల అనైతిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి వింటాము. జాత్యాహంకారంతో అమెరికాలో జార్జ్ ఫ్లాయిడ్‌పై జరిగిన పోలీస్ ఆకృత్యాలు, మధుర, వాకపల్లి నుంచి నేటి వరకు స్త్రీలపై చేస్తున్న అత్యాచారాలు కావచ్చు. ఇవి ప్రత్యక్షంగా మనకు కనిపిస్తాయి, అర్థం అవుతాయి. కానీ స్త్రీలపై పరోక్షంగా హాని చేసే వారి భావజాలం, సహాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళితే లైంగిక వేధింపులు, లంచగొండితనం నిత్యం జరిగినా వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు తారా స్థాయిలో లేవు. వీరు చేసే దాష్టీకాలకు కోర్టులు హెచ్చరించినా ఫలితం లేదు. షరామామూలే. కొండకచో నష్టపరిహారం ఇచ్చినా అది ఎలా సమ్మతం అవుతుంది? వీరి పై అధికారుల కనుసన్నలలో జరుగుతుంది. కాబట్టి వారి సహకారం బాధితులకు ఉండదు. జాతీయ హింసా లెక్కల రేటు ప్రకారం ప్రాథమిక సమాచార రిపోర్టు (ఎఫ్ఐఆర్) నుంచి కేసు ముగిసే వరకు పోలీసుల చేతుల్లో స్త్రీల జీవితాలు కట్టేసి ఉంటాయి. పోలీసులు చెప్పే కథలను జడ్జీలు నమ్మడం ఎక్కువగా ఉంటుంది. చాలాసార్లు రిమాండ్‌కు పంపుతున్నప్పుడు పోలీసులు బాధితులపై జరిపే ఎలాంటి మిస్‌కండక్ట్ చర్యల గురించి కోర్టులో ఎక్కడో కానీ జడ్జీలు అడగడం జరగదు. దీనివలన పోలీసుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు, భయం ఉండటం లేదు. యాధా రాజా తథా ప్రజా అన్నట్లు రాజకీయ అధికారం చుట్టూ పోలీస్ వ్యవస్థ నడుస్తుంది. అందుకే కొన్ని కేసుల్లో మనం ఎన్‌కౌంటర్‌లు చూస్తాం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పోలీస్ వ్యవస్థలో కొన్ని సంస్కరణలు అవసరమని సుప్రీంకోర్టు మెసేజ్ ఇచ్చినా ఏ పార్టీ ఇంతవరకు ఆ సంస్కరణల పట్ల శ్రద్ధ తీసుకోలేదు.

మానవ హక్కుల కమిషన్ అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని లేదా కోర్టుకు హాజరు పరచమని కూడా ఆదేశాలివ్వని సందర్భాలు ఎన్నో. విచారణ కోసం మళ్లీ పోలీస్ శాఖనే నియమించడం వలన స్వతంత్ర విచారణ లేక బాధితులకు అన్యాయమే జరుగుతుంది. ఈ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు ఆమోదయోగ్యమైనవే కానీ అమలు చేయాలనే ఖచ్చితత్వం ఉండదు. అమలు చేయని పక్షంలో వారిని శిక్షించే అధికారం లేని వ్యవస్థ కన్నా, అధికారాలు కలిగిన సివిల్, క్రిమినల్ కోర్టులపైనే ఆధారపడడం మంచిదన్న అభిప్రాయానికి ప్రజలు, న్యాయవాదులు వస్తున్నారు. ప్రభుత్వం మానవ హక్కుల పరిరక్షణ ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత, ఆచరణలో చిత్తశుద్ధి లేకపోవటం వల్ల వచ్చిన పరిస్థితికి ఈ వ్యవస్థ నిదర్శనంగా ఉంది. ఇదే బాటలో నడుస్తున్న మహిళా కమిషన్‌కు ఎటువంటి శిక్షించే హక్కు లేదు.

నేటి సమాజంలో స్త్రీకి వ్యతిరేకంగా ఉన్న చట్టాల సవరణ కొత్త చట్టాలను సాధించుకోవడానికి మహిళా ఉద్యమం కృషి చేయాలి. హింసకు తావులేని వ్యవస్థ మార్పులో జరిగే పయనంలో భాగమవుతూ స్త్రీ జీవన గీతికను హోరెత్తే నినాదంగా మార్చినప్పుడే ఇది సాధ్యమని మన గత చరిత్ర చాటి చెబుతుంది. సామాజిక ఉద్యమాలలో సహచరుడు జ్యోతిరావు పూలేతో కలిసి నడిచిన సావిత్రీబాయి పూలే, ఓటు హక్కుకై పోరాడిన ముత్తు లక్ష్మిరెడ్డి, సాయుధ పోరాటంలో అప్పటి పితృస్వామ్య

సాంప్రదాయ గీత దాటి దోపిడీ వ్యవస్థకు సవాలుగా నిలబడ్డ ఐలమ్మ, పంచాది నిర్మల, కుల వ్యవస్థ కోరల గుండెల్లో హడలు పుట్టించిన అలిశమ్మ, పురుషాధిక్య భావజాలాన్ని ప్రశ్నించి నిలిచిన సదాలక్ష్మి, సాహితీ కెరటాలను అప్పటి తరానికి అవిష్కరించిన మాలతీ చందూర్, స్త్రీ శక్తి సంఘటనతో స్త్రీవాదానికి అర్థం చెప్పిన కార్యకర్తలు, నిర్భయ, అమృతను సమాజం ముందుకు తేవడానికి ప్రవాహంలా సాగి వచ్చిన స్త్రీలు ఎందరో మనకు స్ఫూర్తి కావాలి. అప్పుడే కుల, మత, వర్గాలతో ముడిపడి ఉన్న న్యాయవ్యవస్థకు నిజమైన విడుదల ఉంటుంది.

ఉద్యమాలతో కొన్ని మార్పులు వచ్చినా స్త్రీ జీవితం సంస్కృతి చుట్టూ అల్లుకోవడం వలన సాంస్కృతిక ఉద్యమం అనివార్యం. అప్పటి వరకు ఉపశమనమే తాత్కాలికమే గానీ శాశ్వతం కాదు. శాశ్వత పరిష్కారం వైపు మనం అడుగులు వేయాలి. అప్పుడే న్యాయ వ్యవస్థ పని చేస్తూ ప్రత్యామ్నాయ దిశగా స్త్రీకి న్యాయాన్ని అందించగలదు.

మనలను విభజించే ప్రతిదాన్ని వదిలేసి మనను ఏకం చేసే ప్రతి దానిని ముందు పీఠికన నిలిపే సంస్కృతి కావాలి. సంఘీభావం, మానవత్వం, భిన్నాభిప్రాయాల పట్ల గౌరవం ప్రకృతిని రక్షించడం అనే విలువల చట్రం మనను ఏకం చేస్తుంది. అందుకు కార్యాచరణ, మార్గదర్శకత వహించడానికి మొత్తం సామాజిక, రాజకీయ చలన స్థితిని విశ్లేషించి ఉపయోగించగల నిర్మాణం అవసరం. బ్రాహ్మణీయ, పితృస్వామ్య వ్యవస్థను రూపుమాపడమే కాదు సమస్త వనరులపైనా ఆధిపత్యాన్ని హక్కులను సాధించే క్రమంలోనే మన శక్తి దాగి ఉంది. ప్రపంచీకరణతో హిందూ జాతీయవాదం తోడవుతున్న సంక్షోభంతో వీటి మూలాన్ని అర్థం చేసుకోకుండా ఆ భావజాలంపై పోరాటం చేయకుండా కష్టాలతో నిండిన బాధితులు జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయగలం. కుటుంబాలను ప్రజాస్వామీకరించకుండా ప్రేమ, స్నేహాన్ని పెంచలేవు. అప్పుడే సమాజంలో హింసను తగ్గించగలం. అందుకు వనరులపైన స్త్రీలకు ఆధిపత్యం, అధికారం కావాలి. ఇది రాజ్యం బాధ్యత. వనరులన్నీ ప్రైవేటుపరం చేస్తూ స్త్రీని ఇంటి పరం చేసే రాజకీయ శక్తులపై చేసే పోరాటంతో స్త్రీలు భాగమైనప్పుడు హక్కుల సాధన సాధ్యమవుతుంది. అందుకు స్త్రీ కోణంతో న్యాయస్థానాలను నిర్వచించగలిగి నిర్మించుకోవాలి.

న్యాయ వ్యవస్థలో చేపట్టవలసిన సంస్కరణలు

1. కుటుంబ సంబందిత కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి.
2. న్యాయ వ్యవస్థలో కోర్టుల పట్ల ఆడిట్ చేయగలగాలి. పెండింగ్‌లో ఎన్ని కేసులు ఉన్నాయి?, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయగలగాలి. మరిన్ని న్యాయ సహాయ కేంద్రాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.
3. మహిళా సమస్యలను మహిళా జడ్జీలు బాగా అర్థం చేసుకోగలరు. కావున కుటుంబ న్యాయస్థానాల్లో మహిళా జడ్జీల నియామకం జరగాలి. న్యాయ వ్యవస్థలో కనీస నిష్పత్తిలోనైనా రిజర్వేషన్ల పద్ధతిలో మహిళలను జడ్జీలుగా ప్రభుత్వం చొరవ చూపి నియమించాలి. పార్లమెంటరీ కమిటీ 2015లో సూచించిన విధంగా మహిళా జడ్జీలకు రిజర్వేషన్ కల్పించాలి.
4. ఇప్పుడున్న చట్టాలతో పాటు సమాజంలో వస్తున్న మార్పులకు అవసరమైన కొత్త చట్టాలను తీసుకురావాలి.
5. చట్టాలను చేయడంతో పాటు వాటి అమలుపై ప్రజలకు అవగాహన కావాలి. వికేంద్రీకరణ పద్దతిలో అంటే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వానికి ప్రత్యేకమైన ప్రణాళిక కలిగి ఉండాలి.
6. అంతర్జాతీయ ఒప్పందాలలో చేసుకున్న తీర్మాణాలు, నిర్ణయాల పట్ల బాధ్యతగా చట్ట రూపంలో అమలవ్వాలి.
7. అవగాహన కేవలం స్త్రీలకు, పురుషులకే కాదు న్యాయ వ్యవస్థ సిబ్బందికి, జడ్జీలకు ఇవ్వాలి.
8. స్టేట్ లా కమిషన్ ఉండి చురుకుగా పనిచేసి చురుకుగా పని చేయించాలి.
9. కోర్టులలో జరిగే లంచగొండితనం, జాప్యం పట్ల నియంత్రణాధికారం న్యాయ వ్యవస్థ కలిగి ఉండాలి.
10. అన్నింటికి మించి చట్టాల రూపకల్పన పాత్ర చాలా కీలకమైంది. అప్పుడే స్త్రీల సమస్యలకు అనుకూలంగా చట్టాల్ని చెయ్య గలుగుతారు. అందుకు స్త్రీలు చట్ట సభలకు రావాలి. దానికోసం రాజకీయ శక్తులు చట్టసభలలో శాసనం చేసినప్పుడే అధి సాధ్యపడుతుంది.
11. 30 శాతం లోకల్‌గానూ, మున్సిపాలిటీల్లో ఎన్నుకోబడ్డ మహిళా శక్తికి స్వంత నిర్ణాయక శక్తి లేకపోవడం కూడా ఇందుకు కారణం కాబట్టి స్త్రీలకు చట్టం తయారీ, అమలు, పర్యవేక్షణలో భాగస్వామ్యం ఉండాలి.
12. పోలీస్ వ్యవస్థలో సుప్రీంకోర్టు ఆదేశించినట్లుగా సంస్కరణలు రావాలి.
13. చట్టాలు, చట్టపరమైన న్యాయపాలన అంతా ఇంగ్లిష్‌లో ఉండడం వల్ల చాలామంది బాధిత స్త్రీలకు ఇబ్బందికరంగా, అర్థం కాని విధంగా ఉంటుంది. కాబట్టి మొత్తం న్యాయపాలన అంతా కూడా తెలుగు మాధ్యమంలో ఉండాలి.
14. నష్టపరిహారం ఇవ్వలేని వారికి ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారాన్ని ఇవ్వాలి.
15. ప్రభుత్వమే ఉద్యోగం, భృతిని కల్పించాలి.
16. దానికి సంబంధించిన పాలసీలు, చట్టాలు తయారు చేయడంలో లా కమిషన్, మహిళా కమిషన్ ప్రధాన భూమిక వహించాలి.
17. రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ 5 శాతం స్త్రీలకు కేటాయిస్తారు. దీని శాతం పెంచాలి. ఈ నిధులను సక్రమంగా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించాలి.
18. దళిత, బలహీన వర్గాలకు తగిన న్యాయ సహాయాన్ని అన్ని స్థాయి కోర్టులలో తప్పనిసరిగా అందించడం నేటి చారిత్రక అవసరం.
19. దీనికి తగినట్లు రాజ్యాన్ని పాలించే శక్తుల స్వార్థ ప్రయోజనాలు, వాని దృక్పథం స్త్రీని టార్గెట్‌గా చేసుకుంటున్నాయి. సంస్కరణల పేరుతో వచ్చిన మార్పులు స్త్రీల జీవితాలలో కొన్ని కనీస మార్పులు తెచ్చాయి. వాటిని కాపాడుకోవాలి. లేకపోతే స్త్రీ జీవితం ఇక తిరోగమనమే.
20. మూఢనమ్మకాలను, పూజల పేరిట సంఘటితపరచడానికి నడుం కడ్తుంది. దబోల్కర్, గౌరీ లంకేష్ ప్రశ్నించినందుకు హత్య చేయబడ్డారు. కాబట్టి న్యాయ వ్యవస్థ పరిష్కారంకై సూచించగలిగే స్వతంత్ర వైఖరి ఏర్పరుచుకోవాలి. చట్టాలు ప్రత్యేకంగా రావాలి.
21. స్త్రీల కోసం ప్రత్యేక అంశాలు, రాజ్యాంగంలో పొందు పరిచినప్పుడు, చట్టాలు చేసినప్పుడు, ఆ చట్టాల ఆధారంగా సమాజ హితంకై

డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 10

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

(గత సంచిక తరువాయి)

1848 ఫిబ్రవరి నాటి ఫ్రెంచ్ విప్లవం, 19వ శతాబ్దపు యూరప్‌లో పాత తరం వారికీ, ఆధునిక భావాలుగల వారికీ మధ్య జరుగుతున్న సంఘర్షణ ఒక సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. అయినా ఈ విప్లవ తుఫానును నికొలాస్1 ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. అతడు ఫ్రాన్స్‌తోటి సంబంధాలను తెంచుకొని, పదమటి రష్యాలో తన సైనిక బలగాలను మోహరించి, రాబోయే తుఫాను ఉధృతిని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు. అయినప్పటికీ, తిరుగుబాటు దారులు వేగంగా చుట్టు పక్కల ప్రాంతాలలో విజృంభించారు. ఒక నెలకన్నా తక్కువ కాలంలోనే ప్రష్యా, ఆస్ట్రియా రాజ్యాలు మొత్తంగా మంటల్లో చిక్కుకున్నాయి. మొత్తంగా ఖండంలోని అన్ని ప్రాంతాల్లో వేగంగా ఆ విప్లవ జ్వాలకు మాడి మసికావడం మొదలైంది. అయితే నీకొలాస్1 పూర్తి స్థాయిలో తన శక్తిని ప్రదర్శించి, యూరప్‌లోని పాలకులందరికీ రక్షకుడిగా అన్నట్టు నిలిచాడు.

1848 నాటి విప్లవం రష్యాలో కూడా తన ఒత్తిడి తరంగాలను సృష్టించింది. వాటి దాటికి సెర్గీ ఉవరోవ్ లాంటి గట్టి పిండం కూడా, అధికారిక దేశభక్తి లాంటి సిద్ధాంతానికి రూపకల్పన చేసి ఎంతో తనకు ఉపయోగపడిన వాడిని కూడా నీకొలాస్ పదవి నుండి తొలగించాడు. కారణం అతడు యూనివర్సిటీలపై ప్రయోగించిన నిర్బంధ చర్యల కాఠిన్యం కూడా ఆ తరాల ఒత్తిడిని ఆపడంలో అశక్తత కావడమే!

1848 మార్చ్‌లో జార్ నీకొలాస్ ఉపాధ్యాయులకు/అధ్యాపకులకు విదేశీ ప్రయాణాలకు ఇచ్చిన అనుమతుల్ని రద్దు చేశాడు. రష్యన్ విశ్వ విద్యాలయాలలో - యూరపియన్ రాజ్యాలలోని రాజకీయపరమైన అంశాలపై చట్ట నిబంధనలపై చేస్తున్న అధ్యయనాలను కూడా రద్దు చేశాడు. అన్ని రకాల విప్లవ భావాలనూ అణచివేయడం ద్వారా, అన్ని రకాల విప్లవోద్యమాలనూ నలిపివేయడం ద్వారా, దేశంలోని తిరుగుబాటు భావాలను నీకొలాస్ నిరోధించగలిగాడు.

చరిత్రకారుడు బ్రూస్‌లింకన్ రాసిన దాన్నిబట్టి, నీకొలాస్ గురించిన అత్యంత దుర్మార్గమైన అంశం ఏమిటంటే, 1848 నాటి క్లిష్ట పరిస్థితులకు సమాధానంగా - అతడూ, అతడి అనుభవం గల అధికారగణమూ తమకు గల అణచివేతల సామర్థ్యాన్ని ఉపయోగించి ప్రజల పట్ల క్రూరంగా వ్యవహరించిన రీతి. 1848 నాటి వాతావరణంలో కూడా అతడు అతిగా ప్రవర్తించాడని మనం సులభంగానే చెప్పవచ్చు. ఆనాటి సంఘటనల్నీ, ప్రజలను అడకత్తెరలో పెట్టి నొక్కినట్టుగా పాలించిన విధానాల్ని పరిశీలించినప్పుడు 1789లో ఫ్రెంచ్ చక్రవర్తి పాల్, నాటి ఫ్రెంచి విప్లవ కాలంలో సరిగ్గా ఇలాగే ప్రవర్తించాడు. ఆ ఉదంతాలను తలచుకొని నీకొలాస్ కూడా భయపడ్డాడు - మధ్య, తూర్పు ఐరోపా ప్రాంతాలలో, అలాగే రష్యాలో కూడా జనాల బుర్రలు చెడిపోయి వెర్రిగా ప్రవర్తిస్తారని!

మొత్తానికి నీకొలాస్ అనుసరించిన అణచివేత నైపుణ్యాల క్రూరత్వం కారణంగా రష్యన్ ప్రజలు నిజంగానే భయపడిపోవడంతో, రష్యా 1848 నాటి విప్లవ పరిస్థితుల్లో కూడా ఆ జోలికి పోకుండా ఉండగలిగింది. అలాగే యూరప్‌లోని ఇతర దేశాల్లో కూడా విప్లవాందోళనలు సద్దుమణిగాయి. విప్లవ జ్వాల రేకెత్తడానికి కారణమైన ఫ్రెంచ్ విప్లవం కూడా ప్రజల నుండి తగిన మద్దతు రాక ఓటమిపాలైంది. విప్లవాందోళనలు తీవ్రంగా వ్యాపించిన జర్మనీ తదితర దేశాలలో కూడా తీవ్ర అణచివేతల్ని ప్రయోగించి, విప్లవ జ్వాలల్ని ఆర్పివేయగలిగారు. ఫ్రాన్స్‌లోనైతే ఒక రాజు పోయి, మరో రాజు వచ్చి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. మొదట ఆ జ్వాలకు భయపడిన రాజు లూయీ ఫిలిప్పే అధికారం నుండి దిగిపోయి, ప్రాణ భయంతో పారిపోగా, అధికారం లేకపోయినా, 'లూయిస్ నెపోలియన్' రెండో రిపబ్లిక్‌ని రద్దుచేసి, దేశాన్ని సామ్రాజ్యంగా పునర్వ్యవస్థీకరించి, తాను నెపోలియన్3 పేరుతో చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. ఇక రష్యాలోనైతే, తను తీసుకున్న మరింత అణచివేత, మరింత క్రూరత్వాల ద్వారా నీకొలాస్1 మరింత బలంగా, మరింత నిరంకుశంగా, మరింత కఠినంగా మారాడు.

అయితే చరిత్రలోని పేజీలన్నీ ఒకేలా ఉండవు. పేజీ పేజీకీ పరిస్థితి మారిపోతుంటుంది. నాటకీయమైన మలుపులెన్నో ఎదురవుతుంటాయి. నీకొలాస్1 పాలనా కాలంలో అత్యంత పటిష్టంగా ఎవరూ తేరిచి చూడలేరన్నంత బలంగా ఉన్న రష్యన్ ప్రభుత్వ స్థితి, అతడి అంత్య కాలంలోనూ, మరణానంతరం నాటకీయంగా, హఠాత్తుగా అత్యంత బలహీనంగా తయారై, తనకెదురైన సవాళ్లను ఎదుర్కోవడంలో తీవ్ర ఇబ్బందుల్లో పడిపోయింది. ఇప్పుడా వివరాలు చూద్దాం.

ప్రశ్నిస్తున్న స్త్రీ సామాజిక కార్యకర్తలను సామూహికంగా అరెస్ట్‌చేసే ప్రక్రియ కొనసాగకుండా చూసే బాధ్యత న్యాయవ్యవస్థ తీసుకోవాలి.

22. జైళ్లలో మగ్గే మహిళా ఖైదీలకు జైళ్ల మ్యాన్యువల్ పాలసీలను అమలు చేయాలి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ ఉపాధ్యాయురాలైన సోనిసోరిపై జరిగిన హింస మరొక్కసారి పునరావృతం కాకూడదు.

23. సామాజిక కార్యకర్తలైన షోమాసేన్, న్యాయాన్ని అందించిన సుధా భరద్వాజ్ (ఈమె అంతర్జాతీయంగా న్యాయవాదిగా పేరు పొందింది.) వ్యవస్థను ప్రశ్నించినందుకు, వీరు వ్యవస్థను ప్రశ్నించినందుకే జైళ్లలో బంధించబడ్డారు. ప్రభుత్వ/పాలకవర్గాల కక్ష్య సాధింపు ధోరణులను న్యాయ వ్యవస్థ నియంత్రించగలగాలి.

(అయిపోయింది)

(రచయిత న్యాయవాది)

వీ

(5) క్రిమియన్ యుద్ధ ఓటమి ప్రభావం: పాన్–స్లావిజం, ఉదారవాదం, రష్యన్ సోషలిజం, మార్క్సిజాలు : నీకొలాస్1 రోమనోవ్ వంశ చక్రవర్తులలో పూర్తి స్థాయిలో అధికారాన్ని అనుభవించిన వారిలో చివరి వాడని చెప్పాలి. వాస్తవ పరిస్థితుల్లో అతడు రష్యా ఆఖరి తిరుగులేని అధికారాలు చెలాయించిన చక్రవర్తి. అయితే అకస్మాత్తుగా అతడు చనిపోయిన ఒక సంవత్సరానికే, అతడు రూపొందించిన పటిష్ట పాలనా విధానం కుప్పకూలిపోవడం, అది కూడా అత్యంత నాటకీయంగా, బాధాకరంగా జరగడం స్పష్టంగా కనబడుతోంది. దాంతో ఆ పరిణామం రష్యాను ఒక కొత్త మార్గంలో పయనించేందుకు ఒత్తిడి పెట్టింది. 19వ శతాబ్దపు మొదటి అర్ధ భాగంలోనే రష్యా అసంఖ్యాక సమస్యలతో బాధపడుతూ, పరిష్కారాల కోసం ఒత్తిడి పెట్టినా గానీ, ప్రభుత్వ నిర్మాణ చట్రపు స్వరూపంలో, అలాగే పాలనాపరమైన చర్యలలోనూ మార్పులు చేర్పులు చేయకుండా మరింత తొక్కిపెట్టి, రావలసిన సమాధానాలను దాటవేశారు. దాంతో రష్యా ఆర్థిక పరమైన వెనుకబాటుతనం, నైపుణ్యంలేని ఉద్యోగవర్గం, పాతబడిపోయిన బానిస విధానం – ఇవన్నీ కూడా కలిసి ఏదో ఒకటి చేయకతప్పదన్న పరిస్థితులకు నెట్టాయి.

తన తండ్రి నీకొలాస్ 1855 ఫిబ్రవరి 18న మరణించగానే అధికారానికి వచ్చిన అలెగ్జాండర్ 2కి, అదే తన తక్షణ లక్ష్యంగా పరిణమించడం జరిగింది. అతడు తన పాలనా కాలంలో, రష్యన్ చరిత్రలో గొప్ప సంస్కరణల యుగంగా పేరొందిన కాలంలో, ఒక మార్గదర్శిగా పనిచేసినట్లు కనబడుతుంది. కానీ, ఈ సంస్కరణల యుగం అంతాకూడా స్వయం విరుద్ధమైన అంశాలతో కూడి ఉండడం వల్ల అకస్మాత్తుగా విప్లవ ఉగ్రవాదం పెరిగిపోవడానికీ కూడా కారణభూతమైంది. నిజానికి వందల సంవత్సరాల నుండీ వస్తున్న బానిస రైతాంగానికి ఇతడు ముక్తి కలిగించి కూడా హత్యకు గురికావడం ఇతడి పాలనా కాలపు సంక్లిష్టతకు అద్దం పడుతుంది. ఈ విధంగా ఇతడు రోమనోవ్‌ల చరిత్రలో, జనం చేతుల్లో హత్యకు గురికావడం మొదటి సారిగా జరిగిందని చెప్పాలి.

(ఇంతకు ముందు కూడా హత్యకు గురై మరణించిన వారున్నట్లు చెప్పుకున్నాం. వారు పీటర్3, పాల్1లు. అయితే వారు రాజస్థానంలోని వారి కుట్ర ద్వారానే హతమయ్యారు. ఇప్పుడు అలెగ్జాండర్2 ఉగ్రవాదుల చేతుల్లో మొదటి సారిగా హతమయ్యాడు. అయితే ఆకరి జార్ నీకొలాస్2, 1917 ఫిబ్రవరి విప్లవంలోనే అధికారాన్ని కోల్పోయినా, 1917 అక్టోబర్ విప్లవం తర్వాత, 1918లో విప్లవ నాయకుడు లెనిన్‌పై జరిగిన హత్యాయత్నం కారణంగా ప్రజల్లో ఆగ్రహావేశాలు చెలరేగి, మాజీ జార్ నీకొలాస్2 కుటుంబానంతటినీ, అతణ్ని కూడా జనం చంపేశారు – రచ.) తన పెద తండ్రి అలెగ్జాండర్1తో పోల్చుకుంటే, అలెగ్జాండర్2 స్థిర నిశ్చయం కలవాడేనని చెప్పాలి. కానీ తన స్వంత తండ్రి అయిన నీకొలాస్1తో పోల్చుకుంటే మాత్రం పగ తీర్చుకోవడంలో కొంచెం మెతకేనని చెప్పకతప్పదు. ఏమైనా ఇతడు సిగ్గుతో తలదించుకోవలసిన విషయం మాత్రం క్రిమి యుద్ధంలో (1853 అక్టోబర్ 16 నుంచి, 1856 మార్చి 30 దాకా, దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు జరిగిన యుద్ధంలో రష్యా, బల్గేరియా, గ్రీస్‌లు ఒక పక్కా, రెండో వైపు – ఒట్టోమన్, ఫ్రెంచ్, బ్రిటన్, సార్డీనియాలు మరోపక్క ఉన్నాయి. ఈ యుద్ధం నీకొలాస్1 అంత్య కాలంలోనే ప్రారంభమై, అతడు మరణించాక అతడి కొడుకు అలెగ్జాండర్2 అధికార స్వీకరణ తర్వాత ఒక సంవత్సరం పాటు జరిగింది – రచ.) లభించిన పరాజయం వల్ల ఓటమికి కారణం రష్యన్ సైనికులకు తక్కువ వనరులుండడం వల్ల కాదు. కానీ రష్యన్ సైన్యంలో కేవలం అధికారులు తప్ప, కింది స్థాయి సైనికులు స్వేచ్ఛా మానవులు కాక, వారంతా బానిస రైతాంగం నుండి రావడం వల్ల వారికి తగిన నైపుణ్యాలు లేవు. కాగా గెలుపొందిన ఫ్రెంచ్, బ్రిటిష్ సైనికులంతా స్వేచ్ఛా మానవులే. ఓటమికి ఇదే ప్రధాన కారణమని తన విశ్లేషణ ద్వారా గ్రహించిన అలెగ్జాండర్, వారందరికీ బానిసత్వం నుండి విముక్తి కలిగించక తప్పదని గ్రహించాడు. ఒక్క సైన్యం విషయంలోనే గాక, రష్యా పలు రంగాలలో వెనకబడి ఉండడానికి కూడా బానిసత్వమే కారణమని అతడు ఈ ఓటమి ద్వారా తెలుసుకున్నాడు. అంతేగాక అతడు సాంకేతికంగానూ, వైజ్ఞానిక రంగాలలో కూడా రష్యా వెనుకబాటు తనం వల్ల ఎంతో నష్టపోతున్నట్లు గ్రహించాడు. ఫలితంగా అలెగ్జాండర్2 ఒక కొత్త సంస్కరణల యుగానికి నాందీ ప్రస్తావన చేశాడు. అతడు తీసుకున్న సంస్కరణలన్నింటిలో కూడా నిస్సందేహంగా 1861లో తీసుకున్న బానిసత్వం రద్దు చట్టమే ప్రథమ గణ్యమైనదని చెప్పక తప్పదు. ఇంకా అతడు తీసుకువచ్చిన – ప్రాంతీయ కౌన్సిళ్ల ఏర్పాటు (జెమ్‌స్త్వోలు) – 1864, ఇంకా న్యాయ నిబంధనల సంస్కరణలు కూడా ముఖ్యమైనవే. వీటివల్ల ఇతడు 'స్వేచ్ఛా ప్రసాదకుడైన జార్'గా ప్రసిద్ధికెక్కాడు.

క్రిమియా యుద్ధం ముందు దాకా రష్యన్ సామ్రాజ్య పరిస్థితి ముక్కు సూటిగా ఉండి, సైద్ధాంతిక దేశభక్తి వైపు జనాలను నడిపించడానికి కృషి చేసింది. అయితే అనంతరం సంభవించిన యుద్ధ పరాజయంతో, రష్యన్ ప్రభుత్వపు మార్గదర్శనం, పలు అంశాలలో పశ్చిమ దేశాల వైపు నడిపించడంగా మారింది. ఫలితంగా రాజ్యం నూత్న నిర్దేశం, సైద్ధాంతిక దేశభక్తుల పైనే గాక, యూరపియన్ వాదుల పైగా నూత్న ఆలోచనల్ని కలిగించింది. తమ దేశానికి ఓటమి సంభవించడం సైద్ధాంతిక దేశభక్తి వాదులకు మింగుడుపడక, కొంతకాలం పాటు వారు నిర్వ్యాపారంలో మునిగి తేలగా, రాజ్యానికి దేశభక్తి సిద్ధాంతంపై ఆసక్తి సన్నగిల్లడం వల్ల, ఆ సిద్ధాంతం స్థానంలో వచ్చిన 'స్లావ్ జాతీయవాదం' కాస్తా తన వేశాన్ని మార్చుకొని, 'ఐక్య స్లావిజం' వేషాన్ని ధరించింది. 'ఐక్య స్లావిజం' భావాలకు మద్దతుగా నిలిచిన మొదటి బృందాలలో ముఖ్యమైన బృందం డిసెంబ్రిస్టు సంస్థలలో ఒకటైన 'ఐక్య స్లావ్ సొసైటీ' ఉంది. డిసెంబ్రిస్టు తిరుగుబాటు వైఫల్యం చెందిన తదుపరి, ఈ ఐక్య స్లావిజం భావాలను అందిపుచ్చుకున్నవాడు సనాతన వాది అయిన మిహాయిల్ పెత్రోవిచ్ పొగోదిన్ అనే అతడు. అతడు ఇలా అందిపుచ్చుకున్న కొద్ది రోజులకే, ఇలాంటి ఐక్యస్లావ్ ఉద్యమ భావాలను ప్రచారం చేసే సంస్థ 'మాస్కో స్లావ్‌ల సంక్షేమ సంఘం'నకు అతడు ఛైర్మన్ అయ్యాడు. ఆ సంస్థ స్లావ్ జాతీయులు అధికంగా నివశించే సరిహద్దు దేశాలలో 1875 – 78 కాలంలో జరుగుతున్న యుద్ధాలలో వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తీవ్రంగా కృషి చేసింది. ఈ కృషి ఫలితంగానే దక్షిణ ప్రాంత స్లావ్ జాతీయులకు టర్కిష్ పాలన నుండి విముక్తి కలిగించడం తన విధానంగా అలెగ్జాండర్2 స్వీకరించడాని చెప్పాలి.

సరికొత్త సంస్కరణలు, అలాగే పాశ్చాత్యీకరణ వైపు అడుగు వేయడం – ఈ మార్పు అంతా పాశ్చాత్య అనుకూల వాదులు ఎక్కువ సంస్కరణలు ఆశించడానికి కారణమైంది. అలెగ్జాండర్2 వ్యక్తిగతంగా ఎలాంటి వాడైనప్పటికీ, అతడో చక్రవర్తి గనుక అతడి సంస్కరణలు – వాటి ప్రణాళిక, అమలు – ఇదంతా నిండు హృదయంతో గాక, అర్ధ మనస్కతతోనే అనే విషయం రుజువైంది. చాలా సంస్కరణలు సరికొత్త సమస్యలు ఏర్పడడానికి కారణమయ్యాయి. దాంతో పాశ్చాత్యానుకూల వాదుల అసంతృప్తి ద్విగుణీకృతం కాజూచింది. ఈ అసంతృప్తి వారిలో

విప్లవ కార్యకలాపాలు పెరిగేందుకు కూడా దోహదపడింది. ఇందుకు ప్రతిక్రియగా అలెగ్జాండర్2, తను చేపట్టిన సంస్కరణల వలన ఏమాత్రం ప్రయోజనం కలగలేదని గ్రహించి, 1866 తర్వాత అతడు సంస్కరణల బాట నుండి మళ్లీ, ప్రతీకార బాటపట్టి, తాను ఆ జార్‌ల తానులో ముక్కేనని రుజువు చేశాడు. ఈ జార్ ప్రతీకార చర్యల కారణంగా తీవ్రవాదులుగా పరిణామం చెందుతున్న పాశ్చాత్యానుకూల వాదులు మూడు రకాల స్థానాలను అందిపుచుకున్నారు. అవి : 1) ఉదారవాదం, 2) రష్యన్ సోషలిజం, 3) మార్క్సిజం.

సంప్రదాయిక పాశ్చాత్యవాదులు ఎవరైతే ప్రధానంగా రాజ్యాంగ వాదాన్ని నమ్ముతున్నారో వారు ఉదారవాదులుగా పరిణామం చెందారు. ఇక యూరప్ అనుభవాలను పోగుచేసి, వాటిని ఒక వరుస క్రమంలో పేర్చి, వాటిని రష్యాకు అనువైన విధంగా ఉపయోగించాలని రష్యన్ సోషలిస్టులుగా అవతారం ఎత్తినవారు భావించారు. అయితే ఈ బృందం ఎక్కువ కాలం పాటు పాశ్చాత్యానుకూలవాద స్థానంలో కుదురుగా ఉండలేకపోయింది. అందుకు బదులుగా ఒక కొత్త స్థానాన్ని, రైతాంగం సోషలిజం స్థానాన్ని స్వీకరించారు. రష్యాకు ఇదే అనుకూల సోషలిజమని వీరు వాదించారు. 1860 ప్రాంతం నుండీ వీరు, సామాన్య ప్రజల ప్రయోజనాలను ఆకాంక్షించే తీవ్రవాదాన్ని చేపట్టారు. సోషలిస్టుల నాయకుడైన అలెగ్జాండర్ హెర్జెన్ ఈ మార్పును కొనసాగిస్తూ, సోషలిజం వైపు అడుగేశాడు. పెట్టుబడి వైపుగా అభివృద్ధి చెందే దశ ద్వారా పొందే పురోగమన దశను వదిలిపెట్టి రైతాంగం విప్లవం వైపుగా, అనగా నరోదిజం వైపుగా. ఇతర సోషలిస్టులు యూరప్ ఏ అభివృద్ధి దశల ద్వారా ప్రయాణిస్తూ పురోగతి చెందిందో అవే అభివృద్ధి దశల ద్వారా రష్యా కూడా ప్రయాణిస్తూ చిట్ట చివరికి సోషలిస్టు విప్లవ లక్ష్యాన్ని చేరుకుంటుందని వాదించారు.

రష్యన్ గ్రామ కమ్యూన్ల గురించి ఊహించిన మేధావులు పలువురున్నారు. వీరంతా ఎక్కువ కాలం పాటు రష్యన్ సోషలిస్టులమని కూడా చెప్పుకోక, తమని తాము పాపులిస్టులమని చెప్పుకున్నారు. ఈ పాపులిస్టులు రష్యన్ రైతు జీవితాన్ని, రష్యా అభివృద్ధిలో ఒక నమూనాగా చూపిస్తూ, యూరప్‌లో ఉన్న వ్యక్తి స్వామ్యాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

ప్రసిద్ధ పోలిష్ చరిత్రకారుడు, సామాజిక, రాజకీయ తత్వశాస్త్రానికి సంబంధించి పోలిష్, రష్యన్ తత్వశాస్త్రంలో, మార్క్సిజంలో, ఉదారవాద భావాల పైనా పరిశోధనలు జరిపినవాడు అయిన ప్రొ. ఆంద్రెజ్ వాలికీ (నోటర్‌డామ్ విశ్వవిద్యాలయం) దృష్టిలో, సనాతన పాపులిజం, దీనికే 'నరోదిజం' అని పేరు (ప్రజల మిత్రులు), రష్యాలో పెట్టుబడి అభివృద్ధికి ప్రతిక్రియగా వచ్చినది మాత్రమే గాక, పడమటి దేశాల పెట్టుబడి, సోషలిజంలకు రష్యన్ మేధావుల ప్రజాస్వామిక జవాబు అంటాడతడు.

(6) జార్ అలెగ్జాండర్2 హత్య, అనంతర పరిణామాలు : 1880 ప్రారంభంలో నరోద్నిక్కులు, సైద్ధాంతిక దేశభక్తి వాదుల్ని ఒంటరి చేసి ప్రాపబల్యం వహించారు. అప్పటికింకా మార్క్సిజం రష్యాలో ఎవరికీ తెలియదు. రష్యాలో పెట్టుబడికి, అభివృద్ధికి తగిన తోడ్పాటునిచ్చి అలెగ్జాండర్2 తీవ్ర తప్పిదానికి పాల్పడ్డాడని ఈ నరోద్నిక్కులు భావించారు. దీంతో అలెగ్జాండర్ 2ని ఎలాగైనా చంపాలని భావించిన నరోద్నిక్కుల తీవ్రవాద సంస్థ అయిన 'నరోద్నయావోల్యా' సంస్థ సభ్యులు పలు సార్లు అతడిపై హత్యా ప్రయత్నం చేసి విఫలమై, ఆఖరికి సెయింట్ పీటర్స్ బర్గ్ నగరంలో 1881 మార్చ్ 13న బాంబు దాడిచేసి చంపేశారు.

అలెగ్జాండర్2 హత్య గావింపబడడంతో అతని కొడుకు అలెగ్జాండర్3 అధికారాన్ని స్వీకరించాడు. అలెగ్జాండర్3, మొట్ట మొదటి విప్లవకారులపై తీసుకున్న ప్రతిచర్య, సెన్సార్‌షిప్‌ని మరింత తీవ్రంగా అమలు చేయడం. ఇతడి పాలనా కాలం అంతా రాజ్యం అణచివేత చర్యలు పాత హద్దుల్ని కూడా అధిగమించి, మరింత తీవ్ర స్థాయికి అందుకోవడం! పౌరులకు ఏ కొద్దిగా ఉన్న హక్కులు కూడా హరించబడి, పోలీసుల పైశాచిక క్రీడ ప్రతిరోజూ జరిగే నిత్యకృత్యంగా మారడం. ప్రత్యేకంగా చెప్పాలంటే, రహస్య పోలీసుల ఏజెంట్ల వ్యవస్థ 'ఓఖానా'ను అలెగ్జాండర్3 అత్యంత దుర్మార్గంగా వినియోగిస్తూ, తిరుగుబాటు దారులనే అనుమానం మీద అరెస్టు చేసిన వారిపైన, ఏ కోద్ది నిరసన వ్యక్తం చేసిన వారిపైన వర్ణించలేని హింసను ప్రయోగించాడు.

అంతకు ముందు అలెగ్జాండర్2, ఇప్పుడు అలెగ్జాండర్3 పారిశ్రామికీకరణ కోసం తీసుకున్న అనుకూల చర్యలు వ్యతిరేక ఫలితాలిచ్చాయి. కార్మికవర్గం, కఠినంగా ఉన్న పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోతూ మరింత బహిరంగంగా సోషలిస్టుల ప్రభావం కిందికి అంతకంతకూ ఎక్కువగా రాసాగింది. ఈ విధంగా తన అణచివేత క్రూరత్వంతో, కొత్తగా ఏర్పడ్డ కార్మికవర్గ వ్యతిరేకతతో అలెగ్జాండర్3 విప్లవానికి మార్గాన్ని నిర్మించాడని చెప్పవచ్చు.

1894లో అలెగ్జాండర్3 మరణించడంతో నికోలాస్2 కొత్త జార్ అయ్యాడు. కొత్తగా 1890ల నుండీ రాజ్యంలో మార్క్సిజం వైపు యువతరం అడుగులు వేయసాగింది. కొద్ది కాలంలోనే బలం పుంజుకుని, కార్మిక రంగంలో ప్రభావవంతంగా పనిచేయ సాగింది. మరోపక్క నరోద్నిక్కుల ప్రభావం దిగజారుతూ వచ్చింది. మార్క్సిజంలో మెన్షివిజం తలెత్తి, రష్యన్ బూర్జువాలను కూడా విప్లవకర వర్గమేనని వేశ్లేషిస్తూ, విప్లవాంశను దిగజారుస్తూ వచ్చారు. మరోపక్క మర్క్సిస్టులు నిరంకుశత్వాన్ని అడ్డుకోవడం కోసం కొత్త ఎత్తుగడ పన్ని, తాత్కాలికంగా బూర్జువాలతో జతకట్టారు. ఈ దశలో సంఘాన్ని నడిపించే విషయంలో, రాజకీయ కార్యాచరణ పరంగానూ, సోషల్ డెమోక్రసీ (ఆ పేరుతోనే ఆనాడు రష్యాలో మార్క్సిస్టులు పనిచేశారు) ఎదురులేని ప్రతిభను కనబరుస్తూ, కార్మిక ప్రజల మద్దతు పొందసాగింది.

ఇలాంటి పరిస్థితుల్లో లెనిన్ తన కొత్తరకపు పార్టీ విధానంతో, యూరప్‌లోని పార్టీ నడిచే విధానాలకు భిన్నమైన విధానంలో నడుస్తూ, మెన్షివిక్‌లకన్నా భిన్నంగా రైతాంగంతో దోస్తీకట్టి మార్క్సిస్టుల కార్యాచరణలో, ఎత్తుగడల్లో గొప్ప ఫలితాల వైపు అడుగులేసింది. అదే సమయంలో రాజీలేని సిద్ధాంతాలతో, వైఖరులతో, గట్టి క్రమశిక్షణగల, నిబద్ధతగల కార్యకర్తలను తయారు చేయడం మొదలు పెట్టింది. ఆ విధంగా ఆసియా రకం బోల్షివిక్కులకూ, యూరప్ తరహా మెన్షివిక్కులకూ మధ్య వాడివేడి చర్చలతో కొన్ని సంవత్సరాలు గడిచాయి.

(7) 1905, 1917ల నాటి విప్లవాలు: జారిస్టు ఏకవ్యక్తి పాలన నుండి, కమ్యూనిస్టుల శ్రామికవర్గ నియంతృత్వం దాకా : అలెగ్జాండర్2 బానిస రైతాంగానికి స్వేచ్ఛ కలిగించినప్పటికీ, రైతాంగం స్థితిగతుల్లో ఏమీ మార్పు రాలేదు. కారణం వారికి భూమి ఇవ్వలేదు. భూముల్ని కొనుగోలు చేసుకోవాలన్నారు. అయితే వాటి ధర అధికంగా ఉండడం వల్ల వారు కొద్ది కాలంలోనే అప్పులపాలయ్యారు. దానికి అదనంగా అధిక పన్నురేట్ల వల్ల, ఆహారం ధరలు మండిపోవడం వల్ల వారి పరిస్థితి మరింత హీనంగా తయారైంది. మరోపక్క ఆర్థికపరమైన కారణాల వల్ల ప్రజల్లో అసహనం పెరిగిపోయింది. ఇతర యూరపియన్ దేశాలతో పోల్చుకుంటే రష్యాలో పారిశ్రామికీకరణ ప్రక్రియ ఆలస్యంగా మొదలైంది. పరిశ్రమల

యజమానులు అధిక లాభాల ఆశతో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం, దీనికితోడు జరిమానాల పేరుతో చీటికి మాటికీ వేతనాల్లో కోతపెడుతుండడం, కార్మికులు తాము కొనుగోలు చేసే నిత్యావసరాల్ని ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన షాపుల్లోనే కొనుగోలు చేయాల్సి రావడం, ఆ సరుకుల ధరలు అధికమే గాక, నాసిరకంగా ఉంటుండడం, ఆర్థిక మాంద్యం పేరుతో వేతనాలలో కోత విధిస్తుండడం, ఇందుకు ఏమాత్రం నిరసన తెలిపినా కార్మికుల్ని పనినుంచి తొలగించడం, అధిక పని గంటలు, వీటికి జతగా కార్మికుల నివాసాలు పందుల గుడిసెల్లా అసహ్యకరంగా ఉండడం కారణంగా కార్మికులంతా పారిశ్రామిక కార్మిక శక్తిగా రూపొంది, ఇతర అసంతృప్త జనాలకు జతగా కలిశారు. అలెగ్జాండర్2 చేత 1864లో ఏర్పరచబడ్డ జామ్‌స్త్వోల నుండి, దాని లక్ష్యాలకు మించి ఆశించడం ఎక్కువైంది. అయినప్పటికీ జార్‌లు తమ రాజరిక నిరంకుశత్వ అధికారానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా చెలాయించుకోవడానికి కృత నిశ్చయులుగా ఉన్నందున, పై అసంతృప్తులతో కూడిన ఉదారవాద బృందాలకూ, ప్రభుత్వానికీ మధ్య ఘర్షణలకు దారితీయసాగాయి. ఫలితంగా మూడు రాజకీయ పార్టీలు ఆవిర్భవించాయి. అవి: 1) సోషల్ డెమోక్రటిక్ పార్టీ. ఇది ప్రధానంగా కార్మికుల కోసం ఏర్పడింది. కార్మికులు కేంద్రంగా, సమసమాజ స్థాపన కోసం ఏర్పడిన ఈ పార్టీ మార్క్సిజం సిద్ధాంతంగా గలది. 2) సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ – ఇది ప్రధానంగా రైతాంగ కేంద్రక సిద్ధాంతం కలిగినది. 3) రాజ్యాంగ సహిత ప్రజాస్వామిక పార్టీ. 'కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ' అనే పేరులో గల పదాల మొదటి అక్షరాలను కలిపి ఈ పార్టీని కాడెట్, ఇది ప్రధానంగా విద్యావంతుల కోసం, జమ్‌స్త్వో సభ్యుల కోసం ఏర్పడింది. ఈ పార్టీలకు రాబోయే విప్లవ కాలంలో గట్టి నాయకులుండి, తమ పార్టీలను ముందుండి నడిపించారు.

1905వ సంవత్సరం రష్యన్ చరిత్రలో ఎంతో ముఖ్యమైన, గుర్తుపెట్టుకోవలసిన సంవత్సరంగా ప్రసిద్ధికెక్కింది. ఈ సంవత్సరంలోనే రష్యన్ చరిత్రను ఒక్కసారిగా ఊహించని గట్టి మలుపు తిప్పేసిన రీతిగా, ఎన్నో కీలకమైన సాంఘిక, రాజకీయ మార్పులకు నాటకీయంగా నాంది పలకడం జరిగింది. ఒకపక్కన రుస్సో–జపనీస్ యుద్ధం కొనసాగుతోంది. మరోపక్క రాజధాని నగరంలో పెద్ద స్థాయిలో ఆందోళనలు మిన్ను ముట్టాయి. 1905 జనవరి 9 ఆదివారం రోజును ప్రజలంతా 'రక్తసిక్త ఆదివారం'గా, భవిష్యత్ తరాలు కూడా గుర్తుపెట్టుకునే రీతిగా, ఒక భయంకరమైన రోజుగా చరిత్రలో నిలిచిపోయింది. ఆ రోజు రక్తం ఏరులై ప్రవహించింది. అదంతా కార్మిక ప్రజల రక్తం, జారిస్టు అణచివేతకు ప్రబల తార్కాణంగా నిలిచిన రక్తం అది. ఆ రక్తమే జారిజం అంతానికి నాంది కూడా పలికింది. ఆ ఉదంతం జరగడానికి ఒక కారణం ఉంది. ఆ వివరాలు క్లుప్తంగా చూద్దాం.

(8) రక్తసిక్త ఆదివారం : రుస్సో–జపాన్ యుద్ధానికి ముందే, 1900–1903 నాటి ఆర్థిక సంక్షోభంలో శ్రమజీవులంతా కుంగిపోయి ఉన్నారు. రుస్సో–జపాన్ యుద్ధం (1904 ఫిబ్రవరికి – 1905 సెప్టెంబర్ 5 దాకా జరిగిన ఈ యుద్ధం చైనాను దోచుకునేందుకు పోటీపడిన రష్యా, జపాన్‌ల మధ్య జరిగింది. ఇంగ్లాండ్ రహస్య మద్దతుతో జపాన్ గెలవడంలో రష్యా తన భూభాగాన్ని కూడా కోల్పోవలసి వచ్చింది – రచ.) వల్ల పడ్డ భారం వారిని మరింత సంక్షోభానికి నెట్టింది. కానీ పెట్టుబడిదారులూ, భూస్వాములూ మాత్రం యుద్ధ కాంట్రాక్టులతో, నల్ల బజారుతో అమితంగా లాభపడ్డారు. దాంతో వారిపట్ల, జార్ పట్ల జనమంతా కోపంతో రగిలిపోయారు. ఫలితంగా 1904 డిసెంబర్‌లో బోల్షివిక్కుల నాయకత్వాన 'బాకూ'లో కార్మికులంతా సమ్మె చేసి, కార్మిక ఉద్యమ చరిత్రలోనే తొలిసారిగా విజయాన్ని సాధించి, గనుల యజమానులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యమ విజృంభనకు ఈ సమ్మె నాంది పలికింది.

పై సమ్మె ప్రభావంతో 1905 జనవరి 3న పీటర్స్ బర్గ్‌లోని అతిపెద్ద పరిశ్రమ 'పుతిలోవ్'లో సమ్మె మొదలైంది. అందుకు కారణం నలుగురు కార్మికుల బర్తరఫ్. వెంటనే దావానంలా నగరంలోని ఇతర పరిశ్రమలకూ గంటల్లోనే వ్యాపించి, సర్వ వ్యాపిత సమ్మెగా మారసాగింది. దీన్ని మొదట్లోనే అణచివేయాలనుకున్న జార్, అందుకు కొందరు కార్మికుల రక్తాన్ని పాశవికంగా చిందిస్తే అప్పుడు మిగిలిన వారు భయంతో వణికిపోయి ఉండి ఉంటారని ఆలోచించాడు. దీంతో పోలీసులు ఫాదర్ గేపన్‌ని సంప్రదించారు. అతడు వారికి సాయపడేందుకు సమ్మతించాడు. నగరంలోని పలు ఫ్యాక్టరీలలో శాఖలు గల 'రష్యన్ ఫ్యాక్టరీ సంఘా'న్ని అతడే స్థాపించాడు. గేపన్ కార్మికుల మూఢత్వాన్ని ఉపయోగించుకుని, కార్మికుల కడగండ్లకు ఉద్యోగులే కారణం తప్ప, జార్‌కు ఏమీ తెలీదనీ, అంచేత కార్మికులు ఊరేగింపుగా వెళ్ళి జార్‌కు తమ బాధలతో ఒక వినతి పత్రం సమర్పిస్తే కార్మికుల బాధలన్నీ సమసిపోతాయనీ వారిని నమ్మించాడు. దీంతో జనవరి 9 ఆదివారం నాడు 1 లక్షా నలభై వేల మంది కార్మికులు, తమ కుటుంబ సభ్యుతో కలిసి చర్చి జెండాలూ, జార్ చిత్ర పటాలూ పట్టుకుని, శాంతియుతంగా, ఊరేగింపుగా జార్ శీతాకాల మందిరమైన వింటర్ పాలెస్ వద్దకు వెళ్లారు. వారంతా భవనానికి అల్లంత దూరంలో ఉండగానే సైన్యాన్ని జార్ కాల్పులు సాగించమని ఆదేశించాడు. భయంకరమైన ఈ కాల్పుల ఘటనలో మొత్తం వెయ్యి మందికి పైగా కార్మికులు చనిపోగా, రెండు వేలకు పైగా గాయాల పాలయ్యారు. నగరపు వీధులన్నీ నెత్తురు కాల్వలతో మునిగిపోయాయి. దీంతో జనవరి 9ని 'బ్లడీ సండే' అని పిలవసాగారు. ఈ తుపాకీ కాల్పులతో కార్మిక లోకానికంతకూ కనువిప్పయింది. జార్ జరిపిన ఘోరకృత్యం వార్త దేశమంతా దావానంలా వ్యాపించింది. ఒక్క కార్మిక జనమే కాదు, సామాన్య జనులూ క్రోధంతో అట్టుడికి పోయారు. ఈ కిరాతక కృత్యానికి నిరసనగా సమ్మె చేయని పట్టణమే లేదు. ఈ విధంగా రష్యాలో ప్రథమ విప్లవం ప్రారంభమైంది. 1905 జనవరి 9 తర్వాత కార్మిక విప్లవ పోరాటాల్లో ఒక ప్రత్యేకత కనిపించింది. అదేమిటంటే, మొదటి సారిగా రాజకీయ ఉద్దేశంతో సమ్మె చేయడం. అలాగే ఈ సమ్మెల్లో కొన్ని చోట్ల కార్మికులు సాయుధులై, తమ పైకి దాడికి వచ్చిన సైనికుల్ని ప్రతిఘటించేందుకూ, తిరుగుబాటుకూ ప్రయత్నించడం! మరొక విశేషమేమంటే, ఉధృతంగా సాగే సమ్మెలకు పలుచోట్ల రైతాంగ తిరుగుబాట్లు సైదోడుగా నిలిచి, భూస్వాముల పైకి రైతాంగ గుంపులు దాడులుగా వెళ్లి, వారి ఎస్టేట్లనూ, భవనాలనూ ధ్వంసం చేస్తూ, ధాన్యపు నిల్వల్ని స్వాధీనం చేసుకొని పంచిపెట్టడం! ఈ విధంగా రక్తసిక్త ఆదివారం సంఘటనతో జార్‌కూ, ప్రజలకూ మధ్యనున్న లింక్ తెగిపోయింది. ఇప్పటిదాకా జార్‌కు జనాన్ని పాలించే అధికారం దైవదత్తమని సామాన్య జనం నమ్మేవారు. అంతేకాదు, జార్‌ని చిన్న తండ్రిగా, దేవుణ్ని పెద్ద తండ్రిగా భావించి పటం పెట్టుకుని పూజించేవారు. ఇప్పుడా పటాల్ని పగులగొట్టి, జార్‌ని అసహ్యించుకుని, ద్వేషించడం మొదలెట్టారు.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

వీ

పోలీసుల హింస వల్లే ఆటో డ్రైవర్ కుటుంబం ఆత్మహత్య

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఆటో డ్రైవర్ అబ్దుల్ సలాం, అతని భార్య, పద్నాలుగు, పదేళ్ల వయస్సున్న ఇద్దరు పిల్లలు నవంబర్ 3న రాత్రి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు పురికొల్పిన కారణాలను సలాం రికార్డు చేసిన విడియో బయటపడింది. రైల్వే పోలీసులు అనుమానాస్పద మరణంగానే కేసు నమోదుచేసుకున్నారు. ఆ తరువాత సలాం బంధువులను విచారించిన రైల్వే పోలీసులు నంద్యాల వన్‌టౌన్ సి.ఐ. సోమశేఖరరెడ్డిని, కానిస్టేబుల్ గంగాధర్‌ను ముద్దాయిలుగా చేర్చి వారిని అరెస్టు చేశారు. ఆ మరుసటి రోజే నిందితులకు బెయిలు లభించింది. సలాం నడుపుతున్న ఆటోలో రు. 70 వేలు పోయాయని ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు సలాం బంగారం దుకాణంలో పనిచేసే సమయంలో జరిగిన చోరీలో కూడా సలాం నిందితుడిగా ఉన్నాడు. తాను దొంగతనం చేయలేదన్నా పోలీసులు చిత్రహింసలు పెట్టి అతడి మీద కేసులు పెట్టారని, ఇప్పుడు కూడా హింస పెడతారేమోనని సలాం కుటుంబంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లగా ఆయన ముందే భార్యతో పోలీసులు అసభ్యకరంగా వ్యవహరించడంతో ఇదంతా అవమానంగా భావించి సలాం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు చెబుతున్నారు.

తెలంగాణలో కొనసాగుతున్న సన్నాల రైతుల నిరసన

తెలంగాణ రాష్ట్ర సిఎం చెపుతేనే సన్నాలు వేశామని, పంట చేతికి వచ్చాక మద్దతు ధర ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులు నవంబర్ 12న ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు. ఆరు జిల్లాలకు సంబంధించిన రైతులు దశల వారిగా ప్రగతి భవన్ వద్దకు వచ్చేందుకు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. రైతులు మీడియాతో సన్నరకం వడ్లకు రు. 2,500 చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే రోజు వామపక్షాల ఆధ్వర్యంలో భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నియంత్రిత వ్యవసాయ ప్రణాళికలో భాగంగా సన్నరకాల వరి సాగు చేసిన రైతులకు మార్కెట్‌లో ఇప్పుడు గిట్టుబాటు ధర లభించడంలేదు. మేం ఇద్దామనుకుంటే కేంద్రం ఇవ్వనీయడం లేదని రాష్ట్రం ఆరోపిస్తుండగా... ఎంఎస్‌పి కంటే ఎంత ఎక్కువ ఇచ్చినా ఆ మొత్తాన్ని రాష్ట్రాలే భరించాలని కేంద్రం అంటోంది. కేంద్రం రాష్ట్రాల కాళ్లు, చేతులు కట్టేసిందని సిఎం, మంత్రులు ఆరోపిస్తున్నారు. కేంద్రం అడ్డుకున్నా ఊరుకోబోమని సన్నాలకు మద్దతు ధర కంటే 100-150 ఎక్కువ ఇస్తామని సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కురిసిన అధిక వర్షాలు, రోగాల దెబ్బకు దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు సన్నాలు సాగుచేసిన రైతులు ఎంఎస్‌పితో కలిపి క్వింటాలుకు రు. 2,500 చొప్పున ఇవ్వాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. 17 శాతం తేమ నిబంధనను పాటిస్తూ ఎంఎస్‌పి అమలు చేస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు నవంబర్ 17న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ రోజు నుండే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 150 డివిజన్లు ఉన్నాయి. నవంబర్ 18 నుండి 20 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 21న నామినేషన్ల పరిశీలన. నవంబర్ 22న నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటన. డిసెంబర్ 1న పోలింగ్. డిసెంబర్ 4న కౌంటింగ్, ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు.

ప్రొ. శేషయ్య సంస్మరణ సభ

పౌర హక్కులను, ప్రజాస్వామిక హక్కులను కాపాడుకుందామని పౌరహక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ అన్నారు. పౌర హక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ప్రొ. శేషయ్య సంస్మరణ సభ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 21న నిర్వహించారు. పురుషోత్తం హత్యకు గురై 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పురుషోత్తంపై 'అతడొక ధిక్కారం' పుస్తకాన్ని పురుషోత్తం కుమార్తె స్వేచ్ఛ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు హక్కుల కోసం గళం విప్పేదే పౌర హక్కుల సంఘం అని, సంస్థ దశ దిశను నిర్దేశించిన మేధావి, దార్శనికుడు ప్రొ. శేషయ్య అన్నారు.

పోలవరం యాత్రను అడ్డుకున్న పోలీసులు

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం, పునరావాసాన్ని కేంద్రం ఇవ్వకపోవడం, ప్రాజెక్టు అంచనా విలువను కుదించడం వంటి పరిణామాల నేపథ్యంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ నాయకత్వంలో చేపట్టిన పోలవరం పరిరక్షణ యాత్రపై పోలీసులు నిర్బంధాన్ని అమలుచేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలోని రామకృష్ణ ఉన్న రివర్ బే హోటల్‌ను నవంబర్ 21నే దిగ్బంధించి పలువురు నేతలను అరెస్టు చేశారు. నవంబర్ 22న తిరుపతిలో మీడియాతో మాట్లాడి పోలవరం యాత్రకు బయలుదేరిన సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించారు. పోలవరం ఏమైనా నిషిద్ధ ప్రాంతమా? ప్రాజెక్టు వద్దకు పోకుండా అడ్డుకునే హక్కు ఎవరిచ్చారు? అని ప్రశ్నించారు.

జర్నలిస్టుల హక్కుల రద్దును వ్యతిరేకిస్తూ నిరసన

ఉద్యమాలతో సాధించుకున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని కేంద్రం రద్దు చేయడం భావ ప్రకటన స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాలరాయడమేనని ఇండియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్త ఆందోళనలతో ఈ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకుంటామని హెచ్చరించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నవంబర్ 16న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నల్లకుంటలో గల కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల నేతలపై కేసులు, అరెస్టులు

హక్కుల నేతలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేసింది. విశాఖ జిల్లా ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో మావోయిస్టు నేతలతో పాటు వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలతో 64 మందిపై ఉపా చట్టం, రాజద్రోహ నేరం, ఆయుధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో కేసులు నమోదు చేశారు. 64 మందిలో పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక, మహిళా సంఘం, వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు, గిరిజనులు ఉన్నారు. ఇద్దరు మహిళ సంఘ సభ్యులను పోలీసులు నవంబర్ 27న అరెస్టు చేశారు. వీ

భారతదేశంలో ప్రమాదపుటంచున ప్రజాస్వామ్యం

భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదపుటంచులో ఉన్నది. మోడీ ప్రభుత్వ చర్యలతో ప్రజాస్వామ్య హోదాను కోల్పోయే స్థితి ఏర్పడింది. స్వీడన్ దేశానికి చెందిన వీ-డెమ్ ఇన్‌స్టిట్యూట్ ఈ ఏడాదికి సంబంధించిన 'డెమోక్రసీ రిపోర్టర్'లో ఈ విషయాన్ని వెల్లడించింది. 'పెరుగుతున్న నిరంకుశత్వం - ఉప్పొంగుతున్న ప్రతిఘటన' పేరుతో ఈ నివేదికను విడుదల చేసింది. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో మీడియా, పౌర సమాజం, ప్రతిపక్షాలకు కనీస హక్కులను కూడా అమలు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని వివరించింది. జీ20 లోని అనేక దేశాలు, ప్రపంచంలోని అన్ని ప్రాంతాలు ఇప్పుడు నియంతృత్వం మూడో వేవ్‌లో ఉన్నాయని ఈ నివేదిక హెచ్చరించింది. 'భారతదేశం ప్రజాస్వామ్య క్షీణత దారిని కొనసాగించింది. ఇప్పుడు అది ప్రజాస్వామ్య హోదాను కోల్పోయింది' అని నివేదికలో పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఏ గెలుపు

బీహార్ అసెంబ్లీకి మూడు విడతలుగా జరిగిన ఎన్నికల ఫలితాలు నవంబర్ 10 అర్ధరాత్రి దాటాక వెలువడ్డాయి. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్‌డిఏ కూటమి బిజెపి-74, జెడియు-43, విఐపి-4, హ్యామ్-4 గెలుపొంది మొత్తం 125 స్థానాలు సాధించింది. మహాకూటమికి చెందిన ఆర్‌జెడి-75, కాంగ్రెస్-19, లెఫ్ట్-16 గెలుపొంది మొత్తం 110 స్థానాలు సాధించింది. ఇతరులు ఎంఐఎం-5, ఎల్‌జెపి-1, బిఎస్‌పి-1, ఇండిపెండెంట్-1 గెలుపొంది మొత్తం 8 స్థానాలు సాధించాయి. ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఎన్‌డిఏ కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రావడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. రెండు దశాబ్దాల్లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా ఏడోసారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 16న ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. 59 స్థానాలో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి మెజారిటీ స్థానాల్లో గెలిచింది.

యుపిలో జర్నలిస్టుపై దాడి

ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్టులపై దాడుల పరంపర కొనసాగుతున్నది. యుపిలో ఉపాధి హామీ పథకంలో అక్రమంగా యంత్రాలు ఉపయోగించడాన్ని ప్రశ్నించినందుకు దాడిచేశారు. ఈ ఘటన లలిత్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసు అధికారి జైప్రకాశ్‌చౌబే తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఓ వార్త ఛానల్‌లో వినయ్ తివారీ పనిచేస్తున్నాడు. నవంబర్ 7న ధౌర్రా గ్రామం వద్దగల లింక్ రోడ్డు నిర్మాణాన్ని ఆయన వీడియో తీశాడు. ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న ఈ రోడ్డుకు కూలీలకు బదులుగా అక్రమంగా యంత్రాలను ఉపయోగించే విషయాన్ని బయటపెట్టేందుకు వినయ్ తివారీ ప్రయత్నించాడు. గ్రామ పెద్ద కుమారులు తివారీని బెదిరించి లాఠీలతో తీవ్రంగా కొట్టి కెమెరా, సెల్‌ఫోన్, డబ్బును గుంజుకున్నారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన వినయ్‌ని ఆస్పత్రికి తరలించారు.

జర్నలిస్టు అర్ణబ్ గోస్వామి అరెస్టు-విడుదల

రిపబ్లిక్ టివి చీఫ్ ఎడిటర్ అర్ణబ్ గోస్వామిని మహారాష్ట్ర రాయిగఢ్ జిల్లా అలీబాగ్ పోలీసులు నవంబర్ 4న అరెస్టు చేశారు. 2018లో ఇంటీరియర్ డిజైనర్ అన్వయ్ నాయక్(53), ఆయన తల్లి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్న ఆరోపణలపై అర్ణబ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అర్ణబ్ బెయిల్ దరఖాస్తును బాంబే హైకోర్టు కింది కోర్టుకు పంపగా సుప్రీంకోర్టుకు వెళ్లారు. నవంబర్ 11న వాదనలు విన్న సుప్రీంకోర్టు జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఇందిరా బెనర్జీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆయనను రు. 50 వేల పూచీకత్తుపై విడుదలకు ఆదేశాలిచ్చింది. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడంలో హైకోర్టు విఫలమైందని, బెయిల్ నిరాకరించడం తప్పుని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. అర్ణబ్ గోస్వామి కేసును అత్యవసరంగా చేపట్టడంపై సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే దేశంలో ఎంతోమంది నెలల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. అందరి కేసులనూ ఇలానే రిజిస్ట్రీ అత్యవసరంగా లిస్ట్ చేస్తోందా అని సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో ప్రశ్నించారు.

ఛత్తీస్‌గఢ్, ఏఓబి ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా పడ్‌కేట్‌బేడాలో నవంబర్ 23న మావోయిస్టులు-పోలీసుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో దళ కమాండర్ రాజు సలామ్‌తో పాటు ఒక మహిళా మావోయిస్టు ఉన్నారన్నారు. ఛత్తీస్‌గఢ్, ఏఓబిల్లో నవంబర్ 26న పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని పోలీసు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా కుట్‌రూ పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్భా అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మిలీసియా సభ్యుడు మృతి చెందారన్నారు. నవంబర్ 26న రాత్రి ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో మల్కన్‌గిరి జిల్లాలో ఎదురుకాల్పుల్లో మావోయిస్టు ఏరియా కమిటీ మెంబర్ మరణించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న పది కేంద్ర కార్మిక యూనియన్లు ఐక్యవేదికగా ఏర్పడి నవంబర్ 26 దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపు మేరకు వివిధ సంస్థలకు చెందిన రైతులు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది ఢిల్లీకి వస్తుండగా అన్ని రహదారుల్లో పోలీసులు వారిపై లాఠీ చార్జీ చేసి బాష్పవాయువును ప్రయోగించారు. గురుగ్రామ్ సరిహద్దుల్లో రైతులు ట్రాక్టర్‌లతో ముందుకు కదులుతుండడంతో పోలీసులు అడ్డంగా ఇసుక బస్తాలు పేర్చారు. లక్షల మంది రైతులను ఢిల్లీ పొలిమేరల్లో పోలీసులు అడ్డగించారు. కేంద్రం తెచ్చిన నూతన వ్యవసాయ, కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని తదితర సమస్యలతో పాటు పలు డిమాండ్‌లు చేస్తూ సమ్మెలో పాల్గొన్నాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రైతులకు మద్దతుగా సిఐటియు, ఏఐటియుసితో సహా వివిధ కార్మిక, రైతు సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. వీ

వచ్చే సంచికలలో...

- ఎవరి ప్రయోజనాల కోసం ధరణి? - ఎన్. వేణుగోపాల్
- కుటుంబమూ, సొంత ఆస్తీ, రాజ్యం ఆవిర్భావం - వి. వెంకట్రావ్
- పిఎం కేర్స్ నిధి వసూళ్లు ఆర్‌టిఐకి అతీతమా? - మాడభూషి శ్రీధర్
- ఆదిలాబాద్ జిల్లా ఆదివాసుల దుస్థితి - చక్రవర్తుల శ్రీమాన్

వీక్షణం 2020 సూచిక

కోవిడ్ లాక్‌డౌన్ వల్ల వీక్షణం ఏప్రిల్, మే, జూన్ సంచికలు అచ్చు వేయలేకపోయాం. ఏప్రిల్, మే సంచికలు కలిపి సాఫ్ట్‌కాపీగా వెలువరించాం. అందువల్ల 2020లో 9 సంచికలు మాత్రమే అచ్చులోనూ, ఒక సంచిక సాఫ్ట్‌కాపీ గానూ వెలువడ్డాయి.

ఏప్రిల్-జూలై 2020 సంచిక : **225**

పాఠకుల వీక్షణం
దేశభక్తి ప్రజల మీద ఆయుధం (సంపాదకీయం)
దొర ఏది జెపితే గదే గత్తర!; కక్ష విధానాలా, ప్రజాపక్ష విధానాలా?;
కల్లోల కాలంలో కూడా మారని రాజ్య స్వభావం – రాజేంద్రబాబు అర్విణి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు

కొవిడ్ 19 - ప్రత్యేక వ్యాసాలు

విశ్వమారిల నుండి మానవజాతిని కాపాడాలి – జార్జ్ ఫ్లాయిడ్
కొవిడ్-19 రాజకీయార్థిక పరిచయం – మనీష్ ఆజాద్
కోపంలేని మనుషులపై కనికరం లేని దేశం – సి. వనజ
వ్యవస్థ స్వభావాన్ని బయటపెట్టిన కరోనా – వై. రామచంద్రం
కొవిడ్‌కు ముందూ తర్వాతా ఆర్థిక సంక్షోభం – డి. నరసింహారెడ్డి
కార్పొరేట్ అనుకూల ప్యాకేజీ – సంతోష్
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉద్దీపన – డా. ఎ. పున్నయ్య
కష్టకాలంలో పాలకుల నియంతృత్వం – బైరెడ్డి సతీష్
కొవిడ్-19 పరీక్షల పైన హైకోర్ట్ తీర్పు – ప్రొ. కోదండరామ్, ప్రొ. పి.ఎల్. విశ్వేశ్వర రావు

కార్మిక చట్టాల్లో సడలింపు పాలకుల దుర్మార్గం – బి. రామకృష్ణ
పని గంటల పెంపు – పాలకుల స్వభావం – ఎం. శ్రీనివాస్
అమెరికాలో ప్రజాగ్రహం – భారత్ నిశ్శబ్దం – బి.ఎస్.రాజు
మతం – సైన్స్ – డా. ఎం. వెంగల్ రెడ్డి
జీవంలేని ఆన్‌లైన్ విద్యా విధానం – గొడితాల వెంకటేశ్వర్లు
ఆర్థిక సంక్షోభ కారణాలు-ప్రత్యామ్నాయం – ఎ. నర్సింహారెడ్డి
క్రూడ్‌ధర పతనమైనా సుంకాల మోత – వెంకట్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ 2020-21 – చిమ్మె జాన్ బర్నబాస్
ప్రజలను పాలిమర్స్‌కు బలిచ్చిన పాలకులు – జి. రఘురాం
ఎల్.జి. పాలిమర్స్ నిర్లక్ష్యానికి అమాయకుల బలి – అన్నపూర్ణ
జివో నెం. 3 రద్దుకు గిరిజనేతరుల కుట్ర – వూకె రామకృష్ణ దొర
భారత్‌పై మిడతల యుద్ధం – ఎం.కె. కుమార్
సంస్మరణ

ఆగస్ట్ 2020 సంచిక : **226**

పాఠకుల వీక్షణం
ప్రజలకు సంక్షోభం, పాలకులకు అవకాశం! (సంపాదకీయం)
నిజాన్ని కూల్చుడు, అబద్ధాన్ని కట్టుడు, ఎంత మజా!; దళితుల మీద దౌర్జన్యాలు చూపుతున్నదేమిటి?;
అమెరికా అధ్యక్ష ఎన్నికలు వాయిదా పడతాయా?– సతీష్ బైరెడ్డి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు
సెక్రటేరియట్ కూల్చివేత – మూఢనమ్మకాలు – ఎన్. వేణుగోపాల్
జగన్ పాలనలో దళితులపై దాడులు – దుడ్డు ప్రభాకర్
కరువు కోరల్లో విజయనగరం జిల్లా రైతాంగం – ఎ.అన్నపూర్ణ
జీవించే హక్కుకు భరోసా ఎక్కడ? – చిమ్మె జాన్ బర్నబాస్
జి.ఎన్. సాయిబాబాకు లేఖ – అరుంధతీ రాయ్
రాజస్థాన్ రాజకీయంలో ప్రజా తీర్పేది? – కె. మహేష్
ఆధిపత్య వ్యవస్థ సృష్టి వికాస్ దుబే – ఎం.కె. కుమార్
'స్టార్స్'తో విద్యావ్యవస్థపై ప్రపంచబ్యాంక్ పెత్తనం – డా. ఎ. పున్నయ్య
సిలబస్ కుదింపుకు కుటిల యత్నాలు – బి.రామకృష్ణ
ఖైదీల ఆరోగ్య హక్కును భారత్ సమర్థిస్తోందా? – సంచితా కదమ్
సంస్మరణ – ఉ.సా. (ఉ. సాంబశివరావు)
కమ్యూనిజానికి ప్రేరణనిస్తున్న కరోనా వైరస్ – అలెక్సాండ్ర్ బుజ్గాలిన్
కరోనా వెనుక కనిపించని నిజాలు – చుంచు శ్రీశైలం
బడ్జెట్ అంటే ఏమిటి? – వి. హనుమంతరావు
మెకనాస్ గోల్డ్ కోసం మనుషుల వేట – వరవరరావు
ఇజ్రాయెల్ దురాక్రమణ కొనసాగింపు – ఎ. నర్సింహారెడ్డి
ఇండో-చైనా సరిహద్దు ఘర్షణ మూలాలు – సంతోష్
చైనా సరుకుల ప్రపంచీకరణ – కేశవ్
అసలు లక్ష్యం చైనాయే.. – సతీష్ బైరెడ్డి
డేవిడ్ హార్వే: పెట్టుబడి – 7 ప్రధాన వైరుధ్యాలు – రమేష్ పట్నాయక్
డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు – 6 – ఎన్.వి.యస్. నాగభూషణ్

సెప్టెంబర్ 2020 సంచిక : **227**

పాఠకుల వీక్షణం
ధ్వంస రచనకు భూమి పూజ! (సంపాదకీయం)
నీళ్ల జాగలకు మనం బోయినమా, అవి మన జాగలకొచ్చినయా!; నిజమైన సమస్యలు తప్పించడానికి కల్పిత సమస్య;
కరోనా కట్టడిలో చిన్నదేశాల విజయం – రాజేంద్రబాబు అర్విణి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు
ఆగస్ట్ 5 – దేశం సిగ్గుతో తలదించుకోవలసిన రోజు – అరుంధతీ రాయ్
న్యాయవ్యవస్థనా – అన్యాయవ్యవస్థనా? – ఇందిరా జైసింగ్
వ్యవసాయరంగ ఆర్డినెన్స్‌లతో ఎవరికి లాభం? – కన్నెగంటి రవి
కొత్త పర్యావరణ ప్రభావ మదింపు చట్టంపై అభ్యంతరాలు – మహారాష్ట్ర పియుసిఎల్
తిరోగమన జాతీయ విద్యా విధానం – ఎ. నర్సింహారెడ్డి
జాతీయ విద్యా విధానంలో పాఠశాల విద్య – బి. రామకృష్ణ
పెట్టుబడిదారుల చేతుల్లోకి ఉన్నతవిద్య – డా. ఎ. పున్నయ్య
కశ్మీర్ అస్తిత్వ పోరాటం – రాజేంద్రబాబు అర్విణి
ఎపి ప్రభుత్వ రాజ్యాంగ ఉల్లంఘనలు – చిమ్మె జాన్ బర్నబాస్
షికారీ చినబాబుది కులహత్యే – ఎం.కె. కుమార్
తెలంగాణ సోయి మర్చిందెవలు? – వాడపల్లి అజయ్‌బాబు
పీడితుల ఆవేదనే వివి వ్యక్తీకరణ – ఎం. శ్రీనివాస్
ఓడా! నువ్వెళ్ళిపోకే.. మాకాదే! నువ్వుండిపోవే.. (సంస్మరణ) – బి.ఎస్. రాజు
ఎ. సావిత్రి, సూర్యావతి, వంగపండు ప్రసాదరావు, జివిఎల్ఎన్ మూర్తి, ఇలినా సేన్, నర్సింగరావు, చల్లపల్లి శ్రీనివాసరావు, పి. జస్వంతరావు (సంస్మరణ)
అపార దయామయి ఇలీనా సేన్ – స్రవంతి దాసరి
భారత్ – చైనా సరిహద్దు వివాదం – పండిట్ సుందర్‌లాల్
నియంతృత్వపు అంచుల్లో శ్రీలంక – సతీష్ బైరెడ్డి
బీరూట్ పేలుళ్లతో కుదేలైన లెబనాన్ – సంతోష్
మార్క్సిజం కాదు నవీకరించబడ్డ కాపిటలిజం – పి. ప్రసాద్
విప్లవం 'ఒంటరిగా' చేయొచ్చు.. నిలపొచ్చు! – నన్నూరి వేణుగోపాల్
డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు – 7 – ఎన్.వి.యస్. నాగభూషణ్
ఈనేల – వై. రామచంద్రం
ఇరుగు-పొరుగు – వై. రామచంద్రం

అక్టోబర్ 2020 సంచిక : **228**

పాఠకుల వీక్షణం
ఫాసిస్టు పాలనలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పాతర! (సంపాదకీయం)
అబ్బ, ఢిల్లి మీద కొట్లాట గింత అల్కగనా!; మతవిద్వేషాల పంటకు చదునవుతున్న భూమి;
పాలస్తీనా ప్రయోజనాలకు భంగకరం – ఎ. నర్సింహారెడ్డి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు
కార్పొరేట్ల కోసమే కొత్త వ్యవసాయ చట్టాలు – కన్నెగంటి రవి
కార్పొరేట్ల గుప్పెట్లో రైతు – కేశవ్
వ్యవసాయాన్ని దెబ్బతీసే ఆర్డినెన్సులు – ఎం.కె. కుమార్
వ్యవసాయంలో లాభం వస్తుందా? – డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
భూ రికార్డుల నవీకరణ – రెవెన్యూ వ్యవస్థ రద్దు – ఎల్. భద్రయ్య
తెలంగాణ ప్రజా అసెంబ్లీ – రాజేంద్రబాబు అర్విణి
జాతీయోత్పత్తి సూచికల పతనం – డా. ఎ. పున్నయ్య
సంక్షోభంలో 'ఎంఎస్ఎం' పరిశ్రమలు – ఎ. నర్సింహారెడ్డి
కమ్ముకొస్తున్న ఫాసిజం ప్రమాదం – ఎన్. వేణుగోపాల్
ప్రైవేట్ యూనివర్సిటీల వ్యాపారం – బి. రామకృష్ణ
అందరికి అందని ఆన్‌లైన్ విద్య – పబ్బతి వెంకటేశ్వర్లు
యాంత్రిక సమాజ సృష్టికే ఆన్‌లైన్ విద్య – చుంచు శ్రీశైలం
రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నం నూతన విద్యావిధానం – జి . తిరుపతి రెడ్డి
కార్మిక చట్టాల నిలుపుదల ఆర్డినెన్స్ – స్నేహలత
నేర రాజకీయ నేతలపై కేసులు – చిమ్మె. జాన్ బర్నబాస్
ఫేస్‌బుక్ రాజకీయాలు – సతీష్ బైరెడ్డి
స్త్రీలు – న్యాయ వ్యవస్థ – హేమ వెంకట్రావు
బలోపేతం కావాల్సిన పన్నుల వ్యవస్థ – వి. వరదరాజు
కరోనా వైరస్ – పాలకుల స్వభావం – ఎ. తిరుపతి
వ్యక్తిగత ఆస్తి పోతుంది, శ్రమ విభజన ఉంటుంది! – నన్నూరి వేణుగోపాల్
దోహా చర్చలు – అఫ్ఘనిస్తాన్‌లో శాంతి – సంతోష్
డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు – 8 – ఎన్.వి.యస్. నాగభూషణ్
ఇరుగు పొరుగు – వై. రామచంద్రం
సంస్మరణ – డా. పాండురంగ రాజు (12), స్వామి అగ్నివేశ్ (14), పైలా చంద్రమ్మ (50), ముఖ్తార్ పాషా (54)

నవంబర్ 2020 సంచిక : **229**

పాఠకుల వీక్షణం
విధ్వంస రాజకీయాల ఉన్మాద ఉధృతి (సంపాదకీయం)
పట్నం గోస గిట్లెందుకయింది?; అడగవలసిన ప్రశ్నలే, కాని అడుగుతున్నదెవరు?
బెలారస్‌పై ముప్పేట దాడి – రాజేంద్రబాబు అర్విణి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు
హాథ్రస్ ఏమి చెబుతున్నది? – బి. రామకృష్ణ
హాథ్రస్‌లో ఏం జరిగింది? – నిజ నిర్ధారణ నివేదిక
ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై దాడి – సతీష్ బైరెడ్డి
వ్యవసాయ చట్టాలపై రైతుల ఆగ్రహం – ఎ. నర్సింహారెడ్డి
అందరు నిర్దోషులైతే, మసీదు కూల్చిందెవరు? – సంతోష్
బీహార్ ఎన్నికల్లో నితీశ్ గట్టెక్కేనా? – నర్సింలు
మనస్సాక్షి గల మనుషుల అరెస్టు – శివ్ విశ్వనాథన్
జైల్లో మాకు ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది? – కళ్యాణి, తన్మయ్
స్టాన్ స్వామి రాజ్యానికి శత్రువు ఎందుకయ్యాడు? – హర్ష్ మందర్
జిఎస్‌టి గుత్తపెత్తనం – సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు – డా.ఎ .పున్నయ్య
ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణను చూడగలమా? – ఎన్. నారాయణ రావు
న్యాయవ్యవస్థ స్వతంత్రత – రాజ్యాంగ దృక్పథం – చిమ్మె. జాన్ బర్నబాస్
నూతన రెవెన్యూ చట్టంతో భూ రికార్డులు కనుమరుగు – ఎల్. భద్రయ్య
స్త్రీలు – న్యాయ వ్యవస్థ – 2 – హేమ వెంకట్రావు
ఆన్‌లైన్ విద్య–అయోమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు – ఎం. రఘుశంకర్ రెడ్డి
రాజకీయ నాయకులతో ప్రజలకు మేలు జరుగుతుందా? – డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
రాజకీయార్థ శాస్త్రవేత్తగా ఫ్రెడరిక్ ఎంగెల్స్ – ఎన్. వేణుగోపాల్
లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు – సమకాలీన విప్లవోద్యమాలు – కొండూరి వీరయ్య
అజర్‌బైజాన్ – అర్మేనియా సాయుధ వివాదం – రాజేంద్రబాబు అర్విణి
సంస్మరణ – ప్రొ. శేషయ్య; గుండా మల్లేశ్; శోభానాయుడు; పెద్ది క్రిష్ణ
డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు – 9 – ఎన్.వి.యస్. నాగభూషణ్
ఈనేల – వై. రామచంద్రం
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
భూగోళం – శేఖర్

డిసెంబర్ 2020 సంచిక : **230**


పాఠకుల వీక్షణం
వ్యక్తిగత ప్రేమనూ శాసిస్తున్న రాజ్యదుర్మార్గం (సంపాదకీయం)
మాయ జేసే పెగ్గెలు, మతి తప్పిన మాటలు; పోలీసు రాజ్యంగా మారుతున్న ఆంధ్రప్రదేశ్;
అమెరికా రాజనీతిని బైడెన్ మారుస్తాడా? (సంపాదకీయ వ్యాఖ్యలు)
రామోజీపేట దళితులపై దాడులు – మాదన కుమారస్వామి
అసంతృప్తి గళాల ఐక్యత రాగం – బెజ్జంకి ప్రభాకరాచారి
తెలంగాణ ఆరోగ్యానికి ముప్పు ఫార్మా సిటీ – అన్వేశ్ రెడ్డి సుంకేత్
రైతు వేదికలు ఎందుకు ఉపయోగపడాలి? – కన్నెగంటి రవి
ఎపిలో పెరిగిపోతున్న పోలీసు రాజ్యం – చిమ్మె. జాన్ బర్నబాస్
బీహార్ ఎన్నికల ఫలితాలు ఏం సూచిస్తున్నాయి? – వై. రామచంద్రం
హిందుత్వ వక్రీకరణలు – సంగిరెడ్డి హనుమంత రెడ్డి
కొత్త కార్మిక వ్యతిరేక చట్టాలు – కె. సూర్యం
కశ్మీర్ మరో పాలస్తీనా కాబోతోందా? – బి. ఎస్. రాజు
ఆత్మనిర్భర్ భారత్‌కు ఆకలి సూచి హెచ్చరిక – డా.ఎ. పున్నయ్య
అమెరికా సైనిక కూటమిలో భారత్ చేరవద్దు – డా. కొల్లా రాజమోహన్
భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి నివేదిక – సతీష్ బైరెడ్డి
వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం – సి.ఎస్.ఆర్. ప్రసాద్
ఓడిపోయినా కొనసాగుతున్న ట్రంపిజం – రాజేంద్రబాబు అర్విణి
చిలే, బొలీవియాల్లో ప్రజా ఉద్యమాల జయభేరి – ఎ. నర్సింహారెడ్డి
సంపాదకునిగా ఫ్రెడరిక్ ఎంగెల్స్ – కొండూరి వీరయ్య
స్త్రీలు – న్యాయ వ్యవస్థ – 3 – హేమ వెంకట్రావు
డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు – 10 – ఎన్.వి.యస్. నాగభూషణ్
ఈనేల – వై. రామచంద్రం
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
సంస్థాగతం – వీక్షణం 2020 సూచిక



ముత్యాల ప్రసాద్

విశాలాంధ్ర దినపత్రిక సంపాదకుడు ముత్యాల ప్రసాద్ అనారోగ్యంతో నవంబర్ 24న మృతిచెందారు. ప్రసాద్‌కు కొద్దిరోజుల క్రితం కోవిడ్ పాజిటివ్ రావడంతో విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తుండగా గుండెపోటు రావడంతో మరణించారు. ప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామం. డిగ్రీ వరకు చదువుకుని కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి దశలో రాజకీయాల్లో ప్రవేశించారు. అనంతరం జర్నలిజంలోకి వచ్చి పలు తెలుగు పత్రికల్లో పనిచేశారు. ప్రస్తుతం విశాలాంధ్ర పత్రిక బాధ్యతలు చూస్తున్నారు. మరణించే నాటికి అరసం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

కేశవరెడ్డి



ఉపాధ్యాయ ఉద్యమ నేత కొమ్మారెడ్డి కేశవరెడ్డి(80) అనారోగ్యంతో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో నవంబర్ 26న మరణించారు. ఆయన గురజాల దగ్గరి అంబాపురంలో జన్మించారు. తెలంగాణలోని సూర్యాపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. శ్రీశ్రీ మహాప్రస్థానం, అభ్యుదయ పత్రిక ఆయనలో అభ్యుదయ భావాలను ఏర్పరిచాయి. యుటిఎఫ్‌లో పనిచేస్తూ 'ఐక్య ఉపాధ్యాయ'కు సంపాదకుని బాధ్యతలు నిర్వహించారు. వివిధ భాషల్లోని చరిత్రకు సంబంధించిన అనేక పుస్తకాలను తెలుగులోకి అనువాదం చేశారు. ఆయన తొలి అనువాదం 1980లో గోర్కీ రాసిన 'ది సిటీ ఆఫ్ ఎల్లో డెవిల్'కు 'నగరం' పేరుతో వెలువడింది. తరువాత గోర్కీ కథలు అనువాదం చేశారు. 30కి పైగా ప్రామాణిక గ్రంథాలను ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. అందులో 'మార్క్స్ కాపిటల్', 'మానవుడు–సంపద–సమాజం', పెలిక్స్ గ్రీన్ రాసిన 'ప్రగతికి ప్రతిబంధకాలు', ఇఎమ్ఎస్ నంబూద్రిపాద్ రాసిన 'భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర', బిపిన్ చంద్ర రాసిన 'స్వాతంత్ర్య సమరం'తో పాటు ఎన్నో ఉన్నాయి.

వీక్షణం ఆగిపోకుండా నిలబడడానికి మీరేం చేయవచ్చు?

ఆగిపోకుండా నడవవలసిన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా
సామాజిక కార్యకర్తలకూ, బుద్ధిజీవులకూ అత్యవసరమైన మేధో వనరుగా
తెలుగు సమాజంలో ఇవాళ వినబడుతున్న అతి తక్కువ ప్రజానుకూల గళాలలో ఒకటిగా
వీక్షణంను మీరు గుర్తిస్తే,
వీక్షణంను నిలబెట్టడానికి మీ వ్యక్తిగత బాధ్యతను మీరు అంగీకరిస్తే

మీలో ప్రతిఒక్కరూ

- తమ బాధ్యతగా చందాదారుగా చేరవచ్చు.
- కనీసం మరొక చందా చేర్పించవచ్చు.
- మీకు పరిచయం ఉన్న విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకు చందాలు చేర్పించవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో పత్రికలు అమ్మే దుకాణంలో వీక్షణం కూడ అమ్మేలా చూసే, వారి నుంచి క్రమబద్ధంగా వీక్షణంకు అమ్మకాల డబ్బు అందే ఏర్పాట్లు చేయవచ్చు.
- ఒక్కొక్కరు కనీసం వెయ్యి రూపాయల విరాళం ఇవ్వడానికి, ఇప్పించడానికి ప్రయత్నించవచ్చు.
- పెద్ద స్థాయిలో విరాళాలు గాని, వ్యాపార ప్రకటనలు గాని ఇవ్వగల దాతల కోసం అన్వేషించి. వారి గురించి వీక్షణం నిర్వాహకులకు తెలపవచ్చు.
- మీ అంతట మీరే చొరవ తీసుకుని వారి దగ్గర విరాళం సంపాదించి పంపవచ్చు.

సామాజికులను ఒంటరులుగా మారుస్తున్న కొవిడ్ చీకటిలో
ఆలోచనల, ఆశయాల దృఢదీక్షకు పునరంకితం చేసే
చిరు మేధో దీపం **వీక్షణం**
రెండు చేతులూ అడ్డుపెట్టి ఈ దీపం ఆరిపోకుండా కాపాడుకుందాం.
భవిష్యత్తు కోసం ఈ చూపు వెలుగును విస్తరించుకుందాం.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ – **013911011002175**

ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 230 - December 2020 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/11/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.________________________

____

____

____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao